www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 349
బుధవారం | 3-4-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా. 6.31 తదుపరి దశమి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 9.48 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ. 6.29-8.01, రా. 1.32-3.01; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.43; అమృతఘడియలు: మ. 3.40-5.12; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 6.26
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఈ ఐపీఎస్‌లకు చెక్..



పాలరాజు గుంటూరు రేంజ్ ఐజీ | అన్బురాజన్ అనంతపురం ఎస్పీ | పల్లె జాషువా చిత్తూరు జిల్లా ఎస్పీ | పరమేశ్వర్‌రెడ్డి ప్రకాశం జిల్లా ఎస్పీ | రవిశంకర్‌రెడ్డి పల్నాడు జిల్లా ఎస్పీ | తిరుమలేశ్వర్‌రెడ్డి నెల్లూరు జిల్లా ఎస్పీ

9 మందిపై వేటు

అడ్డగోలు అధికారులపై ఈసీ బదిలీ కొరడా

ఆరుగురు ఐపీఎస్‌లు, ముగ్గురు కలెక్టర్ల బదిలీ

మాయ చేద్దామనుకున్న జగన్‌కు భారీ ఝలక్

కోడ్‌కు ముందే 'కోరిన' జిల్లాలకు.. అయినా తప్పని వేటు

ఈ కలెక్టర్లు ఔట్



గౌతమి అనంతపురం కలెక్టర్ | లక్ష్మీశ తిరుపతి కలెక్టర్ | రాజాబాబు కృష్ణా కలెక్టర్

ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని ఆదేశాలు

సీఎం సొంత మనిషి పరమేశ్వర రెడ్డి

కాంపౌండ్లో ఉండే అన్బురాజన్

పెద్దిరెడ్డికి జీ హుజూర్ అనే జాషువా

వైసీపీ చట్టం అమలుచేసిన రవిశంకర్ రెడ్డి

ప్రధాని సభ ఏర్పాట్లలో వైఫల్యంపైనా సీరియస్!

గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజుపై అందుకే వేటు!

'దొంగ ఓట్ల' వ్యవహారంపై ఈసీ కఠిన చర్యలు

కృష్ణా, అనంతపురం, తిరుపతి కలెక్టర్ల బదిలీ

ఉరవకొండ దొంగ ఓట్లపై నిర్లక్ష్యంగా గౌతమి

బాధ్యతలు తీసుకున్న రోజే ఎమ్మెల్యేతో లక్ష్మీశ భేటీ

స్వామి భక్తికి శాస్తి

మావోయిస్టులు, ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులపై సీఎం జగన్ కఠిన చర్యలు తీసుకున్న సందర్భమేదీ లేదు. ఆయన భద్రతకు ఎలాంటి ముప్పూ లేదు. అయినా సరే.. నెలన్నర కిందట ఆయన కడప పర్యటనకు వచ్చినపుడు అతి భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పొరుగు జిల్లాల నుంచి 1058 మంది సివిల్ పోలీసులు, 13 ప్లటూన్ల ఏపీఎస్పీ బలగాలు, రెండు గ్రేహౌండ్స్ యూనిట్లు, పదుల సంఖ్యలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్‌ను దించారు. మరోవైపు హైసెక్యూరిటీ ఉన్న దేశాధినేతల్లో టాప్ ఫైవ్‌లో ఉండే ప్రధాని నరేంద్ర మోదీ పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటలో టీడీపీ- జనసేన- బీజేపీ ఉమ్మడి సభకు వస్తే కేవలం ఐదు ఏపీఎస్పీ ప్లటూన్లను బందోబస్తుకు పంపారు. ట్రాఫిక్ మొదలుకొని ఎక్కడికక్కడ భద్రతా వైఫల్యం కనిపించడంపై కేంద్ర ఇంటెలిజెన్స్ ఆరా తీసింది. రాష్ట్ర సీఎం భద్రత కన్నా దేశ ప్రధాని రక్షణకు తక్కువ పోలీసులను వినియోగించిన విషయం తెలుసుకుని నివ్వెరపోయింది! ఈ నిర్వాకానికిగాను గుంటూరు ఐజీ పాలరాజుపై వేటు పడిందని ఐపీఎస్ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం ఈసీ వేటుకు గురైన ఐపీఎస్‌ల్లో పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ముగ్గురూ ప్రధాని సభ పర్యవేక్షణలో విఫలమైనట్లు ఆరోపణలు ఎదుర్కొన్న వారే.

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి గట్టి షాక్ ఇచ్చింది. ఎన్నికల కమిషన్ కళ్లు కప్పేందుకు చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. షెడ్యూలుకు రెండు నెలల ముందే వ్యూహాత్మకంగా జరిపిన అడ్డగోలు నియామకాలను 'రివర్స్' చేసింది. ఒకే రోజు ఒకే ఉత్తర్వుతో ముగ్గురు ఐఏఎస్‌లు, ఆరుగురు ఐపీఎస్‌లను పక్కకు తప్పించింది. వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ ఈ స్థాయిలో అధికారులపై

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రాకు ఈసీ ప్రత్యేక పరిశీలకులు

వివేకాను హత్య చేసిన వాళ్లకు ఈరోజు వరకు శిక్ష పడలేదు. హత్య చేసిన వాళ్లు, చేయించిన వాళ్లు తప్పించుకుని తిరుగుతూనే ఉన్నారు. అన్ని సాక్ష్యాలూ ఉన్నా, ఎన్ని వాంగ్మూలాలు ఉన్నా.. జగన్ వారిని రక్షించడమే కాకుండా అవినాశ్‌రెడ్డికే టికెట్ ఇవ్వడం తట్టుకోలేకపోయా.

నా పోటీ చిన్నాన్న కోరిక -షర్మిల

చిన్నాన్న చివరి కోరిక నేను ఎంపీగా నిలబడాలన్నదే. నా వద్దకు వచ్చి దాదాపు రెండు గంటలపాటు నువ్వు ఎంపీగా నిలబడాలమ్మా అని ప్రాధేయపడ్డారు. ఎందుకు అంతగా అడుగుతున్నారో ఆరోజు నాకు అర్థం కాలేదు. కానీ ఈరోజు అర్థమవుతోంది.

నా అనుకున్న వాళ్లను నాశనం చేశాడు!

సీఎం జగన్‌పై వైఎస్ షర్మిల ఫైర్

చిన్నాన్నను చంపినవాళ్లకే ఎంపీ టికెట్ ఇచ్చాడు

ఆయన హత్యను రాజకీయానికి వాడుకున్నారు

ఈ ప్రభుత్వం రక్తంలో మునిగిపోయింది

సొంత చిన్నాన్నకే న్యాయం జరగలేదు

ఇక ప్రజలకు ఏం న్యాయం జరుగుతుంది?

ఎన్నికలప్పుడు చెల్లి కాదు.. బిడ్డవన్నాడు

కానీ ముఖ్యమంత్రి అయ్యాక మారిపోయాడు

రాజన్న రాజ్యం తెస్తానని రాక్షస రాజ్యం తెచ్చాడు

అన్న జగన్‌పై షర్మిల తీవ్ర ఆగ్రహం

5 లోక్‌సభ, 114 అసెంబ్లీ అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితా విడుదల



ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి

హంతకుడు, హత్య చేయించిన వాళ్లు చట్టసభల్లోకి వెళ్లకూడదు

అందుకే కడప నుంచి పోటీ చేస్తున్నా

ఇది వివేకానందరెడ్డి ఆఖరి కోరిక: షర్మిల

కడప/న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 'జగన్మోహన్ రెడ్డి నా అన్న.. నా రక్తం.. అన్నంటే నాకు ద్వేషం లేదు. ఎన్నికల్లో నన్ను చెల్లి కాదు బిడ్డ అన్నాడు.. ముఖ్యమంత్రి అయ్యాక మనిషి మారిపోయాడు.. ముఖ్యమంత్రి జగన్ ఎవరో నాకు పరిచయం లేదు. ఈ సీఎం నా అనుకున్న వాళ్లందరినీ నాశనం చేశాడు.' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి దుయ్యబట్టారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహించాడని.. చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డిని చంపిన వాళ్లకే కడప ఎంపీ టికెట్ ఇచ్చాడని.. ఇది తట్టుకోలేకపోయానని తెలిపారు. 'హత్య చేసిన వాళ్లను, చేయించిన వాళ్లను తప్పిస్తున్నారు. ఎంపీని వెనకేసుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వం రక్తంలో మునిగిపోయింది. వివేకా హత్యను రాజకీయానికి వాడుకున్నారు. సొంత

మిగతా 11వ పేజీలో...



జగనన్నా.. ఎందుకు భయం?

అవినాశ్ రెడ్డిని ఎందుకు కాపాడుతున్నారు?

అరెస్టు చేస్తే నిజాలు బయటపడతాయనా?

సునీత సూటి ప్రశ్నలు

సీఎంగానైనా నా ప్రశ్నలకు బదులివ్వాలి

జగన్ చానల్‌లో చర్చకు కూడా సిద్ధం

వివేకా హత్య తర్వాత జగన్ ఉచ్చులో నేనూ, జనం

తండ్రి చనిపోయాక నన్ను తోలుబొమ్మలా ఆడించారు

రక్తంలో మునిగిన వైసీపీ మళ్లీ అధికారంలోకి రాకూడదు

అవినాశ్ ఓటమి, కుదిరితే జగన్ ఓటమే లక్ష్యం: సునీత

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తన తండ్రి వివేకానందరెడ్డి హత్య విషయంలో తనతోపాటు రాష్ట్ర ప్రజలందరూ జగన్ ఉచ్చులో పడ్డారని సునీతా రెడ్డి పేర్కొన్నారు. "నాన్న హత్య తర్వాత మిమ్మల్ని (జగన్‌ను) గుడ్డిగా నమ్మి మీరు చెప్పినట్లు చేశాను. నేను చేసిన తప్పును గ్రహించాను. దానిని సరిదిద్దుకొనేందుకు సమయం వచ్చింది. అందుకోసమే

మిగతా 12వ పేజీలో...

షర్మిలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో నాడు ఆమెను కడప ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాలని వివేకా నిర్ణయించారు. ఆమెకు మద్దతు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే మా నాన్నను కిరాతకంగా హత్య చేశారా? నిజమేంటో బయటకు రావాలి. నా ప్రశ్నలకు జగనన్న సమాధానం చెప్పాలి. షర్మిల లక్ష్యం, నా లక్ష్యం ఒక్కటే. అవినాశ్ రెడ్డిని ఓడించాలి. కుదిరితే... జగనన్ననూ (పులివెందులలో) ఓడించాలి. రాష్ట్రంలో తిరిగి వైసీపీ అధికారంలోకి రాకూడదు.

- సునీతా రెడ్డి (వివేకా కుమార్తె)

మేజిస్ట్రేట్ యాంత్రికంగా వ్యవహరించారు

ఫిర్యాదు చేయగానే పోలీసులకు పంపేశారు.. కనీసం ఫిర్యాదుకు కారణాలూ పేర్కొనలేదు 3

పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసులో పిటిషనర్లపై తదుపరి చర్యలు నిలిపివేస్తున్నాం

వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి.. సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌లకు హైకోర్టులో ఊరట

బీజాపూర్ అడవుల్లో ఎన్‌కౌంటర్

11 మంది మావోయిస్టుల మృతి

మృతుల్లో ఒకరు మహిళా నక్సల్

ఘటనా స్థలంలో అధునాతన మెషీన్‌గన్

20 రోజుల వ్యవధిలో నాలుగో ఎన్‌కౌంటర్

సుకుమా, బీజాపూర్ బంద్‌కు నక్సల్స్ పిలుపు

చింతూరు/చర్ల, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల వేళ కాల్పుల మోతతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ దద్దరిల్లింది. బస్తర్ డివిజన్ గంగలూరు, లేంద్ర అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా నక్సల్ సహా.. 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఘటనాస్థలంలో నక్సల్స్ అధునాతన ఆయుధాలు, కిట్ బ్యాగులను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ వెల్లడించారు. ఈ నెల 19న తొలిదశ లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న బస్తర్‌లో మావోయిస్టుల అలజడితో.. భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి బస్తర్‌లో అలజడి తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. మంగళవారం నాటి ఘటనతో కలుపుకొని.. గడచిన 20 రోజుల వ్యవధిలో వేర్వేరు చోట్ల జరిగిన ఎన్‌కౌంటర్లలో 21 మంది నక్సల్స్ మృతిచెందారు. గడ్చిరోలి జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ మావోయిస్టు పార్టీకి చెందిన

మిగతా 2వ పేజీలో...



నేటి నుంచి పింఛన్ల పంపిణీ

గ్రామ, వార్డు సచివాలయాల్లో పంపిణీకి ఏర్పాట్లు: ప్రభుత్వం

తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారికి, దివ్యాంగులు, వితంతువులకు ఇంటికే


అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీపై ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసింది. సెర్ప్ సీఈవో గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. బుధవారం నుంచి 4 రోజుల పాటు(ఈనెల 6 వరకు) గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి, వితంతువులకు ఇంటివద్దే పింఛను సొమ్ము ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామ సచివాలయాలకు దూరంగా ఉన్న గిరిజనుల కోసం

మిగతా 11వ పేజీలో...

ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వండి

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు బాబు లేఖ 11

ఇంటింటి పంపిణీకి సరిపడా సిబ్బంది ఉన్నారు



అయినా సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి

కావాలనే అడ్డుపడుతున్నారు

ఈయన మంత్రి బుగ్గన బంధువు

వ్యవహారం వెనుక కుట్ర: బాబు.. సీఎస్, సీఈవోలకూ ఫోన్లు

పింఛన్ల జాప్యం వైసీపీ కుట్రే.. రాజకీయ లబ్ధి కోసమే

అవ్వాతాతలకు కష్టాలు.. ప్రజలకు బాబు బహిరంగ లేఖ

4 వేల కోట్ల అప్పు

నూతన ఆర్థిక సంవత్సరానికి అప్పుతో స్వాగతం

అస్మదీయులకు 1,200 కోట్ల బిల్లులు చెల్లింపు 3

ఇంకా జమ కాని ఉద్యోగుల జీతాలు, పింఛన్లు

24 నుంచి వేసవి సెలవులు 3

పాఠశాలల్లో వాటర్ బెల్స్!

నట వీర.. నట శూర!

ఎన్నికల ప్రచారంలో జగన్ అద్భుత ప్రదర్శన

స్క్రిప్టు ప్రకారం బయట పడుతున్న 'జాలి గుండె'

ఐదేళ్లు జనాన్ని ఆమడ దూరం ఉంచిన జగన్ 12

వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినా ఈడ్చి పడేయడమే



బుల్లెట్ ప్రూఫ్ బస్సు నుంచి దిగి వచ్చి, కిందికి వంగి కూర్చుని మరీ వినతిపత్రం స్వీకరిస్తున్న జగన్

జనం లేని జగన్ యాత్ర!

రోడ్డు షో వెలవెల.. పోలీసులు సెక్యూరిటీ సిబ్బందే ఎక్కువ

పలు గ్రామాల్లో ఆగకుండానే సీఎం బస్సు ముందుకు

నమస్కార బాణాలతో సరి

సభకు వెయ్యి ఆర్టీసీ బస్సులు

సీఎం ప్రసంగం మొదలవగానే జనం జంప్ 3



వెంటాడే ట్యాపింగ్ పాపం!

ఎన్నికల్లో గెలుపునకు వాడుకుంటే నేరమే

విపక్షాల సమానావకాశాలు దెబ్బతీయడమే

అధికార దుర్వినియోగంతో గెలిచే కుట్రలు చెల్లవు

గతంలో ఇలాంటి ఆరోపణలతోనే ఇందిరపై అనర్హత వేటు వేసిన అలహాబాద్ హైకోర్టు

తెలంగాణలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్

బీఆర్ఎస్ గెలిచినచోట ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయిస్తే అదే తరహా తీర్పులు వచ్చే చాన్స్!

'అధికారంలో ఉన్నాం! విపక్ష నేతల ఫోన్లను దొంగచాటుగా విందాం! వ్యూహాలను పసిగట్టి ఎన్నికల్లో గెలిచేద్దాం'.. అని చెలరేగిపోయే అధికార పార్టీలకు ఇదో హెచ్చరిక! ట్యాపింగ్ పాపం ఊరికే వదలదు. ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా విపక్ష నేతల కదలికలపై నిఘా పెట్టడం, ఆర్థికమూలాలపై దాడి చేయడం (ఇల్లీగల్ ప్రాక్టీసెస్).. అధికార యంత్రాంగాన్ని అడ్డగోలుగా వాడుకోవడం, సొంత పార్టీ నేతల నగదు రవాణాకు టాస్క్‌ఫోర్స్ వాహనాలను వాడడం (కరప్ట్ ప్రాక్టీసెస్).. ఇవన్నీ ఎన్నికల్లో ప్రత్యర్థులకు సమానావకాశాలు లేకుండా చేయడం కిందకే వస్తాయి. కేవలం ఈ అభియోగాల కారణంగానే అప్పట్లో ఇందిరాగాంధీపై అనర్హత వేటు పడింది. ఈ పరిణామం చివరికి 'ఎమర్జెన్సీ' చీకటి రోజులకు కారణమైంది! తెలంగాణలో తాజా పరిణామాలతో ఇప్పుడు 'ఇందిర కేసు' మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇది వైసీపీకీ ఒక హెచ్చరికలాంటిదే! ఎందుకంటే.. గెలుపు కోసం వైసీపీ అడ్డగోలుగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. ట్యాపింగ్‌కూ పాల్పడుతోంది. 2



పిఠాపురం ఎన్నికల ప్రచారం సందర్భంగా ఒక కుటుంబంతో కలిసి కూర్చుని మాట్లాడుతున్న పవన్

ఇక్కడే ఉంటా!

పిఠాపురం నా స్వస్థలం... ఎవరినీ వదిలి వెళ్లను

నా గుండె లోతుల్లో టన్నుల కొద్దీ మాటలున్నాయి

ప్రేమైనా, బాధైనా మీతో పంచుకోవాలని ఉంది

మీ కష్టసుఖాలు తెలుసుకోవాలని ఆశగా ఉంది

కొత్తపల్లి వీరమహిళలతో పవన్

సమావేశాన్ని అడ్డుకున్న అధికారులు 11

పొడిపొడిగా మాట్లాడి ముగించిన జనసేనాని

చివరి రోజు పర్యటనలో 30 కిలోమీటర్ల రోడ్ షో

అడుగడుగునా బ్రహ్మరథం.. హారతులతో స్వాగతం

పిఠాపురం ఏజీసీ చర్చి, బషీర్ బీబీ దర్గాలో ప్రార్థనలు

ఉద్యోగం మానేసి మాతో తిరగండి!

» నెలకు రూ.15 వేలు.. అంతకంటే ఎక్కువే ఇస్తాం
» 'తూర్పు'న వలంటీర్లకు వైసీపీ నేతల ప్రలోభాలు
» పెన్షన్‌దారులను సచివాలయాలకు తీసుకురండి
» వలంటీర్లకు వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఆదేశం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎన్నికల విధులు, పింఛన్లు, సంక్షేమ పథకాల పంపిణీకి దూరమైన వలంటీర్లను వైసీపీ నేతలు ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.5వేల గౌరవ వేతనం కంటే ఎక్కువ ఇస్తామని, రాజీనామా చేసి తమ వెంట తిరగాలని ఒత్తిడి తెస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లో ఉద్యోగం మానేసి తమ కూడా ప్రచారం చేస్తే నెలకు రూ.15వేలు ఇస్తామని, అవసరమైతే అంతకంటే ఎక్కువే ఇస్తామని, మళ్లీ తాము అధికారంలోకి వస్తే ఉద్యోగం ఇస్తామని కూడా చెబుతూ ఒకవైపు ఒత్తిడి, మరోవైపు ప్రలోభాలు పెడుతూ వలంటీర్లతో రాజీనామాలు చేయిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, టీడీపీ అధినేత చంద్రబాబుపై అనుచిత పోస్టు పెట్టిన వలంటీర్‌పై కేసు నమోదైంది. "శభాష్ చంద్రన్న.. నీ టాలెంట్ ఉపయోగించి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛను ఆపగలిగావు. దాని పర్యవసానం అనుభవిస్తావు" అంటూ నల్లజర్ల మండలం కవులూరు గ్రామ సచివాలయం క్లస్టర్-1కు చెందిన వలంటీర్ జాలాది శ్రీనివాసరావు తన పరిధిలోని 50 కుటుంబాలకు చెందిన వాట్సాప్ గ్రూప్‌లో గతనెల 31న పోస్టు పెట్టాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. వలంటీర్ శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించినట్టు ఎంసీసీ నోడల్ అధికారి, ఎంపీడీవో నరేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా, కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఎన్నికల సంఘం ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. 'పింఛనుదారులను వలంటీర్లే సచివాలయాల వద్దకు ఆటోల్లో తీసుకురావాలి. ఆటో ఖర్చులు మనం మనం చూసుకుందాం'... అంటూ వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని పంపిన వాయిస్ మెసేజ్ లీకయింది. పింఛనుదారులను తీసుకువచ్చి మళ్లీ వారు ఇంటి వద్దకు చేరేవరకు వలంటీర్లే బాధ్యత వహించాలంటూ ఆయన చెప్పిన ఆడియో హల్‌చల్ చేస్తోంది. ఎమ్మెల్యే పేర్ని ఒత్తిడితో 860మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తన కుమారుడిని గెలిపించుకునేందుకు ఎమ్మెల్యే తమను బలిపశువుల్ని చేశారని, వలంటీర్లతో రాజీనామా చేయించడం వెనుక కుట్ర దాగి ఉందని వారు వాపోతున్నారు.

బీజాపూర్ అడవుల్లో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

నలుగురు నక్సల్స్ బీజాపూర్ జిల్లా పిడియాగుట్టలో ఇద్దరు, బాజగూడ అడవుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే.! ఈ ఏడాది ఆరంభం నుంచి ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 42 మంది నక్సల్స్ హతమయ్యారు. ఈ ఎన్‌కౌంట్లకు నిరసనగా మావోయిస్టు పార్టీ ఈ నెల 3న(బుధవారం) బీజాపూర్, సుకుమా జిల్లాల బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్‌ను విజయవంతం చేసేందుకు మావోయిస్టులు సోమవారం సాయంత్రం నుంచి ఏజెన్సీల్లో తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో.. గంగలూరు ఠాణా పరిధిలోని గంగలూరు, లేంద్ర అడవుల్లో కోబ్రా, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్, ఎస్టీఎఫ్ బలగాలు మంగళవారం తెల్లవారుజాము నుంచి కూబింగ్ ప్రారంభించాయి. ఉదయం 6 గంటల సమయంలో ఈ బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో.. ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఉదయం 9 గంటల సమయంలో అడవుల్లోంచి కాల్పులు నిలిచిపోవడంతో.. పోలీసులు ముందుకు సాగారు. ఈ క్రమంలో ఉదయం 10 గంటల సమయంలో నలుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. మధ్యాహ్నం మరో ఐదు.. సాయంత్రం ఇంకో రెండు మృతదేహాలు లభ్యమైనట్లు ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. ఘటనాస్థలి నుంచి ఒక అధునాతన లైట్ మెషీన్‌గన్(ఎల్ఎంజీ), భారీ సంఖ్యలో జీబీఎల్ లాంచర్లు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎల్ఎంజీ ఆయుధాన్ని మావోయిస్టుల వద్ద సీజ్ చేయడం ఇదే మొదటిసారని వివరించారు. మావోయిస్టులు బుధవారం బీజాపూర్, సుకుమా జిల్లాల్లో బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంద్‌ను విజయవంతం చేయడానికి మావోయిస్టులు గూడేల్లోకి వస్తే.. వారిని పట్టుకునేలా కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో తెలంగాణ పోలీసులు కూడా కూంబింగ్‌ను పెంచారు. మావోయిస్టు పార్టీకి దండకారణ్యం సేఫ్‌జోన్. అయితే..ఎండాకాలం మొదలై, అడవంతా ఆకులు రాలుతున్న నేపథ్యంలో మావోయిస్టులకు గడ్డు పరిస్థితులు తప్పవని, గడిచిన 20 రోజుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మావోయిస్టుల మరణాలు అధికంగా ఉండడానికి ఇదే కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

పర్చూరు, ఏప్రిల్ 2: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాపట్ల జిల్లా పర్చూరు మండలం బోడవాడ గ్రామానికి చెందిన ఆచంట రేవంత్ (22) మృతి చెందారు. బోడవాడకు చెందిన ఆచంట రఘు, వరలక్ష్మిల కుమారుడు రేవంత్ చెన్నైలో బీటెక్ పూర్తిచేసుకొని గత సంవత్సరం డిసెంబర్‌లో ఎంఎస్ కోసం అమెరికా వెళ్లారు. వాషింగ్టన్ డకోట స్టేట్ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం వేకువజామున కారులో స్నేహితులతో వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. మైనస్ డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో రోడ్డుపై గడ్డకట్టిన మంచుకారణంగా కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రేవంత్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

పథకాల ప్రకటనలపై జగన్ ఫొటోలా?

» ఎన్నికల నిబంధనల ఉల్లంఘనే: ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రకటనల్లో సీఎం జగన్ ఫొటోలను ముద్రిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఆయన ప్రభుత్వం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తోందని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ)కి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ సీనియర్ నేతలు సల్మాన్ ఖుర్షీద్, పవన్ ఖేరా, గుర్దీప్ సప్పల్ మంగళవారమిక్కడ ఈసీ అధికారులను కలిశారు. అనంతరం ఖుర్షీద్ విలేకరులతో మాట్లాడారు. తమ ఫిర్యాదులను ఈసీ సీరియస్‌గా తీసుకుందని చెప్పారు.

కర్ణాటకపై కమలం భారీ ఆశలు

మోదీ మేనియా, రామ మందిరం రక్షణ కవచాలంటున్న కాషాయ దళం

» 28 స్థానాలూ దక్కించుకునే ప్లాన్
» జేడీఎస్‌తో చేతులు కలిపిన బీజేపీ
» సిద్దూ సర్కార్ గ్యారెంటీలతో పుంజుకున్న కాంగ్రెస్ ఓటు బ్యాంక్

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ దక్షిణాదిలో కర్ణాటకపై భారీగా ఆశలు పెట్టుకుంది. 2019లో రాష్ట్రంలో సాధించిన ఘన విజయాన్ని కొనసాగించాలని భావిస్తోంది. గత 2019లో ఆయా దక్షిణాది రాష్ట్రాల్లో 30 సీట్లలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. వీటిలో 25 ఒక్క కర్ణాటకలోనే దక్కించుకున్నారు. దక్షిణాదిలో బలంగా ఉన్నామని చెప్పుకొనే కాంగ్రెస్ కంటే కూడా బీజేపీ అధిక సంఖ్యలో సీట్లు కైవసం చేసుకుని ఆ పార్టీకి సవాల్ రువ్వింది. ఈ రాష్ట్రంలో 2004 నుంచి 2019 వరకు గడిచిన నాలుగు ఎన్నికల్లోనూ బీజేపీ గణనీయ సంఖ్యలో లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించింది. ప్రస్తుత ఎన్నికల విషయానికి వస్తే కర్ణాటకలో బీజేపీ చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జేడీఎస్‌తో పొత్తు పెట్టుకుంది. తద్వారా ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తం పార్లమెంటు స్థానాలను క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తోంది.

గత వికాసం ఇదీ!

2019 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 28 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 25 స్థానాల్లో విజయం దక్కించుకోగా, కాంగ్రెస్, జేడీఎస్‌లు ఒక్కో స్థానంలో మాత్రమే గెలిచాయి. బీజేపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి ఒకరు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 51.4 శాతం ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది. కాగా, గతేడాది కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్‌కు ఘోర పరాభవం ఎదురైంది. పైగా ఈ పార్టీకి చెందిన 5% ఓటు బ్యాంకును కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్‌తో పొత్తులో భాగంగా 25 స్థానాల్లో పోటీ చేయాలని కమలనాథులు నిర్ణయించారు. మిత్రపక్షం జేడీఎస్.. కోలార్, హస్సన్, మాండ్య.. మూడు స్థానాల్లో బరిలోకి దిగనుంది. ఇక, బీజేపీ ఒక్క చిత్రదుర్గ మినహా 24 స్థానాల్లో తన అభ్యర్థులను ప్రకటించింది. అయితే, ఈ స్థానాల్లో 12 మంది సిట్టింగులకు టికెట్లను నిరాకరించింది. దీంతో టికెట్లు రాని వాళ్లు బీజేపీ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, జేడీఎస్ నేతలు కూడా బీజేపీతో పొత్తు వ్యవహారంపై అంతర్గతంగా మథనపడుతున్నారు. సీట్ల పంపకాలను ఆలస్యం చేయడంతోపాటు, జేడీఎస్‌కు కంచుకోట వంటి మాండ్య నియోజకవర్గాన్ని నటి సుమలతా అంబరీష్‌కు కేటాయించాలన్న బీజేపీ ప్రతిపాదనపై కూడా కుమారస్వామి వర్గం గుర్రుగా ఉంది.



నేతల మధ్య సఖ్యత ప్రశ్నే!

బీజేపీ-జేడీఎస్‌లు చేతులు కలిపినా.. గత విషయాలను గుర్తు చేసుకుని ఇరు పక్షాల నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. వాస్తవానికి జేడీఎస్‌తో బీజేపీ చేతులు కలపడం వెనుక.. దక్షిణ కర్ణాటక, లేదా పాత మైసూరు ప్రాంతాల్లో బలమైన సామాజిక వర్గంగా ఉన్న వక్కలిగలు తమవైపు మళ్లుతారనే ఆశ ఉంది. కానీ, నేతల మధ్య సఖ్యత కనిపించకపోవడం లేదు.

మైనారిటీలు కాంగ్రెస్ వైపే!

కర్ణాటకలో మైనారిటీలు కాంగ్రెస్ వైపే ఉన్నట్టు స్పష్టమవుతోంది. దీనికి ప్రధాన కారణం.. బీజేపీ అంటే లింగాయతుల పార్టీ అని, అగ్రవర్ణ పార్టీ అనే వాదన ఆయా వర్గాల్లో గూడుకట్టుకుపోవడమే. ఇక, బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకున్న తర్వాత బలమైన రెండు సామాజిక వర్గాల(వక్కలిగ, లింగాయతులు) ఓట్లు కుమార స్వామికి ఏమేరకు అందివస్తాయనే చర్చ తెరమీదికి వచ్చింది. ఇక, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓట్లు పూర్తిగా కాంగ్రెస్ పార్టీకే పడతాయనే అంచనా పెరుగుతోంది.

గ్యారెంటీల ప్రభావం!

కర్ణాటకలో గత ఏడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీల హామీలను అమలు చేస్తోంది. ఇది కూడా ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అంచనాలపై ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం, పేదలకు ఉచిత బియ్యం వంటివి ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లేలా చేస్తున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో ఆయా పథకాలకు సీఎం సిద్దరామయ్య ప్రభుత్వం రూ.50 వేల కోట్ల రూపాయలను కేటాయించడం గమనార్హం.

మోదీ మేనియా కలసివచ్చేనా?

ప్రధాని మోదీ మేనియా, అయోధ్య రామ మందిరం వంటి కీలక అంశాలపై కర్ణాటక బీజేపీ చాలా ఆశలు పెట్టుకుంది. ఈ రెండు అంశాలు తమకు కలిసి వస్తాయని కమలనాథులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో మోదీ ప్రజాదరణ కారణంగానే తమ ఓటు బ్యాంకు 51.4 శాతానికి చేరుకుందని నాయకులు అంచనా వేస్తున్నారు. ఇప్పుడు ఇది 53 శాతానికి పెరిగినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. - (సెంట్రల్ డెస్క్)

కాంగ్రెస్‌ను తుడిచిపెట్టేయండి

» వారికి దేశభక్తి గురించి మాట్లాడే అర్హత లేదు: ప్రధాని మోదీ

రుద్రపూర్ (ఉత్తరాఖండ్), ఏప్రిల్ 2: బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే దేశం అగ్నిగుండం అవుతుందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశాన్ని అస్థిరత, అరాచకంవైపు నెట్టిన కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో పూర్తిగా తుడిచిపెట్టేయాలని ప్రజలను కోరారు. మంగళవారం ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో మోదీ ప్రసంగించారు. 'వారు దేశాన్ని 60ఏళ్లు పాలించారు. కేవలం పదేళ్లు అధికారానికి దూరంగా ఉండటంతో ఇప్పుడు దేశాన్ని తగులబెట్టడం గురించి మాట్లాడుతున్నారు. మీరు వారిని అలా చేయనిస్తారా? ప్రజాస్వామ్యంలో ఇలాంటి భాష వాడటం ఆమోదయోగ్యమేనా? మీరు వారిని శిక్షించలేరా?' అని మోదీ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కరిగా ఎన్నికల బరి నుంచి సాగనంపాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాల బలహీనత దేశ విభజనకు దారితీసిందని, పాక్ జలసంధిలోని కచ్చతీవు ద్వీపాన్ని శ్రీలంకకు ధారాదత్తం చేసిన ఆ పార్టీకి దేశభక్తి గురించి మాట్లాడే అర్హత లేదని మోదీ ఆక్షేపించారు. 'అవినీతిపరులు నన్ను బెదిరిస్తున్నారు... దూషిస్తున్నారు... వీటికి నేను భయపడను. వారు నన్ను అడ్డుకోలేరు. ప్రతి ఒక్క అవినీతిపరుడిపై చర్యలు కొనసాగుతాయి. ఇలాంటివారు జైల్లో ఉండాలని మీకు అనిపించడం లేదా? మరోసారి ఎన్నికైన తర్వాత అవినీతిపై ఇంకా కఠిన చర్యలు తీసుకుంటాం' అని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	41.2	26.6
అనంతపురం	41.0	27.0
కడప	41.0	24.0
విజయవాడ	38.0	25.4
ఒంగోలు	37.5	26.6
కాకినాడ	35.0	26.0

ఇసుకకు ప్రత్యామ్నాయం!

» మట్టి, నిర్మాణ వ్యర్థాలు, కార్బన్ డై ఆక్సైడ్‌తో కొత్త మెటీరియల్.. ఐఐఎస్‌సీ ఘనత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: పట్టణీకరణ, భవన నిర్మాణ రంగం విస్తరిస్తుండటంతో ఇసుకకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో కాంక్రీట్ విక్సింగ్‌లో ఇసుకకు ప్రత్యామ్నాయంగా మరేదైనా అందుబాటులోకి వస్తే? ఇదే ఆలోచనతో పరిశోధనలు చేసిన బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)కి చెందిన సెంటర్ ఫర్ సస్టయినబుల్ (సీఎస్టీ) శాస్త్రవేత్తలు గొప్ప ముందడుగు వేశారు. ఇసుకకు 'ప్రత్యామ్నాయ మెటీరియల్'ను కనుగొన్నారు. ఈ మెటీరియల్‌కు ముడిపదార్థాలు కార్బన్ డై ఆక్సైడ్, తవ్వి తీసిన మట్టి, భవన నిర్మాణాల వ్యర్థాలు! మట్టి, నిర్మాణాల వ్యర్థాల్లోకి ప్రత్యేక పద్ధతుల ద్వారా కార్బన్‌డై ఆక్సైడ్‌ను మిక్స్ చేసి ఇసుకకు ప్రత్యామ్నాయ పదార్థాన్ని రూపొందించారు. కాగా ఈ మెటీరియల్‌ను ఉపయోగిస్తే ఇసుక కన్నా 20-22 శాతం మేర నిర్మాణాల్లో అధిక దృఢత్వం వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సహజ ఇసుకకు బదులుగా కొంత మేర ప్రత్యామ్నాయంగా ఈ మెటీరియల్‌ను ఉపయోగించవచ్చునని, తద్వారా ఇసుక వాడకం తగ్గి పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

విశాఖలో భారీగా నగదు పట్టివేత

» 52 లక్షల నగదు, రూ.31 లక్షల విలువైన చెక్కులు

విశాఖపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేకుండా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రూ.52 లక్షల నగదు, రూ.31 లక్షల విలువైన 51 చెక్కులను విశాఖ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై సూట్‌కేస్‌లో భారీగా నగదు తీసుకువెళుతున్నారంటూ ద్వారకానగర్ సీఐ రమేశ్‌కుమార్‌కు సమాచారం అందింది. దీంతో సీతంపేట వైపు నుంచి ద్వారకానగర్ వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని టైటాన్ షోరూమ్ వద్ద ఆపి తనిఖీ చేశారు. సూట్‌కేస్ తెరచి చూడగా రూ.51,99,800 నగదుతోపాటు రూ.31 లక్షలు విలువ కలిగిన 51 బ్యాంకు చెక్కులు లభ్యమయ్యాయి. ద్విచక్ర వాహనంపై ఉన్న శ్రీను, లక్ష్మణరావులను ప్రశ్నించగా... నగరంలోని ఒక ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీ నుంచి బ్యాంకుకు తీసుకువెళుతున్నామని చెప్పారు. అయితే వాటికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో కేసు నమోదుచేసి అర్బన్ తహసీల్దార్‌కు అప్పగించారు.

అన్ని హద్దులు దాటేశారు

» న్యాయస్థానాలంటే గౌరవం లేదా?
» 'పతంజలి'పై సుప్రీంకోర్టు ఆగ్రహం
» బాబా రామ్‌దేవ్ క్షమాపణలు.. అంగీకరించని ధర్మాసనం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ వ్యవస్థాపకుడు యోగా గురువు బాబా రామ్‌దేవ్, ఆ సంస్థ ఎండీ బాలకృష్ణలపై మంగళవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తప్పుదోవ పట్టించే విధంగా మీడియా ప్రకటనలు ఇచ్చిన కేసులో తమ ఆదేశాలను పాటించనందుకు తదుపరి చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. అలోపతి వైద్యవిధానాల గురించి తప్పుదోవ పట్టించేలా పతంజలి మీడియా ప్రకటనలు చేసిందని పేర్కొంటూ గతేడాది నవంబర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసుపై జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఐఎంఏ చేసిన పిటిషన్‌పై గతేడాది నవంబర్‌లో విచారణ జరిపిన ధర్మాసనం పతంజలి సంస్థను మందలించింది. మళ్లీ తప్పుదోవ పట్టించే ప్రకటనలు చెయ్యొద్దని ఆదేశించింది. ఇది పునరావృతం కాదని పతంజలి తరఫు న్యాయవాదులు కోర్టుకు హామీ ఇచ్చారు. ఆ హామీని మళ్లీ ఉల్లంఘించడంతో మరోసారి కోర్టులో విచారణ జరిగింది. ఫిబ్రవరిలో జరిగిన విచారణలో పతంజలి వ్యవహార శైలిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరణ ఇవ్వాలంటూ రామ్‌దేవ్ బాబా, బాలకృష్ణకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులకు స్పందించకపోవడంతో కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ క్రమంలో న్యాయస్థానాల పట్ల పతంజలి సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. "ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇచ్చారు. ఈ విషయంలో అన్ని హద్దులు దాటారు. కేవలం సుప్రీంకోర్టు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న కోర్టులు జారీ చేసే ప్రతి ఉత్తర్వును గౌరవించాలి. లేకపోతే కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది కదా? కరోనాకు అల్లోపతిలో నివారణ లేదని పతంజలి ప్రకటనలు ఇచ్చినప్పుడు కేంద్రప్రభుత్వం ఎలా కళ్లు మూసుకుంది? ఈ కేసులో రామ్ దేవ్, బాలకృష్ణ ఒక వారంలోగా మళ్లీ కొత్త అఫిడవిట్లు దాఖలు చేయాలి. ఏప్రిల్ 10న మరోసారి న్యాయస్థానం ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలి" అని ధర్మాసనం స్పష్టం చేసింది. రామ్‌దేవ్ బాబా క్షమాపణలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తరఫున న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా ధర్మాసనం అందుకు అంగీకరించలేదు. లిఖిత పూర్వకంగా అఫిడవిట్ ద్వారా సమర్పించాల్సిందేనని ఆదేశించింది.

ఆంధ్రకు ఈసీ ప్రత్యేక పరిశీలకులు

న్యూఢిల్లీ, అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకులను నియమించింది. ఏపీకి జనరల్ స్పెషల్ అబ్జర్వర్‌గా రామ్ మోహన్ మిశ్రా, పోలీస్ స్పెషల్ అబ్జర్వర్‌గా దీపక్ మిశ్రా, స్పెషల్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌గా నీనా నిగమ్‌లను కేటాయించింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లకు ప్రత్యేక పరిశీలనా బాధ్యతలను సార్వత్రిక ఎన్నికల ముందు ఈసీ అప్పగించడం పరిపాటే. తప్పుడు ప్రచారం, కల్పిత కథనాలు వ్యాప్తి చెందకుండా సత్వరం కళ్లెం వేయడం వీరికి అప్పగించిన ప్రధాన బాధ్యత. అలాగే, సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తారు. కాగా, ఏపీతోపాటు ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభలకు ఎన్నికలు జరుపుకొంటున్న ఒడిశాకు జనరల్ స్పెషల్ అబ్జర్వర్‌గా యోగేంద్ర త్రిపాఠి, పోలీస్ స్పెషల్ అబ్జర్వర్‌గా రజనీకాంత్ మిశ్రా, స్పెషల్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌గా హిమాలిని కశ్యప్‌లను ఎంపిక చేశారు. ఈ రెండు రాష్ట్రాల్లో ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే.

కరుడుగట్టిన నేరగాళ్ల మధ్య కేజ్రీవాల్



సంజయ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రస్తుతం తిహార్ జైలులో కరుడుగట్టిన నేరగాళ్ల పక్కన కాలం గడుపుతున్నారు. న్యాయస్థానం రెండు వారాల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో పోలీసులు ఆయనను రెండో నెంబరు జైలుకు తరలించారు. అక్కడ డాన్ ఛోటా రాజన్, కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ నీరజ్ బవానా, ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది జియా ఉర్ రహ్మాన్‌లు ఇరుగుపొరుగు వారిగా ఉన్నారు. అండర్ వరల్డ్ డాన్ అయిన దావూద్ ఇబ్రహీంకు ఒకప్పుడు అత్యంత సన్నిహితుడైన ఛోటా రాజన్ అనంతర కాలంలో అతడికి ప్రత్యర్థిగా మారాడు. గ్యాంగ్‌స్టర్ నీరజ్‌పై హత్య, హత్యాయత్నం నేరాలు సహా 40కిపైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. కేజ్రీవాల్ ఈ రెండు వారాల పాటు వారితో కలిసి కాలం గడపాల్సి ఉంటుంది. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయనను ఈ జైలుకు తీసుకువచ్చారు. రాత్రంతా చికాకుగానే గడిపారు. సుగర్ లెవల్స్ తగ్గడంతో మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఇంటి నుంచే తీసుకొచ్చేందుకు జైలు అధికారులు అనుమతి ఇచ్చారు. మంగళవారం ఉదయం 6.40 గంటలకు అల్పాహారం కింద టీ, బ్రెడ్ ఇచ్చారు. కేజ్రీవాల్ సెల్‌లోనే గంట సేపు యోగా, ధ్యానం చేశారు. ప్రతి రోజూ అయిదు నిమిషాల పాటు ఫోనులో కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు ఆయనకు అవకాశం ఇచ్చారు. తనను కలిసేందుకు ఆరుగురికి అవకాశం ఇవ్వాలంటూ ఆయన జాబితాను సమర్పించారు. భార్య సునీత, కుమారుడు, కుమార్తె, ప్రైవేటు సెక్రటరీ బిభావ్ కుమార్, ఆప్ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్‌ల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

సంజయ్‌సింగ్‌కు బెయిల్

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆరు నెలలుగా జైలు జీవితం గడుపుతున్న ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌కు సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ట్రయల్ కోర్టు విధించిన షరతులకు లోబడి నడుచుకోవాలని ధర్మాసనం తెలిపింది. రాజకీయ సమావేశాల్లో పాల్గొనవచ్చునని, అయితే మద్యం విధానం కుంభకోణం కేసుకు సంబంధించి మాత్రం ఎటువంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన్ను ఆదేశించింది. నిరుడు అక్టోబరు 4న సంజయ్ సింగ్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది.

కేజ్రీ ఐఫోన్ అన్‌లాక్‌కు యాపిల్ 'నో'

కేజ్రీవాల్ ఐఫోన్‌ను అన్‌లాక్ చేసేందుకు ఈడీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. మంగళవారం కేజ్రీవాల్ ఐఫోన్‌ను అన్‌లాక్ చేయాలని యాపిల్ కార్యాలయాన్ని ఈడీ కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈడీ అనధికారంగా చేసిన ఈ వినతిని యాపిల్ తిరస్కరించినట్లు సమాచారం. తమ కంపెనీ నిబంధనల ప్రకారం ఫోన్ సొంతదారు మాత్రమే దాని లాక్‌ను తెరవగలరని యాపిల్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మార్చి 21న అరెస్టయిన కేజ్రీవాల్ తన ఐఫోన్‌కు లాక్ వేసి స్విచ్చాఫ్ చేశారు.

వెంటాడే 'ట్యాపింగ్' పాపం!

» ఎన్నికల్లో గెలుపునకు వాడుకుంటే నేరమే
» తెలంగాణలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్

(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో అక్రమాలు అంటే.. కేవలం ఓటర్లకు డబ్బులు పంచడం, ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్ వంటివే కాదు! అధికార దుర్వినియోగమూ దానికిందికే వస్తుంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. అధికారులను ప్రభావితం చేసి ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేయడం, మళ్లీ గెలిచేందుకు అధికారయంత్రాంగాన్ని ఇష్టం వచ్చినట్టు వాడుకోవడం.. ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించడమే. విపక్ష నేతలు, ఎన్నికల్లో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేసి.. వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయడం.. అస్మదీయుల నగదు రవాణాకు టాస్క్‌ఫోర్స్ వాహనాలను, పోలీసులను వాడుకోవడం.. ఇవన్నీ ప్రజాప్రాతినిధ్య చట్టంలో పేర్కొన్న 'కరప్ట్ ప్రాక్టీసెస్' కిందికే వస్తాయని రాజకీయ, రాజ్యాంగ నిపుణులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా తెలంగాణలో ఇవన్నీ జరిగినట్లు తాజాగా స్పష్టమైంది. ట్యాపింగ్‌పై లోతైన విచారణ జరుగుతుండటంతో ఒక్కో గుట్టు రట్టవుతోంది. ఇంత చేసినా బీఆర్ఎస్ నెగ్గిన సీట్లు 36 మాత్రమే. అక్కడ కూడా తమకు సమానావకాశాలు లేకుండా చేసి, చట్టవిరుద్ధమైన చర్యల ద్వారా బీఆర్ఎస్ గెలిచిందని.. ఓటమి పాలైన వారు కోర్టుకు వెళ్లొచ్చు. అదే జరిగితే... బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటం ఖాయమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

ఇందిర విషయంలో జరిగిందిదే...

1971లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 352 సీట్లతో అజేయశక్తిగా నిలిచింది. రాయ్‌బరేలీ నుంచి ఇందిరా గాంధీ లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో నెగ్గారు. ఆ సీటులో సంయుక్త సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా ఆమెతో పోటీ పడ్డ రాజ్‌నారాయణ్.. తన గెలుపుపై చాలా విశ్వాసంతో ఉన్నారు. కానీ, ఫలితం అందుకు విరుద్ధంగా రావడం ఆయనకు షాక్. ఇందిరా గాంధీ ప్రభుత్వ యంత్రాంగాన్ని దారుణంగా దుర్వినియోగం చేయడమే తన ఓటమికి కారణమని భావించిన ఆయన.. అలహాబాద్ హైకోర్టులో 'ఎన్నికల పిటిషన్' దాఖలుచేశారు. ఎన్నికల పిటిషన్ అంటే.. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 80 ప్రకారం.. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి అవినీతి విధానాలను అవలంబించినా, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినా.. ఆ అభ్యర్థిని అనర్హుడిగా/అనర్హురాలిగా ప్రకటించాలంటూ సదరు అభ్యర్థితో పోటీపడిన ప్రత్యర్థిగానీ, ఆ నియోజకవర్గంలోని ఓటరుగానీ హైకోర్టును ఆశ్రయించి వేసే పిటిషన్. 1971 ఏప్రిల్ 24న రాజ్‌నారాయణ ఈ పిటిషన్ వేశారు. ఇందిర ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని.. సాయుధ దళాలు సహా ఎన్నికల ప్రచారంలో ఆమెకు పలువురు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, స్థానిక పోలీసులు సహకరించారని పేర్కొన్నారు. భారత వైమానిక దళం ఆమెకు విమానాలను, హెలికాప్టర్లను సమకూర్చిందని పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 (7) ప్రకారం అలా చేయడం 'కరప్ట్ ప్రాక్టీసెస్' కిందకు వస్తుందని.. అది అనర్హతకు తగిన కారణమని గుర్తుచేశారు. అలాగే.. ఆమె తన ఎన్నికల ప్రచారానికి ప్రభుత్వ వాహనాలను వాడుకున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు.. ఎన్నికల కోసం అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినందున ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 123 (7) ప్రకారం ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదంటూ 1975 జూన్ 12న తీర్పునిచ్చింది. ఆ తీర్పుతో.. ఉన్న సీటును కోల్పోవడమే కాక, ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసే అర్హతను కూడా ఆమె కోల్పోయారు. దీనిపై ఇందిర సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ.. దేశ అత్యున్నత న్యాయస్థానం అలహాబాద్ హైకోర్టు తీర్పును కొట్టివేయలేదు. ఎగ్జిక్యూషనల్ స్టే మాత్రమే ఇచ్చింది. దరిమిలా ఆమె దేశంలో ఎమర్జెన్సీ విధించారు. ప్రస్తుతం తెలంగాణలో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సైతం అంతకుమించి అధికార దుర్వినియోగం కిందికి వస్తుందని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు.

ఇప్పటికీ చాన్స్..

ఫోన్ ట్యాపింగే అక్రమం, చట్టవిరుద్ధం అయితే.. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు చట్టబద్ధంగా ఎన్నికల్లో ఖర్చుపెట్టేందుకు తీసుకెళ్తున్న డబ్బు వివరాలను ట్యాపింగ్ ద్వారా విని, ఆ సొమ్మును అడ్డుకోవడం ఎన్నికల అక్రమం కిందకే వస్తుందని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. ఇది ఎన్నికల్లో ప్రత్యర్థుల కాళ్లు,చేతులు కట్టేసినట్టేనని, వారి విజయావకాశాలను దెబ్బతీయడమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. విపక్షాలు న్యాయపరంగా తమకున్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ అవసరాల కోసం బ్యాంకు నుంచి డబ్బు తీసుకుని వస్తుంటే.. ఫోన్ ట్యాపింగ్ ద్వారా తెలుసుకుని పట్టుకున్నారని ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అలాగే తన ఫోన్ ట్యాప్ చేశారని సిరిసిల్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కేకే మహేందర్ రెడ్డి సైతం ఇటీవలే ఆరోపించారు. అలాగే ఎన్నికల సందర్భంగా తమ ఫోన్‌లు ట్యాప్ అయ్యాయని పలువురు నేతలు ఆరోపిస్తున్నారు. అప్పటి అధికార పార్టీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం ద్వారా తాము ఓడిపోయామని పేర్కొంటూ వీరంతా హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని సమాచారం. అయితే.. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత నిర్దీత కాలవ్యవధిలోనే హైకోర్టును ఆశ్రయించి ఎలక్షన్ పిటిషన్ వేయాల్సి ఉంటుందని నిబంధనలు చెబుతున్నాయి. కానీ, ట్యాపింగ్ గుట్టు రట్టయిందే ఇప్పుడు కనుక.. ఓడిపోయిన అభ్యర్థులు హైకోర్టును ఇప్పటికైనా ఆశ్రయించవచ్చని, కోర్టు కూడా వారి వాదనను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, కేసును విచారించే అవకాశం ఉన్నదని కొందరు న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

24 నుంచి వేసవి సెలవులు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు ఈనెల 24 నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఎప్పటిలాగే జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్!

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో పిల్లలు నీరు తాగేందుకు ప్రత్యేకంగా వాటర్ బెల్స్ మోగించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ ఆదేశించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున హైడ్రేషన్ కోసం తరచూ నీరు తాగాల్సిన అవసరం ఉంటుందని, దీనిపై అవగాహన కోసం ప్రత్యేకంగా మూడు బెల్స్ మోగించాలని నిర్ణయించామని వివరించారు. ఉదయం 8.45, 10.05, 11.50 సమయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు నీరు తాగేందుకు గంట మోగించాలని పేర్కొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ ఏర్పాటు

▸ కన్వీనర్‌గా పి.మదన్ మోహన్‌రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు జేఏసీని ఏర్పాటుచేసుకున్నాయి. మంగళవారం మంగళగిరిలో జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులను యాజమాన్యాల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా పాపిరెడ్డి మదన్ మోహన్‌రెడ్డి, కో కన్వీనర్‌గా మోహన్ రావు, రీజనల్ కోఆర్డినేటర్లుగా భాస్కర రెడ్డి, రమణాజీను ఎన్నుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కేజీ నుంచి పీజీ వరకు ప్రైవేటు విద్యాసంస్థలు తీవ్రంగా నష్టపోయాయని సమావేశంలో యాజమాన్యాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ప్రధానంగా విద్యా దీవెన పథకంలో ఇచ్చే నగదును నేరుగా కాలేజీల ఖాతాల్లోనే జమ చేయాలని, పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించాలని, పీజీ విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ బకాయిలను మూడు నెలల్లోగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హౌసింగ్‌లో ఆర్థిక అవకతవకలు

▸ ఫైనాన్స్ మేనేజర్‌కు షోకాజ్

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌లో భారీస్థాయిలో జరిగిన ఆర్థిక అవకతవకలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఆ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఫైనాన్స్ మేనేజరు ఆర్.తిరుపతి నాయక్ తమ సంస్థ ఉన్నతాధికారుల (కాంపిటెంట్ అథారిటీ) అనుమతి లేకుండా గత నెల 15వ తేదీన ఏకంగా రూ.35 కోట్ల నిధులు ఒక బ్యాంకు నుంచి మరొక బ్యాంకుకు చెక్కు ద్వారా బదిలీ చేశారు. ఈ వ్యవహారం హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి వెళ్లింది. కార్పొరేషన్ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఉద్దేశపూర్వకంగానే ఈ పని చేసినట్టుగా భావించిన ఎండీ.. తిరుపతి నాయక్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

సాగర్ నీటి విడుదలకు చర్యలు చేపట్టండి

▸ కేఆర్ఎంబీని కోరిన ఏపీ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల కోసం ఈ నెల 8వ తేదీ నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున ఐదు టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను రాష్ట్ర జల వనరుల శాఖ కోరింది. ఈమేరకు నాగార్జునసాగర్ వద్ద గస్తీ ఉన్న సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేయాలని కూడా ఏపీ కోరింది. అంతేగాకుండా తెలంగాణ తమకు కేటాయించిన 35 టీఎంసీల కంటే ఏడు టీఎంసీలను అధికంగా వినియోగించినందున.. నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి రాష్ట్రానికి విడుదల చేసే కృష్ణా జలాలను తెలంగాణ తోడేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ జల వనరుల శాఖ ఇంజనీరు ఇన్ చీఫ్ సి.నారాయణరెడ్డి మంగళవారం కేఆర్ఎంబీ చైర్మన్‌ను కోరారు.

కన్నతల్లిని గొంతు కోసి చంపేశాడు

▸ ఆస్తి తగాదాలతో ఓ కొడుకు ఘాతుకం

పిచ్చాటూరు, ఏప్రిల్ 2 :ఆస్తి తగాదాలతో కన్నతల్లినే కత్తితో గొంతు కోసి చంపాడో కొడుకు. తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడుకు చెందిన రాజమ్మ(80)కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మునస్వామి తల్లితో పాటు గ్రామంలోనే ఉండేవాడు. కృష్ణారెడ్డి తమిళనాడులోని అరక్కోణంలో కాపురముండేవాడు. ఏడాదిన్నర క్రితం మునస్వామి అనారోగ్యంతో మృతి చెందగా అతని కుమారుడు హరిరెడ్డికి ఎకరం పొలాన్ని రాజమ్మ రాసిచ్చారు. కృష్ణారెడ్డి కూడా ఏడాది క్రితం స్వగ్రామానికి చేరుకుని కాపురం పెట్టాడు. అన్న కుమారుడి పేరున రాసిన పొలాన్ని మార్చి తనకు రాసివ్వాలంటూ తరచూ గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం పూటుగా మద్యం సేవించిన కృష్ణారెడ్డి ఆ మత్తులో హరిరెడ్డి కుటుంబంతో గొడవకు దిగాడు. దీంతో హరిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలిసిన కొంతసేపటికే కృష్ణారెడ్డి, అతని భార్య గౌరి, కుమారులు ఇళంగోవన్, పురుషోత్తం రాజమ్మపై దాడి చేశారు. కృష్ణారెడ్డి కత్తితో రాజమ్మ గొంతు కోసి చంపి పరారయ్యాడు. సీఐ భాస్కర్ నాయక్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

'విద్యా' ప్రచారానికి బ్రేక్!

▸ ఆదేశాలను ఉపసంహరించుకున్న ఇంటర్ విద్యాశాఖ

▸ స్పాట్ అడ్మిషన్ల పేరుతో ప్రచారానికి గతవారం ఆదేశం

▸ 'ఆంధ్రజ్యోతి' కథనంతో గుర్తొచ్చిన ఎన్నికల కోడ్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాల పేరుతో చేపట్టదలిచిన ప్రచారాన్ని నిలిపివేయాలని ఇంటర్ విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ల కోసం ఈనెల 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం చేయాలని మార్చి 27న ఆ శాఖ ఆదేశాలు జారీచేసింది. పేరుకు పాఠశాలల్లో ప్రచారమే అయినా ఇంటింటికీ వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విద్యా రంగంలో అమలుచేస్తున్న పథకాల గురించి ప్రచారం చేయాలని భావించింది. తద్వారా విద్యార్థులను ప్రభుత్వ కాలేజీల్లో చేర్పించమని అడగాలని జూనియర్ లెక్చరర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లకు సూచించింది. గతంలో ఎప్పుడూ ఇలాంటి విధానం లేకపోవడంతో ఇది ఎన్నికల కోసమేనని జేఎల్స్, టీచర్లు ఒక అంచనాకు వచ్చారు. కానీ, టార్గెట్లు పెట్టి మరీ ప్రచారం చేయాలనడంతో ప్రచారానికి సిద్ధమయ్యారు. దీనిపై 'చదువుల పేరిట చక్కబెట్టేద్దాం!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' సోమవారం కథనాన్ని ప్రచురించింది. ఎన్నికల వేళ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రచారం చేయాలన్న నిర్ణయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రతిపక్ష పార్టీలు ఈసీకి ఫిర్యాదు కూడా చేశాయి. దీంతో అప్రమత్తమైన ఇంటర్ విద్యాశాఖ ఎన్నికల కోడ్ అమల్లో ఉందనే కారణంతో ఈ ప్రచారాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని వెంటనే క్షేత్రస్థాయి అధికారులకు చేరవేయాలని ఆదేశిస్తూ ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

జనం లేని జగన్ యాత్ర!

రోడ్డు షో వెలవెల.. పోలీసులు ..., సెక్యూరిటీ సిబ్బందే ఎక్కువ

▸ పలు గ్రామాల్లో ఆగకుండా వెళ్లిన బస్సు

▸ నమస్కారాలు.. చేతులు ఊపడంతో సరి

▸ బహిరంగ సభకు వెయ్యి ఆర్టీసీ బస్సులు

▸ పలు జిల్లాల నుంచి జనాల తరలింపు

▸ రూ.300, బిర్యానీ, మద్యం పంపిణీ

▸ సీఎం ప్రసంగం మొదలవగానే జనం జంప్

▸ ఎన్నికల నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘన



మదనపల్లెలో జరిగిన మేమంతా సిద్ధం బహిరంగ సభలో జగన్ మాట్లాడుతున్న సమయానికే జనం లేక ఖాళీగా ఉన్న గ్యాలరీలు

రాయచోటి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'మేమంతా సిద్ధం' పేరుతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సీఎం జగన్‌కు అన్నమయ్య జిల్లా ప్రజలు గట్టి దెబ్బే కొట్టారు. మంగళవారం అన్నమయ్య జిల్లా ములకలచెరువు నుంచి కురబలకోట మండలం వరకు సుమారు 45 కిలోమీటర్లు సాగిన బస్సుయాత్రకు జనం కరువయ్యారు. దీంతో రోడ్డు షో వెలవెల పోయింది. జగన్ బస్సు చుట్టూ.. పోలీసులు, సెక్యూరిటీ సిబ్బందే ఎక్కువగా కనిపించారు. బస్సుయాత్ర సాగిన మార్గంలోని పలు గ్రామాల వద్ద జనం లేకపోవడంతో.. బస్సును ఆపకుండా వెళ్లిపోయారు. కొన్నిచోట్ల అంతంతమాత్రంగానే ఉన్న జనాన్ని చూసి సీఎం జగన్ బస్సు నుంచి కిందకు దిగి వారిని పలకరించారు. మిగిలిన చోట్ల బస్సులో నుంచే ప్రజలకు నమస్కారాలు చేశారు. గాలిలో చేతులు ఊపడాలతోనే సరిపెట్టారు. జగన్ బస్సు వెంట వచ్చిన వాహనాల కారణంగా.. గంటల పాటు వాహనాలతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. మరోవైపు మంగళవారం సాయంత్రం మదనపల్లెలో జరిగిన మేమంతా సిద్ధం బహిరంగసభకు మూడు నాలుగు జిల్లాల నుంచి దాదాపు 1000కి పైగా ఆర్టీసీ బస్సుల్లో జనాలను తరలించారు. అయితే, జగన్ ప్రసంగం ప్రారంభం అయ్యా అవ్వకముందే.. గ్యాలరీల నుంచి జనం బయటకు వెళ్లిపోయారు. ఇక, అధికారపార్టీ నేతలు యథేచ్ఛగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారు.

చడీచప్పుడు లేని వైనం

శ్రీ సత్యసాయి-అన్నమయ్య జిల్లా సరిహద్దులో సోమవారం రాత్రి బసచేసిన ప్రాంతం నుంచి మంగళవారం ఉదయం 10.30 గంటలకు జగన్ బస్సు యాత్ర బయలుదేరింది. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకు జగన్ బస్సులోనే ఉండిపోయారు. ములకలచెరువు మండలంలో ఎక్కడా బస్సు పైకి ఎక్కలేదు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడలేదు. బస్సులో నుంచి బయటకు రాకపోవడంతో ప్రజలు, వైసీపీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. దీంతో మేమంతా సిద్ధం బస్సుయాత్ర చడీచప్పుడు లేకుండానే సాగిపోయింది. పెద్దపాళ్యం, వేపూరికోటలలో బస్సులో నుంచి జగన్ బయటకు వచ్చి బస్సు మెట్లమీద నుంచే మాట్లాడారు. కొన్నిచోట్ల కిందకు దిగి.. గంటల కొద్దీ వేచి ఉన్న వారిని అరనిముషంలో పలకరించి బస్సెక్కేశారు. ఇదే పరిస్థితి బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లోనూ కనిపించింది.

జాతీయ రహదారిపై ఇక్కట్లు

బస్సుయాత్రకు జనం పెద్దగా రాకపోయినా.. పోలీసులు భద్రత పేరుతో ట్రాఫిక్‌ను నియంత్రించారు. దీంతో జాతీయరహదారిపైన ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. మదనపల్లె నుంచి ములకలచెరువు వరకు ట్రాఫిక్‌ను మళ్లించారు. బెంగళూరు నుంచి కడపకు వెళ్లే వాహనాలను కూడా దారి మళ్లించడంతో.. ప్రయాణికులు అదనంగా 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చింది. రోడ్డుపక్కనే పెద్దపెద్ద వాహనాలు నిలపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కర్ణాటక ఆర్టీసీ బస్సు ప్రయాణీకులు ఆందోళన చేయడంతో.. పోలీసులు వారికి సర్దిచెప్పారు.

మద్యం, డబ్బు పంపకాలు

బస్సుయాత్రకు వచ్చిన వాళ్లకు అధికారపార్టీ నేతలు జోరుగా మద్యం, డబ్బు పంపిణీ చేశారు. సభకు ప్రజలను తరలించడానికి వైసీపీ నేతలు పెద్దఎత్తున డబ్బులు పంపిణీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపాలిటీలలో ఒక్కో వార్డుకు, ఒక్కో పంచాయతీకి రూ.లక్ష ఇచ్చినట్టు సమాచారం. పెద్ద వార్డులు, మేజర్ పంచాయతీలకు రూ.లక్షన్నర నుంచి 2 లక్షలు ఇచ్చినట్టు తెలిసింది. సభకు వచ్చే మహిళకు రూ.300, మధ్యాహ్నం బిర్యానీ ప్యాకెట్, పురుషులకు డబ్బుతోపాటు మద్యం పంచారు. ఈ యాత్రకు పలు జిల్లాల నుంచి సుమారు 1000కి పైగా ఆర్టీసీ బస్సుల్లో జనాలను తరలించారు. ఆర్టీసీ బస్సులకు వైసీపీ జెండాలు, బోర్డులు పెట్టారు. బస్సు యాత్ర దారిపొడవునా జెండాలు కట్టారు. వైసీపీ నేతలు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా.. అధికారులు పట్టించుకోలేదని పలువురు విమర్శిస్తున్నారు.

నా కోసం 2 సార్లు బటన్ నొక్కండి

▸ 99 మార్కులు తెచ్చుకున్న విద్యార్థి పరీక్షలకు ఎప్పుడైనా భయపడతాడా?

▸ మదనపల్లె సభలో సీఎం జగన్

మదనపల్లె పట్టణంలో మంగళవారం సాయంత్రం జరిగిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్.. తనకు మాత్రమే అలవాటైన అబద్ధాలను అలవోకగా చెప్పారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఏమాత్రం అభివృద్ధి చేయకపోయినా..తమ మేనిఫెస్టోలోని అన్ని



హామీలను నెరవేర్చామని పాత విషయాలనే ఏకరువు పెట్టారు. 2014లో వచ్చిన కూటమే.. మళ్లీ ఎన్నికల కోసం వస్తోందన్నారు. ఈ కూటమి అప్పట్లో రాష్ట్రానికి ఏమీ చేయకపోయినా..ఇప్పుడు మళ్లీ ఒకటిగా వస్తోందని అన్నారు. తనను ఒంటరిగా ఎదుర్కొనే శక్తి లేకనే గుంపుగా వస్తున్నాయని సినిమా డైలాగులు చెప్పారు. తన ఒక్కడి మీద.. ఇంత మంది కలిసి దాడిచేస్తున్నారని బేలమాటలు మాట్లాడారు. 99 మార్కులు తెచ్చుకున్న విద్యార్థి పరీక్షలకు భయపడనట్లు.. తాను కూడా భయపడనని బీరాలు పలికారు. ఈ ఐదేళ్లలో 130సార్లు బటన్లు నొక్కానని, రాబోయే ఎన్నికల్లో తనకోసం రెండుసార్లు బటన్ నొక్కాలని కోరారు. గతంలో బీజేపీ ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. అయితే గత ఐదేళ్లలో తాను కనీసం ఒకసారి కూడా ప్రత్యేక హోదా కోసం నోరెత్తక పోవడాన్ని ప్రస్తావించలేదు. వలంటీర్లు మన వాళ్లే అని చెప్పిన ముఖ్యమంత్రి.. ఎన్నికల సంఘం వలంటీర్లను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తే.. చంద్రబాబు వల్లే వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయలేకపోయారని వేలాది మంది సాక్షిగా అబద్ధం చెప్పేశారు. వెరసి మదనపల్లెలో జగన్ సభ ఆత్మస్తుతి.. ప్రతిపక్షాలపై నిందలతోనే సాగింది. అయితే.. ముఖ్యమంత్రి ప్రసంగం మొదలు పెట్టకముందే.. జనం వెనుదిరగడం మొదలు పెట్టారు. ఆయన ప్రసంగం పూర్తయ్యే సమయానికి గ్యాలరీలు సగానికి పైగా ఖాళీ అయ్యాయి. కాగా.. మదనపల్లెలో సభ ముగిసిన అనంతరం సదుం మండలం చేరుకుని మంత్రి పెద్దిరెడ్డి ఇంట్లో సీఎం జగన్ మంగళవారం రాత్రి బస చేశారు.

రూ.4,000 కోట్ల అప్పు

▸ నూతన ఆర్థిక సంవత్సరానికి అప్పుతో స్వాగతం

▸ తొలి వర్కింగ్ డేనే ఆర్బీఐ నుంచి భారీ రుణం

▸ మార్చి 31న 1,000 కోట్ల అప్పు తెచ్చిన సర్కారు

▸ 1,200 కోట్లతో అస్మదీయులకు బిల్లుల చెల్లింపులు

▸ ఇంకా జమ కాని ఉద్యోగుల జీతాలు, పింఛన్లు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్థిక సంవత్సరానికి జగన్ సర్కారు అప్పులతో స్వాగతం పలికింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి వర్కింగ్ డే నాడే అప్పుల మోత మోగించింది. ఆర్బీఐ నుంచి మంగళవారం ఏకంగా రూ.4,000 కోట్లు అప్పుగా తెచ్చింది. గత ఆర్థిక సంవత్సరం చివరిరోజు మార్చి 31న అస్మదీయులకు బిల్లులు చెల్లించడానికి ఆర్బీఐ నుంచి రూ.1,000 కోట్లు రుణం తెచ్చారు. వాటితో కలిపి మొత్తం రూ.1,200 కోట్ల బిల్లులు చెల్లించారు. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటిరోజు అంటే ఏప్రిల్ 1న రూ.1,000 కోట్ల అప్పుతో రాష్ట్ర ఖజానా ప్రారంభమైంది. ఇలాంటి తప్పులు చేయకూడదని కాగ్ తన నివేదికల్లో చేస్తున్న హెచ్చరికలను జగన్ సర్కారు ఏమాత్రం ఖాతరు చేయలేదు. ఇది చాలదన్నట్టు తొలి పని దినం అయిన మంగళవారం ఆర్‌బీఐలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు వేలం వేసి రూ.4వేల కోట్ల అప్పులు తెచ్చారు. ఈ నెల ఇంతవరకూ సామాజిక పెన్షన్లు, ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇవ్వలేదు. ఉద్యోగులందరికీ వేతనాలు, పెన్షన్లు అందేసరికి నెలలో మూడో వారం వస్తోంది. రాష్ట్ర సచివాలయంలో కొందరు ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు పడేవి. కానీ, ఈ నెలలో 2న కూడా ఒక్కరికీ జీతం అందలేదు.

ఉద్యోగులకు బకాయిలు 32,000 కోట్లు

జగన్ సర్కారు రూ.వేల కోట్ల అప్పులు తెచ్చి నిబంధనలకు విరుద్ధంగా అస్మదీయులకు బిల్లులు చెల్లిస్తోంది. కానీ, ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు మాత్రం ఇవ్వడంలేదు. 2018 జూలై 1 నుంచి డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు, గ్రాట్యుటీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్లు ఇంతవరకు చెల్లించలేదు. ఈ బకాయిలన్నీ కలుపుకొని రూ.32,000 కోట్లకు పైగానే ఉంటాయి. ఎన్నికల కోడ్ వచ్చాక ఇప్పటి వరకు రూ.14,500కోట్ల చెల్లింపులు చేశారు. ఇందులో ఒక్క రూపాయి కూడా ఉద్యోగుల బకాయిలకు ప్రభుత్వం వెచ్చించలేదు. ఈసారి వైసీపీ గెలవదన్న భయంతోనే ప్రభుత్వ పెద్దలు అప్పులు తెచ్చి మరీ అస్మదీయులకు బిల్లులు ఇచ్చేసుకుంటున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

'వివేకం' ప్రదర్శనను నిలిపివేయాలని వ్యాజ్యం

▸ విచారణ రేపటికి వాయిదా వేసిన హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల షెడ్యూల్ ముగిసే వరకు మాజీమంత్రి వివేకానందరెడ్డి బయోపిక్‌గా చెప్పబడుతున్న వివేకం సినిమాను యూట్యూబ్, ఓటీటీలలో ప్రదర్శించకుండా, నిలుపుదల చేసేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వివేకానందరెడ్డి హత్యలో నిందితుడిగా ఉన్న షేక్ దస్తగిరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్, ఎన్నికల సంఘాన్ని న్యాయస్థానం ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 4కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మంగళవారం ఆదేశాలిచ్చారు. దస్తగిరి తరపున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. సీబీఐకి, పులివెందుల కోర్టుకు దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వివేకం సినిమా తీశారని, అతన్ని అబాసుపాల్జేసేలా సినిమాలో నేరుగా పేరువాడారని తెలిపారు. ఈ సినిమాను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు ఓ రాజకీయపార్టీ ప్రయత్నిస్తోందన్నారు. పిటిషనర్ దస్తగిరి ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారని, ఈ నేపథ్యంలో సినిమా ప్రదర్శను నిలుపుదల చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు.

అభ్యర్థుల వివరాలు తెలుగులో వెల్లడించాలి!

▸ క్రిమినల్ కేసులు, ఆస్తుల వివరాలు అందుబాటులో ఉంచేలా ఈసీఐని ఆదేశించండి.. హైకోర్టులో పిల్

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించిన అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌ను(ఫామ్-26) తెలుగులోకి అనువదించి పౌరులకు అందుబాటులోకి తెచ్చేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విజయవాడకు చెందిన ఎస్.రమేష్‌బాబు ఈ పిల్ దాఖలు చేశారు. అభ్యర్థులకు సంబంధించిన వివరాలన్నింటినీ తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేసేలా ఆయా రాజకీయపార్టీలు, అభ్యర్థులను ఆదేశించాలని కోరారు. పిటిషనర్ సమర్పించిన వినతులను పరిగణలోకి తీసుకొనేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల అధికారి, ఏపీ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. '2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 83శాతం మంది ప్రజలు కేవలం తెలుగు మాత్రమే అర్థం చేసుకోగలరు. అభ్యర్థులు తమ అఫిడవిట్లను ఆంగ్లంలో సమర్పించడం వల్ల అధికశాతం ప్రజలు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల పూర్వ చరిత్ర తెలుసుకొనే హక్కు ఓటరుకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫామ్-26 అఫిడవిట్‌ను తెలుగులో ఉండేలా చూడాలని ఎన్నికల సంఘానికి పలుమార్లు వినతి సమర్పించినా ఎలాంటి చర్యలూ లేవు. ఫామ్-26 అఫిడవిట్‌ను ఆంగ్లం లేదా ఏదైనా ప్రాంతీయ భాషలో సమర్పించవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. తమిళనాడులో పోటీచేసే అభ్యర్థులు తమ ఫామ్-26 అఫిడవిట్లను తమిళంలో సమర్పించే స్వేచ్ఛ ఉంది. ఏపీలో అఫిడవిట్లను తెలుగులో ప్రచురించడం లేదు. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించిన అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌ను(ఫామ్-26) తెలుగులోకి అనువదించి పౌరులకు అందుబాటులోకి తెచ్చేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించండి' అని పిటిషన్‌లో కోరారు.

అనంతలో ముగ్గురు రైతుల ఆత్మహత్య



సంగప్ప, మిద్దె గోపాల్‌రెడ్డి

తాడిపత్రి టౌన్/పెద్దపప్పూరు/కూడేరు, ఏప్రిల్ 2: అనంతపురం జిల్లాలో అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన రైతు మిద్దె గోపాల్ రెడ్డి(59) తనకున్న ఐదు ఎకరాల పొలంలో ఆరేళ్ల క్రితం చీనీ మొక్కలు నాటాడు. సాగునీటి కోసం ఎనిమిది బోరుబావులు తవ్వించారు. పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం దాదాపు రూ.15 లక్షలు అప్పు చేశాడు. పంట దిగుబడి సరిగా రాకపోవడంతో అప్పులు పేరుకుపోయాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉరివేసుకున్నాడు. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామానికి చెందిన నల్లయ్య(54) నాలుగు ఎకరాల్లో కరివేపాకు సాగుచేశాడు. పెట్టుబడుల కోసం రూ.8 లక్షలదాకా అప్పు చేశాడు. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పాటు, ధర కూడా పతనమైంది. ఈ క్రమంలో ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయిన నల్లయ్య మృతదేహాన్ని మంగళవారం గ్రామంలోని ఓ అరటితోటలో గుర్తించారు. కూడేరు మండలం కడదరకుంట గ్రామానికి సంగప్ప(35) ఐదారు సంవత్సరాలుగా భూములను కౌలుకు తీసుకుని వేరుశనగ, వరి, ఆముదం తదితర పంటలు సాగు చేస్తున్నాడు. దిగుబడి సక్రమంగా రాకపోవడంతో నష్టపోయాడు. పెట్టుబడి, కుటుంబ అవసరాల కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని తీర్చేమార్గంలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మేజిస్ట్రేట్ యాంత్రికంగా వ్యవహరించారు

వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌లకు హైకోర్టులో ఊరట

▸ ఫిర్యాదు చేయగానే పోలీసులకు పంపేశారు

▸ కనీసం ఫిర్యాదుకు కారణాలూ పేర్కొనలేదు

▸ పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసులో పిటిషనర్లపై తదుపరి చర్యలు నిలిపివేస్తున్నాం

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసులో దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. పులివెందుల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు వారిపై నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలను 4వారాల పాటు నిలుపుదల చేసింది. కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదును ఎలాంటి కారణాలు పేర్కొనకుండా మేజిస్ట్రేట్ యాంత్రికంగా పోలీసులకు పంపించారని ఆక్షేపించింది. రికార్డులన్నింటినీ పరిశీలించిన తర్వాతే ప్రైవేటు ఫిర్యాదును పోలీసులకు పంపించారా? అనే సందేహం వ్యక్తం చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య కేసులో సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ కోరిన విధంగా సాక్ష్యం చెప్పాలని, లేకుంటే హత్య కేసులో ఇరికిస్తామని వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి ఒత్తిడి చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని ఆరోపిస్తూ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు.. కేసు నమోదుచేసి ఈ ఏడాది జనవరి 4లోగా తుది నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. దీంతో ఎస్పీ రామ్‌సింగ్, సునీత, రాజశేఖరరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి, చార్జ్‌షీట్ వేశారు. ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు వచ్చింది.

ఆధారాలు పరిశీలించకుండానే!

సునీత, రాజశేఖరరెడ్డి తరపు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు. ప్రైవేటు ఫిర్యాదుకు సంబంధించి ఏమైనా ఆధారాలు ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని పరిశీలించకుండానే మేజిస్ట్రేట్ యాంత్రికంగా కేసు నమోదు చేసి తుది నివేదిక దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారని తెలిపారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వుల్లో ఎలాంటి కారణాలు పేర్కొనలేదన్నారు. ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నారు. దురుద్దేశపూర్వకంగా పిటిషనర్లపై కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారని తెలిపారు. పోలీసులు నమోదు చేసిన కేసు, పులివెందుల కోర్టులో తదుపరి చర్యలను నిలుపుదల చేయాలని కోరారు. సీబీఐ దర్యాప్తు అధికారి రామ్‌సింగ్ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ బి.నరసింహ శర్మ స్పందిస్తూ.. ఫిర్యాదు చేసిన కృష్ణారెడ్డి ప్రమాణపూర్వక వాంగ్మూలాన్ని నమోదు చేయకుండానే మేజిస్ట్రేట్ యాంత్రికంగా కేసు నమోదుచేసి తుది నివేదిక దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారన్నారు. సీఆర్పీసీ సెక్షన్ 197 ప్రకారం ఎస్పీపై ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఈ కేసులో అలా చేయలేదని ఇది న్యాయ విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనన్నారు. సీబీఐ ఎస్పీపై గతంలో కూడా కేసు నమోదు చేయగా, హైకోర్టు స్టే విధించిందన్నారు.

మేజిస్ట్రేట్ ఉత్తర్వులు సరైనవే

పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. నాగిరెడ్డి, ఫిర్యాది కృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మేజిస్ట్రేట్ ఉత్తర్వులు సరైనవేనని తెలిపారు. పోలీసులు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను కోర్టు రిటర్న్ చేసిందన్నారు. ప్రస్తుత వ్యాజ్యాలకు విచారణార్హత ఉండదన్నారు. ఈ వాదనలపై న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎలాంటి కారణాలు పేర్కొనలేదన్నారు. ఈ వ్యవహారంపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు.



హారతి పడుతున్న వారికి నగదు ఇస్తున్న నాని

హారతి ఇచ్చుకో.. వెయ్యి పుచ్చుకో!

▸ ఓటర్లకు కొడాలి నాని తాయిలాలు

గుడివాడ, ఏప్రిల్ 2: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానీ ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు తాయిలాలు పంచుతున్నారు. ఇంటింటి ప్రచారానికి వెళుతున్న నానీ.. హారతి పట్టేవారికి పళ్లెంలో రూ.1000 పెడుతున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా హారతి పళ్లెం డబ్బుల పంపిణీ యదేచ్ఛగా సాగుతోంది. ఎన్నికల అధికారులు మాత్రం దీనిపై మౌనం వహిస్తున్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచార సామగ్రి స్వాధీనం



పిఠాపురంలో ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్న వైసీపీ ఎన్నికల ప్రచార సామగ్రి ఉన్న వాహనం

పిఠాపురం, ఏప్రిల్ 2: కాకినాడ జిల్లా పిఠాపురంలో వైసీపీ ఎన్నికల ప్రచార సామగ్రిని తరలిస్తున్న వాహనాన్ని, ప్రచార సామగ్రిని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పాదగయ జంక్షన్ సమీపంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. కాకినాడ నుంచి తుని వెళుతున్న వాహనాన్ని తనిఖీచేయగా బాక్సులు, బస్తాలు కనిపించాయి. ఒక బస్తాను తెరిచి చూడగా లోపల డమ్మీ ఈవీఎంలు, వైసీపీ టోపీలు, మాస్కులు, స్టిక్కర్లు, జెండాలు ఉన్నాయి. దీంతో వాహనాన్ని అందులో ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు.


శ్రీకాకుళంలో తనిఖీల్లో రూ.5.6 లక్షలు స్వాధీనం

శ్రీకాకుళం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల వేళ.. శ్రీకాకుళం జిలా జలుమూరు మండలం టెక్కలిపాడు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీలో రూ.3.1లక్షలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలాసలో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.2.5 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఏసీబీ వలలో టంగుటూరు ఎస్ఐ

▸ కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ.లక్ష డిమాండ్

▸ రూ.70 వేలు తీసుకుంటుండగా పట్టివేత



ఎస్ఐ నాగేశ్వరరావు

టంగుటూరు, ఏప్రిల్ 2: ప్రకాశం జిల్లా టంగుటూరు ఎస్ఐ ఎ.నాగేశ్వరరావు ఏసీబీ వలకు చిక్కాడు. కేసు నమోదు చేయకుండా ఉండేందుకు ఓ వ్యక్తి వద్ద రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని కాకుటూరివారిపాలెంలో వైసీపీకి చెందిన మార్టూరి వెంకట్రావు అనుమతి లేకుండా పొగాకు బ్యారన్లు నిర్మిస్తుండటంపై కొద్దిరోజుల క్రితం అప్పటి పంచాయతీ కార్యదర్శి సాంబయ్య ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బ్యారన్ నిర్మిస్తున్న మార్టూరి వెంకట్రావు తనను సర్పంచ్ తనయులు కొమ్మినేని వెంకట్రావు, శ్రీనివాసరావు బెదిరిస్తున్నారని ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్పంచ్ తనయుడు వెంకట్రావును స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై.. 'బ్యారన్లు నిర్మిస్తున్న వెంకట్రావును మీరు బెదిరిస్తున్నట్టు అతను ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేస్తున్నా' అని స్పష్టం చేశారు. కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.లక్ష డిమాండ్ చేశాడు. అందుకు ఆయన అంగీకరించాడు. సర్పంచ్ రెండో కుమారుడైన శ్రీనివాసరావు తొలివిడత గత నెల 29న ఎస్సైకి రూ.30వేలు ఇచ్చారు. మిగిలిన డబ్బులు త్వరగా ఇవ్వాలని ఎస్ఐ హుకుం జారీ చేయడంతో సర్పంచ్ తనయులు ఈ నెల 1న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు శ్రీనివాసరావు మంగళవారం టంగుటూరు వచ్చారు. అనంతరం ఎస్ఐకి ఫోన్ చేయగా, స్థానిక చెల్లమ్మతోటలోని తన నివాసానికి రావాలని సూచించారు. అక్కడ ఎస్ఐకు రూ.70 వేలు ఇవ్వగానే అప్పటికే అక్కడ ఉన్న ఏసీబీ అధికారులు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టుకు హాజరుపరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపారు.

ఆరుగురు మత్స్యకారులు గల్లంతు

గాలిస్తున్న కోస్టుగార్డు, నేవీ

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో వేటకు బయలుదేరిన ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. వీరంతా వీ-1- ఎంఓ-2736 నంబరు బోటులో సోమవారం సాయంత్రం వేటకు వెళ్లారు. హార్బర్ నుంచి గంగవరం వైపు వేటకు వెళ్లిన వీరు మంగళవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయారు. వీరు విశాఖపట్నం, విజయనగరం జిల్లా భోగాపురం మండలానికి చెందినవారు. దీనిపై మత్స్యకార నాయకులు ఫిర్యాదు చేయగా కోస్టుగార్డు, నేవీ హెలికాప్టర్ సాయంతో గాలింపు చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారిలో విశాఖపట్నం పెయింటరపేటకు చెందిన కర్రి చిన్నారావు (33), చెంగ్రాలపేటకు చెందిన కర్రి నరేంద్ర (18), కర్రి సత్తయ్య (56), భోగాపురం మండలం ముక్కాం సమీపాన కొంగవానిపాలేనికి చెందిన వాసుపల్లి అప్పన్న, పొడుగు అప్పన్న, మైలపల్లి మహేశ్ ఉన్నట్టు ఏపీ మెకనైజ్డ్ బోటు ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రమాదకర రాజకీయం

యాభైయేళ్ళక్రితం భారత్–శ్రీలంక మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా పాక్ జలసంధిలోని కచ్చతీవు ద్వీపం శ్రీలంక అధీనంలోకి పోయింది. 1974జూన్‌లో ఇందిరాగాంధీ–సిరిమావో బండారునాయకే చేసుకున్న ఈ స్నేహపూర్వక ఒప్పందం మనదేశానికి భద్రతాపరంగా పెద్ద నష్టాన్ని చేకూర్చిందని ప్రధాని నరేంద్రమోదీ ఇప్పుడు అంటున్నారు. కొత్త సత్యాలు బయటపడుతున్నాయనీ, దేశానికి వ్యూహాత్మకంగా ముఖ్యమైన ఈ ప్రాంతాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యంగా పొరుగుదేశానికి కట్టబెట్టిందని ఆయన ట్వీట్లు చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల కాలంలో భారతీయ జనతా పార్టీ తమిళనాడు రాష్ట్రశాఖ అధ్యక్షుడు ఆర్టీఐ ద్వారా సేకరించిన సమాచారంలో, ఐదుదశాబ్దాలుగా వెలుగుచూడని రహస్యాలు, దేశం నిర్ఘాంతపోయే సత్యాలు కొత్తగా ఏముంటాయన్నది అటుంచితే, పొరుగుదేశంతో దౌత్య సంబంధాలమీద విశేష ప్రభావం చూపే ఓ అంశంమీద ప్రధాని, విదేశాంగ మంత్రీ వ్యాఖ్యలు చేయడం అమితాశ్చర్యం కలిగిస్తోంది. తమిళనాడులోని వివిధ రాజకీయపక్షాల మధ్య వాదోపవాదాలకు, కవ్వింపులకు పరిమితమవుతూన్న ఓ అంశం ఇప్పుడు ప్రధాని ప్రకటనతో, దానికి కొనసాగింపుగా ఈ దీవి విషయాన్ని తేలుస్తామంటూ విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యతో అమితప్రాధాన్యం సంతరించుకుంది. నిర్మానుష్యమైన, తాగేందుకు గుక్కెడు మంచినీళ్ళు దొరకని ఓ అతి చిన్న ప్రాంతం ఎన్నికలపుణ్యమాని రెండు దేశాల మధ్య దూరాన్ని పెంచడానికి తోడ్పడితే ఎంతో ప్రమాదం.

తమిళనాడులో ఎలాగైనా కాలూనాలన్న తహతహ వల్ల కాబోలు, కచ్చతీవుకు సంబంధించి ఏదో కొత్తగా బయటపడిందని మోదీ అంటున్నారు. కానీ, తమిళనాట డీఎంకె, అన్నాడీఎంకెలకు ఈ అంశం దశాబ్దాలుగా రాజకీయాస్త్రంగా ఉపకరిస్తున్నదే. తమిళ మత్స్యకారులమీద శ్రీలంక దాష్టీకం ప్రదర్శించినప్పుడల్లా తమిళనాడులో రాజుకొనే వేడి ఇదే. కచ్చతీవును మన దేశం శ్రీలంకకు పూర్తిగా ఇచ్చేసిందా, ఒప్పందం ప్రకారం మనకున్న పరిమితమైన అధికారాలను సైతం ఆ దేశం ఎందుకు గౌరవించడం లేదు అన్న లోతైన చర్చను అటుంచితే, ఈ దీవిని వెనక్కు తెచ్చుకోవడం అసాధ్యమన్న విషయం ఇప్పటికే తేలిపోయింది. కచ్చతీవు అప్పగింత రాజ్యాంగవ్యతిరేకమని 2008లో జయలలిత సుప్రీంకోర్టులో కేసువేయడం, దానిని వెనక్కుతీసుకోవాలంటే యుద్ధం ఒక్కటే మార్గమని అటార్నీ జనరల్ పేర్కొనడం ప్రధానికి తెలియనివేమీ కావు.

మోదీ తొలివిడత పాలనలో బంగ్లాదేశ్‌తో చేసుకున్న ఓ ఒప్పందంతో కాంగ్రెస్ ఈ కచ్చతీవు ఒప్పందాన్ని పోలుస్తోంది. భారతదేశానికి చెందిన 111 చిన్నాచితకా భూభాగాలను బంగ్లాదేశ్‌కు ఇచ్చేస్తూ, ఈ సరిహద్దుల ఒప్పందం కేవలం భూమికి పరిమితమైనది కాదని, రెండు హృదయాల కలయికని మోదీ వ్యాఖ్యానించిన విషయాన్ని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. పదేళ్ళపాలన తరువాత, సరిగ్గా లోక్‌సభ ఎన్నికలముందు కచ్చతీవుతో ముడిపడిన దేశసమగ్రత, భద్రత ప్రధానికి గుర్తురావడం విశేషం. నెహ్రూ కూడా ఈ చిన్నదీవి విషయంలో పట్టింపులేనితనం ప్రదర్శించారని, ఒక సమావేశంలో పొరుగుదేశంతో సత్సంబంధాలకంటే ఈ చిన్నప్రాంతం తనకు ముఖ్యం కాదన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్పుడు గుర్తుచేస్తున్నారు. ఇందిరాగాంధీ ఎంతో నిర్లక్ష్యంగా ఈ కీలకమైన ప్రాంతాన్ని లంకకు ఇచ్చేశారని బీజేపీ పెద్దలు ఇంతగా బాధపడుతున్నప్పుడు, దానిని వెనక్కుతెచ్చుకొనే ప్రయత్నాలు ఇప్పటికే ఆరంభించివుంటే బాగుండేది. గౌతమ్ అదానీకి శ్రీలంకలో ఓ భారీ ప్రాజెక్టు ఇప్పించేందుకు మోదీ స్వయంగా ఫోన్ చేశారన్న ఆరోపణలను కొందరు ఇప్పుడు గుర్తుచేసుకుంటూ, నరేంద్రమోదీకి శ్రీలంక పాలకులతో బలమైన బంధాలున్నందున ఆయనే కనుక తలుచుకొనివుంటే కచ్చతీవు కథ ఈపాటికే ఓ కొలిక్కివచ్చేదని అంటున్నారు. దేశభద్రతకు అమితప్రాధాన్యం ఇచ్చేపాలకులకు కచ్చతీవు ఇంతకాలం గుర్తుకురాకపోవడం విచిత్రమే మరి. కాంగ్రెస్‌పార్టీ దేశాన్ని రక్షించలేకపోయిందనీ, పొరుగుదేశాల చొరబాట్ల నుంచి మనలను కాపాడలేకపోయిందనీ, దేశభద్రత విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ మన భూభాగాలను ఇతరులకు ధారాదత్తంచేసిందని బీజేపీ అనాదిగా వాదిస్తూ, కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలోకీ, ఇరకాటంలోకి నెట్టడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. చైనా, పాకిస్థాన్‌తో ముడిపడిన విషయాల్లో ఎన్ని విమర్శలు చేసుకున్నా అంత ప్రమాదం ఉండకపోవచ్చును కానీ, ఇతర పొరుగుదేశాల విషయంలో మన మాటలు చేతలూ జాగ్రత్తగా ఉండక తప్పదు.

దేశ సరిహద్దు అవతలి శత్రువుపై వినియోగించాల్సిన నిఘా పరిజ్ఞానాన్ని పాలకులు తమను ప్రశ్నిస్తున్న గొంతుకల నోరు మూయడానికి వినియోగిస్తుండటమే ఆందోళన కలిగిస్తున్న అంశం.

ప్రతిష్ఠకు మచ్చ ఫోన్ ట్యాపింగ్!

టెలిఫోన్ కాదు కదా కనీసం సరైన రవాణా వసతి కూడ లేని మారుమూల ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సి. మాధవరెడ్డి లోక్‌సభలో 1980లలో తాను టెలిఫోన్ల టాపింగ్‌పై లేవనెత్తిన ఒక ప్రశ్న దేశ రాజకీయాలలో దుమారం రేపుతూ ఒక ముఖ్యమంత్రి పదవికి ఎసరు తెచ్చింది. రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి జనతాదళ్ సభ్యుడు మధుదండావతేతో కలిసి మాధవరెడ్డి లెవనెత్తిన ఈ అంశం చివరకు స్వంత పార్టీ ముఖ్యమంత్రి రామకృష్ణాహెగ్డే పదవికి ఎసరు తెచ్చిపెట్టింది. నైతిక విలువల నాయకుడిగా పేరు కల్గిన దిగవంత హెగ్డే తన రాజకీయ ప్రత్యర్థి దేవగౌడకు రాజధానిలో ఎంత వరకు ప్రాబల్యం ఉందో తెలుసుకోవడానికి అతని ఫోనును ట్యాపింగ్ చేసారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. టెలిఫోన్ల ట్యాపింగ్ అనేది నూతనంగా ఏమీ కాకున్నా, అది బహిర్గతమైన ప్రతిసారి రాజకీయ దుమారం చెలరేగడం షరా మాములే.

ప్రస్తుతం తెలంగాణలో చర్చనీయంశంగా మారిన టెలిఫోన్ ట్యాపింగ్ తీరు ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన దాని కంటె విభిన్నమైంది. ఒక సంప్రదాయక భద్రతాపరమైన నియమాన్ని రాజకీయ శక్తులు దుర్వినియోగం చేసిన విధానం ఆందోళన కలిగిస్తున్నది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందే కొద్దీ సంభాషణలను వినడం లేదా రికార్డు చేయడం సులభతరమవుతూ ఒకప్పుడు జిల్లా ఎస్పీలకు కూడా లేని ఈ అధికారం ఇప్పుడు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులకు కూడ విస్తృతంగా లభిస్తున్నది. ఇది ఆందోళనకరం. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ల్యాండ్ లైన్లు కనుమరుగవుతూ మొబైల్ ఫోన్ వ్యవస్థ పెరిగిన

గల్ఫ్ లేఖ

తర్వాత అనుమతులు, సర్వీసు ప్రొవైడర్లు వగైరాలతో సంబంధం లేకుండా నేరుగా దొంగచాటుగా వినే అవకాశం దక్కింది. కేవలం అత్యున్నత నిఘా స్థాయిలో మాత్రమే వాడే ఐఎంఎస్ఐ విధానాన్ని కూడా కార్పొరేట్లు, పాలకపక్షాలు సునాయసంగా వాడుతున్నాయంటే విస్మయం కలిగిస్తుంది.

దేశవిదేశాల నుంచి నిత్యం వచ్చే కొన్ని లక్షలాది ఫోన్ కాల్స్, ఇంటర్నెట్ సందేశాలను భారతీయ నిఘా వర్గాలు పరిశీలిస్తూ, అవసరమైనప్పుడు సంబంధిత ప్రభుత్వ వర్గాలను అప్రమత్తం చేస్తుండడం ఒక



సంప్రదాయక భద్రతపరమైన నియమం. భారతదేశంలో ప్రతి రోజు దాదాపు పది లక్షలకు పైగా ఫోన్ కాల్స్‌ను కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలోని పది నిఘా సంస్థలు ట్యాపింగ్ చేస్తుండగా, అందులో విదేశాలలోని భారతీయ ఎంబసీలలో కేంద్రీకృతమై ఉండే 'రా' నిఘా విభాగం కూడా ఒకటి, ఇందులో పని చేసే అధికారులందరూ కూడా విధి నిర్వహణలో చిత్తశుద్ధి కలిగిన వారుగా పేరుంది. వీరికి తోడుగా అదనంగా రాష్ట్రాల పోలీసులు కూడా ట్యాపింగ్ చేస్తుంటారు.

జాతి భద్రత, శ్రేయస్సు కోసం ఉగ్రవాదులు, నేరస్థులపై దృష్టి సారించవల్సిన నిఘా నేత్రాన్ని పాలకుల విధానాలను విమర్శించే వారిపై ఎక్కుపెట్టడం పాలకులకు మామూలు విషయమే. కానీ శాంతిభద్రతలు రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి పోలీసులకు కూడా అవకాశం ఉండడంతో ఈ రకమైన దుర్వినియోగం జరుగుతుంది. దేశంలో ఫోన్లు, మెసేజ్‌లను టాపింగ్ చేసే అగ్రరాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటి అనేది మరిచిపోకూడదు.

నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌లో రాజకీయాలు, నేరాలతో ఎలాంటి సంబంధం లేని ఒక యువతి ఫోన్‌ను ట్యాప్ చేసిన సంఘటన మొదలు మహారాష్ట్రలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం పతనం, తెలంగాణలోని తాజా పరిణామాల వరకు రాష్ట్రాలలో దీన్ని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నారో అవగతమవుతుంది.

ఒక్క ఫోన్లే కాదు, ఇతర విధానాల ద్వారా కూడా సమాచారాన్ని సేకరించే చట్టబద్ధ వ్యవస్థకు 2011 లోనే భారతదేశం నాంది పలికింది. దీని ద్వారా సర్వీస్ ప్రొవైడర్లతో సంబంధం లేకుండా, శాంతిభద్రతలు రాష్ట్రాల అంశమైనప్పటికీ రాష్ట్రాలతో ప్రమేయం లేకుండా నేరుగా కేంద్రమే ఫోన్లు, మెసేజ్‌లు, మెయిల్స్, ఫోటోలు... వగైరా సర్వం సేకరించే సెంట్రల్ మానిటరింగ్ సిస్టం (సిఎంఎస్) విధానాన్ని రూ.800కోట్లతో ప్రారంభించింది. సిఎంఎస్ విధానం ఎదుటివారికి తెలియకుండా వారి ఫోన్ల సంభాషణను, మెసేజ్‌లను, ఫోన్‌లోని ప్రతి అంశాన్ని గమనిస్తూ నిక్షిప్తం చేస్తుంది. నాట్ గ్రిడ్ విధానం అనేది పౌరునికి సంబంధించిన 21 రకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోగలుగుతుంది. అదే విధంగా నెత్రా అనేది ఒక్క సామాజిక మాధ్యమాలలోనే కాదు, ఒక కంప్యూటర్లో ఏమేం ఉందో తెలుసుకోగలుగుతుంది. వ్యక్తిగత గోప్యతను హరించే ఈ మూడు నిఘా విధానాలు కూడ భారతదేశంలో చట్టబద్ధంగా అమలులో ఉన్నాయి.

దేశ సరిహద్దు అవతలి శత్రువుపై వినియోగించాల్సిన నిఘా పరిజ్ఞానాన్ని పాలకులు తమను ప్రశ్నిస్తున్న గొంతుకల నోరు మూయడానికి వినియోగిస్తుండటమే ఆందోళన కలిగిస్తున్న అంశం.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

నిజంగా ప్రజాస్వామ్యానికి అంతిమ ఘడియలా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

అభ్యర్థుల ఎంపికలు ఇప్పుడిప్పుడే పూర్తవుతున్నాయి. అసంతృప్తుల బుజ్జగింపులు కొనసాగుతున్నాయి. 'నేను కొన్ని దశాబ్దాలుగా నా నియోజకవర్గంలో పనిచేస్తున్నాను. కాని ఉన్నట్లుండి బయట నుంచి ఒక వ్యక్తిని తీసుకువచ్చి ఆయనను ఎంపిక చేశారు. రాజకీయాల్లో డబ్బు, కులం ఆధిపత్యం పెరిగిపోయింది' అని ఒక సీనియర్ రాజకీయ నాయకుడు వాపోయారు. ఎన్నో ఆశలు పెట్టుకుని పలు ప్రయత్నాలు చేసుకున్న వివిధ సామాజిక వర్గాలు నిరాశ చెందినట్లు కనిపిస్తున్నాయి. తమను ఉపయోగించుకోవడమే కాని, తమకు నిజమైన సామాజికాధికారం కల్పించే ఉద్దేశం ఎవరికీ లేదని పలువురు బడుగు, బలహీన వర్గాల నేతలు ఢిల్లీ దాకా వచ్చి మీడియాకు చెప్పుకుంటున్నారు. ఈ రణగొణ ధ్వనులు అన్ని పార్టీల్లో ఉన్నాయి. జీవితంలో ఒక్కసారి కూడా కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాలు చూడని వారు ఆయా పార్టీల నాయకులుగా రాత్రికి రాత్రి అవతరిస్తున్నారు. ఇప్పుడు ఏ పార్టీలో అతి సామాన్యులు లేరనే చెప్పాలి. అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ ప్రకారం గత లోక్‌సభ ఎన్నికల్లో 25శాతం మంది ఎంపీలు వంద కోట్లకు పైగా ఆర్జించిన సంపన్నులైతే బీజేపీలో ప్రతి పదిమందిలో 9 మంది కోటీశ్వరులే. ఈడీ నిజాయితీగా పనిచేస్తే ఇవాళ దేశంలో సగానికిపైగా రాజకీయ నాయకులు కటకటాలు లెక్కపెట్టవలిసి వస్తుందని ఒక పార్టీ నేత చెప్పారు.

రాజకీయ పార్టీల్లో ఇన్ని లోపాలు ఉన్నప్పటికీ దేశంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న కొద్దీ లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అన్న ఉత్కంఠ ఉండనే ఉంటుంది. 'ఇందులో ఉత్కంఠ ఏముంది? నరేంద్ర మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీని ఢీకొనగల శక్తి దేశంలో ఎక్కడుంది? ఆయన మూడోసారి గెలిచే విషయంలో ఎలాంటి అనుమానం లేదు' అని వ్యాఖ్యానించేవారు ఎక్కువగా ఉన్నారు. వీరు అసలు మోదీ మరోసారి విజయం సాధిస్తారా లేదా అన్న చర్చకే తావులేదని కొట్టి పారేస్తున్నారు. మోదీ కూడా ఇప్పటికే గెలిచానన్నట్లుగా మాట్లాడుతున్నారు. జూన్‌లో మరోసారి అధికారం చేపట్టిన తర్వాత వందరోజుల్లో తాను చేపట్టే కార్యక్రమాల గురించి ఇప్పటి నుంచే చెప్పుకుంటున్నారు. 'గత పదేళ్లలో జరిగింది ట్రెయిలర్ మాత్రమే. ఇంకా చాలా చేయాల్సి ఉన్నది' అని మోదీ మంగళవారం రాజస్థాన్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రకటించారు.

మోదీ ఈ మాటలే ప్రతిపక్షాల్లోనూ, అనేకమంది ఇతర వర్గాల్లోను వణుకు పుట్టిస్తోంది. బహుశా బీజేపీలో కూడా ఈ విషయంపై అంతర్గత చర్చ జరుగుతున్నట్లు కనిపిస్తోంది. రెండు సార్లు గెలిస్తేనే మోదీ ఇంత బీభత్సం సృష్టించారు. ఇక మూడోసారి ఆయన గెలిస్తే గాలి కూడా స్తంభించిపోతుందేమో' అన్న భయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నేతల్ని జైలుకు పంపి, ఈడీ, ఐటీ సమన్లు, దర్యాప్తులతో, ఖాతాల స్తంభనతో వేధిస్తూ ఎన్నికల్లో విజయం సాధించడం ఒకరకంగా మాచ్ ఫిక్సింగ్‌తో సమానమని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. 'ఇవి సాధారణ ఎన్నికలు కావు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగమే మారిపోతుంది. దేశాన్ని కాపాడి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి' అని రాహుల్ గాంధీ రెండు రోజుల క్రితం రామ్ లీలా మైదాన్‌లో జరిగిన బహిరంగ సభలో అన్నారు. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే ఇక దేశంలో ప్రజాస్వామ్యాన్ని మరిచిపోవాల్సిందేనని ఇదే సభలో మాట్లాడిన దాదాపు 27 మంది ప్రతిపక్ష నేతలు అభిప్రాయపడ్డారు.

'కృష్ణుడు కంసుడిని వధించకపోతే, కంసుడే కృష్ణుడిని వధించేవాడు' అని ఒక ప్రవచన కర్త అన్నట్లుగా, రాజకీయాల్లో నేతలు ఎదురు దెబ్బలను తట్టుకుని నిలదొక్కుకోకపోతే ఇతరులు వారి భౌతిక కాయాలపై నడుచుకుంటూ వెళతారు. ఈ రీత్యా రాంలీలామైదాన్‌లో జరిగిన బహిరంగ సభను చూస్తే ప్రతిపక్షాలు కాడిని పడేయలేదని స్పష్టమవుతోంది. గత మూడునెలల్లో ప్రతిపక్షాలను కకావికలం చేసే అనేక ప్రయత్నాలు జరిగాయి. ఇండియా కూటమి నుంచి జనతాదళ్ (యు) నేత నితీష్ కుమార్ తప్పుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తానని ప్రకటించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు జైలుకు వెళ్లారు. రాజ్యసభ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలను బీజేపీ తమ వైపుకు తిప్పుకుంది. ఆరుగురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కొనఊపిరితో ఉన్నది. ఒక దిగ్బంధన వాతావరణంలో ప్రతిపక్షాలు అరివీర భయంకరుడైన మోదీని ఎదుర్కొనగలవా అన్న అనుమానాలు అంతటా నెలకొనడంలో ఆశ్చర్యం లేదు. ఈ పరిస్థితుల్లోనూ ప్రతిపక్షాలు చివరి పోరాటానికి సిద్ధపడినట్లే కనపడుతోంది. మార్చి 3న బిహార్‌లోని పట్నాలోని చరిత్రాత్మక గాంధీ మైదానంలో భారీ ఎత్తున జరిగిన జన విశ్వాస్ ర్యాలీ హిందీ బెల్ట్‌లో ప్రతిపక్షాల ఐక్యతను ప్రతిఫలించింది. ఆ తర్వాత మార్చి 17న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా ముంబైలోని శివాజీ పార్క్‌లో జరిగిన ర్యాలీ, తాజాగా కేజ్రీవాల్, హిమంత్ సోరెన్ అరెస్టుని నిరసిస్తూ ఢిల్లీలో జరిగిన ర్యాలీ కూడా ప్రతిపక్షాల సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నాయి. ఇది మంచి పరిణామమే.

అయితే 'నియంతృత్వాన్ని రూపుమాపండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని ప్రతిపక్షాలు చేస్తున్న నినాదం ఎంతవరకు ప్రజల్లో చొచ్చుకుపోతోంది? నిజంగా ప్రజాస్వామ్యానికి అంతిమ ఘడియలు దాపురించినట్లు దేశ ప్రజలంతా నమ్ముతున్నారా? నమ్మినా ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వారంతా ముందుకు వస్తారా? నేతల అరెస్టులు ప్రజల్లో ఎంత మేరకు సానుభూతిని కల్పిస్తాయి? అన్న ప్రశ్నలు వేసుకోవాల్సి ఉన్నది. 1977లో వివిధ పార్టీలు జనతా పార్టీ పేరిట ఏకమై 43.2 శాతం ఓట్లతో ఘనవిజయం సాధించిన నాటి పరిస్థితులు దేశంలో ఏర్పడేలా చేయగలిగిన శక్తి నేటి ప్రతిపక్షాలకు ఉన్నదా అన్నది చర్చనీయాంశం. నిజానికి ప్రతిపక్షాలకు సంఘటితం కాగలిన, ప్రజలను చైతన్యం చేయగలిగిన నైతిక శక్తి ఉంటే విజయం సాధించడం పెద్ద కష్టం కాదు. గత ఎన్నికల్లో బీజేపీకి కేవలం 37.36శాతం ఓట్లు మాత్రమే లభించాయి. మిగతా 63 శాతం ఓట్లు ప్రతిపక్షాల ఓట్లుగా, సీట్లుగా ఎందుకు మారలేకపోయాయి? ఇది ఓటర్ల వైఫల్యం కానే కాదు. దేశంలో ప్రతిపక్షాల, ప్రత్యామ్నాయ శక్తుల వైఫల్యం. సిద్ధాంత రాహిత్యాల, భావ దారిద్ర్యాల ఫలితం.



'నియంతృత్వాన్ని రూపుమాపండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని ప్రతిపక్షాలు చేస్తున్న నినాదం ఎంతవరకు ప్రజల్లో చొచ్చుకుపోతోంది? నిజంగా ప్రజాస్వామ్యానికి అంతిమ ఘడియలు దాపురించినట్లు దేశ ప్రజలంతా నమ్ముతున్నారా? నమ్మినా ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వారంతా ముందుకు వస్తారా? నిజానికి ప్రతిపక్షాలకు సంఘటితం కాగలిన, ప్రజలను చైతన్యం చేయగలిగిన నైతిక శక్తి ఉంటే విజయం సాధించడం పెద్ద కష్టం కాదు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మోదీ అనుసరిస్తున్న విధానాలను దేశంలో ప్రతిపక్షాలు, ఇతర చెదురుమదురు వర్గాలు మాత్రమే కాక ప్రపంచంలో పలు దేశాలు విమర్శిస్తున్నాయి. మోదీకి నీరాజనాలు పట్టిన అమెరికా కూడా రాజకీయ ప్రత్యర్థులపై వచ్చిన ఆరోపణలను పారదర్శకంగా, నిజాయితీగా, న్యాయపూరితంగా విచారించాలని ఆశించింది. జర్మనీ కూడా స్వతంత్ర న్యాయ వ్యవస్థకు ఉండాల్సిన ప్రమాణాలు, కనీస ప్రజాస్వామిక సూత్రాలు పాటించాలని ఆశించింది. ఇదే అమెరికా, జర్మనీ గత ఏడాది జీ–20 సమావేశాల్లో మోదీని ఆకాశానికి ఎత్తిన విషయం మరిచిపోరాదు. దేశ రాజధానిలో ఉండే రాయబార కార్యాలయ ప్రతినిధులే కాదు, ప్రతి విదేశీ మీడియా ప్రతినిధి జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారు. మోదీకి ఉన్నత వర్గాల్లో ఆదరణ ఉన్నదని చెబుతూనే కేజ్రీవాల్ అరెస్టు ప్రజాస్వామ్యంపై మచ్చలాంటిదని 'ద ఎకనామిస్ట్' వ్యాఖ్యానించింది. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలపై విరుచుకు పడడం అప్రజాస్వామికమని అనేక విదేశీ పత్రికలు విమర్శించాయి. 'ప్రతి ఒక్కరి రాజకీయ, పౌర హక్కులను పరిరక్షించాలి. ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగే వాతావరణంలో ప్రజలు ఓటు వేయగల గాలి' అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ అన్నారు. మోదీని విదేశాల్లో ప్రశంసించినప్పుడు ఆర్భాటంగా చెప్పుకునే ఆయన భక్తులు ఈ విమర్శలను సీరియస్‌గా ఎందుకు పట్టించుకోవడం లేదు? తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరైంది కాదని అమెరికా, జర్మనీ రాయబారులను పిలిచి నిరసన తెలిపినంత మాత్రాన ప్రపంచం కళ్లు మూసుకుంటుందా? ఇదే మోదీ 2019లో అమెరికా వెళ్లి 'అబ్ కీ బార్ ట్రంప్ కీ సర్కార్' అని ట్రంప్‌కు అనుకూలంగా ప్రచారం చేయలేదా? ఇది ఆ దేశ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం కాదా?

బీజేపీ మూడోసారి గెలుస్తుందా, లేదా అన్న చర్చను ప్రక్కన పెడితే ఆ పార్టీ ఆత్మరక్షణలో ఉన్నందువల్లే తమపై విరుచుకుపడుతోందన్న సందేశం ప్రజలకు చేర్చడంలో ప్రతిపక్షాలు ఎంతో కొంత విజయం సాధించాయి. తాను అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నానని మోదీ ప్రతి సందర్భంలోనూ చెప్పుకుంటున్నప్పటికీ, ప్రతిపక్షాలన్నిటినీ అవినీతిపరులుగా ఒకే గొటన కడుతున్నప్పటికీ అందరూ దాన్ని విశ్వసిస్తున్నట్లు కనపడడం లేదు. ఈ విషయంలో మోదీ చేస్తున్న ప్రకటనల్లో నిజాయితీ లేదని, డొల్లతనం మాత్రమే ఉన్నదన్న ప్రచారం కూడా జనంలోకి వెళ్లిపోయింది. ఎన్నికల బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు విస్మరించదగినవి కావు. డబ్బు తీసుకున్నట్లు రుజువులేకపోయినా ఆరునెలలుగా ఆప్ నేత సంజయ్ సింగ్‌ను ఎందుకు జైల్లో పెట్టారని కూడా మంగళవారం సుప్రీం ప్రశ్నించడం ఈడీ పనితీరును సవాలు చేసింది. మోదీ కేవలం తన అధికారాన్ని శాశ్వతం చేసుకోవడం కోసమే ప్రత్యర్థులకు ఊపిరి సలపకుండా దాడులు చేయిస్తున్నారని, ఈ ఎన్నికలు పూర్తి ప్రజాస్వామికంగా జరగడం లేదని ప్రచారం కూడా జరగడం దేశంలో నెలకొని ఉన్న అనారోగ్యకర రాజకీయ వాతావరణానికి సంకేతం. పరిస్థితులు ఆరోగ్యకరంగా మార్చి దేశంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతున్నాయన్న సంకేతాలు పంపేందుకు మోదీకి ఇంకా సమయం దాటిపోలేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఇంతటి యువశక్తి కలిగిన రాష్ట్రంలో ఇదా పాలన!?

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసీపీ పార్టీ సొంత మీడియా ద్వారా కొట్టుకొంటున్న సొంత డబ్బా శ్రుతి మించి వికటించే స్థాయికి చేరుకున్నది. ఇందుకు ఓ చిన్న ఉదాహరణ. అధికార పార్టీ విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే ఉద్దేశంతో కాబోలు సొంత ఛానెల్‌లో ఓ కార్యక్రమం మొదలు పెట్టారు. సూటు బూటు ధరించిన ఇద్దరు యాంకర్లు, వారికెదురుగా ప్రభుత్వ పథకాలు అందుకున్న కొందరు లబ్ధిదారులు ఉంటారు. యాంకర్లు తామే వారికి సగం జవాబులు అందిస్తూ ప్రశ్నలు వేస్తుంటారు. 'చెప్పండి సుబ్బారావు గారూ.. ఈ ఐదేళ్లల్లో జగన్ గారి వల్ల మీరు ఏ విధంగా లబ్ధిపొందారు. మీ జీవన ప్రమాణాలు ఏ విధంగా పెరిగాయో వివరిస్తారా?' సీనియర్ యాంకర్ ప్రశ్న. సదరు సుబ్బారావు గారు, 'నాకిద్దరు కొడుకులండి.. పెద్దవాడు బీకాం కంప్యూటర్స్ ఐదేళ్లుగా గ్రామ వాలంటీర్‌గా పనిచేస్తున్నాడు. రెండోవాడు ఎంబీఏ చేసి రెండేళ్లయింది. జగన్‌గారి పుణ్యమా అని రెండోవాడు కూడా వాలంటీర్‌గా జాయిన్ అయ్యాడండీ.. ఇప్పుడు మాకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా మా కుటుంబం హాయిగా బ్రతుకుతోందండి' అంటూ అతను తన్మయత్వంతో చెబుతుంటే, జూనియర్ యాంకర్ మెడలోని టైని సరిచేసుకొంటూ 'ఈ సంగతి ఆ ప్రతిపక్షం వాళ్లకు వినబడేట్టు గట్టిగా చెప్పండి.. తెల్లారి లేస్తే జగన్ గారి మీద పడి ఏడుస్తుంటారు' అని ముక్తాయింపు ఇస్తాడు.

ఇదొక్క ఉదాహరణ చాలు– గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని చదువుకొన్న యువత భవితవ్యం ఎంత గొప్పగా ఉందో చెప్పడానికి. లక్షల్లో యువతకు ఉద్యోగాలు కల్పించామని అధికార పార్టీ వేసుకొంటున్న దండోరా వెనుకనున్న అసలు నిజం ఇది. కంప్యూటర్ పట్టభద్రులు, ఉన్నత చదువులు చదువుకొన్న యువతకు రాష్ట్రంలో వాలంటీర్‌ను మించిన ఉద్యోగాలు లభించడం లేదన్నది ఓ చేదు వాస్తవం. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేనప్పుడు యువత మాత్రం ఏం చేస్తుంది? నెలకు నాలుగైదు వేల రూపాయల జీతంతో ఉద్యోగాల్లో చేరిన యువత భవిష్యత్ ఏమిటి? చిరుద్యోగం కంటే తక్కువ ఉద్యోగాలు చేపట్టిన యువతకు చదివిన చదువుకు, చేస్తున్న ఉద్యోగానికి, లభిస్తున్న జీతానికి ఎక్కడా పొంతన లేదు? ఈ లెక్కన వారు జీవితంలో ఎప్పటికి స్థిరపడగలరు?

సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2019 ఏప్రిల్ నాటికి నాలుగు శాతంగా ఉన్న నిరుద్యోగిత 2023 డిసెంబర్ నాటికి 6.6శాతానికి పెరిగింది. ఇదే నివేదిక ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగ పట్టభద్రులు 35.14శాతంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ (పిఎల్ఎఫ్ఎస్) నివేదిక ప్రకారం గ్రాడ్యుయేట్ నిరుద్యోగ రేటులో దేశంలో తెలంగాణది 9వ స్థానం కాగా, ఆంధ్రప్రదేశ్‌ది తొలిస్థానం. అంటే వెనుకబడిన రాష్ట్రాలుగా పేరు పొందిన బిహార్, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో కంటే ఏపీలో నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు ఎక్కువగా ఉన్నారు.

అధికారంలోకి రాగానే వెంటనే 2.30లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామంటూ ఎన్నికల ముందు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు నమ్మకంగా చెప్పారు. ఇదే హామీని మేనిఫెస్టోలో చేర్చారు. సోషల్ మీడియాలో దీనిపై చాలా రోజులుగా 'జగన్ జనవరి 1న నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇవ్వడం లేదు గానీ సాక్షి క్యాలెండర్ ఇస్తున్నారు' అంటూ ట్రోలింగ్ చేస్తున్నారు.

నిజానికి దేశంలో అద్భుతమైన సహజ వనరులు, చురుకైన మానవ వనరులు ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు పేరుంది. రాష్ట్రం నుంచి ప్రతి ఏటా జాతీయ స్థాయిలో ఉత్తమ విద్యా ర్యాంకులు పొందే యువత సంఖ్య గణనీయంగా ఉంది. ముఖ్యంగా ఐటీ–బీపీవో రంగం ఇప్పటికీ యువతకు పెద్దపీట వేస్తోంది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐటీ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014–19 మధ్య కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా విశాఖపట్నాన్ని ఐటీ హబ్ చేయడానికి ప్రయత్నించారు. ఐదేళ్లలో నాలుగు భాగస్వామ్య సదస్సులు నిర్వహించి ప్రముఖ ఐటీ దిగ్గజ కంపెనీలతోపాటు ఇతర రంగాలకు చెందిన సంస్థలను రాష్ట్రానికి తేవడానికి కృషి చేశారు. ప్రతియేటా దావోస్‌కు వెళ్లి రాష్ట్రానికి పెట్టుబడుల్ని ఆకర్షించడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. నూతనంగా 'డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్క్' విధానం తెచ్చి రాష్ట్రంలో ఏర్పాటయ్యే కంపెనీలకు పలు రాయితీలు అందించారు. ఆయా కంపెనీలు అందించే ఉద్యోగాలను పరిగణనలోకి తీసుకొని అందుకు అనుగుణంగా తగిన ఇన్సెంటివ్‌లు వాటికి కల్పించారు. ఈ చర్యల వల్ల విశాఖపట్నంలో ఐటీ పరిశ్రమ కుదురుకోవటం మొదలైంది. హైదరాబాద్‌కు సమాంతరంగా విశాఖపట్నం ఐటీ రంగంలో ఎదుగుతోందని అనుకొంటున్న సమయంలోనే 2019లో జగన్ అధికారంలోకి రావడంతో ఈ పరిస్థితి మొత్తం తలకిందులయ్యింది. కేవలం చంద్రబాబు నాయుడికి పేరు వస్తుందనే దుగ్ధతో డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్క్ విధానాన్ని రద్దు చేసి పడేశాడు. దాంతో, దాదాపు 100 చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలు కార్యకలాపాల్ని విరమించుకొని పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయి. జగన్ హస్వదృష్టి, అకారణ ద్వేషాన్ని చూసి ప్రముఖ దిగ్గజ కంపెనీలైన ఐబీఎం, హెచ్ఎస్‌బీసీ వంటివి కూడా గుడ్ బై చెప్పి నిష్క్రమించాయి.

కొత్త కంపెనీలు ఏర్పాటయితే వాటివల్ల ప్రత్యక్షంగానే కాదు పరోక్షంగా కూడా యవతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నది ఒక్క జగన్‌కి మాత్రమే తెలిసి ఉండకపోవచ్చు! ఐటీ–బీపీవో కంపెనీలు కొత్తగా వచ్చాకనే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, రవాణా, హోటల్, హాస్పిటాలిటీ తదితర రంగాలు అభివృద్ధి చెంది తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ఇక, చంద్రబాబు నాయుడు మీద బురద జల్లడానికి సీమెన్స్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందనే నెపంతో ఆ సంస్థ అనుబంధ నైపుణ్య కేంద్రాలను మూత వేయించారు. ప్రతియేటా 70వేల మందికి హైఎండ్ నైపుణ్యాలు అందించే కేంద్రాలు మూతపడటంతో యువతకు లభించాల్సిన ఉద్యోగాలు దక్కకుండా పోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఒంటెత్తు పోకడలు యువతకు శాపంగా మారగా, పొరుగునున్న తెలంగాణ రాష్ట్రం నెత్తిన పాలు పోసినట్లయింది. తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన అనుకూల విధానాలతో అక్కడ పనిచేసే ఐటీ ఉద్యోగుల సంఖ్య 9లక్షలకు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎంతమంది ఐటీ ఉద్యోగులు ఉన్నారంటే, గణాంకాలు వెల్లడించే వారే లేరు.

ఇక రాష్ట్రంలో ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఆ తర్వాత కూడా కొనసాగింది. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉండగా 2014–19 మధ్య ఖాళీగా ఉన్న 18వేల మంది టీచర్ పోస్టులను భర్తీ చేయగా, ప్రతియేటా మెగా డీఎస్సీ అని చెప్పిన జగన్ చివరి ఏడాదిలో మాత్రమే 6వేల టీచర్ల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ ఉద్యోగార్థులను మోసం చేశారు. ఇక, నిరుద్యోగులకు ఇస్తానన్న భృతి గానీ, ప్రభుత్వ పనుల్లో, కాంట్రాక్టులలో నిరుద్యోగ యువతకు భాగస్వామ్యం కల్పిస్తామనే మాటలు గానీ నీటి మూటలుగా మిగిలిపోయాయి. పారదర్శకంగా, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ స్టేట్ సర్వీస్ కమీషన్‌ను ఓ రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చి, తగిన అర్హతలు లేని వారిని సభ్యులుగా చేసి దాని ప్రతిష్ఠను దిగజార్చారు. సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల్లో అనేక అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



యువత సంఖ్య ఎక్కువగా ఉండటం ఏ రాష్ట్రానికైనా అనుకూల అంశం. కానీ, జగన్ అధికారంలో ఉండటం రాష్ట్ర యువతకు ప్రతికూల అంశంగా పరిణమించింది. ఈ భయానకమైన వర్తమానాన్ని వీడి ఇకపై అందమైన భవిష్యత్తును పునర్ నిర్మించుకోవాలంటే రాష్ట్రంలోని యువత తమ పాలిట యమకింకరుడిగా మారిన పాలకుణ్ణి వదిలించుకోవాల్సిందే!

కాగా, ఉద్యోగాలు, ఉపాధి లేని యువత నైరాశ్యంలో మునిగిపోయి పెడమార్గం పడుతున్నట్లు వార్తలొస్తున్నాయి. 2020–2023 మధ్య మూడేళ్ల కాలంలో 21,575 మంది యువత ఆంధ్రప్రదేశ్‌లో ఆత్మహత్యలకు పాల్పడినట్లు సాక్షాత్తు కేంద్ర కార్మిక మంత్రి రామేశ్వర్ పార్లమెంట్‌లో వెల్లడించారు. అదేవిధంగా ఈ ఐదేళ్లల్లో గంజాయి అక్రమ రవాణాలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నివేదిక స్పష్టం చేసింది. ఇంకోపక్క రాష్ట్రంలో నాసిరకం మద్యం యువత పాలిట స్లోపాయిజన్‌గా పనిచేస్తూ వారి ఆరోగ్యాల్ని దెబ్బతీస్తోంది.

ఏ దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా యువత సంఖ్య అధికంగా ఉంటే దానిని 'డెమోగ్రఫిక్ డివిడెండ్'గా చెప్పుకొంటారు. అంటే, యువత సంఖ్య ఎక్కువగా ఉండటం ఏ రాష్ట్రానికైనా అనుకూల అంశం. కానీ, జగన్ అధికారంలో ఉండటం రాష్ట్ర యువతకు ప్రతికూల అంశంగా పరిణమించింది. ఈ భయానకమైన వర్తమానాన్ని వీడి ఇకపై అందమైన భవిష్యత్తును పునర్ నిర్మించుకోవాలంటే రాష్ట్రంలోని యువత తమ పాలిట యమకింకరుడిగా మారిన పాలకుణ్ణి వదిలించుకోవాల్సిందే!

● సి. రామచంద్రయ్య
శాసనమండలి మాజీ సభ్యులు

హై స్కూల్ ప్లస్‌లో అన్నీ మైనస్‌లే!

విద్యా సంస్కరణలలో భాగంగా 2022–23 విద్యా సంవత్సరం నుంచి హై స్కూల్ ప్లస్ పేరుతో ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టారు. తదనుగుణంగా రాష్ట్రంలోని 292 ఉన్నత పాఠశాలల్లో బాలికల హైస్కూల్ ప్లస్‌లు ఏర్పడ్డాయి. బోధన సిబ్బందిని నియమించడం వల్ల 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ క్లాసులు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. 2024–25 విద్యా సంవత్సరం నుంచి కో–ఎడ్యుకేషన్ హై స్కూల్ ప్లస్ ఏర్పాటుకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీనికి గాను 296 మండలాల్లో అవి ప్రారంభం కానున్నాయి. సంకల్పం దృఢంగా ఉన్నప్పటికీ సఫలం కాలేకపోవడానికి అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. సిబ్బంది నియామకం నుంచి నిర్వహణ వరకు అన్ని సమస్యలే.


హై స్కూల్ ప్లస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంటర్మీడియట్ విద్య నిర్వహణ కోసం ప్రత్యేకమైన సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందనే చెప్పవచ్చు. ప్రత్యేకమైన భవన నిర్మాణాలు, ఆట స్థలాలు, లాబులు, శాశ్వత ప్రాతిపదిక సిబ్బంది, బోధనేతర సిబ్బందిని కల్పించలేదు. చివరికి వ్యాయామ ఉపాధ్యాయుడు లేకుండా తూతూ మంత్రంగా హై స్కూల్ ప్లస్‌లు ప్రారంభమైనవి. నిర్వహణ గ్రాంట్ లేకపోవడం ఆలోచించదగ్గ విషయం. అందుకే వీటిలో చేరుటకు విద్యార్థులలో అనాసక్తి చూపడం వల్లే ఆశించిన రీతిలో ప్రవేశాలు జరగలేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలో తగిన నిర్ణయం తీసుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది. స్కూల్ ప్లస్‌కు ప్రత్యేకంగా ప్రధానాచార్యులు లేకపోవడం వల్ల పరిపాలనపరంగా కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి.

పాఠశాల విద్యలో కొనసాగుతున్న ఇంటర్ కోర్సు ఇంటర్మీడియట్ విద్య విభాగం ఇచ్చే ఆదేశాలు కొన్ని అనుసరించక తప్పడం లేదు. దీంతో పాఠశాల విద్య ఇంటర్ విద్య విభాగాలకు పొంతన కుదరడం లేదు. ఇంటర్మీడియట్ విద్యా విభాగం సూచనల మేరకు బోధనా సిబ్బంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాత్రమే బోధించినప్పుడే సరైన న్యాయం జరుగుతుంది కానీ హై స్కూల్ ప్లస్‌లో నియమింపబడ్డ బోధనా సిబ్బంది 9 నుంచి 12వ తరగతి వరకు బోధించడం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. వీటికి సరైన అకాడమిక్ క్యాలెండర్ లేకపోవడం చర్చించదగ్గ విషయం.

– సివి ప్రసాద్
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఏపీటీఎఫ్ అమరావతి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



ప్రశ్నిస్తే వేధింపులు... నిలదీస్తే దాడులు.. ఇదీ వైసీపీ నేతల నిర్వాకం. ఐదేళ్లలో చేసింది చెప్పుకోలేని దుస్థితిలో మళ్లీ ఎన్నికలను ఎదుర్కొనలేక అసహనంతో దాడులకు తెగబడుతున్నారు. నందిగామ వైసీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన రావును.. మూడు రాజధానులకు మద్దతుగా ర్యాలీ ఎందుకు చేశారని ప్రశ్నించిన ఇద్దరిపై వైసీపీ నాయకులు దారుణంగా దాడికి దిగారు.

ప్రశ్నిస్తే చచ్చేలా కొట్టిస్తారా!

నందిగామలో మొండితోక బ్రదర్స్ దౌర్జన్యం



దాడిలో తీవ్రగాయాలపాలైన నల్లాని కిషోర్



నల్లాని నరసింహారావు

- మూడు రాజధానుల ర్యాలీపై వైసీపీ ఎమ్మెల్యే నిలదీత
- నిలదీసిన ఇద్దరిపై దాడి చేసిన వైసీపీ మూక
- తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన బాధితులు

(విజయవాడ/నందిగామ - ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాజకీయ క్రీడకు బలైన అమరావతి రాజధాని భవిష్యత్తుపై గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల్లో తీవ్ర ఆందోళన ఉంది. నందిగామ నియోజకవర్గంలోని కృష్ణా పరీవాహక గ్రామాల ప్రజలకు అమరావతిలో జరిగే అభివృద్ధి పనులు నేరుగా కనిపించేవి. ఆ అభివృద్ధిని చూస్తూ తమ భవిష్యత్‌ను ఊహించుకొంటూ ప్రజలు మురిసిపోయేవారు. వైసీపీ అధికారంలోకి రాగానే మూడు రాజధానుల నాటకానికి తెరదీసి అమరావతిని చిదిమేసింది. దీనిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ప్రజలు ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు వచ్చే వైసీపీ అభ్యర్థులను రాజధాని అంశంపై నిలదీస్తున్నారు. అందులో భాగంగా గతంలో మూడు రాజధానులను సమర్థిస్తూ స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఆ పార్టీ నాయకులు పాదయాత్ర చేయడాన్ని మంగళవారం నందిగామకు చెందిన కిషోర్‌బాబు, నరసింహారావు ప్రశ్నించారు. 12వ వార్డులో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆయన్ను ఈ ఇద్దరు నిలదీశారు. అమరావతికి సమీపాన ఉన్న నందిగామ ఎమ్మెల్యేగా మీరు మూడు రాజధానులను సమర్థించడం ఎంత వరకూ న్యాయమని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ- ప్రభుత్వ విధానానికి అనుగుణంగా పనిచేశానంటూ ముక్తసరి సమాధానం ఇచ్చి అక్కడ నుండి వెళ్లిపోయారు.

ఎమ్మెల్యేనే ప్రశ్నిస్తావా అంటూ దాడి

ఎమ్మెల్యే వెళ్లాక ఆ పార్టీ నాయకులు షేక్ ఖాజా మరికొందరు కలిసి కిషోర్‌బాబు, నరసింహారావుతో వాగ్వివాదానికి దిగారు. విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు. తీవ్రగాయాల పాలైన కిషోర్, నరసింహారావును నందిగామ ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. జరిగిన ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల వద్ద నుంచి సీఐ హనీష్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● ఆది నుంచీ అంతే...!

మూడు రాజధానుల అంశంపై రగిలిపోతున్న నందిగామ ప్రాంత ప్రజలకు వైసీపీ అభ్యర్థులు తప్పక సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా ఇదే అంశం తెరపైకి వస్తుండటంతో ఆదిలోనే దాన్ని అణచివేయాలన్న ఆలోచనతో ఈ దాడి జరిగినట్టు భావిస్తున్నారు. మొండితోక బ్రదర్స్ ఆది నుంచీ ఇదే తీరున వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక దోపిడీ, మట్టి దోపిడీకి పాల్పడుతూ ఎవరైనా తమను ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తుండేవారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.



దాడి సమాచారంతో వైద్యశాల వద్దకు భారీగా చేరుకున్న పోలీసులు

పలు పోరాటాల్లో దాడి బాధితులు

దాడికి గురైన కిషోర్‌బాబు, నరసింహారావులు గతంలో పలు ప్రభుత్వ పథకాల అమలులో జరుగుతున్న అవకతవకలపై పోరాటాలు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూశారు. చందర్లపాడు మండలంలో వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందకుండా చేశారు. ఆ ఘటనలపై తీవ్రంగా స్పందించి పోరాటాలు చేసి వారికి న్యాయం జరిగేలా చేశారు. దీనిపై వైసీపీ నాయకత్వం కిషోర్, నరసింహారావుపై గుర్రుగా ఉంది. మంగళవారం నాటి ఘటనలో పాత విషయాలనూ దృష్టిలో ఉంచుకుని దాడికి పాల్పడ్డారని టీడీపీ నేతలు భావిస్తున్నారు. దాడికి గురైన ఇద్దరూ జర్నలిస్టులు కావడంతో ఘటనపై జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఘటనను ఖండించాయి.

ఆలయమంతా పసిడి కాంతులు



దుర్గమ్మ దేవస్థానం మొత్తం బంగారు తాపడం చేయించేందుకు సన్నాహాలు

● విరాళాల కోసం ప్రత్యేకంగా ట్రస్ట్

వన్‌టౌన్,ఏప్రిల్ 2 : ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన కనకదుర్గమ్మవారి ఆలయ గోడలకు బంగారుతాపడం చేసేందుకు ఆలయ ఈవో రామారావు సంకల్పించారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయగోపురం వరకు మాత్రమే బంగారు తాపడం ఉంది. అయితే సగం మాత్రమే ఉన్న బంగారుతాపడాన్ని దిగువ వరకు కూడా అంటే చుట్టూగోడలకు కూడా బంగారు తాపడం చేయడం వల్ల మరింత కాంతులీనుతుందని ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ క్రమంలో విరాళంగా బంగారం సేకరించే నిమిత్తం దేవస్థానంలో నడుస్తున్న అన్నదాన ట్రస్ట్ తరహాలో కొత్తగా శ్రీకనకదుర్గ డవలప్‌మెంట్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ట్రస్ట్‌ను రిజిస్టర్ చేసినట్టు సమాచారం. బంగారాన్ని దాతలు కొత్తగా ఏర్పడిన ట్రస్ట్‌కు మాత్రమే జమ చేయాల్సి ఉంటుంది. ట్రస్ట్‌కు ఇచ్చే విరాళాలకు సెక్షన్ 80జీ కింద ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

వలంటీర్ల ప్రత్యక్ష ప్రచారం

★ అడ్డుకున్న టీడీపీ ★ పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 2 : రాజీనామా చేసిన వలంటీర్లు మంగళవారం రాత్రి మచిలీపట్నంలోని 25వ డివిజన్ ఉల్లింగిపాలెంలో ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారంలోకి దిగారు. ఇళ్ల వద్దకు వచ్చి పెన్షన్లు ఇవ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుపడ్డారని చెప్పడం ప్రారంభించారు. ఇది తెలిసిన టీడీపీ కార్యకర్తలు వలంటీర్ల వద్దకు వెళ్లారు. సిటిజన్ ఫర్ డెమొక్రసీ ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ వలంటీర్లను పెన్షన్లు పంచవద్దని ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. ఇంతలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అక్కడికి వచ్చారు. రాజీనామా చేయని వలంటీర్లు కూడా ప్రచారం చేశారు. దీంతో వాగ్వివాదం పెరిగి ఇరువర్గాలు పోలీసుస్టేషన్‌కు వెళ్లాయి.



రాజీనామా చేసిన వలంటీర్ ప్రచారం



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-22 (బుధ)
సహర్ (ఉదయం) : 4-48 (గురు)

జీ హుజూర్‌పై వేటు!

కలెక్టర్ రాజాబాబు బదిలీ | జేసీకి అదనపు బాధ్యతలు



బదిలీ అయిన కలెక్టర్ పి రాజాబాబు

ఎన్నికల వేళ కొందరు ఐఏఎస్ అధికారులు సైతం అధికార వైసీపీ నేతల అడుగులకు మడుగులొత్తేలా వ్యవహరిస్తుండటంపై ఎట్టకేలకు ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబుపై కేంద్ర ఎన్నికల సంఘం జోక్యంతో బదిలీ వేటు పడింది. అధికారపార్టీ నేతలు చెప్పిందే వేదంగా అనుసరించడం.. ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు వచ్చినా.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించినా స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిడితో నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించిన కలెక్టర్‌పై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ఫలితం ఆయనపై బదిలీ వేటు వేసి ఎన్నికల విధులకు దూరంగా కూర్చోబెట్టింది.

- ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయకపోవడంపై ఈసీ సీరియస్
- మచిలీపట్నం, గన్నవరంలో యథేచ్ఛగా దొంగ పట్టాల పంపిణీ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించిన వైనం
- కేంద్ర ఎన్నికల సంఘం జోక్యంతో ఏడాదిలోపే బదిలీ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/మచిలీపట్నం) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో డోర్ నెంబర్లు లేకుండా, ఒకే కుటుంబంలోని సభ్యులను వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుగా చేర్చడం వంటి ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయి. వీటిని సరిచేయాలని మచిలీపట్నం టీడీపీ నాయకులు ఎంతో కాలంగా పోరాడుతున్నారు. స్థానిక టీడీపీ నాయకుడు ఐ.దిలీప్‌కుమార్ హైకోర్టునూ ఆశ్రయించారు. ఎన్నికల సంఘానికీ ఫిర్యాదు చేశారు. తప్పులను సరిచేయకుండా మచిలీపట్నం ఆర్‌వోగా గతంలో వ్యవహరించిన ఆర్డీవో కిషోర్ ఓటర్ల జాబితాల సవరణ కీలక సమయంలో దీర్ఘకాలంపాటు సెలవుపెట్టి వెళ్లిపోయారు. మళ్లీ మచిలీపట్నానికి రాకుండా వేరే ప్రాంతానికి ఆయన బదిలీ చేయించుకున్నారు. దీంతో మచిలీపట్నం నగరంలోని ఓటర్ల జాబితా సక్రమంగా తయారు కాలేదు. పోలింగ్‌స్టేషన్లు ఏ డోర్ నెంబరు నుంచి ప్రారంభమై, ఏ డోర్‌నెంబరుతో ముగుస్తుందో వివరాలు లేకుండా ఓటర్ల జాబితాలను తయారు చేశారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఒత్తిడితోనే ఓటర్ల జాబితాలను అధికారులు వైసీపీ నేతలకు అనుకూలంగా తయారు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతిపక్ష నాయకులు వివరాలు కోరితే తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఈ అంశానికి సంబంధించిన సమాచారం తమ వద్దలేదని సమాధానం ఇచ్చారు.

నాని ఆదేశంతో తహసీల్దార్ సస్పెండ్‌ను ఆపిన కలెక్టర్

తప్పులతడకగా ఓటర్ల జాబితాలు తయారు చేసిన మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అయితే సంబంధిత అధికారిని సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్ ఆ తర్వాత పేర్ని నాని ఒత్తిడితో ఆ ఉత్తర్వులను రద్దు చేశారు. ఈ అంశంపై వివాదాస్పదమైంది. ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేయాలని, బాధ్యుడైన ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను కలెక్టర్ బుట్టదాఖలు చేశారు.

దొంగ పట్టాలపై కళ్లకు గంతలు

ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత మచిలీపట్నంలో స్ట్రీట్‌ఫీల్డ్ (ఎస్‌ఎఫ్) సర్వే నెంబరుతో ఓటర్లను ఆకర్షించేందుకు దొంగ ఇంటి పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమానికి పేర్ని నాని శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ అనధికార ఆదేశాలతో రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సహకరించారు. దీంతో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ నాయకులతో కలిసి రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో ఎంకే మీనాకు ఫిర్యాదు చేశారు. మరుసటిరోజు తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి సమయంలో దొంగ ఇంటి పట్టాలపై రెవెన్యూ అధికారులు సంతకాలు చేస్తున్నారనే సమాచారంతో టీడీపీ నాయకులు అక్కడకు వెళ్లి ఆందోళన చేశారు. జేసీ గీతాంజలి శర్మ రాత్రి 12 గంటల సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఈ అంశంపై విచారణ చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో టీడీపీ నాయకులు ఆందోళన విరమించారు. ఇంత జరిగినా నేటికీ దొంగ ఇంటిపట్టాల పంపిణీ గుట్టుచప్పుడు కాకుండా జరుగుతూనే ఉంది. గన్నవరం నియోజకవర్గంలోనూ స్థానిక ఎమ్మెల్యే వంశీ కూడా ఇదే తరహాలో దొంగ ఇంటి పట్టాలకు తెరదీశారు. వీటన్నింటినీ కలెక్టర్ చూసీచూడనట్టు వదిలేస్తూనే ఉన్నారు.

12వేల ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు

మచిలీపట్నం మండలంలో 12 వేల ఎకరాల అసైన్డ్‌భూములకు పట్టాలు పంపిణీ చేసే అంశంలోనూ రెవెన్యూ అధికారులపై అధికారపార్టీ నాయకుడు పేర్ని నాని తీవ్ర ఒత్తిడి తెచ్చారు. బందరు మండలంలోని కోన, తాళ్లపాలెం, రుద్రవరం తదితర గ్రామాల్లో అసైన్డ్ భూములకు రైతుల పేరున పట్టాలు ఇచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఎంపీ నిధులతో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అనుమతులు ఇవ్వకుండా కలెక్టర్‌పై అధికారపార్టీకి చెందిన శాసనసభ్యులు తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. దీనిపైనా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలకు జీహుజూర్ అంటూ పనిచేసిన పాపానికి కలెక్టర్‌పై బదిలీ వేటు పడింది. ఎన్నికల విధులకు సంబంధంలేని పోస్టులో కలెక్టర్‌ను నియమించాలని ఎన్నికలసంఘం ఆదేశాలు జారీ చేసింది.

జేసీకి అదనపు బాధ్యతలు

కలెక్టర్ పి.రాజాబాబు బదిలీతో ఆయనను జనరల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు జేసీ గీతాంజలి శర్మకు కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బిల్డప్ నాని

- సొంత వారితో హారతులు, పాలాభిషేకాలు
- ప్రజలే స్వచ్ఛందంగా చేస్తున్నట్టు హంగామా

గుడివాడ : చుట్టూ వంద మంది భజన బృందం... ప్రతి పది ఇళ్లకోసారి మంగళ హారతి... అక్కడక్కడా కాళ్లకు పాలాభిషేకం... ఇదీ గుడివాడ వైసీపీ అభ్యర్థి కొడాలి నాని కొత్త తరహా ప్రచారార్భాటం. ఈ తరహా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వైసీపీ అభ్యర్థి కొడాలి నాని బిల్డప్ చూసి పట్టణవాసులు ఆశ్చర్యపోతున్నారు. రోజుకో రకంగా బిల్డప్‌లతో బజర్దస్త్‌ను మించిన కామెడీని ఎంజాయ్ చేస్తున్నారు. గత ఆరు రోజులుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నా ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో కొత్త ఎత్తుగడకు నాని శ్రీకారం చుట్టారు. రెండున్నరేళ్లు మంత్రిగా, మరో రెండున్నరేళ్లు ఎమ్మెల్యేగా నాని గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యం. ఈ విషయంలో నియోజకవర్గ ప్రజలు పూర్తి స్పష్టతతో ఉన్నారు. ఆరు రోజులుగా ప్రచారం చేస్తున్నా ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో తానేదో గుడివాడ అభివృద్ధి ప్రదాత అనే రేంజ్‌లో ఏకంగా వైసీపీ శ్రేణులతో పాదాలకు పాలాభిషేకాలు చేయించుకుంటున్నారు. పార్టీ అభిమానులు, సొంత మనుషులతో డబ్బులిచ్చి పాలాభిషేకాలు తెరలేపారు. ప్రచారానికి వచ్చిన వారికి పూర్తిస్థాయిలో చికెన్ భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రచారంలో తన వెంట వందమంది ఉండేలా పక్కా ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి పది ఇళ్లకు ఒకసారి హారతి పట్టేలా, మెడలో పూలదండలు వేసేలా ఏర్పాట్లు బేషుగ్గా చేసుకున్నారని గుడివాడ టాక్.



నాని పాదాలకు పాలాభిషేకం చేస్తున్న మహిళ

ఈసీ చూస్తోంది.. జాగ్రత్త!



అధికార పార్టీ మత్తు వీడని కొందరు అధికారులు

- కోడ్ వచ్చినా వైసీపీ సేవలోనే పావనం
- జగన్ పత్రిక మినహా మిగిలిన వాటికి దూరం
- పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవు

అధికారులపై ఎలక్షన్ కమిషన్ నిఘా

ఉద్యోగ విధులు మరచి... వైసీపీ అడుగులకు మడుగులొత్తే అధికారుల పప్పులు ఇక ఉడకవు. ఎన్నికల కోడ్ వచ్చినా నిబంధనలకు నీళ్లొదిలి అధికార పార్టీ సేవలో పావనమయ్యే అధికారులు పెట్టె సర్దుకోవాల్సిందే. ఇటువంటి వారిపై ఎలక్షన్ కమిషన్ నిఘా పెట్టింది. ఈ జాబితాలో ఉన్న కృష్ణాజిల్లా కలెక్టర్‌పై కేంద్ర ఎన్నికల కమిషన్ తాజాగా వేటు వేసింది. ఆయనలానే ఎన్టీఆర్ జిల్లాలో కొందరు అధికారులు వైసీపీ సేవలో తరిస్తున్నారు. ఇకనైనా జాగ్రత్త పడకపోతే వారి లెక్కలూ తేల్చేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమైంది.

- 6లో..

తొలి జాబితాలో తొమ్మిది మంది

అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

- ఉమ్మడి జిల్లాలో ఐదు స్థానాలు పెండింగ్
- వామపక్షాలకు రెండు స్థానాలు
- మిగిలిన మూడింటిపై సందిగ్ధం



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులకు సంబంధించిన విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మందికి స్థానం దక్కింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వాటిలో తొమ్మిది స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. తిరువూరు నుంచి లాం తాంతియ కుమారిని అధిష్ఠానం పోటీలోకి దింపింది. గుడివాడ స్థానాన్ని వడ్డాది గోవిందరావుకు కేటాయించారు. పెడనకు శొంఠి నాగరాజు, మచిలీపట్నానికి అబ్దుల్ మతీన్, అవనిగడ్డకు అందే శ్రీరామమూర్తి, పామర్రుకు మాజీ ఎమ్మెల్యే డీవై దాసు పేర్లను కాంగ్రెస్ ఎన్నికల కమిటీ ప్రకటించింది. పెనమలూరు నుంచి ఎలిసల సుబ్రహ్మణ్యం, మైలవరం నుంచి ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బొర్రా కిరణ్‌ను బరిలోకి దింపింది. నందిగామ నుంచి మందా వజ్రయ్య అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. అసెంబ్లీ అభ్యర్థులతోపాటు లోక్‌సభ అభ్యర్థుల జాబితాను విడుదల చేసినా అందులో విజయవాడ, మచిలీపట్నం స్థానాలకు చోటు దక్కలేదు. మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా వాటిలో తొమ్మిది స్థానాలకు లైన్ క్లియర్ అయింది.

ఆ రెండు వామపక్షాలకే

కాంగ్రెస్ పార్టీ ఇంకా మరో ఐదు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఇండియా కూటమిగా అడుగులు వేస్తోంది. ఇందులో సీపీఐ, సీపీఎం ఉన్నాయి. పొత్తులో భాగంగా వామపక్షాలకు చెరో నియోజకవర్గాన్ని కేటాయించడానికి దాదాపు అంగీకారం కుదిరింది. విజయవాడలో మొత్తం మూడు నియోజకవర్గాలు ఉండగా రెండింటిని వామపక్షాలకు కేటాయించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్ నుంచి సీపీఎం, పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ పోటీ చేసే సూచనలు ఉన్నాయి. ఇప్పటి సెంట్రల్ నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ నగర కమిటీ కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఈ రెండు స్థానాలు పోగా ఇంకా మూడు స్థానాలను కాంగ్రెస్ ఖరారు చేయాల్సి ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ తూర్పు, జగ్గయ్యపేట స్థానాలకు, కృష్ణా జిల్లాలో గన్నవరం స్థానానికి అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. గన్నవరం నుంచి కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు వింతా సంజీవరెడ్డి పోటీ చేయడానికి ఆసక్తిని చూపిస్తున్నారు. ఈయనతోపాటు మరికొంతమంది ఉన్నప్పటికీ డీసీసీ అధ్యక్షుడి హోదాలో సంజీవరెడ్డికి అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. ఇప్పుడు ఈ స్థానంపై కాంగ్రెస్, వామపక్షాల మధ్య పేచీ మొదలైంది. విజయవాడ సెంట్రల్‌తోపాటు గన్నవరం స్థానాన్ని తమకు కేటాయించాలని సీపీఎం కోరుతోంది. ఈ విషయంలో తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో ఈ మొత్తం వ్యవహారం కొలిక్కి వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.

మద్యం రవాణా గుట్టు రట్టు

- 6లో..

ఈసీ నజర్..

జిల్లా అధికారులపై ఎలక్షన్ కమిషన్ నిఘా

ఎలక్షన్ కమిషన్ నిఘాపెట్టినా.. ఎన్టీఆర్ జిల్లాలో కొందరు అధికారుల్లో లెక్కలేనితనం కనిపిస్తోంది. కోడ్ అమల్లోకి వచ్చినా కొందరు అధికారులు అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ బదిలీ నేపథ్యంలో అయినా ఎన్టీఆర్ జిల్లాలో కొన్ని శాఖల అధికారులు కళ్లు తెరవాలి. కొందరు జిల్లా అధికారులు అధికార పార్టీకి తాబేదుల్లా పనిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.





- కోడ్ వచ్చినా అధికార పార్టీ మత్తు వీడని కొందరు అధికారులు
- స్వేచ్ఛగా మాట్లాడలేరు.. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోలేరు
- జగన్ పత్రిక మినహా.. మిగిలిన పత్రికలకు దూరం..
- పద్ధతి మార్చుకోక పోతే చర్యలు తప్పవు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జయచంద్ర గాంధీ విధుల్లో చేరినప్పటి నుంచి అధికార పార్టీకి భజన చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు, ఉద్యోగుల గ్రూపుల్లో అధికార పార్టీ అనుకూల సందేశాలు పంపటంతో పాటు, ప్రైవేటుగా పబ్లిక్ గ్రూపుల్లో పక్కా వైసీపీ కార్యకర్త మాదిరిగా పార్టీకి ప్రచారం చేస్తున్నారు. కోడ్ అమల్లోకి వచ్చినా కూడా ఆ రెండు పత్రికలు మనల్ని ఫెయిల్యూర్ చేయాలని చూస్తాయంటూ మెసేజ్‌లు పెట్టారు. అంతర్గతంగా వైసీపీ ఏజంట్‌లా పనిచేస్తున్నారు. జగ్గయ్యపేట వైసీపీ అభ్యర్థి సామినేని ఉదయభానుకు ఆయన సహాయ సహకారాలను అందిస్తు మంత్రిగా చూడాలన్న కాంక్షతో ఉన్నారు. స్థానిక జిల్లాకు చెందిన అధికారి ఎన్నికల సందర్భంలో మరోచోటకు బదిలీ చేయాల్సి ఉండగా.. ఆయన్ను అధికార పార్టీ ఒత్తిళ్లతో ఇక్కడే కొనసాగించటంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారుల్లో మూడేళ్లు పూర్తి చేసుకున్న వారు ఉన్నారు. నోడల్ అధికారులుగా కూడా కొందరు పనిచేస్తున్నారు. ఈ విషయంపైనా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఫిర్యాదులు చూసయినా వారికి డ్యూటీలు ఇవ్వకూడదు. లేదంటే వారిని మరోచోటుకు బదిలీ చేయాలి. జిల్లాలో కొందరు అధికారులు అధికార పార్టీ భయం నుంచి బయటపడటం లేదు. కోడ్ అమల్లోకి వచ్చినా స్వేచ్ఛగా మాట్లాడలేని పరిస్థితి. జిల్లా ఉన్నతాధికారులు మినహాయిస్తే ఆయా శాఖల అధికారులు కోడ్ వచ్చినా ఇంకా భయం భయంగానే ఉంటున్నారు. ఎన్నికల విధుల్లోనూ ధైర్యంగా మాట్లాడలేని పరిస్థితులు నెలకొన్నాయి. మీడియాకు సమాచారం ఇవ్వాలన్నా భయపడిపోతున్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రతి విషయం ప్రజలకు తెలియాలన్న ఉద్దేశ్యంతో ఓ పక్క ఎన్నికల సంఘం నిర్దేశిస్తున్నా కూడా.. కొందరు అధికారులు స్వామి భక్తి వీడటంలేదు. జిల్లాలో సమాచార కేంద్రం ఏర్పాటు జరిగినా జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారులకు, సంబంధిత ఎన్నికల విభాగం నుంచి సరిగా సమాచారం రావటం లేదు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి డిస్ట్రిక్ట్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (డీఈఎంపీ) తయారు కాలేదు. దీనిని బట్టి చూస్తే ఎన్నికల విభాగం ఏ విధంగా పనిచేస్తుందో అర్థమౌతుంది. సమాచారం కోసం సంబంధిత అధికారులకు ఫోన్లు చేస్తుంటే అధికారులు భయపడిపోతున్నారు. కొందరు నోడల్ ఆఫీసర్లకు ఫోన్లు చేసి తాము ఫలాన పత్రిక అని చెప్పగానే ఫోన్లు పెట్టేస్తున్నారు. ఆ నెంబర్ నుంచి మళ్లీ ఫోన్లు వస్తేఎత్తరు. మీటింగ్‌లో ఉన్నామని, తర్వాత ఫోన్ చేస్తానన్న మెసేజ్ పంపిస్తున్నారు. సమాచారం చెప్పటానికి దాటవేస్తున్నారు. సమాచారం ఇస్తే అంతే సంగతులు అన్న చెడు ప్రచారాన్ని కొంత మంది అధికారులు మిగిలిన వారి దృష్టికి తీసుకువెళుతున్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నడుచుకుంటున్నా.. నోడల్ ఆఫీసర్లు, అధికారులు మాత్రం ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన వారమన్న సంగతిని మరిచిపోతున్నారు. రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలు వివిధ శాఖల అధికారులు కూడా ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదులు వస్తే.. చెప్పటం కూడా నేరంగా భావించే పరిస్థితి నెలకొంది. కలెక్టర్ దిల్లీరావు, ఇతర రిటర్నింగ్ ఆఫీసర్లు తక్షణం అధికారుల ఫోబియోను వదిలించాల్సిన అవసరం ఉంది. లేదంటే ఎన్నికల నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి చెడ్డ పేరు తీసుకు వచ్చే అవకాశం ఉంది.



ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న నెట్టెం రఘురామ్, కేశినేని శివనాథ్

నందిగామలో వైసీపీ అరాచకాలు!

- ప్రశ్నించిన జర్నలిస్టులపై 'మొండితోక' అనుచరుల దాడి
- చికిత్స పొందుతున్న బాధితులకు కేశినేని చిన్ని పరామర్శ

విద్యాధరపురం, ఏప్రిల్ 2 : నందిగామలో మొండితోక సోదరుల అరాచకాలు విఎతిమీరాయని విజయవాడ లోక్‌సభ టీడీపీ అభ్యర్థి, సీనియర్ నేత కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. నందిగామలో మంగళవారం ఉదయం వైసీపీ మూకల దాడిలో గాయపడి విజయవాడ ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు కిశోర్‌బాబు, నరసింహారావులను జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, కనపర్తి శ్రీనివాసులతో కలిసి పరామర్శించారు. వారు త్వరగా కోలుకోవాలని, మెరుగైన చికిత్సను అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ, ప్రశ్నించిన వారిపైనే వైసీపీ దాడులు చేస్తోందన్నారు. నందిగామలో మొండితోక సోదరుల అరాచకాలకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. మొండితోక సోదరులకు ఈ ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన అంతమొందించాలంటే టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబు నాయకత్వం రావాలని పిలుపునిచ్చారు.

ప్రశ్నించిన వారిపై దాడులు హేయం : సౌమ్య



నందిగామ : ఐదేళ్ల పరిపాలన చేసి రాష్ట్ర రాజధాని ఎక్కడో చెప్పలేని వైసీపీ నేతలు.. ప్రశ్నించిన వారిపై దాడిచేసి రాక్షసానందం పొందడం హేయమని టీడీపీ కూటమి అభ్యర్థిని తంగిరాల సౌమ్య అన్నారు. మంగళవారం వైసీపీ నేతల దాడిలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు కిశోర్‌బాబు, నరసింహారావులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా సీఐ హనీష్‌తో ఆమె మాట్లాడారు. దాడి జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాలు ఉండటంతో ఇప్పటికే ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయన్నారు. దాడిచేసిన వారు కళ్లముందే ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దాడిచేసిన వ్యక్తులు సిగ్గులేకుండా వచ్చి వైద్యశాలలో చేరడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే వారిని అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వైసీపీ అరాచకాలకు అడ్డూఆపూ లేకుండా పోతున్నాయన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారన్నారు. ప్రజలు ఎన్నికలలో బుద్ధి చెప్పితీరుతారన్నారు. పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వసంతతో నెట్టెం భేటీ



నందిగామ, ఏప్రిల్ 2 : ఎన్టీఆర్ జిల్లాలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. మంగళవారం మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ నివాసంలో నెట్టెంతో పాటు పలువురు పార్టీ నాయకులు ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా నెట్టెం మాట్లాడుతూ, అమరావతి ద్రోహి జగన్‌కు బుద్ధి చెప్పేందుకు జిల్లా ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవబోతున్నట్లు చెప్పారు. వైసీపీ అభ్యర్థులకు ఓట్లడిగే అర్హత కూడా లేదన్నారు. అనంతరం మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావుతో ఆయన చర్చలు జరిపారు.

పింఛన్లపైనా జగన్ నీచ రాజకీయాలు : దేవినేని



గొల్లపూడి, ఏప్రిల్ 2 : ఎన్నికల వేళ పింఛన్ల పంపిణీపై వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి నీచరాజకీయాలు చేస్తూ విపక్షాలపై విషం చిమ్మాలనే కుయుక్తులు ఫలించవని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం గొల్లపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ వేసిన ప్రతి ప్లాన్ రివర్స్ కొడుతుండటంతో ఏం చేయాలో పాలుపోక పింఛన్ల పంపిణీని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. గతంలో గ్రామ, వార్డు కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థ కొనసాగుతుందని, పింఛన్ రూ.4 వేలు చేసి ఇంటి వద్దకే నారా చంద్రబాబు నాయుడు పంపతారని అందులో ఎలాంటి సందేహం లేదని ఉమా స్పష్టం చేశారు.



తట్టివర్రులో పర్యటిస్తున్న వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

- తట్టివర్రులో వెనిగండ్ల ఎన్నికల ప్రచారం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 2 : గుడివాడ రూరల్ మండలంలో కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము పర్యటించారు. తట్టివర్రులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామసెంటర్ వద్ద అభిమానులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సూపర్ సిక్స్ పథకాలను రాము వివరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, గుడివాడ ప్రాంతానికి మేలు చేద్దామన్న సదాశయంతో మీ ముందుకు వచ్చానని, ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జీ, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్ర బాబు, మండల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ వర్గాల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

గుడివాడ : నాయీ బ్రాహ్మణులతో పాటు బీసీ వర్గాల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని, బీసీల ఉన్నతికి మరిన్ని పథకాలను ప్రవేశపెట్టనున్నట్టు ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, వైసీపీ అరాచక పాలనలో పథకాలన్నీ రద్దు చేశారని ఆరోపించారు. ఆస్కార్ స్థాయిని మించి రాష్ట్రంలో అబద్ధాలు చెప్పే వ్యక్తుల్లో జగన్‌రెడ్డి, కొడాలి నాని ముందున్నారన్నారు. పలువురు సంఘీయులు వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

ఉయ్యూరు, ఏప్రిల్ 2 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చేపట్టిన ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఉయ్యూరులో పర్యటించనున్నట్టు పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పర్యటన సందర్భంగా సభా వేదికను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి స్థానిక మార్కెట్ సెంటర్‌ను ఎంపిక చేశారు. బోడె, రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఉయ్యూరులో చంద్రబాబు పర్యటనకు ప్రజలు భారీగా తరలివచ్చి దిగ్విజయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా టీడీ జనార్దన్ జన్మదిన వేడుకలు

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ రావు జన్మదిన వేడుకలను పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు భారీ కేక్ కట్ చేసి.. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సామాన్య కుటుంబంలో పుట్టి స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగిన జనార్దన్ పార్టీకి అందిస్తున్న సేవలను కొనియాడారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బొండా ఉమామహేశ్వరరావు, నక్కా ఆనందబాబు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, దారపనేని నరేంద్ర, పిల్లి మాణిక్యాలరావు, కోడూరు అఖిల్, దామోదర్, సురేష్, వల్లూరి కిరణ్, పాతర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి పింఛన్లు పంపిణీ చేయండి

- జిల్లా కలెక్టర్ దిల్లీరావు ఆదేశం

కృష్ణలంక, ఏప్రిల్ 2 : భారత ఎన్నికల సంఘం ఆదేశాలను పాటిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు ఈనెల 3వ తేదీ బుధవారం నుంచి సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. దిల్లీరావు అధికారులను ఆదేశించారు. వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యం, వీల్‌చైర్‌కు పరిమితమైన, యుద్ధవీరుల వృద్ధ వితంతులకు ఇంటి వద్దే పంపిణీతో పాటు మిగిలిన వారికి సమీపంలోని సచివాలయాల ద్వారా పంపిణీ చేయాలన్నారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 2 లక్షల 71 వేలమందికి పింఛన్ల పంపిణీపై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందన్నారు. దానికి అనుగుణంగా పంపిణీకి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ లేవలేని స్థితిలో వున్నవారు, వీల్‌చైర్‌కు పరిమితమైన వారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధవీరుల, వృద్ధ వితంతులకు వారి ఇంటి వద్దనే పింఛన్లు అందజేయాలన్నారు. మిగిలిన వారికి వారి నివాస సమీపంలోని గ్రామ వార్డు సచివాలయాలలో అందజేయాలన్నారు. కేవలం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాలని, ఈ విషయంలో మరెవరి జోక్యం ఉండరాదని కలెక్టర్ పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు వున్నారు.



మద్యం బాటిల్స్, నిందితులు, బైక్‌తో సీఐ మణికంఠరెడ్డి

మద్యం రవాణా గుట్టు రట్టు

- తెలంగాణ నుంచి తెచ్చి ఆంధ్రాలో విక్రయం
- 525 బాటిళ్లు, బైక్ స్వాధీనం

జగ్గయ్యపేట/జగ్గయ్యపేటరూరల్, ఏప్రిల్ 2 : తెలంగాణా నుంచి బైక్‌పై అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని జగ్గయ్యపేట సెబ్ అధికారులు మంగళవారం చాకచక్యంగా పట్టుకున్నారు. సెబ్ సీఐ మణికంఠరెడ్డి సెబ్ కార్యాలయంలో నిందితులు, స్వాధీనం చేసుకున్న 525 మద్యం బాటిల్స్ బైక్, మొబైల్ ఫోన్‌ను ప్రదర్శించారు. జగ్గయ్యపేటలో విలియంపేటకు చెందిన మంగళంపల్లి ప్రకాశరావు హీరో హోండా గ్లామర్ బైక్‌పై ఉదయం కోదాడ వైపు నుంచి వస్తుండగా రాష్ట్ర సరిహద్దు వ్యవసాయమార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద సెబ్ అధికారులు తనిఖీ చేసి సీటు కింద పేర్చిన 115 మద్యం బాటిల్స్ లభ్యమయ్యాయి. లోతైన విచారణ చేయగా తెలంగాణా సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డులో ఉన్న మద్యం షాపుల నుంచి దఫ దఫాలుగా మద్యం కొనుగోలు చేసి బైక్ సీటు కింద ఎవరికి అనుమానం రాకుండా ఉంచి విలియంపేటలో సందా రాధిక, మారేపల్లి రాజు, పగిడిపల్లి రాము, తిరువలమ్మ, మల్లెల నాగమణి, ఏసుపోగు మేరిలకు సరఫరా చేస్తానని, వారు విక్రయిస్తుంటారని పేర్కొన్నాడు. సమాచారం మేరకు సోదాలు చేయగా 410 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని చెప్పారు. 525 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.

ఆధారాలు చూపని రూ. 4.48 లక్షలు స్వాధీనం

కంకిపాడు, ఏప్రిల్ 2 : ఎన్నికల నియామవళిలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన రహదారులపై చెక్‌పోస్టుల్లో విస్తృత తనిఖీలు చేపట్టినట్టు కంకిపాడు ఎస్సై డి.సందీప్ తెలిపారు. దావులూరు, పునాదిపాడు గ్రామాల పరిధిలో మంగళవారం నిర్వహించిన సోదాల్లో బందరు గ్రామానికి చెందిన చలమలశెట్టి మంగయ్య ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ. 1.50 లక్షల రోల్డ్ గోల్డ్ వస్తువులు, ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బొమ్మారెడ్డి సోమశేఖర్ రెడ్డి రూ. 2 లక్షలు, వెంగల శ్రీనివాసరావు వద్ద రూ. 2.38 లక్షలు స్వాధీన పరుచుకున్నట్టు తెలిపారు. సంబంధిత వస్తువులు, నగదుకు ఎటువంటి ఆధారాలు వారు చూపలేదన్నారు. నగదు, రోల్డ్ గోల్డ్ వస్తువులను ఎన్నికల అధికారికి అందజేసినట్టు ఎస్సై తెలియజేశారు.


రాష్ట్ర పునర్నిర్మాణానికి చంద్రబాబు గెలుపు అవసరం

- ఆత్మీయ సమావేశంలో శివనాథ్, జనసేన, టీడీపీ నేతలు



పటమట, ఏప్రిల్ 2 : వైసీపీ పాలనలో గాడితప్పిన ఏపీని తిరిగి ప్రగతి దిశగా నడిపించగల సత్తా ఉన్నా నాయకుడు చంద్రబాబునాయుడు మాత్రమే అని జనసేన, బిజెపీ కూటమి బలపర్చిన టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని అయ్యప్పనగర్ మెగాటౌన్ షిప్‌లో స్థానికులతో కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, టీడీపీ, బీజెపీ, జనసేన కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. మూడు పార్టీల కలయిక చారిత్రక అవసరమని, ఇది ఎన్నికల ఫలితాల తర్వాత జగన్‌కు అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను భ్రష్టుపట్టించి, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కి జగన్ నెట్టివేశాడని అన్నారు. తూర్పు నియోజకవర్గానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అయితే అధికారులు దేవినేని అవినాశ్ చుట్టు ప్రదక్షిణలు చేశారని విమర్శించారు. గద్దె అభివృద్ధికి చిరునామా అయితే, అవతల వ్యక్తి విధ్వంసానికి కేరాఫ్ అడ్రస్ అని దుయ్యబట్టారు. అవినీతి మరకలేని గద్దెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నందమూరి, నారా కుటుంబాలు ఎన్టీఆర్ ట్రస్ట్, బసవతారకం హాస్పిటల్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, జగన్ మాత్రం ప్రజల సొత్తును తన జేబులో వేసుకుంటున్నాడని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని కార్యకర్తలను కోరారు. ఎన్టీఆర్ జిల్లాలో కూటమి అభ్యర్థుల్ని గెలిపించి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దోపిడీ పాలనకు చరమగీతం పలకండి : బాలశౌరి



పామర్రు : యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించకుండా, సహజ వనరులు ఇష్టారాజ్యంగా దోచుకుంటు, ప్రశ్నించే వారిపై దాడులు, తప్పుడు కేసులతో వేధింపులకు గురిచేసే పాలనకు చరమగీతం పలకాలని బందరు పార్లమెంట్ జనసేన అభ్యర్థి ఎంపీ వల్లభనేని బాలశౌరి పిలుపునిచ్చారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పామర్రు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వర్లకుమార్‌రాజా అధ్యక్షతన ఎన్డీయే కూటమి నేతల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాలు, భవిష్యత్తు కోసమే కూటవి ం కలయిక అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనపై అన్ని వర్గాల ప్రజలు విరక్తితో ఉన్నారన్నారు. పార్టీ విజయానికి అంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. వర్లకుమార్ రాజా మాట్లాడుతూ, జగన్ అరాచక పాలనతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. అనంతరం గుడివాడ రోడ్డులోగల మసీదులో ముస్లింల ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పామర్రు జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, బీజేపీ నేత వలపర్ల వెంకటేశ్వరరావు, టీడీపీ నేత వీరంకి గురుమూర్తి, ఐదుమండలాల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధిపొందాలనే వైసీపీ కుట్ర : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 2 : ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దాదాపు లక్షా 60 వేల మంది ఉన్న సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇంటింటికీ చేయవచ్చని మాజీ ఎంపీ, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వలంటీర్లతో రాజీనామాలు చేయించి ఎన్నికల ప్రచారానికి వాడుకునేందుకు వైసీపీ నాయకులు వినియోగిస్తున్నారని, వలంటీర్ల రాజీనామాలను ఆమోదించడం సబబుకాదన్నారు. రాష్ట్రంలో లక్షా 60 వేల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, వారితో ప్రతి ఇంటికి పింఛన్లు పంపిణీ చేయవచ్చన్నారు. ఒక్కొక్క డివిజన్‌లో 10 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, వారిని పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వినియోగించాలన్నారు.

జనసైనికుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకండి

- అవనిగడ్డలో బుద్ధప్రసాద్‌కు వ్యతిరేకంగా కొనసాగిన నిరసనలు



అవనిగడ్డ, ఏప్రిల్ 2 : కండువాలు మార్చే వారికి సీట్లు ఇచ్చి జనసైనికుల ఆత్మ విశ్వాసం దెబ్బతీయవద్దంటూ పలువురు జనసేన నేతలు మంగళవారం అవనిగడ్డలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. తెలుగుదేశం, జనసేన పార్టీల జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు చెన్నగిరి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ఇంటి నుంచి వందల మంది జనసైనికులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశంలో పార్టీ ముఖ్య నేతలు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్‌తో స్ఫూర్తి పొంది ఎంతో మంది యువకులు రాజకీయాల్లోకి రాగా, పార్టీలో ఎవరూ సమర్థులు లేనట్టుగా టీడీపీ నుంచి మండలి బుద్ధప్రసాద్‌ను తీసుకుని పార్టీ రాష్ట్ర నాయకత్వం సీటు ఇవ్వాలని చూస్తున్నట్టు ప్రచారం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ గెలిచే అవకాశం లేదన్న వారు జనసేనలోకి ఎందుకు వచ్చారన్న విషయమై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్తవారికి అవకాశం కల్పిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఐదు దశాబ్దాల పాటు దివిసీమలో చక్రం తిప్పిన కుటుంబానికే పార్టీలో అవకాశం కల్పిస్తే ఎలా అని ప్రశ్నించారు. అధినేత పవన్ కళ్యాణ్ సీటు విషయంలో తన నిర్ణయాన్ని పునఃపరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు రాయపూడి వేణుగోపాలరావు, బచ్చు వెంకటనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లపై సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మిశ్రా

సమష్టి కృషితో సత్ఫలితాలు

- రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా
- ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాట్లపై సంతృప్తి

కృష్ణలంక, ఏప్రిల్ 2 : సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రత్యేక పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈసీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ అబ్జర్వర్‌గా నియమించిన రామ్మోహన్ మిశ్రా మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్నికల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం, ఎంసీఎంసీ, సోషల్ మీడియా విభాగాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిల్లీరావు, పోలీసు కమిషనర్ కాంతి రాణాటాటా, ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. కంట్రోల్ రూంలోని సీ-విజిల్, ఐటీ, బ్యాంకింగ్, కమర్షియల్ ట్యాక్స్ ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్), కస్టమ్స్ తదితర విభాగాల కార్యకలాపాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలను దిల్లీరావు, కాంతిరాణాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పెషల్ జనరల్ అబ్జర్వర్‌కు వివరించారు. ఈసారి ఎన్నికల్లో జిల్లాలో 85శాతం ఓటింగ్ లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఏప్రిల్ 13, 14 తేదీల్లో సెషన్ల వారీగా పీవో, ఏపీవోలకు శిక్షణకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా పోలీసు కమిషనర్ జిల్లాలో ఎలక్షన్ సీజర్లను, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. పోలీస్ కంట్రోల్ రూంను రామ్మోహన్ మిశ్రా పరిశీలించారు.

అధికారుల పనితీరు అభినందనీయం

జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ నేతృత్వంలోని ఎన్నికల బృందాల పనితీరును మిశ్రా అభినందించారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చే డేటాను విశ్లేషించి కార్యాచరణ దిశగా అడుగులేయాలన్నారు. అనంతరం కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ, మిశ్రా సూచనలతో జిల్లాలో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేస్తామన్నారు.

అనంతరం మిశ్రా గూడవల్లిలోని ఇంటర్ డిస్ట్రిక్ట్ బోర్డర్ చెక్‌పోస్టును సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. అక్కడ విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ పి.సంపత్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవో భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభావతి కస్టడీ పిటిషన్ కొట్టివేత

విజయవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఆభరణాలను కాజేశారన్న కేసులో గంగూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మాజీ మేనేజర్ దావులూరి ప్రభావతిపై పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. యోగేశ్వరరావు అనే ఖాతాదారుడికి సంబంధించిన 32 బంగారు ఆభరణాలను ఆమె కాజేసిందని, విచారణ సమయంలో రెండు ఆభరణాలు మాత్రమే రికవరీ చేశామని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఆమె నుంచి ఇంకా 30 ఆభరణాలు రికవరీ చేయాల్సి ఉన్నందున మూడు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పెనమలూరు పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభావతి తరపున వాదనలు వినిపించిన న్యాయవాది కిలారు బెనర్జీ ఆ ఆభరణాలకు సంబంధించిన కంప్యూటరైజ్డ్ బిల్లులను కోర్టుకు చూపించారు. ఇరువర్గాల వాదనలను విన్న ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి లెనిన్ బాబు పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కొట్టేస్తూ మంగళవారం తీర్పును ఇచ్చారు.

ప్రత్యేకాధికారి దృష్టికి రూ.50లక్షల కుంభకోణం

- అక్రమార్కులకు వైసీపీ నేత అభయహస్తం?

గుడివాడ, ఏప్రిల్ 2 : 'మ్యుటేషన్ పేరుతో మింగేశారు.. మున్సిపల్ ఆదాయానికి గండికొట్టి రూ.50లక్షల హాంఫట్ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించారు. గుంటూరు మున్సిపల్ అధికారులు రూ.50లక్షల కుంభకోణ వివరాలను సేకరిస్తున్నారు. పురపాలక సంఘ ప్రత్యేక అధికారి, జిల్లా జేసీ కుంభకోణం పాత్రదారులపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. అయితే పాత్రదారులకు వైసీపీ నేత అభయహస్తమిచ్చినట్టు సమాచారం. ఎటువంటి చర్యలకు పాల్పడకుండా తాను చూసుకుంటానని రెవెన్యూ అధికారులకు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

బాలికపై లైంగిక దాడి యువకుడిపై కేసు నమోదు

పెడన, ఏప్రిల్ 2 : బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని 7వ వార్డుకు చెందిన ఎండి హషీర్ (21) బాలికపై లైంగికదాడి చేయడంతో బాలిక ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేశారు. బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాని ఘటనపై విచారణ నిర్వహించారు.

బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు



ఎ.కొండూరు : ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ల శిబిరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని గొల్లమందల గ్రామ శివారు మామిడితోటలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం మేరకు తిరువూరు సీఐ పర్యవేక్షణలో సిబ్బంది దాడిచేశారు. భూక్యా సురేష్, షేక్ జాన్‌బాషా, చిమట రమేష్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి ఒక ల్యాప్ టాప్, ఏడు సెల్ ఫోన్లు, రూ.ఐదు వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వారి సమాచారం మేరకు చిమట గోపాలరావు, రాంబాబు, వెంకటేశ్వరరావులను గుర్తించి మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కృష్ణ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	252
చికెన్ స్కిన్‌లెస్	262

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

వైసీపీని వీడి టీడీపీలో చేరిన నహీద్

వన్‌టౌన్, ఏప్రిల్ 2: వైసీపీ మైనార్టీ నగర అధ్యక్షుడు నహీద్ తనకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని మంగళవారం తన అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. పశ్చిమం నుంచి కూటమి అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న సుజనా చౌదరి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్(చిన్ని) ని కానూరులో సుజనా చౌదరి నివాసంలో కలిసి వారికి దుశాలువా కప్పి సత్కరించారు.అనంతరం ఆయన టీడీపీలో చేరారు.



నేరస్తులను తిరస్కరించండి

● జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట, ఏప్రిల్ 2 : ప్రజలకు మంచి చేసి మన్ననలు పొందాలే గానీ, రౌడీయిజం చేసి, ప్రశ్నించిన వారిపై దాడులు చేసి ఓట్లను పొందాలని చూస్తే తూర్పు ప్రజలు ఒప్పుకోరని వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధం ద్వారా భయభ్రాంతులకు గురి చేసే వారిని తిరస్కరించాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ప్రజలను కోరారు. 14వ డివిజన్ దర్శిపేట రావిచెట్టు సెంటర్ నుంచి జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)లను గెలిపించాలని కోరుతూ ఆమె మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై కరప్రతాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ప్రశాంతంగా ఉన్న తూర్పులో వైసీపీ నాయకులు వారి చరిత్రను మళ్లీ తెరమీదకు తెచ్చి గత చరిత్రను పునరావృతం చేస్తున్నారని విమర్శించారు. గద్దె రామ్మోహన్ ద్వారా తామే ఏదో ఒక లబ్ధి పొందామని ప్రజలు చెబుతున్నారని, గద్దె లాంటి సౌమ్యుడే ఎమ్మెల్యేగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. నర్రా కిషోర్, బద్రి, వై.శివ నాగరాజు, వి. డాంగేకుమారి, సీహెచ్ సాంబయ్య, ఎన్. ఉషారాణి, వి. కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం: గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె రాజేష్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఏడవ డివిజన్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఘన విజయం చేకూర్చాలని కోరారు. గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్ చంద్ర, దోమకొండ అశోక్, నాగుమోతు రాజా, పెనుగొండ శ్రీను, దోమకొండ రత్నాకర్, అన్నే వసంత రాయులు, పెరవళి శివ, మల్లిఖార్జున, శివలక్ష్మి, సుష్మ పాల్గొన్నారు.



14వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న గద్దె అనురాధ

పింఛన్‌లు వెంటనే పంపిణీ చేయాలి

● బోయ సత్యబాబు

చిట్టినగర్, ఏప్రిల్ 2: 50వ డివిజన్‌లో పింఛన్‌దారులకు వెంటనే పింఛన్‌లు పంపిణీ చేయాలని కోరుతూ పింఛన్‌దారుల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం గొల్లపాలెంగట్టు ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను స్వార్థ రాజకీయాల కోసం వినియోగించడం దారుణమన్నారు. పెన్షన్లు వలంటీర్లు పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించిందని, దీని వల్ల పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం సిబ్బందితో పింఛన్‌లు పంపిణీ చేయమని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వడంతో వారు డబ్బులు డ్రా చేయకుండా బ్యాంకులకు సెలవులని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వృద్ధులు దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇంటింటికీ వెళ్లి పింఛన్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పింఛన్‌దారుల యూనియన్ నాయకులు ఈ రాజు, సిహెచ్ దుర్గారావు, నూకమ్మ, రామారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.





పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న చిన్నారులు

ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 2: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మంగళవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలల పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులచే పుస్తకాలు చదివించే కార్యక్రమం నిర్వహించారు. పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన గ్రంథపాలకురాలు రమాదేవి మాట్లాడుతూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని చిన్నారులకు సూచించారు. మంచి పుస్తకం చదవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



షాహీ మసీదులో ఇఫ్తార్ విందు

వన్‌టౌన్, ఏప్రిల్ 2: పంజా సెంటర్‌లోని షాహీ మసీదులో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందులో వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, సీఐలు గణేష్, కృష్ణ, శేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు ఈ సందర్భంగా వారంతా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాస విశేషాలను వివరించారు.



నాగేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

వృద్ధాశ్రమంలో అన్న సంతర్పణ

● గుంటుపల్లి నాగేశ్వరరావుకు నివాళి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 2 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నేత, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వాంబేకాలనీలోని అమ్మప్రేమ ఆదరణ వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నసంతర్పణ జరిగింది. ముందుగా గుంటుపల్లి నాగేశ్వరరావుకు సంతాప సభ నిర్వహించిన టీడీపీ నాయీబ్రాహ్మణ సంఘం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం 50 మంది వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు. నేతలు దుర్గారావు, రమణ, బాష, రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లయోల ఇంజనీరింగ్ కళాశాలలో 73 ప్రాజెక్ట్‌ల ప్రదర్శన

భారతీనగర్, ఏప్రిల్ 2: లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఇన్నోవేషన్ 2024 ప్రాజెక్టు ప్రదర్శన భాగంగా మంగళవారం ఐటీ, సివిల్, ఈఈఈ విభాగాల విద్యార్థులు 73 ప్రాజెక్ట్‌లు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనల్లో ఐటీ విభాగం విద్యార్థులు 40 ప్రాజెక్ట్‌లు, సివిల్ విభాగం విద్యార్థులు 6 ప్రాజెక్ట్‌లు, ఈఈఈ విభాగం విద్యార్థులు 27ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం

● పొంగిపొర్లుతున్న మురుగు
● 41, 44 డివిజన్లలో పలు ప్రాంతాలు అధ్వానం

భవానీపురం, ఏప్రిల్ 2 : భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారుతుండటంతో పలు వీధుల్లో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు బయటకు పొంగి వస్తోంది. దీంతో వీధులన్నీ మురికి కూపాలుగా మారుతున్నాయి. ఈ దుర్గంధంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. 44వ డివిజన్ కొండబడి ప్రాంతంలో యూజీడీ మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేశాక చాలా వీధుల్లో మురుగు తోడకపోవడంతో మూతలు కిందకు దిగిపోతున్నాయి. కనీసం నెలకొకసారైనా మూతలను బయటకు తీసి మురుగు తీయడం లేదు. 41వ డివిజన్‌లోని బాజీబాబా ఆశ్రమం వీధి, పీఆర్‌కే బిల్డింగ్స్ ఏరియాల్లోను మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు బయటకు వచ్చి కాల్వలో కలుస్తోంది. ఆర్టీసీ వర్క్‌షాపురోడ్డులోనూ పలుచోట్ల మూతలు కిందకు దిగిపోయాయి. ఇక్కడ మానవ మందిరం రోడ్డు ప్రారంభంలోనే మూతపై వాహనాలు వెళుతుంటే స్థానికులపై మురుగునీరు పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మ్యాన్‌హోల్స్ నిర్వహణను ఒక క్రమ పద్ధతితో యంత్రాల ద్వారా చేపట్టి మురుగునీటి పారుదలకు కార్పొరేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొండబడి ప్రాంతంలో కిందకు దిగిన మ్యాన్‌హోల్ మూత



బాజీబాబా ఆశ్రమం వీధిలో పొంగుతున్న మురుగు

కారు పార్కింగ్ విషయమై ఘర్షణ

విధుల నుంచి సెక్యూరిటీ గార్డుల తొలగింపు



గొడవపడుతున్న సెక్యూరిటీ గార్డులు, డ్రైవర్

వన్‌టౌన్, ఏప్రిల్ 2: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం కనకదుర్గానగర్‌లో విశాఖపట్నానికి చెందిన కారు డ్రైవర్ దూసుకుపోతుండగా అడ్డుకున్న సెక్యూరిటీ గార్డులపై డ్రైవర్ దాడికి దిగాడు. దాడిలో పరస్పరం బూతులు తిట్టుకుంటూ కొట్టుకున్నారు. కనకదుర్గానగర్‌లో పనులు జరుగుతున్నందున వాహనాలను పార్కింగ్ చేసే అవకాశం లేదు. దీంతో సెక్యూరిటీ గార్డులు ఆ కారుడ్రైవర్‌ను కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న దేవస్థానానికి చెందిన పార్కింగ్‌లో కారు పెట్టి రావాలని సూచించారు. దీంతో డ్రైవర్ అకారణంగా గొడవపడ్డాడు. విషయం తెలుసుకున్న ఈవో కేఎస్ రామారావు పూర్తి వివరాలు తెలుసుకుని గొడవపడిన ఇద్దరు సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తొలగించారు. భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించవద్దని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.

చికిత్స పొందుతూ యాచకుడు మృతి

వన్‌టౌన్, ఏప్రిల్ 2: చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం యాచకుడు మృతి చెందాడు. బీఆర్టీఎస్ రోడ్డులో కోడూరు కల్యాణమండపం ఎదురుగా సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు గాయపడ్డాడు. దుర్గాపురంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కొండూరు వెంకట కిషోర్ గాయపడిన యాచకుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు పంపించారు. సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స పొందుతూ యాచకుడు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో

వృత్తి నైపుణ్యంపై శిక్షణ

పటమట, ఏప్రిల్ 2 : మహిళలు, యువతులు ఆర్థికంగా ఎదగడానికి వాసవ్య మహిళా మండలి వివిధ కార్యక్రమాల ద్వారా శిక్షణ ఇస్తుందని సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ బొల్లినేని కీర్తి తెలిపారు. హెచ్‌సీఎల్ సహకారంతో గన్నవరం, విజయవాడ శిక్షణా కేంద్రాల్లో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, అత్యాధునిక డిజైనర్ బ్లౌజులు, డ్రెస్‌ల తయారీ, మగ్గం వర్క్, టాలీ, జీఎస్‌టీ, కంప్యూటర్ శిక్షణ ఉంటుందన్నారు. ఈ అంశాలపై తదుపరి బ్యాచ్ ఈ నెల 8న ప్రారంభమవుతుందని, శిక్షణలో చేరాలనుకునే వారు ఈ నెల ఆరో తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9573404319, 08662470966 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెంచమ్మకు అవార్డు

గన్నవరం, ఏప్రిల్ 2 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్, ఇంజనీరింగ్ రీసెర్చ్ సొసైటీ (ఏఐఎంఈఆర్ఎస్) ఆధ్వర్యంలో విద్యారంగంలో విస్తృతంగా కృషి చేసిన విద్యా వేత్తలకు మంగళవారం అవార్డులను ప్రదానం చేశారు. ఎనికేపాడు విజయ ఇంజనీరింగ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెంచమ్మ నూతన టెక్నాలజీలో విద్యార్థులను తీర్చిదిద్దటంతో పాటు వారి విద్యా ప్రమాణాలను మెరుగు పరచటంతో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. అలాగే కళాశాల హెచ్‌వోడీ వై.విజయ, డాక్టర్ పి.సుబ్బయ్య, డాక్టర్ కె.మురళీలు నూతన సాంకేతిక పద్ధతులలో విద్యాబోధన చేయగా స్టూడెంట్ మెంటార్‌షిప్, డెవలప్‌మెంట్ అవార్డులను అందుకున్నారు. వీరికి ఎస్ఆర్‌కే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

విజువల్ కమ్యూనికేషన్‌తో ఉపాధి మెండు

కంటెంట్ రైటర్ అశ్వతి బాలకృష్ణన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అశ్వతి బాలకృష్ణన్

లబ్బీపేట, ఏప్రిల్ 2: విజువల్ కమ్యూనికేషన్ కోర్సుకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని కంటెంట్ రైటర్ అశ్వతి బాలకృష్ణన్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విజనరీ విస్టాన్-2కే24ను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వినూత్నంగా ఆలోచించడం, ఫొటోగ్రఫీ, వెబ్‌డిజైనింగ్, మల్టీమీడియాలలో శిక్షణ పొందడం వలన తమ ఆసక్తికి అనుగుణంగా ఉన్న రంగాల్లో కెరీర్ మలచుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ విజువల్ కమ్యూనికేషన్ మొదటి బ్యాచ్ విద్యార్థులు మంచి ఉద్యోగాలు పొందారని, ప్రాక్టికల్‌గా కోర్సు నేర్చుకోవడానికి స్టూడియోను అన్ని రకాల సదుపాయాలతో కళాశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు.

ఈ సందర్భంగా నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు క్లే మోడలింగ్, పోస్టర్ మేకింగ్, షార్ట్‌ఫిల్మ్, డాన్స్, డ్రామా తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విజువల్ కమ్యూనికేషన్ హెచ్‌వోడీ బి.శ్రీనివాసరావు, ఫిరోజ్ ఖాన్, కుమారి భార్గవి పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపేందుకు ప్రజలంతా సిద్ధం

● కేశినేని శ్రీదేవి



ఎన్నికల ప్రచారంలో కేశినేని శ్రీదేవి, టీడీపీ నాయకులు

భారతీనగర్, ఏప్రిల్ 2: రాష్ట్ర ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేసిన జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఇంటికి పంపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని కేశినేని శ్రీదేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 4వ డివిజన్‌లోని ఏపీఐఐసీ కాలనీలో బీజేపీ, జనసేన బలపరిచిన విజయవాడ టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ కేశినేని శ్రీదేవి ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరావు, చలసాని రోజా, కాలనీ పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ధర్మపథం వేదికపై బృంద నాట్య ప్రదర్శన

వన్‌టౌన్, ఏప్రిల్ 2: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ధర్మపథం వేదికపై మంగళవారం మల్లిశెట్టి అనూషనాయుడు ఆధ్వర్యంలోని కళాకారుల బృందం నాట్యప్రదర్శన ఇచ్చింది. నారాయణామృత, కొండలలో నెలకొన్న చక్కనితల్లి, జతీస్వరం, నందగోపాల, అఖిలాండేశ్వరి, అయిగిరి నందినీ, మహాగణపతిం, భావములోన, నమోనారాయణ, ముద్దుగారే యశోద, జయజనార్ధన కీర్తనలకు 35మందికి పైగా కళాకారుల బృందం నాట్య ప్రదర్శన చేశారు. చక్కని హావభావ నటన అహూతులను ఆకట్టుకుంది.

ఇంటింటికీ పెన్షన్‌లు పంపిణీ చేయండి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



సత్యనారాయణపురంలో పర్యటిస్తున్న బాబూరావు

సత్యనారాయణపురం, ఏప్రిల్ 2 : పేదలు, వృద్ధులకు పెన్షన్లు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం ఆటలాడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలో మంగళవారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లు భిక్ష కాదని అది వారి హక్కు అని అన్నారు. ఇంటింటికి పెన్షన్లు ఇవ్వడం చేతకాకపోతే జగన్ గద్దె దిగాలన్నారు. తక్షణమే ఇంటింటికి పెన్షన్లు అందజేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 3 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com



'నా పేరు చిరంజీవి' అని తొలిసారి చెప్పింది సావిత్రమ్మకే

"సావిత్రి గారిపై నాకు ఉన్న అభిమానాన్ని ఇలా పుస్తకావిష్కరణ ద్వారా చూపించే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. 'ప్రేమ తరంగాలు' చిత్రంలో ఆమెకు కొడుగ్గా నటించాను. ఇప్పటికీ ఆమె సినిమాలు, పాటలు ఇంట్లో చూస్తుంటాను. ఈ ప్రపంచంలో కళ్లతో అభినయాన్ని పలికించే ఏకైక నటి సావిత్రమ్మ. ఇది ఆ మహాతల్లి నాకు ఇచ్చిన గొప్ప అవకాశంగా ఈ పుస్తకావిష్కరణను భావిస్తున్నాను" అని చిరంజీవి అన్నారు. సంజయ్ కిశోర్ రచించిన మహానటి 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకావిష్కరణ మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. సావిత్రి నటించిన 47 సినిమాల్లోంచి ఆమె పాత్రలను ఎంచుకొని వాటిని విశ్లేషించి, ఫొటోలతో సహా చక్కని పుస్తకంగా మలిచారు.

చిరంజీవి, సురేఖ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. సావిత్రి కూతురు విజయ చాముండేశ్వరి, అల్లుడు గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "పునాదిరాళ్లు' సినిమాలో మహానటి సావిత్రితో కలసి నటించబోతున్నావు' అని చెప్పినప్పుడు ఒళ్లు జలదరించింది. నమ్మలేకపోయాను. అప్పుడే రాజమండ్రి పంచవటి హోటల్లో తొలిసారి సావిత్రిగారిని చూశాను. ఆమె 'బాబూ నీ పేరేంటి?' అని అడిగారు. అంతకు ముందే స్ర్కీన్ నేమ్ చిరంజీవి అనుకున్నాను. అలా తొలిసారి నన్ను చిరంజీవిగా సావిత్రి గారికి పరిచయం చేసుకున్నాను. ఆమె 'శుభం' అన్నారు. ఆ షూటింగ్ జరిగేటప్పుడు ఓ రోజు సావిత్రి గారి ముందు టేప్‌రికార్డర్‌లో పాట పెట్టి డాన్స్ చేశాను. గచ్చుపైన తేమ ఉండడంతో జారి పడ్డాను. కానీ వెంటనే దాన్ని నాగుపాము నృత్యంలా మార్చడం సావిత్రి గారికి బాగా నచ్చింది. నన్ను దగ్గరకు తీసుకొని 'నీ సమయస్ఫూర్తి నచ్చిందోయ్, భవిష్యత్తులో మంచి యాక్టర్‌వి అవుతావు' అని ఆశీర్వదించారు. దాంతో నాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. ఈ పుస్తకావిష్కరణకు వారధిగా నిలిచే అవకాశం ఇచ్చినందుకు చాముండేశ్వరిగారికి ధన్యవాదాలు' అన్నారు.

విజయ చాముండేశ్వరి మాట్లాడుతూ 'చెన్నైలో మా ఎదురింట్లోనే అల్లు రామలింగయ్య గారి కుటుంబం ఉండేది. అప్పటి నుంచే సురేఖ గారితో పరిచయం ఉంది. నన్ను తోడబుట్టిన సోదరిలా చూసుకుంటారు చిరంజీవి. 'నేను ఉదయం లేవగానే సావిత్రమ్మ ఫొటో చూస్తాను' అని ఆయన చెప్పారు. తన బెడ్‌రూంలో ఉన్న ఫొటోను తెప్పించి చూపించారు. 'ఈ పుస్తకావిష్కరణను సింపుల్‌గా కానిచ్చేద్దాం' అని అన్నాను. కానీ అమ్మకు పెద్ద కొడుకు ఉండుంటే ఏం చేసేవాడో ఈ రోజు చిరంజీవిగా గారు అంత గొప్పగా నిర్వహించారు. ఆయనకు ఎలా ధన్యవాదాలు చెప్పాలో తెలియడం లేదు. 'మహానటి' సినిమా వల్ల ఈ తరం పిల్లలు కూడా అమ్మ గురించి మాట్లాడుతున్నారు. అమ్మ జీవితం గురించి చాలా పుస్తకాలు వచ్చాయి. ఆమె నటన గొప్పదనం తెలిపేలా ఈ పుస్తకం ఉంటుంది' అన్నారు. తల్లి సావిత్రితో తన బాల్యస్మృతులను చాముండేశ్వరి గుర్తు చేసుకున్నారు. 'స్కూల్లో పేరెంట్స్ మీటింగ్స్‌కి అమ్మ వచ్చేది కాదు. అమ్మ నాకు జడ వేయడం లేదు అనుకునేదాన్ని. అప్పట్లో నాకు అది అర్థం కాలేదు. రాత్రి అమ్మమ్మతో కలసి బజ్జుంటే పొద్దున్నే లేచేసరికి అమ్మ పక్కలో ఉండేదాన్ని. మా కోసమే అంతలా కష్టపడిందని పెద్దయ్యాక అర్థమైంది. సండే సఫారీ థియేటర్‌లో కార్టూన్ షోలు వేసేవారు. అప్పుడప్పుడూ నన్ను తీసుకెళ్లేవాళ్లు. చీకటి పడ్డాక బీచ్‌కు తీసుకెళ్లేవారు. అక్కడ మమ్మల్ని ఆటపట్టిస్తూ చాలా చిలిపి పనులు చేసేది. అమ్మతో కార్లో వెళ్లేటప్పుడు, కారు మధ్యలో ఆపి పైకెక్కి చింతకాయలు కోసేవాళ్లం. పొలంలో వేరుశనగ కాయలు దొంగతనంగా కోసేది. 'అడిగితే ఇచ్చేవాళ్లం కదమ్మా' అని కావలివాళ్లు అంటే 'ఆ అందులో రుచి ఉండదోయ్' అనేది. ఓసారి సినిమాలో చూసి జంప్ సూట్ నాకూ కావాలని అడిగా 'ఆడపిల్లల శరీరం కనపడకూడదు' అని వద్దంది. తన చీరలతో నాకు హాఫ్ శారీస్ కుట్టించేది. పుదుపోట రాజా దగ్గర నుంచి అమ్మ రెండు పులిపిల్లలను తెచ్చింది. కుందేలు, నెమలి పిల్లలను పెంచేది. అమ్మకు ఆరోగ్యం బాగోకపోవడంతో అత్తకొడుకు గోవిందరావుకు ఇచ్చి 16 ఏళ్లకే నా పెండ్లి చేసింది. అమ్మ కోమాలోకి పోయినప్పుడు 19 నెలలు హాస్పిటల్‌లో ఉంది. ఆ జ్ఞాపకాలు తలుచుకోవడం ఇష్టం లేదు. 'సావిత్రి గారు అన్నీ పోగొట్టారు, పిల్లలకు చిల్లిగవ్వ కూడా విగల్చలేదు అనుకుంటారు కానీ అది నిజం కాదు. ఎన్ని దానధర్మాలు చేసినా నాకూ, తమ్ముడికి లోటు లేని సంపదను ఇచ్చిపోయింది. 'మహానటి' చిత్రంలో ప్రతిదీ నా అనుమతి తీసుకున్న తర్వాతే చేశారు కాబట్టి అందులో తప్పుపట్టటానికేం లేదు' అన్నారు.

సురేఖ మాట్లాడుతూ 'చిరంజీవి గారికి సావిత్రమ్మ అంటే ఎంతో ప్రేమ. అందుకే అంగీకరిస్తారనే నమ్మకంతో ఆయన్ను అడగకుండానే విజయ చాముండిగారికి మాటిచ్చాను. ఇలా వేదికపైన కూర్చోవడం, మాట్లాడడం ఎప్పుడూ చేయలేదు. చాముండి కోసం చేస్తున్నాను. సావిత్రమ్మ గారి గురించి తెలుసుకోవాలనుకున్నాను. అది ఈ రోజు మీ ద్వారా కుదిరింది' అన్నారు.

నా జీవితంలో ఒకే ఒకసారి మా స్నేహితుడి ఇంట్లో సావిత్రిగారిని చూశాను. నటనలో ఆమెకు ఆమే సాటి అని అల్లు అరవింద్ చెప్పారు.

సంజయ్ కిశోర్ మాట్లాడుతూ 'ఆర్టిస్ట్‌గా నేను రాణించడానికి స్ఫూర్తి సావిత్రిగారు. చాముండేశ్వరి గారు పిలిచి ఈ పుస్తకం రాయమని చెప్పారు. పుస్తకావిష్కరణనే కాదు కార్యక్రమ నిర్వహణను కూడా తనపైన వేసుకున్న చిరంజీవి గారికి ధన్యవాదాలు. మహానటి సావిత్రిగారికి చిరంజీవి ఇస్తున్న గొప్ప నివాళి ఈ పుస్తకం' అన్నారు.

ఒక హీరోయిన్‌కు సంబంధించిన కార్యక్రమ నిర్వహణకు హీరో అయిన చిరంజీవిగారు స్వయంగా పూనుకొన్నందుకు చాలా సంతోషంగా ఉందని జయసుధ తెలిపారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమకు వచ్చి ఎన్నో గొప్ప పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించిన సాహసి సావిత్రి అని పరుచూరి గోపాలకృష్ణ తెలిపారు. సావిత్రిగారు మనందరి హృదయాల్లో ఎప్పటికీ జీవించే ఉంటారు అని బ్రహ్మానందం చెప్పారు. సావిత్రిగారితో ఒక్క ఫొటో దిగినా చాలు అనుకునేవాణ్ణి, అలాంటిది ఆమెతో ఏడెనిమిది సినిమాల్లో నటించే అవకాశం దక్కడం నా అదృష్టం అని మురళీమోహన్ అన్నారు.



పుట్టిన రోజున టీజర్

ప్రపంచ వ్యాప్తంగా సినిమా ప్రేక్షకులు ఎదురు చూస్తున్న చిత్రం 'పుష్ప 2' ..ది రూల్. అల్లు అర్జున్ , దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ను ఏప్రిల్ 8న విడుదల చేయనున్నారు. ఆ రోజే అల్లు అర్జున్ పుట్టినరోజు కావడంతో డబుల్ ధమాకా అంటూ అభిమానులు ఆనందంతో పొంగిపోతున్నారు. 2021లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'పుష్ప ది రైజ్' చిత్రం జాతీయస్థాయిలో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా అవార్డ్ తెచ్చి పెట్టింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న 'పుష్ప ది రూల్' చిత్రానికి ఆకాశమంత స్థాయిలో అంచనాలు ఉన్నాయి. వాటిని అధిగమించేందుకు సుకుమార్ అయన టీమ్ విశేషంగా కృషి చేస్తున్నారు. రష్మిక హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి చిత్ర నిర్మాతలు.

ఎన్‌టీఆర్ గ్యారేజీలో మరో ఖరీదైన కారు..!






జూనియర్ ఎన్‌టీఆర్ గ్యారేజీలో మరో ఖరీదైన కారు చేరింది. ఖైరతాబాద్‌లోని ఆర్‌టీఏ కార్యాలయంలో నూతన వాహనం రిజిస్ట్రేషన్ ఇటీవల జరిగింది. మెర్సిడెజ్ బెంజ్ మే బ్యాక్ మోడల్ కారును ఆయన ఇటీవల కొనుగోలు చేశారు. ఈ కారు ధర రూ.3.50 కోట్ల వరకు ఉంటుంది. కార్లు, వాచీలంటే అమితంగా ఇష్టపడే ఎన్‌టీఆర్ వాటి కొనుగోలుపై ఆసక్తి చూపుతుంటాడు. దేవర, వార్-2 చిత్రీకరణలో ఉన్న ఆయన షూటింగ్‌కు బ్రేక్ ఉండడంతో కారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. ఆర్‌టీఏ అధికారులు దగ్గరుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.

సైకలాజికల్ థ్రిల్లర్‌గా బహుముఖం



అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసే హర్షివ్ కార్తీక్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం షూటింగ్ అంతా అమెరికాలోని వివిధ ప్రదేశాల్లో జరిగింది. ఈ నెల 5న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా హర్షివ్ కార్తీక్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'మానసిక అనారోగ్యం ఉన్న ఓ వ్యక్తి ఓ ఆడిషన్‌కు వెళితే అక్కడ అతనికి అవమానం జరుగుతుంది. దాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆ వ్యక్తి ఆ తర్వాత ఏం చేశాడన్న ఇతివృత్తంతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఇటువంటి కథతో ఇంతవరకూ ఏ సినిమా రాలేదు. ఇప్పుడు సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలను ప్రేక్షకులు ఎక్కువగా చూస్తున్నారు. అందుకే ఈ ప్రాజెక్ట్ చేశాను' అని చెప్పారు. 'ఇందులో దాదాపు 40 మంది కొత్త నటీనటులు ఉన్నారు. ప్రతిదీ వర్క్ షాప్ నిర్ణయించి క్లియర్ విజన్‌తో నిర్మించాను. ఖర్చు తగ్గించుకోవాలనే తపనతో చాలా శాఖలు నేనే నిర్వహించాను. పాటలను ఫణి కల్యాణ్ స్వరపరచగా, శ్రీచరణ్ పాకాల నేపథ్య సంగీతం అందించారు' అని తెలిపారు హర్షివ్ కార్తీక్. తదుపరి చిత్రం కోసం ఓ యాక్షన్ డ్రామా రాసుకున్నాననీ, ఇన్ని శాఖలు కాకుండా ఏదో ఒక దాని మీదే దృష్టి పెడతానని ఆయన చెప్పారు.

లెజెండరీ కోచ్ జీవితకథగా...



భారతదేశంలో మోడరన్ ఫుట్‌బాల్ విప్లవానికి నాంది పలికిన లెజెండరీ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవిత కథగా వస్తున్న చిత్రం 'మైదాన్'. అజయ్ దేవ్‌గణ్ ఇందులో కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ పాత్రను పోషిస్తున్నారు. భారతీయ ఫుట్‌బాల్ రంగానికి స్వర్ణయుగంగా చెప్పుకునే పదేళ్ల కాలంలో (1952-1962) జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. దేశంలో మోడరన్ ఫుట్‌బాల్ అటకు ఆద్యుడిగా, నేషనల్ ఫుట్‌బాల్ టీమ్ కోచ్‌గా, మేనేజర్‌గా అబ్దుల్ రహీమ్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలను, ఆయన ఎదుర్కొన్న సవాళ్లను ఈ చిత్రంలో చూపించనున్నారు. మంగళవారం కథానాయకుడు అజయ్ దేవ్‌గణ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం 'మైదాన్' ఫైనల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఫుట్‌బాల్ రంగంలో ఇండియా టీమ్ చరిత్రను ఎలా తిరగరాసిందో తెలిపే ఈ బయోపిక్‌కు అమిత్ రవీంద్రనాథ్‌శర్మ దర్శకత్వం వహించారు. ప్రియమణి, గజ్‌రాయ్ రావు, రుద్రనీల్ ఘోశ్ కీలక పాత్రలు పోషించారు. ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించారు. బోనికపూర్ నిర్మించిన 'మైదాన్' ఈ నెల 10న విడుదలవుతోంది.



జీవి ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యరాజేశ్ జంటగా నటించిన చిత్రం 'డియర్'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. ఈ చిత్రం తమిళంలో 11న, తెలుగులో 12న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'భలే వెడ్డింగ్' సాంగ్‌ను విడుదల చేశారు. ఈ అట్రాక్టివ్ వెడ్డింగ్ సాంగ్‌కు జీవి ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. రాకేందు మౌళి లిరిక్స్ రాశారు. నారాయణన్ రవిశంకర్, సింధూరి విశాల్ ఆలపించారు. ఈ చిత్రంలో కాళివెంకట్, ఇళవరుసు, రోహిణి, తలైవాసల్ విజయ్, గీతా కైలాసం కీలక పాత్రలలో నటిస్తున్నారు.


'పడమటి సంధ్యారాగం' చిత్రానికి సీక్వెల్

విజయశాంతి ప్రధాన పాత్రను పోషించిన చిత్రం 'పడమటి సంధ్యారాగం'. జంధ్యాల దర్శకత్వంలో పూర్తిగా అమెరికా నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఆ సినిమా 1987 ఏప్రిల్ 11న విడుదలై విజయం సాధించింది. ప్రవాసాంధ్రులు గుమ్మలూరి శాస్త్రి, మీర్ అబ్దుల్లా కలసి ఈ సినిమా నిర్మించారు. ఇన్నేళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్ వస్తుండడం విశేషం. ఆ చిత్ర నిర్మాతలలో ఒకరు, అందులో విజయశాంతి బాబాయిగా నటించిన మీర్ అబ్దుల్లా ఈ సీక్వెల్‌ను స్వీయ దర్శకత్వంలో నిర్మించనున్నారు. ఈ చిత్రం వివరాలను ఆయన చిత్రజ్యోతికి ప్రత్యేకంగా వివరిస్తూ "పడమటి సంధ్యారాగం' చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉండడమే కాకుండా జంధ్యాలగారి దగ్గర దర్శకత్వంలో మెళకువలు నేర్చుకున్నాను. ఈ సినిమాకు సీక్వెల్ తీయాలనే ఆలోచన గుమ్మలూరి శాస్త్రిగారికి, నాకూ చాలా కాలంగా ఉంది. ఈ నిర్మాణ సన్నాహాల్లో ఉండగా ఆయన మరణించడంతో ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు నడిపించాలని నిర్ణయించుకున్నాను. తెలుగు రాష్ట్రాల్లోనే ఈ చిత్ర నిర్మాణం జరుగుతుంది. 'పడమటి సంధ్యారాగం' చిత్రంలో విజయశాంతి తప్ప మిగిలిన పాత్రలలో దాదాపు అందరూ కొత్తవారే నటించారు. సీక్వెల్‌లో కూడా కొత్త నటీనటులకు అవకాశం ఇవ్వాలనుకుంటున్నా. కామెడీ ఎంటర్‌టైనర్‌గా సినిమాను రూపొందిస్తాం. జులైలో చిత్ర నిర్మాణం మొదలు పెట్టాలనుకుంటున్నా. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాక షూటింగ్ తేదీ వెల్లడిస్తా' అన్నారు.



తొలి తెలుగు కామెడీ కిడ్ స్టార్ విశ్వేశ్వరరావు ఇక లేరు

ప్రముఖ హాస్య నటుడు జి.విశ్వేశ్వరరావు (64) కన్నుమూశారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ వచ్చిన ఆయనకు సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్లు ఆయన పెద్ద కుమార్తె భార్గవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆయన అంత్యక్రియలను మంగళవారం పూర్తి చేశారు. ఆయనకు భార్య వరలక్ష్మి, కుమార్తెలు భార్గవి, పూజ ఉన్నారు. తమిళం, తెలుగు భాషల్లో దాదాపు 350కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన స్వస్థలం కాకినాడ. 1967లో చెన్నైకు వచ్చిన ఆయన బాల నటుడుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. మాస్టర్ రాము, బేబి రాణి, మాస్టర్ ప్రభాకర్ వంటి బాల నటులు ఎక్కువ సినిమాల్లో నటిస్తూ పేరు తెచ్చుకుంటున్న తరుణంలో ప్రవేశించిన మాస్టర్ విశ్వేశ్వరరావు కొద్ది కాలంలోనే తన ప్రతిభ చాటుకున్నారు. ఆ రోజుల్లో ఎన్టీఆర్, ఏయన్నార్, కాంతారావు,



హరనాథ్, జగ్గయ్య వంటి వారు హీరో పాత్రలు చేస్తుంటే రేలంగి, పద్మనాభం, చలం, రాజబాబు హాస్య పాత్రలు పోషించేవారు. ఈ హాస్య నటుల చిన్నప్పటి వేషాలు విశ్వేశ్వరరావు వేసేవారు. బాల తారలతో తీసిన 'బాల భారతం'లో విశ్వేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. తెలుగు సినిమాల వరకూ తొలి కామెడీ కిడ్ స్టార్ ఈయనే. చిన్నప్పుడు హాస్య నటుడిగా ఎంత పేరు తెచ్చుకున్నారో పెరిగి పెద్దయ్యాక ఆ స్థాయిలో గుర్తింపు పొందలేక పోయారు. 'ముఠామేస్త్రి', 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం', 'ఆయనకు ఇద్దరు', 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి', 'రిక్షావోడు' వంటి చిత్రాల్లో ఏవో చిన్న వేషాలు వేశారు కానీ పూర్తి స్థాయి కమెడియన్‌గా ఆయన నిలదొక్కుకోలేక పోయారు. సినిమాల్లోనే కాకుండా, అనేక టీవీ సీరియల్స్‌లో కూడా విశ్వేశ్వరరావు నటించారు.. అవకాశాలు తగ్గిన సమయంలో సొంతంగా 'విస్సు టాకీస్' పేరుతో యూ ట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తూ తన అనుభవాలను వివరించేవారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

అయితే ఎర్న్... లేకపోతే లెర్న్

'నాకు చిన్నప్పటి నుంచి ఈ గ్లామర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాలని కోరిక. మంచి కథ దొరకడంతో 'భరతనాట్యం' చిత్రంతో నిర్మాతగా మారా. మావారు హితేష్, సూర్యతేజ జిమ్‌లో ఫ్రెండ్స్. తన దగ్గర ఉన్న కథని మావారికి చెప్పారు. ఆయనకు కథ నచ్చింది. సినిమా తీద్దామా అని నన్ను అడగడంతో సరేనన్నా. అలా ఈ సినిమా మొదలైంది' అన్నారు మహిళా నిర్మాత పాయల్ సరాఫ్. సూర్యతేజని హీరోగా పరిచయం చేస్తూ నిర్మించిన 'భరతనాట్యం' చిత్రం ఈ నెల 5న విడుదలవుతుండడంతో పాయల్ మీడియాతో ముచ్చటించారు.



'దర్శకుడు కావాలని ప్రయత్నించే యువకుడి కథ ఇది. ఫ్యామిలీ, లవ్ లైఫ్ నుంచి సమస్యలు ఎదుర్కొంటూ అనుకోకుండా క్రైమ్ వరల్డ్‌కి వెళ్లి, అక్కడి నుంచి ఎలా బయటపడ్డాడనేది ఈ చిత్రకథ. మంచి కంటెంట్‌తో పాటు అద్భుతమైన నటీనటులు ఈ చిత్రంలో నటించారు. ఇక్కడ ఎర్న్ చేస్తాను, లేదా లెర్న్ చేస్తాను అనుకుని ఈ పరిశ్రమలోకి అడుగుపెట్టా. అనుకున్న బడ్జెట్‌లోనే సినిమా పూర్తి చేశాం. అందరూ సపోర్ట్ చేశారు' అని చెప్పారు పాయల్.

'కథ రాస్తున్నప్పుడే ఈ సినిమాకు మహేంద్ర దర్శకుడైతే బాగుండునని సూర్య అనుకున్నారు. ఆ తర్వాత కాస్టింగ్ అంతా డైరెక్టర్‌గారే చూసుకున్నారు. అయితే తను హీరోగా చేయాలని సూర్యతేజ మొదట అనుకోలేదు. ఈ పాత్రకు కొత్త నటుడు కావాలి కనుక ఆయన్ని ఎంపిక చేశారు. నిజానికి ఇది హీరో బేస్డ్ సబ్జెక్ట్ కాదు. నటీనటులంతా కథలో భాగం అవుతారు' అని వివరించారామె.





జాతీయోద్యమ చరిత్రలో మరుపురాని, మరువలేని వ్యక్తి డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య. వందేళ్ల కిందటే ఆంధ్రా బ్యాంకు, సహకార బ్యాంకు, బీమా కంపెనీ తదితర సంస్థలను నెలకొల్పిన దార్శనికుడు ఆయన. ఆంధ్రుల అస్తిత్వ చిహ్నమైన ఆంధ్రాబ్యాంకుకు వందేళ్లు పూర్తి అయింది. ఇప్పుడు ఆ పేరు చరిత్రగా మిగిలినా... భారత జాతీయ కాంగ్రెస్‌లో చరిత్ర సృష్టించిన 'తెలుగోడు'గా పట్టాభి సీతారామయ్య ఖ్యాతి చిరస్మరణీయం. ఆయన మనుమరాలు మారెళ్ల శారద చెబుతున్న తాతయ్య జ్ఞాపకాలు 'నవ్య'కు ప్రత్యేకం...

అది అన్యాయం... అయినా
ఆయన పేరు చరితార్థం

"తెలుగువారి అస్తిత్వానికి చిహ్నమైన 'ఆంధ్రా బ్యాంకు' చరిత్రగా మిగిలిపోవడాన్ని తలచుకున్నప్పుడు... దాని వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యకు మనుమరాలిగా నా హృదయం మెలిపెట్టినట్టుంటుంది. నాదే కాదు, ఆయన మనుమలు, మనుమరాళ్ళగా... మా అందరిదీ ఇదే భావన. కోఠిలోని ఆంధ్రా బ్యాంకు ప్రధాన కార్యాలయం ముందు ఇప్పుడు యూనియన్ బ్యాంకు హోర్డింగ్ చూస్తున్నప్పుడల్లా నా మనసు విలవిలలాడిపోతుంది. అదీ ప్రతిష్టాత్మక బ్యాంకుకు వందేళ్లు పూర్తికావడానికి కొద్ది నెలలు ముందు విలీనం చేసి అన్యాయంగా వ్యవహరించారు. అప్పుడు మమ్మల్ని చాలామంది పోరాడమన్నారు. కానీ మనమంతా కలిసి పోరాడదామన్నవాళ్లు లేరు. అయితే బ్యాంకు సిబ్బంది మాత్రం 'విలీనం చేసినా కనీసం ఆంధ్రా బ్యాంకు పేరు అలానే ఉంచాలి' అని ఉద్యమించినా లాభం లేకపోయింది. బహుశా ఉత్తరాది వారికి దక్షిణాది వారి భావోద్వేగాలు అంత ముఖ్యం కాదేమో! లేదంటే, మనకే మన ప్రాంతీయ అస్తిత్వం పట్ల శ్రద్ధ తక్కువైనా అయిుండవచ్చు. అసలు ఈ ప్రాంతీయ తారతమ్యాలు ముందు నుంచి దేశంలో ఉన్నాయనిపిస్తోంది. జాతీయ కాంగ్రెస్‌లో ముఖ్య పాత్ర పోషించిన తాతయ్య దక్షిణాది వ్యక్తి కావడంవల్లే... జాతీయోద్యమ కాంగ్రెస్‌లో ఉత్తరాది నాయకులకు లభించినంత గుర్తింపు, గౌరవం ఆయనకు దక్కలేదు. కనీసం ఆంధ్రులమైనా ఆ మహానుభావుడిని సముచితంగా గౌరవించుకుంటున్నామా? అంటే అదీ లేదు కదా! అయినా, ఆయన రాసిన 'భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర' అత్యంత ప్రామాణికం కనుక, అలా మా తాతయ్య పేరు చరితార్థం.

> తాతయ్య మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో ఒక రోజు రాజ్‌భవన్ సిబ్బంది క్వార్టర్స్ గోడలు బీటలు వారి కూలిపోయేట్టు ఉండటం గమనించారట. ఆ వెంటనే వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి లేఖ రాస్తే... రోజులు గడుస్తున్నా అవతలి నుంచి సమాధానం రాలేదు. దాంతో రాజ్‌భవన్ ప్రాంగణంలోని గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను కొట్టించి... అవి వేలం వేయగా వచ్చిన సొమ్ముతో క్వార్టర్స్ గోడలు బాగుచేయించారు. పట్టాభి సీతారామయ్యగారి వ్యవహార శైలికి ఇదొక చిన్న ఉదాహరణ. ఆంధ్రాబ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీ, కృష్ణా సహకార బ్యాంకులాంటి సంస్థలెన్నింటినో తాతయ్య స్థాపించారు. వాటన్నిటిలో మన మాతృభాష తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాలని ఆదేశించారు. ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ప్రధాన మద్దతుదారుగా ఉండడం వల్లే తాతయ్య పట్ల ఆనాటి ఒకరిద్దరు జాతీయ స్థాయి పెద్ద నేతలు కినుకవహిస్తుండేవారని కూడా విన్నాను.

మనుమలంటే మురిపెం...

తాతయ్యకు మనుమలంటే మహామురిపెం. మా పెద్దనాన్న వెంకటరత్నానికి ఎనిమిదిమంది సంతానం. మా మేనత్త కామేశ్వరికి నలుగురు పిల్లలు. ఆమె పెద్ద కూతురును రాయప్రోలు సుబ్బారావుగారి అబ్బాయికి, చిన్న కూతురును దేవులపల్లి కృష్ణశాస్త్రి గారబ్బాయికి ఇచ్చి పెళ్లి చేశారు. మా నాన్న రాధాకృష్ణకు మేము ఏడు మందిమి. అలా 1940నుంచి ఏడాదికి ఒకరు నట్టింట ఊయలలో మనుమరాలు లేదంటే మనుమడు ఉండడాన్ని చూసి తాతయ్య తెగ సంబరపడేవారు. కోడళ్లను చాలా బాగా చూసుకునేవారు. హైదరాబాద్‌లో మొదట గడ్డిఅన్నారంలో ఉండేవారట. "మగవాళ్లు ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి చేరతారు, అప్పటి వరకు ఊరి చివర పిల్లలతో



ఉండటం భయంగా ఉంటుంది కదా!" అని మా అమ్మ అనగానే... హిమాయత్ నగర్‌లో ఇల్లు కొన్నారు. అదీ కోడలి మాటలకు ఆయన ఇచ్చిన విలువ. పట్టాభి సీతారామయ్య గారి మనుమలమంతా వేడుకలు, ప్రత్యేక సందర్భాలలో కలుస్తుంటాం. ఉద్యోగరీత్యా తలా ఒకచోట స్థిరపడినా... తాతయ్య కోరుకున్నట్టు మేమంతా ఒక్కటిగా కలిసిమెలిసి ఉంటాం.

బంగారు కరవాలం బహూకరణ...

నేను పట్టాభి సీతారామయ్యగారి చిన్న కుమారుడు రాధాకృష్ణ కుమార్తెను. తాతయ్య కన్నుమూసేనాటికి నాకు రెండేళ్లు. మధ్యప్రదేశ్ గవర్నర్‌గా పదవీకాలం ముగిసిన నాటి నుంచి చనిపోయే వరకు తాతయ్యతో పాటు మేము హిమాయత్‌నగర్‌లో కలిసున్నాం. పెద్దనాన్నగారి కుటుంబమంతా చెన్నైలో ఉండేవారు. తాతయ్య జ్ఞాపకాలు నాకు గుర్తు లేకున్నా అమ్మా నాన్న ఎప్పుడూ చెబుతుండేవారు. నన్ను భుజాన వేసుకొని వసారాలో తిరుగుతూ... 'శారద నీరదేందు ఘనసార...' అంటూ పోతన భాగవత పద్యం పాడుతూ ఆడిస్తుండేవారట. మా పెద్దక్కయ్య సుదక్షిణాదేవి తాతయ్య వెంట తరచుగా వెళుతుండేవారు. కొన్నాళ్ళ కిందట ఆమె చనిపోయారు. తాతయ్య జైలుజీవితం సమయంలో ఆయనకు వచ్చిన ఉత్తరాల వెనుక భాగంలో కొన్నివ్యాసాలు రాసుకున్నారు. వాటన్నిటిని నాన్న భద్రపరిచారు. ఇంగ్లండ్‌కు చెందిన రాజనీతిశాస్త్ర పరిశోధకురాలు జేన్స్ ఒకరోజు మా ఇంటికొచ్చి వాటిని ఇవ్వాల్సిందిగా కోరితే... నా చేతులమీదగా ఆమెకు ఇచ్చాను. తర్వాత వాటిని ఢిల్లీలోని నెహ్రూ స్మారక మ్యూజియంకు అప్పగించినట్టు తెలిసింది. అరబ్ రాజు తాతయ్యకు బంగారు కరవాలాన్ని బహూకరించారు. దాన్ని తాతయ్య మరణానంతరం పబ్లిక్ గార్డెన్స్‌లోని హెల్త్ మ్యూజియానికి మా నాన్న అప్పగించారు. అయితే, ఇప్పుడు అది ప్రదర్శనశాలలో కనిపించడంలేదు. దాని గురించి అడిగితే... మ్యూజియం బాధ్యులు తెలియదంటున్నారు.

ప్లీడరు కాదు డాక్టరు...

తాతయ్య చిన్నతనంలోనే ఆయన తండ్రి చనిపోవడంతో తీవ్రమైన పేదరికాన్ని అనుభవించారు. చాలారోజులు ఒంటిమీద చొక్కా లేకుండానే స్కూలుకు వెళ్లారు. వీధి లైటుకింద చదువుకున్నారు. అలాంటి తాతయ్యకు నాయనమ్మ రాజేశ్వరితో పరిణయం... ఆయన జీవితాన్ని మార్చింది. కాకినాడలో గంజాం వెంకటరత్నం పంతులు గారని బాగా పేరు, డబ్బున్న వకీలు. ఆయన ఒక్కగానొక్క కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తూ... 'బాగా తెలివైనవాడు, అందమైనవాడు, పేదవాడు అయిన అబ్బాయిని చూసిపెట్టమ'ని తన స్నేహితుడు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారితో చెప్పారట. దాంతో ఆయన బందరు నోబుల్ కాలేజీలో తన ప్రియ శిష్యుడైన పట్టాభి సీతారామయ్యను సూచించారట. అలా తాతయ్య గంజాం వెంకటరత్నంగారి అల్లుడయ్యారు. తనలాగే అల్లుడు కూడా వకీలు అవ్వాలని 'లా' చదవమని అంటే... 'అబద్ధం ఆడకుండా ప్లీడరుగా పైకిరావడం సాధ్యమేనా?" అని ప్రశ్నించారట. "అది కుదరని పని" అని మామగారి నుంచి బదులు రావడంతో... తాతయ్య మెడిసిన్‌లో చేరారు. తర్వాత మచిలీపట్నంలో ఐదేళ్ల ప్రాక్టీసుకూడా చేశారు. బందరులో మా ఇంటికి గాంధీగారు వచ్చారని, మా ఇంటిలో బసచేశారని మా అమ్మ చెబుతుండేవారు.

ఇప్పటికీ ఆచరిస్తున్నాం...

చిన్నప్పటి నుంచి డబ్బు విలువ తెలిసిన తాతయ్య మనుమలు, మనుమరాళ్ళతో రోజూ జమాఖర్చులు రాయించేవారట. అప్పుడప్పుడు వాళ్ళందరినీ మెరీనా బీచ్‌కు తీసుకెళ్లి ఒక్కొక్కరికీ ఒక్కో చాక్లెట్ ఇచ్చేవారట. అది తిన్న తర్వాత కాగితం మాత్రం ఇంటికొచ్చి చెత్తబుట్టలోనే వేయాలి. అదీ ఆయన నేర్పిన క్రమశిక్షణ. భోజనాల సమయంలోనూ పిల్లలం ఎవరిమైనా కంచంలో అన్నం మిగిల్చితే... "అదే వాళ్ళకు సాయంత్రం పెట్టండి" అని సున్నితంగా మందలించేవారట. ఇలా తాతయ్య మా వాళ్ళకు చెప్పినవీ, వారి నుంచి నేను విన్నవీ ఇప్పటికి కూడా ఆచరించడానికి ప్రయత్నిస్తున్నాం. తాతయ్య చివరి రోజుల్లో... నిత్యం సాయంత్రం ఆయనను పీవీ నరసింహారావు, నీలం సంజీవరెడ్డి లాంటి పెద్దలు ఇంటికి వచ్చి కలిసేవారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ తాతయ్యను చూడకుండా వెళ్లేవారు కాదు. ఇలా తాతయ్య జ్ఞాపకాలు బోలెడు. అవి మాకు ఎంతో అపురూపమైనవి, విలువైనవి. తాతయ్య కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదు ఒక దార్శనికుడు. వందేళ్ళ కిందట బ్యాంకులు, బీమా సంస్థ నెలకొల్పడమంటే మాటలా! అలాంటి మహనీయుణ్ణి ప్రస్తుతం సమాజం మరవడం బాధాకరం. భోగరాజు పట్టాభి సీతారామయ్య మనుమలుగా మాకు గుర్తింపు అక్కర్లేదు. చరిత్రలో ఆయనకు ఇవ్వాల్సిన స్థానాన్ని, దక్కాల్సిన గౌరవాన్ని ఆయనకు ఇస్తే చాలు."

• సాంత్వన్

నేతాజీకి పట్టాభి సలహాలు

రాజకీయ పదవులకు మొదటి నుంచి తాతయ్య చాలా దూరం. బాబూ రాజేంద్రప్రసాద్ గారి ఒత్తిడి మేరకు మధ్యప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత అవకాశాలు వచ్చినా మరే పదవీ స్వీకరించలేదు. అంతకుముందు చక్రవర్తి రాజగోపాలాచారి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రి పదవి ఇస్తానన్నా తాతయ్య తిరస్కరించారు. భారత జాతీయ కాంగ్రెస్‌కు 1939 నాటి అధ్యక్ష ఎన్నికల్లో గాంధీ మాట కాదనలేక నేతాజీకి ప్రత్యర్థిగా పట్టాభి సీతారామయ్య పోటీ చేసిన సంగతి తెలిసిందే! అప్పుడే 'పట్టాభి ఓటమి నా ఓటమి' అని గాంధీ ప్రకటించారు. అయితే ఆ ఎన్నికల తర్వాత కూడా నేతాజీతో తాతయ్య స్నేహం పూర్వంలాగే కొనసాగింది. అదే సమయంలో నేతాజీ అనారోగ్యానికి లోనయ్యారని తెలియగానే తాతయ్య వెళ్లి పరామర్శించారు. ఒక వైద్యుడిగా కూడా బోస్‌కు సూచనలు ఇచ్చారని నాకు మా నాన్న చెప్పారు.


నేతాజీతో పట్టాభి సీతారామయ్య

కూల్ కూల్ కాటన్

తేలికగా, మెత్తగా, సౌకర్యంగా ఉండే కాటన్ చీరలను ఇష్టపడని వాళ్లుండరు. మరీ ముఖ్యంగా వేసవి వేడిని భరించడానికి ఈ చీరలెంతో అనువుగా ఉంటాయి కాబట్టే మహిళల మనసు కాటన్ శారీస్ మీదకే మళ్లుతూ ఉంటుంది. అలాంటి కొన్ని సమ్మర్ శారీస్ మీద ఓ లుక్కేద్దామా..!



లినెన్ కాటన్

మెత్తగా, ఒంటికి హత్తుకుపోయే ఈ కాటన్ శారీస్ తాజా ట్రెండ్‌గా మారింది. వెండి, బంగారు జరీ అంచుతో ఆకర్షణీయమైన డిజైన్లతో, రంగులతో మనసును కట్టిపడేసే ఈ చీరలు ఈవినింగ్ పార్టీలకు, చిన్నపాటి వేడుకలకు కూడా ధరించవచ్చు. సింపుల్ జ్యూవెలరీతో ఈ శారీని జత చేస్తే, నలుగురిలో హుందాగా కనిపించవచ్చు.



ఫ్యాషన్

ప్రింటెడ్ కాటన్

పూలు, లతలు, జామెట్రీ డిజైన్లతో ఆకర్షణీయమైన రంగుల్లో దొరికే ప్రింటెడ్ కాటన్ శారీస్ అందరికీ నప్పుతాయి. అయితే నాణ్యమైన కాటన్ అయితే రంగులు వెలసిపోకుండా ఉంటాయి. ఫ్యాబ్రిక్ కూడా ఎక్కువ కాలం మన్నుతుంది. కాబట్టి దర ఎక్కువే అయినా నాణ్యత కలిగి ఉన్న కాటన్ శారీస్‌నే ఎంచుకోవాలి.



కలంకారి

ఈ చీరల ప్రత్యేకత గురించి తెలియని మహిళలుండరు. అరుదైన డిజైన్లు, అందమైన రంగులు కలిగి ఉండే కలంకారి చీరలు ఎప్పటికీ వన్నె తరగవు. ఇటుక, మెరూన్, పసుపు రంగులను కలిగి ఉండే కలంకారి చీరలు రెట్టింపు ఆకర్షణీయంగా ఉంటాయి. కాంట్రాస్ట్ కలర్స్ కలిగి ఉండే కలంకారి చీరలను ఎంచుకుంటే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ మీరే అవుతారు. చీరకు తగిన బ్లౌజ్ ధరించడం కూడా ముఖ్యమే కాబట్టి, బ్లౌజ్ డిజైన్ మీద ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.



ఎముకలు ఆరోగ్యంగా...

● వేసవిలో వచ్చే ఈ లిచి పండులో అధికంగా కేలరీలుంటాయి. పండుతో పాటు జ్యూస్ రూపంలో వీటిని తీసుకోవచ్చు. వంద గ్రాముల లిచిలు తీసుకుంటే 66 కేలరీలుంటాయి. ఇందులో ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు అధికంగా ఉంటాయి.

● విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ వీటిలో పుష్కలం.

● బ్లడ్ ప్రెషర్‌ను నియంత్రిస్తుంది. తద్వారా గుండె సమస్యలు దరిచేరవు. ముఖ్యంగా ఫ్రీరాడికల్స్ వల్ల కణాలకు డ్యామేజ్ కాకుండా నిరోధించే లక్షణం వీటికి ఉంది. ఇందువల్ల క్యాన్సర్ లక్షణాలు వచ్చే అవకాశాలు తక్కువ.

● వేసవిలో ఫ్లూ లక్షణాలుంటే ఈ పండ్లు తినటం వల్ల తగ్గిపోతాయి. ముఖ్యంగా నొప్పులు తగ్గుతాయి.

● విటమిన్- ఇ ఉండటం వల్ల చర్మ రక్షణకు మేలు కలుగుతుంది. స్కిన్ ఇన్‌ఫెక్షన్లు పోతాయి.

● మాంగనీస్, కాపర్ ఉండటం వల్ల ఎముకల గట్టిదనానికి ఉపయోగపడతాయివి.

● ఉదయంపూట లిచిపండ్లను తింటే రిఫ్రెష్‌గా ఉండటంతో పాటు టెన్షన్ తగ్గుతుంది.

మార్పునకు మార్గదర్శి

జర్నలిస్ట్‌గా జనం సమస్యలను ఎత్తిచూపుతారు. సామాజిక కార్యకర్తగా వాటికి పరిష్కారాలూ చూపిస్తారు. అమ్మ వెంట ఆవుల్ని మేపుతూ తిరిగిన రోజుల నుంచీ... తాజాగా 'ఫోర్బ్స్ ఇండియా- ఉమెన్ పవర్' జాబితాలో స్థానం సంపాదించుకొనే వరకూ... 34 ఏళ్ల జయంతి బురుడా జీవితంలో అనేక మలుపులు. ఒడిశాలోని మారుమూల పల్లెలో ప్రారంభమైన ఆమె ప్రయాణం ఇప్పుడు ఎందరో బాలికలకు స్ఫూర్తి మంత్రం.

జయంతి బురుడా స్వగ్రామం ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలోని సెర్పల్లి గ్రామం. సామాన్య గిరిజన కుటుంబంలో... పదకొండుమంది తోబుట్టువుల్లో తొమ్మిదో బిడ్డగా జన్మించారు జయంతి బురుడా. "మా ఊరి చుట్టూ ఉన్న అడవిలోకి వెళ్ళి ఆవుల్ని మేపడం, కట్టెలు సేకరించడం, మహువా పూలను ఏరడం... ఇదీ బాల్యంలో నా దినచర్య. ఆరేళ్ళ వయసులో నన్ను బడిలో చేర్చారు. చదువు మీద నాలో ఆసక్తి పెరగడానికి కారణం... ఇక్కడ ఉన్న ఇద్దరు టీచర్లు. సబ్జెక్ట్స్ అన్నీ వాళ్ళే బోధించేవారు" అని నాటి రోజులను గుర్తు చేసుకున్నారు జయంతి. అక్కడ డ్రాపవుట్స్ చాలా ఎక్కువగా ఉండేవి. ఆడపిల్లలు ఏడో క్లాసు దాటడం అరుదే. కానీ జయంతి పట్టుదలగా చదివారు. ఆ స్కూల్ నుంచి పదో క్లాసులో పదిమంది పాసైతే... బాలిక ఆమె ఒక్కరే. ఆ తరువాత మల్కన్‌గిరిలో ఆమె కాలేజీ చదువు సాగింది. అక్కడే సామాజిక సేవ పట్ల ఆమెకు ఆసక్తి కలిగింది. మురికివాడల్లోని కూలీల పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో కార్యకర్తగా చేరారు. "మన సమాజంలో రకరకాల వివక్షలు ఉన్నాయి. కొన్ని పైకి కనిపిస్తాయి. మరికొన్ని కనిపించకుండా బాధ పెడతాయి. సామాజిక సేవలో దిగాక... పురుషాధిక్యత ఎలా ఉంటుందనేది తొలిసారిగా రుచి చూశాను. అత్యున్నత స్థానంలో ఉన్నవారు నా ప్రశ్నలకు కానీ, విజ్ఞాపనలకు కానీ ఏమాత్రం స్పందించేవారు కాదు. కంటితుడుపు పనుల వల్ల ప్రయోజనం ఏమిటనిపించేది. అలాంటి అనుభవాలు కొన్నిటిని ఎదుర్కొన్న తరువాత... జర్నలిజం చదవాలని నిర్ణయించుకున్నాను. 'అప్పుడు నా మాటలకు వాళ్ళు స్పందిస్తారు, నన్ను గౌరవిస్తారు, తప్పు చేస్తే నిలదీస్తానని భయపడతారు' అనుకున్నాను" అని చెబుతారు జయంతి. "మల్కన్‌గిరిలో డిగ్రీ అయ్యాక కొరాపుట్ సెంట్రల్ యూనివర్సిటీలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశాను. భువనేశ్వర్‌లో ఫిలిమ్‌మేకర్, జర్నలిస్ట్ బీరేన్‌దాస్ స్టూడియోలో నెలరోజులు ఇంటర్న్‌షిప్ చేశాను. కెమేరాను హ్యాండిల్ చెయ్యడం, ఇంటర్వ్యూలు నిర్వహించడం, ఎడిటింగ్ లాంటివి అక్కడ నేర్చుకున్నాను. ఆ శిక్షణ నా వృత్తి జీవితానికి పునాదిగా నిలిచింది" అన్నారామె.



తరువాత భువనేశ్వర్‌లోని ప్రాంతీయ వార్తా ఛానెల్‌లో చేరారు జయంతి. అక్కడ ఎన్నో చేదు అనుభవాలు ఎదురైనా... సహనంతో భరించారు. "ఆ సమయంలో... వివిధ దశల్లో స్నేహితులు నన్ను అన్ని విధాలా ఆదుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైనప్పుడు 'పికిల్ జార్ మీడియా' వ్యవస్థాపకురాలు, సీతఃఓ వాసంతి హరిప్రకాశ్ పరిచయం అయ్యారు. ఆమె ఒక సభలో మాట్లాడుతూ "ఒడిశాలోని మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన మహిళ చదువుకోవడం అంత సులువుకాదు. అలాంటిది.. తన తెగలోనే కాదు.. తన జిల్లాలోనూ తొలి మహిళా జర్నలిస్ట్ కావడం, సమాజ శ్రేయస్సు కోసం తపించడం గొప్ప విషయం" అన్నారు. ఆ మాటలు నాకు జీవితానికి సరిపడేంత ప్రేరణ ఇచ్చాయి" అంటారు జయంతి. ఆ తరువాత వివిధ మీడియా సంస్థల్లో ఆమె పని చేశారు. 2017లో.. 'ఎన్‌డబ్ల్యూఎంఐ ఫెలోషిప్ ఫర్ ఉమెన్ జర్నలిస్ట్స్' ఆమెకు లభించింది. అది అందుకున్న తొలి వ్యక్తి జయంతే. "నేను జర్నలిస్ట్ కావడం మా ఇంట్లో ఎవరికీ ఇష్టం లేదు. నా అక్కచెల్లెళ్ళు పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే జీవితానికి భద్రత ఉంటుందని వాళ్ళ నమ్మకం. కానీ సామాజికంగా నాకు గట్టి మద్దతు దొరికింది. ఎక్కడికి వెళ్ళినా గ్రామస్తులు నన్ను సాదరంగా ఆహ్వానించేవారు. వారి సమస్యలను మీడియా ద్వారా హైలైట్ చేయడం దీనికి కారణం" అని చెప్పారు జయంతి.

అదే సవాల్: జర్నలిస్ట్‌గా ప్రజల సమస్యలను మీడియా ద్వారా వివరిస్తున్నా.. వాటి పరిష్కారం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుండడం ఆమెను బాధించింది. మార్పుకు తనే శ్రీకారం చుట్టాలనుకున్నారు. నెలసరి సమయంలో పాటించాల్సిన శుభ్రతా చర్యల గురించి మహిళల్లో, విద్యార్థినుల్లో అవగాహన కల్పించడం కోసం మరికొందరు యువతులతో కలిసి 2019 నుంచి మల్కన్‌గిరి జిల్లాలో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. దీనిలో భాగంగా ఈ ఏడాది జనవరిలో 'శానిటరీ నేప్‌కిన్ బ్యాంక్' ఏర్పాటు చేశారు. 'బడా దాదీ యూనియన్' పేరిట మహిళల కోసం ఒక సంస్థను నెలకొల్పారు. దాని ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అయిదేళ్ళలో 'బడా దీదీ యూనియన్' జిల్లాలోని ఏడు బ్లాక్‌లకూ విస్తరించింది. "పలు గ్రామాలకు చెందిన బాలికలు తమకోసం శానిటరీ నేప్‌కిన్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అయితే దానికోసం సొంత మిషన్లు, మెటీరియల్ కావాలి. అదే విధంగా మేము ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో... వేసవి సెలవుల్లో పిల్లలు చదవడానికి మరిన్ని పుస్తకాలు కావాలి. ఈ పనులన్నిటికీ నిధులు సమకూర్చడమే మా ముందున్న సవాల్" అంటారు జయంతి. తన దగ్గర శిక్షణ పొందుతున్న బాలికలు... తను కోరుకొనే మార్పునకు సారథులు కావాలనేది ఆమె కోరిక.

సాధికారత కోసం 'జంగిల్ రాణి'

కిందటి ఏడాది మేలో ఆమె ప్రారంభించిన 'జంగిల్ రాణి' కార్యక్రమం బాలికా సాధికారత దిశగా పెద్ద అడుగు. జిల్లా స్థాయిలో బాలికలను ఎంపిక చేసి జర్నలిజంలోని ప్రధాన అంశాల్లో జయంతి శిక్షణ ఇస్తున్నారు. అటవీ చట్టాలు, గిరిజనుల జీవితం, సంస్కృతి, సంప్రదాయాల మీద అవగాహన కలిగిస్తున్నారు. 'ఇక్కడ శిక్షణ పొందిన అమ్మాయిలు గిరిజన ప్రాంతాల్లోని వివిధ అంశాలను వీడియో తీసి, మా సోషల్ మీడియాలో పెడతారు. ఎవరికీ పట్టని జీవితాల మీద వెలుగులు ప్రసరించడమే దీని ఆశయం" అంటున్న జయంతి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్'కు చెందిన స్వతంత్ర మేధో బృందం... 'భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ'తో కలిసి పని చేస్తున్నారు. అటవీ వనరుల రక్షణ, గిరిజన హక్కులు తదితర అంశాలపై క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా గళం వినిపిస్తున్నారు. అలాగే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యురాలుగానూ వ్యవహరిస్తున్నారు. ఇటీవల 'ఫోర్బ్స్ ఇండియా ఉమెన్ పవర్- 2024' జాబితాలో ఆమెకు స్థానం లభించింది.

మళ్లీ మయాంకే..

విశాఖలో నేడు
కేకేఆర్‌తో ఢిల్లీ సై


కెప్టెన్లు పంత్‌, శ్రేయాస్‌

విశాఖపట్నం (స్పోర్ట్స్‌): ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయ ఢంకా మోగించి, ఊపులో ఉన్న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో పోరుకు రిషభ్‌ పంత్‌ నాయకత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్‌ సై అంటోంది. ఈ సీజన్‌లో విశాఖకు కేటాయించిన మ్యాచ్‌ల్లో రెండో, ఆఖరి పోరు ఇది. వరుస పరాజయాలకు స్వస్తి చెబుతూ, గత మ్యాచ్‌లో డిఫెండింగ్‌ చాంపియన్‌ సీఎస్కేకు షాకిచ్చిన ఢిల్లీ, ఈసారి జోష్‌లో ఉన్న కేకేఆర్‌ స్పీడ్‌కు బ్రేకులు వేసేందుకు వ్యూహాలు పన్నుతోంది. ఈ ఇరు జట్లు ఇప్పటివరకు ఐపీఎల్‌లో 33 సార్లు తలపడగా, చెరో 16 సార్లు గెలిచాయి. గత మ్యాచ్‌లో ఢిల్లీ ఓపెనర్‌ డేవిడ్‌ వార్నర్‌, కెప్టెన్‌ పంత్‌ అర్ధ సెంచరీలతో చెలరేగడం, ఆ జట్టు పేసర్‌ ఖలీల్‌ అహ్మద్‌ కీలక సమయాల్లో చెలరేగడం ఆ జట్టుకు సానుకూలాంశం. మరోవైపు కేకేఆర్‌ ఆల్‌రౌండర్లు ఆండ్రీ రస్సెల్‌, సునీల్‌ నరైన్‌ ఫామ్‌లోకి రావడం, యువ క్రికెటర్లు అంచనాలకు తగ్గట్టు రాణిస్తుండడం ఆ జట్టుకు బలంగా మారింది. విశాఖ పిచ్‌ బ్యాటర్లకు అనుకూలం, మొదట బ్యాటింగ్‌ చేసిన జట్లకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నది విశ్లేషకుల అంచనా.

ఒకటి ముందుకి-మరోటి వెనక్కి

» రెండు ఐపీఎల్‌ మ్యాచ్‌ల రీషెడ్యూల్‌

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో రెండు మ్యాచ్‌లను బీసీసీఐ రీషెడ్యూల్‌ చేసింది. ఈడెన్‌ గార్డెన్స్‌లో ఈ నెల 17న కోల్‌కతా-రాజస్థాన్‌ మధ్య మ్యాచ్‌ను ఒక రోజు ముందుగా.. అంటే 16న నిర్వహించనున్నారు. శ్రీరామ నవమి పండుగ ఉన్నందున తగినంత భద్రత కల్పించలేమని కోల్‌కతా పోలీసులు స్పష్టం చేయడంతో.. ఆ మ్యాచ్‌ను ఒక రోజు ముందు నిర్వహిస్తున్నట్టు బీసీసీఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. దీంతో అహ్మదాబాద్‌లో 16న గుజరాత్‌-ఢిల్లీ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను ఓ రోజు తర్వాతికి.. అంటే 17వ తేదీకి మార్చారు.

మహిళా ఫుట్‌బాలర్లపై దాడుల కేసులో..
దీపక్‌ శర్మపై వేటు



న్యూఢిల్లీ: ఇద్దరు మహిళా ఫుట్‌బాలర్లపై భౌతిక దాడులకు పాల్పడిన కేసులో అఖిల భారత ఫుట్‌బాల్‌ సమాఖ్య (ఏఐఎ‌ఫ్‌ఎఫ్‌) ఈసీ సభ్యుడు దీపక్‌ శర్మపై సస్పెన్షన్‌ వేటుపడింది. విచారణ ప్రక్రియలో భాగంగా దీపక్‌ నుంచి వివరాలు తీసుకొన్న అత్యవసర కమిటీ.. ఈ కేసును క్రమశిక్షణా సంఘానికి సిఫార్సు చేసింది. మహిళల ఫుట్‌బాల్‌ సెకండ్‌ డివిజన్‌ లీగ్‌లో పాల్గొనేందుకు హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన 'ఖాద్‌ ఎఫ్‌సీ' జట్టు గోవాకు వచ్చింది. అయితే, ఆ టీమ్‌ యజమాని కూడా అయిన దీపక్‌.. తాగిన మైకంలో బలవంతంగా తమ రూమ్‌లోకి చొరబడి తమపై దాడి చేశాడని ఖాద్‌ ఎఫ్‌సీ బాధిత ప్లేయర్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఆటకు సంబంధించిన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని శర్మను ఏఐఎఫ్‌ఎఫ్‌ ఆదేశించింది.

3 వికెట్లతో అదరగొట్టిన పేసర్‌
లఖ్‌నవూ ఘనవిజయం ▪ బెంగళూరు చిత్తు

నేటి మ్యాచ్‌
ఢిల్లీ x కోల్‌కతా
రా.7.30 నుంచి


మయాంక్‌ (3/14)

తక్కువ ఇన్నింగ్స్‌ (99)లో 3 వేల రన్స్‌ సాధించిన ఆరో ఐపీఎల్‌ బ్యాటర్‌గా డికాక్‌. తొలి స్థానంలో గేల్‌ (75) ఉన్నాడు.

బెంగళూరు: అదే జోరు.. అదే వేగం.. స్పీడ్‌గన్‌ మయాంక్‌ యాదవ్‌ (3/14)ను ఎదుర్కొనేందుకు బ్యాటర్లు బెంబేలెత్తుతున్నారు. ఈసారి రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరుపై నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడ్డాడు. ఏకంగా తాజా సీజన్‌లోనే అత్యంత (156.7) వేగంగా బంతి విసిరి లఖ్‌నవూ సూపర్‌ జెయింట్స్‌కు స్టార్‌ అట్రాక్షన్‌గా మారాడు. అతడికి జతగా మిగిలిన బౌలర్లు కూడా రాణించడంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూ 28 పరుగులతో నెగ్గింది. సొంతగడ్డపై ఆర్‌సీబీకిది వరుసగా రెండో ఓటమి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 181 పరుగులు చేసింది. డికాక్‌ (56 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 81), పూరన్‌ (21 బంతుల్లో 1 ఫోర్‌, 5 సిక్సర్లతో 40 నాటౌట్‌) ఆకట్టుకున్నారు. ఛేదనలో బెంగళూరు 19.4 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. లొమ్రోర్‌ (13 బంతుల్లో 33), రజత్‌ (29), విరాట్‌ (22) ఓ మాదిరిగా రాణించారు. ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌గా మయాంక్‌ యాదవ్‌ నిలిచాడు.

ఆరంభంలోనే..: ఛేదనలో ఆర్‌సీబీ తడబ్యాటు' కొనసాగింది. పవర్‌ప్లేలోనే విరాట్‌, డుప్లెసి (19), మ్యాక్స్‌వెల్‌ (0) వికెట్లను కోల్పోయి బేలగా కనిపించింది. కానీ తొలి నాలుగు ఓవర్లలో ఓపెనర్లు ఆడిన తీరు చూస్తే జట్టు విజయం లాంఛనమే అనిపించింది. కానీ వరుస ఓవర్లలో విరాట్‌ను స్పిన్నర్‌ సిద్దార్థ్‌, మ్యాక్స్‌వెల్‌ను పేసర్‌ మయాంక్‌ అవుట్‌ చేయగా, డుప్లెసి రనౌటయ్యాడు. ఇక మయాంక్‌ తన బుల్లెట్‌లాంటి బంతులతో గ్రీన్‌ (9)ను సైతం పెవిలియన్‌కు చేర్చడంతో 58/4తో ఆర్‌సీబీ పోటీలోకి రాలేకపోయింది. ఈ దశలో రజత్‌-అనూజ్‌ (11)తో కలిసి ఐదో వికెట్‌కు 36 పరుగులు జోడించాడు. కానీ మయాంక్‌ తన చివరి ఓవర్‌లో రజత్‌ను అవుట్‌ చేసి వరుసగా రెండో మ్యాచ్‌లోనూ మూడు వికెట్లను సాధించాడు. అటు చివరి 30 బంతుల్లో 78 రన్స్‌ కావాల్సిన వేళ లొమ్రోర్‌ యథేచ్ఛగా బ్యాట్‌ ఝుళిపించాడు. 16వ ఓవర్‌లో 19 రన్స్‌ అందించి, తర్వాతి ఓవర్‌లోనూ మెరిసి ఆశలు రేపాడు. కానీ అదే ఓవర్‌లో దినేశ్‌ కార్తీక్‌ (4) కీపర్‌ రాహుల్‌కు క్యాచిచ్చాడు. లొమ్రోర్‌ను యశ్‌ అవుట్‌ చేయడంతో ఆర్‌సీబీ చేసేదేమీ లేకపోయింది. సిరాజ్‌ (12) చివర్లో రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు.


డికాక్‌ (81)

డికాక్‌ పోరాటం

టాస్‌ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌ డికాక్‌ ఆటే హైలైట్‌గా నిలిచింది. పిచ్‌ బ్యాటింగ్‌కు అంతగా అనుకూలించకపోయినా.. అతను ఎదురుదాడికి దిగగా, చివర్లో పూరన్‌ సైతం చెలరేగడంతో భారీ స్కోరు సాధ్యమైంది. మిగతా బ్యాటర్లు పరుగులు తీసేందుకు కష్టపడ్డారు. తొలి ఓవర్‌లోనే మూడు ఫోర్లతో వేగం కనబర్చిన డికాక్‌ ఆ తర్వాత కూడా ధాటి కొనసాగించాడు. అటు కెప్టెన్‌ రాహుల్‌ (20) కూడా రెండేసి సిక్సర్లతో టచ్‌లో ఉన్నట్టు కనిపించినా మ్యాక్స్‌వెల్‌ ఓవర్‌లో అవుటయ్యాడు. తొలి వికెట్‌కు వీరి మధ్య 53 పరుగులు జత చేరాయి. దేవ్‌దత్‌ (6) తన పేలవ ఫామ్‌ను కొనసాగించాడు. అయితే డికాక్‌కు స్టొయినిస్‌ (24) జత కలిశాక స్కోరుబోర్డు వేగంగా కదిలింది. 12వ ఓవర్‌లో డికాక్‌ 36 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆ వెంటనే గ్రీన్‌ ఓవర్‌లో స్టొయినిస్‌ 6,6 డికాక్‌ 4తో 19 రన్స్‌ సమకూరాయి. కానీ స్టొయినిస్‌ను మ్యాక్స్‌వెల్‌ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సిరాజ్‌ ఓవర్‌లో మరో రెండు ఫోర్లతో డికాక్‌ 80 పరుగులకు చేరి సెంచరీ వైపు కదిలాడు. అయితే టోప్లే ఫుల్‌టాస్‌ బంతికి అతడు దాగర్‌కు క్యాచ్‌ ఇచ్చాడు. 15-18 ఓవర్ల మధ్య బౌలర్లు యష్‌ దయాల్‌, టోప్లే రన్స్‌ కట్టడి చేశారు. దీంతో బ్యాట్‌ ఝుళిపించిన పూరన్‌ 19వ ఓవర్‌లో 3 సిక్సర్లతో 20 పరుగులు, ఆఖరి ఓవర్‌లో రెండు సిక్సర్లతో 13 రన్స్‌ అందించడంతో స్కోరు 180 దాటింది.

ఇప్పటికి వీరే..



పరుగులు	వికెట్లు
విరాట్‌ కోహ్లి (బెంగళూరు)	ముస్తాఫిజుర్‌ (చెన్నై)
203 పరుగులు	7 వికెట్లు

స్కోరుబోర్డు

లఖ్‌నవూ : డికాక్‌ (సి) దాగర్‌ (బి) టోప్లే 81, రాహుల్‌ (సి) దాగర్‌ (బి) మ్యాక్స్‌వెల్‌ 20, పడిక్కళ్‌ (సి) అనూజ్‌ రావత్‌ (బి) సిరాజ్‌ 6, స్టొయినిస్‌ (సి) దాగర్‌ (బి) మ్యాక్స్‌వెల్‌ 24, పూరన్‌ (నాటౌట్‌) 40, ఆయుష్‌ (సి) డుప్లెసి (బి) యశ్‌ 0, క్రునాల్‌ (నాటౌట్‌) 0; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం 20 ఓవర్లలో 181/5; వికెట్ల పతనం:** 1-53, 2-73, 3-129, 4-143, 5-148; **బౌలింగ్‌:** టోప్లే 4-0-39-1, యశ్‌ దయాల్‌ 4-0-24-1, సిరాజ్‌ 4-0-47-1, మ్యాక్స్‌వెల్‌ 4-0-23-2, దాగర్‌ 2-0-23-0, గ్రీన్‌ 2-0-25-0.

బెంగళూరు: కోహ్లి (సి) పడిక్కళ్‌ (బి) సిద్దార్థ్‌ 22, డుప్లెసి-రనౌట్‌ (పడిక్కళ్‌) 19, పటీదార్‌ (సి) పడిక్కళ్‌ (బి) మయాంక్‌ 29, మ్యాక్స్‌వెల్‌ (సి) పూరన్‌ (బి) మయాంక్‌ 0, గ్రీన్‌ (బి) మయాంక్‌ 9, రావత్‌ (సి) పడిక్కళ్‌ (బి) స్టొయినిస్‌ 11, లొమ్రోర్‌ (సి) పూరన్‌ (బి) ఠాకూర్‌ 33, కార్తీక్‌ (సి) రాహుల్‌ (బి) నవీనుల్‌ 4, దాగర్‌-రనౌట్‌ (పూరన్‌) 0, టోప్లే (నాటౌట్‌) 3, సిరాజ్‌ (సి) పూరన్‌ (బి) నవీనుల్‌ 12, **ఎక్స్‌ట్రాలు11, మొత్తం: 19.4 ఓవర్లలో 153 ఆలౌట్‌; వికెట్లపతనం:** 1-40, 2-42, 3-43, 4-58, 5-94, 6-103, 7-136, 8-137, 9-138; **బౌలింగ్‌:** సిద్దార్థ్‌ 3-0-21-1, కృనాల్‌ 1-0-10-0, నవీనుల్‌ 3.4-0-25-2, మయాంక్‌ యాదవ్‌ 4-0-14-3, బిష్ణోయ్‌ 3-0-33-0, యశ్‌ ఠాకూర్‌ 4-0-38-1, స్టొయినిస్‌ 1-0-9-1.

పాయింట్ల పట్టిక


జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్‌	3	3	0	0	6	1.249
కోల్‌కతా	2	2	0	0	4	1.047
చెన్నై	3	2	1	0	4	0.976
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
గుజరాత్‌	3	2	1	0	4	-0.738
హైదరాబాద్‌	3	1	2	0	2	0.204
ఢిల్లీ	3	1	2	0	2	-0.016
పంజాబ్‌	3	1	2	0	2	-0.337
బెంగళూరు	4	1	3	0	2	-0.876
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్‌ రన్‌రేట్‌

టీ20 వరల్డ్‌కప్‌నకు స్టోక్స్‌ దూరం



లండన్‌: ఇంగ్లండ్‌ టెస్టు కెప్టెన్‌ బెన్‌ స్టోక్స్‌ టీ20 వరల్డ్‌కప్‌ నుంచి వైదొలిగాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో పూర్తి స్థాయి ఆల్‌రౌండర్‌గా రాణించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశాడు. టెస్టు క్రికెట్‌ తన మొదటి ప్రాధాన్యతగా చెప్పాడు. ఇంగ్లండ్‌ జట్టుకు ఈ ఏడాది టెస్టులకు సంబంధించి బిజీ షెడ్యూల్‌ ఉంది. 12 టెస్టులు ఆడాల్సి ఉండడంతో ఇప్పటికే ఐపీఎల్‌కు దూరమైన స్టోక్స్‌, తాజాగా మెగా టోర్నీలోనూ ఆడకూడదని నిర్ణయించుకున్నాడు. జూలైలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌ ద్వారా వీరి షెడ్యూల్‌ ఆరంభం కానుంది.



ఫేవరెట్‌ ప్రజ్ఞానంద

» మహిళల బరిలో హంపి
» నేటి నుంచి క్యాండిడేట్స్‌ చెస్‌ టోర్నీ

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్‌ చెస్‌ టోర్నీలో టీనేజ్‌ సంచలనం ప్రజ్ఞానంద ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. బుధవారం నుంచి జరిగే టోర్నీకి పురుషుల విభాగంలో ప్రజ్ఞానందతోపాటు గుకేష్‌, విదిత్‌ గుజరాతీ కూడా అర్హత సాధించారు. 8 మంది టాప్‌ రేటెడ్‌ గ్రాండ్‌ మాస్టర్లు బరిలో ఉన్న ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ఆటగాడికి.. వరల్డ్‌ చాంపియన్‌ డింగ్‌ లిరెన్‌ను సవాల్‌ చేసే అరుదైన అవకాశం దక్కుతుంది. అంతేకాకుండా సుమారు రూ. 45 లక్షల ప్రైజ్‌మనీని కూడా గెలుచుకొంటాడు. 2023 వరల్డ్‌ కప్‌ రన్నరప్‌గా ప్రజ్ఞానంద ఈ టోర్నీలో ఆడే చాన్స్‌ పట్టేశాడు. కాగా, మహిళల విభాగంలో గ్రాండ్‌ మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి బరిలో నిలవనున్నారు.

గెలుపు దిశగా లంక

చట్టోగ్రామ్‌: బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక విజయం దిశగా సాగుతోంది. లంక నిర్దేశించిన 511 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా.. ఆటకు నాలుగో రోజైన మంగళవారం రెండో ఇన్నింగ్స్‌ బరిలోకి దిగిన బంగ్లా 268/7తో ఎదురీదుతోంది. ఆఖరి రోజు బంగ్లా గెలుపునకు ఇంకా 243 పరుగులు కావాల్సి ఉంది. ఓవర్‌నైట్‌ స్కోరు 102/6తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన లంక 157/7 స్కోరు వద్ద డిక్లేర్‌ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 531 పరుగులు చేయగా.. బంగ్లా 178 రన్స్‌కు ఆలౌటైంది.

మేం పెద్ద తప్పు చేశాం..

2019 వరల్డ్‌కప్‌ ఫైనల్‌పై మాజీ అంపైర్‌ ఎరాస్మస్‌



లండన్‌: ఇంగ్లండ్‌ క్రికెట్‌ జట్టు తొలి వన్డే వరల్డ్‌కప్‌ ట్రోఫీని అంపైర్‌ పొరపాటు నిర్ణయం వల్లనే సాధించిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. 2019లో అత్యంత ఉత్కంఠభరితంగా ముగిసిన ఆ ఫైనల్‌.. క్రికెట్‌ చరిత్రలోనే అత్యంత అరుదైన మ్యాచ్‌గా నిలిచింది. కివీస్‌తో ఆ మ్యాచ్‌ సూపర్‌ ఓవర్‌ కూడా టైగా ముగియడంతో, ఎక్కువ బౌండరీల కారణంగా ఇంగ్లండ్‌ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌ ఆఖరి ఓవర్‌లో తాము పొరపాటుకు పాల్పడినట్టు అప్పటి అంపైర్‌ ఎరాస్మస్‌ పేర్కొన్నాడు. 50వ ఓవర్‌ నాలుగో బంతికి గప్టిల్‌ విసిరిన త్రో రన్‌తీస్తున్న స్టోక్స్‌ బ్యాట్‌కు తగిలి బౌండరీకి వెళ్లింది. అప్పటికే బ్యాటర్లు రెండు పరుగులు పూర్తి చేయగా.. ఈ ఫోర్‌ కలిపి ఫీల్డ్‌ అంపైర్లు ఆరు పరుగులుగా ప్రకటించారు. దీంతో సమీకరణం 2 బంతుల్లో మూడు రన్స్‌కు మారగా ఇంగ్లండ్‌ రెండు పరుగులే చేయడంతో టైగా ముగిసింది. కానీ ఐసీసీ రూల్స్‌ ప్రకారం ఇక్కడ ఐదు పరుగులే రావాలి. ఎందుకంటే.. గప్టిల్‌ బంతి విసిరే సమయానికి బ్యాటర్లు రెండో పరుగు కోసం ఒకరినొకరు క్రాస్‌ చేసుకోలేదు. మర్నాడు ఉదయం హోటల్లో మరో అంపైర్‌ ధర్మసేన తాము చేసిన అదిపెద్ద పొరపాటు గురించి చెప్పాడని ఎరాస్మస్‌ గుర్తు చేసుకున్నాడు. కానీ మైదానంలో మాత్రం బ్యాటర్ల పరుగు గమనించక, తామిద్దరం ఆరు పరుగులే ఇవ్వాలనే విధంగా మాట్లాడుకున్నామని తెలిపాడు.

బిజినెస్‌

ఈసారి రూ.లక్ష కోట్ల ఐపీఓలు!

ఇన్వెస్ట్‌మెంట్జ్‌.కామ్‌ అంచనా

» క్యూలో రూ.70,000 కోట్ల ఆఫర్లు
» 2023-24లో రూ.62,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ఈ నెల 1తో ప్రారంభమైన కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్‌ ఆఫరింగ్‌ (ఐపీఓ)ల జోరు కొనసాగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో 76 కంపెనీలు ఐపీఓల ద్వారా దాదాపు రూ.62,000 కోట్లు సమీకరించగా.. 2024-25లో ఐపీఓల ద్వారా నిధుల సేకరణ రూ.లక్ష కోట్లు దాటవచ్చని పెట్టుబడులు, ట్రేడింగ్‌ ప్లాట్‌ఫామ్‌ 'ఇన్వెస్ట్‌మెంట్జ్‌.కామ్‌' నివేదిక అంచనా వేసింది. ఆకస్మిక అంతర్జాతీయ ప్రతికూల పరిణామాల ప్రభావం లేకపోతే ఈ మొత్తం మరింత పెరగవచ్చని అంటోంది. ఇప్పటికే రూ.70,000 కోట్ల విలువైన 56 కంపెనీల పబ్లిక్‌ ఆఫర్లు క్యూలో ఉన్నాయని నివేదిక పేర్కొంది. అందులో రూ.25,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో కూడిన 19 కంపెనీల ఐపీఓలకు ఇప్పటికే సెబీ ఆమోదం లభించగా.. మరో రూ.45,000 కోట్ల విలువ చేసే 37 కంపెనీల ఐపీఓ దరఖాస్తులు నియంత్రణ సంస్థ పరిశీలనలో ఉన్నాయి. మొత్తం 56 కంపెనీల్లో 9 నవతరం టెక్నాలజీ కంపెనీలనీ.. వీటి నిధుల సమీకరణ లక్ష్యం మొత్తం రూ.21,000 కోట్ల స్థాయిలో ఉందని నివేదిక వెల్లడించింది.

నిధుల సేకరణలో 19% వృద్ధి

అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)లో 37 కంపెనీలు ఐపీఓల ద్వారా సమీకరించిన రూ.52,115 కోట్లతో పోలిస్తే 2023-24లో ఈ మొత్తం మరో 19 శాతం పెరిగింది. సెకండరీ మార్కెట్లో జోరు, రిటైల్‌ మదుపరుల పాత్ర పెరగడంతో పాటు సంస్థాగత ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు గుమ్మరించడం ఇందుకు దోహదపడింది. మరిన్ని ఆసక్తికర అంశాలు..

- గత ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్‌ ఇష్యూకు వచ్చిన కంపెనీల షేర్లు స్టాక్‌ ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన తొలి రోజు పంచిన లాభం సగటు 29 శాతంగా నమోదైంది. 2022-23లో ఈ సగటు 9 శాతంగా ఉంది.
- గత ఆర్థిక సంవత్సరంలో ఐపీఓకు వచ్చిన 70 శాతం లేదా 55 కంపెనీల షేర్లు ఇప్పటికీ ఇష్యూ ధర ఎగువన ట్రేడవుతున్నాయి.
- ఐపీఓలకు రిటైల్‌ మదుపరుల నుంచి లభించిన దరఖాస్తుల సగటు 2022-23లో 6 లక్షలుగా ఉండగా.. 2023-24లో 13 లక్షలకు పెరిగింది.
- గత ఏడాది చిన్న, మధ్య స్థాయి కంపెనీ (ఎస్‌ఎంఈ) ఐపీఓలు భారీగా పెరిగాయి. ప్రైమ్‌ డేటాబేస్‌ ప్రకారం.. 2022-23లో 125 ఎస్‌ఎంఈలు పబ్లిక్‌ ఇష్యూల ద్వారా రూ.2,235 కోట్లు సమీకరించగా.. 2023-24లో 200 ఎస్‌ఎంఈలు మొత్తం రూ.5,838 కోట్లు సేకరించాయి.
- గత ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 29 శాతం వృద్ధి చెందగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్‌ 100 ఇండెక్స్‌ 70 శాతం, మిడ్‌క్యాప్‌ 100 సూచీ 60 శాతం పెరిగాయి. ఐపీఓ తర్వాత మార్కెట్లో లిస్టయిన కంపెనీల షేర్ల పనితీరును తెలిపే బీఎస్‌ఈ ఐపీఓ ఇండెక్స్‌ సైతం 69 శాతం ఎగబాకింది.

ఏపీలో శ్రీ సిమెంట్‌ ప్లాంట్‌

» దాచేపల్లి యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం

హైదరాబాద్‌: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దాచేపల్లిలో శ్రీ సిమెంట్‌ కంపెనీ ఏర్పాటు చేసిన సిమెంట్‌ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమైంది. ఏటా 30 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కంపెనీ ఈ ప్లాంట్‌ ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేసింది. నిర్ణీత గడువు కంటే 6 నెలల ముందే ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించినట్టు తెలిపింది. ఈ ప్లాంట్‌ ద్వారా 700 మందికి ప్రత్యక్షంగా, 1,300 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. తెలంగాణ సరిహద్దుకు చేరువలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల మార్కెట్లలో తన సత్తా చాటాలని శ్రీ సిమెంట్‌ భావిస్తోంది. అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ నుంచి కాలుష్యం కూడా పెద్దగా వెలువడదని తెలిపింది.

భారత్‌ బయోటెక్‌ నుంచి ఓరల్‌ పోలియో వ్యాక్సిన్‌

హైదరాబాద్‌ కేంద్రంగా పని చేసే భారత్‌ బయోటెక్‌ మరో వినూత్న వ్యాక్సిన్‌ ఉత్పత్తికి సిద్ధమవుతోంది. నోటి ద్వారా తీసుకునే పోలియో వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయనుంది. ఇందుకోసం నెదర్లాండ్‌ కేంద్రంగా పని చేసే బిల్తోవెన్‌ బయోలాజికల్స్‌ బీవీ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపింది. ఇందుకు అవసరమైన అనుమతుల కోసం రెండు కంపెనీలు సంయుక్తంగా దరఖాస్తు చేస్తాయి. భారత్‌ బయోటెక్‌ ఉత్పత్తిచేసే ఓరల్‌ పోలియో వ్యాక్సిన్లను భారత్‌తో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి చేస్తారు. బిల్తోవెన్‌ బయోలాజికల్స్‌.. సీరమ్‌ ఇనిస్టిట్యూట్‌ అనుబంధ సంస్థ.

మూడేళ్లలో 'విజేత' పబ్లిక్‌ ఇష్యూ

పదేళ్లలో మరో 90 స్టోర్లు ▪ రూ.2,000 కోట్ల టర్నోవర్‌ టార్గెట్‌
తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాలకు విస్తరణ
'ఆంధ్రజ్యోతి'తో విజేత సూపర్‌ మార్కెట్స్‌ ఎండీ జగన్మోహన రావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



విజేత సూపర్‌ మార్కెట్స్‌ అంటే తెలియని వారు లేరు. హైదరాబాద్‌లో విజేత సూపర్‌ మార్కెట్‌ కనిపించని ప్రదేశం లేదంటే అతిశయోక్తి కాదు. నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించడం ద్వారా కస్టమర్లను ఆకట్టుకున్న ఈ సంస్థ భారీ విస్తరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. రాబోయే పదేళ్లలో కొత్తగా 90 స్టోర్లు ప్రారంభించడం, పబ్లిక్‌ ఇష్యూ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించుకోవడం ఈ ప్రణాళిక ప్రధానాంశాలు. విజేత సూపర్‌ మార్కెట్స్‌ ప్రారంభమై మార్చి నాటికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ మురకొండ జగన్మోహనరావు 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖిలో పలు అంశాలు ప్రస్తావించారు. అవి ఆయన మాటల్లోనే...

- గుంటూరు జిల్లాలోని నిమ్మగడ్డవారి పాలెం గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టిన నేను ప్రారంభంలో కొన్ని చిన్న ఉద్యోగాలు చేశాను. హైదరాబాద్‌ వచ్చి త్రినేత్ర సూపర్‌ మార్కెట్లో ఉద్యోగానికి చేరాను. బిల్లింగ్‌ క్లర్క్‌ నుంచి స్టోర్‌ ఇన్‌చార్జ్‌ వరకు 5 సంవత్సరాల అనుభవం ఈ వ్యాపార జీవితానికి పునాది అయింది. ఏదో ఒకటి సాధించాలనే నాలోని తపన దానికి జోడయింది.
- అలా తొలి స్టోర్‌ చందానగర్‌లో 1999 మార్చి 7వ తేదీన ప్రారంభించాను. అప్పటికి ఇతర రంగాలతో పోల్చితే బీహెచ్‌ఈఎల్‌ ఉద్యోగులకు అధిక వేతనాలుండడం వల్ల వారి కొనుగోలు శక్తి అధికంగా ఉండేది. అందుకే తొలి స్టోర్‌ అక్కడ ప్రారంభించాను.
- క్రమంగా స్టోర్ల సంఖ్యను విస్తరిస్తూ పాతికేళ్ల ప్రయాణంలో 110 స్టోర్లకు వ్యాపారాన్ని పెంచాం. వీటిలో 11 స్టోర్లు మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మిగతావన్నీ తెలంగాణలోనే ఉన్నాయి. వచ్చే పదేళ్ల కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉమ్మడి జిల్లా కేంద్రాలన్నింటిలో విజేత స్టోర్లు తెరవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాబోయే 10 సంవత్సరాల్లో మొత్తం స్టోర్ల సంఖ్య 200కి చేర్చడం, రూ.2000 కోట్ల టర్నోవర్‌ సాధించడం మా లక్ష్యం. ప్రస్తుతం మా టర్నోవర్‌ రూ.840 కోట్లుంది. ఏటా 15 నుంచి 20 శాతం వృద్ధి నమోదు చేస్తున్నాం.
- కొత్త స్టోర్ల ఏర్పాటుకు నిధులు భారీగానే అవసరం అవుతాయి. మంచి ప్రాంతంలో విశాలమైన ప్రాంగణంలో ఒక స్టోర్‌ ప్రారంభించాలంటే కనీసం రూ.6 కోట్లు అవసరం. ఇప్పటివరకు అంతర్గత వనరులు, బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమకూర్చుకున్నాం. భవిష్యత్‌ అవసరాల కోసం తొలుత ప్రైవేట్‌ ఈక్విటీ సంస్థల (పీఈ)ను ఆశ్రయించాలనుకుంటున్నాం.
- పబ్లిక్‌ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించే ఆలోచన ఉంది. అయితే అందుకు కొంత సమయం తీసుకుంటాం. బహుశ మూడేళ్లలో ఇష్యూకి వచ్చే అవకాశం ఉంది.
- వ్యవస్థీకృత రిటైలింగ్‌ రంగంలో పోటీ తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. కాని నాణ్యత ఉన్న చోటికి కస్టమర్లు తమంత తాముగానే వస్తారు. అదే మా వ్యాపార రహస్యం. దానికి తోడు స్టోర్‌ను ఆకర్షణీయంగా డిజైన్‌ చేయడం, కస్టమర్లతో సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించడం మా ప్రత్యేకతలు.
- 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మార్చి 31 వరకు కస్టమర్లకు స్పెషల్‌ కూపన్లు అందించాం. త్వరలో వాటిని డ్రా తీయబోతున్నాం. డ్రాలో విజేతలకు కార్లు, బైక్‌లు, ఇతర ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తాం.

మన మార్కెట్‌ వాల్యుయేషన్స్‌ సబబే

నమ్మకం, విశ్వాసం ఉండబట్టే పెట్టుబడులు: సెబీ చీఫ్‌ మాధవి పురి బుచ్‌




ముంబై: దేశీయ స్టాక్‌ మార్కెట్‌ అధిక వాల్యుయేషన్స్‌ను మార్కెట్‌ నియంత్రణ మండలి సెబీ చీఫ్‌ మాధవి పురి బుచ్‌ సమర్థించారు. మదుపరులకు ముఖ్యంగా విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు మన ఆర్థిక వ్యవస్థ, క్యాపిటల్‌ మార్కెట్‌పై నమ్మకం, విశ్వాసం, ఆశావాదం ఉండబట్టే వాల్యుయేషన్స్‌ అధికంగా ఉన్నా పెట్టుబడులు పెడుతున్నట్టు తెలిపారు. కార్పొరేట్‌ గవర్నెన్స్‌పై సీఐఐ నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ విషయాలు చెప్పారు. ప్రస్తుతం దేశీయ స్టాక్‌ మార్కెట్‌ 22.2 పీఈ వద్ద ట్రేడవుతోంది. అనేక దేశాల స్టాక్‌ మార్కెట్లతో పోలిస్తే ఇది చాలా ఎక్కువని మాధవి అన్నారు. తాను భేటీ అయిన ఎఫ్‌పీఐల ప్రధాన అధికారులు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థపై అత్యంత నమ్మకం, విశ్వాసం వ్యక్తం చేశారన్నారు. నమ్మకం అనే అంశంపైనే క్యాపిటల్‌ మార్కెట్‌ అనే భవనం నిలబడి ఉందన్నారు. ఇందుకు పారదర్శక లావాదేవీలు అత్యంత ముఖ్యమన్నారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్‌

దేశీయ స్టాక్‌ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడింది. ఐటీ, ప్రైవేట్‌ బ్యాంకింగ్‌, వాహన రంగాలకు చెందిన కొన్ని కంపెనీల షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో మంగళవారం సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్‌ 110.64 పాయింట్లు కోల్పోయి 73,903.91 వద్దకు జారుకుంది. ఇంట్రాడేలోనైతే సూచీ 270 పాయింట్లకు పైగా పతనమైనప్పటికీ.. ఆఖరి గంటలో నష్టాలను సగానికి పైగా తగ్గించుకోగలిగింది. నిఫ్టీ 8.70 పాయింట్ల నష్టంతో 22,453.30 వద్ద క్లోజైంది.

ఆర్‌ఐఎన్‌ఎల్‌ టర్నోవర్‌ రూ.23,129 కోట్లు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇస్పాత్‌ నిగమ్‌ లిమిటెడ్‌ (ఆర్‌ఐఎన్‌ఎల్‌-విశాఖ ఉక్కు) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.23,129 కోట్ల టర్నోవర్‌ సాధించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది రెండు శాతం అధికమని ఆర్‌ఐఎన్‌ఎల్‌ తెలిపింది. కాగా విక్రయించిన ఉత్పత్తులలో 43.12 లక్షల టన్నులు సేలబుల్‌ స్టీల్‌ కాగా 7.8 లక్షల టన్నులు రౌండ్స్‌ ఉన్నాయి. ముడి పదార్థాలు అందుబాటులో లేకపోయినప్పటికీ 17,39,943 లక్షల టన్నుల స్టీల్‌ని ఉత్పత్తి చేసినట్టు, అందులో స్పెషల్‌ బార్‌ మిల్లు నుంచి 5,43,942 టన్నులు, వైర్‌ రాడ్‌ మిల్లు నుంచి 6,15,588 టన్నులు, స్ట్రక్చర్‌ మిల్లు నుంచి 5,80,413 టన్నులు ఉత్పత్తి చేసినట్టు వెల్లడించింది.



- ఏషియా సొసైటీ ఇండియా సెంటర్‌ బోర్డ్‌ కొత్త చైర్మన్‌గా సంగీతా జిందాల్‌ నియమితులయ్యారు. ఈ నెల 1 నుంచి ఈమె నియామకం అమల్లోకి వచ్చింది. భారత్‌ సహా దక్షిణాసియాలో సమకాలీన చిత్రకళకు తోడ్పాటునందించటంలో సంగీతా కీలక పాత్ర పోషించనున్నారని ఏషియా సొసైటీ ఇండియా సెంటర్‌ సీఈఓ ఇనాక్షీ సోబ్తీ అన్నారు. ప్రస్తుతం సంగీతా జిందాల్‌.. ఆర్ట్‌ ఇండియా ప్రెసిడెంట్‌, జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్‌ చైర్‌పర్సన్‌గా ఉన్నారు.
- నీల్‌కమల్‌ స్లీప్‌.. బాలీవుడ్‌ నటుడు రణబీర్‌ కపూర్‌ను ప్రచారకర్తగా నియమించుకుంది. రణబీర్‌ ప్రచారంతో కంపెనీ ఉత్పత్తులు వినియోగదారులకు ముఖ్యంగా యువతకు మరింత చేరువ అవుతాయని నీల్‌కమల్‌ స్లీప్‌ వెల్లడించింది.
- ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన క్లియర్‌ట్రిప్‌.. ప్రముఖ క్రికెటర్‌ మహేంద్ర సింగ్‌ ధోనీని బ్రాండ్‌ అంబాసిడర్‌గా నియమించుకుంది. క్లియర్‌ట్రిప్‌ లక్ష్యాలను చేరుకునేందుకు ధోనీ ప్రచారం ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొంది.
- కొత్త ఇన్వెస్టర్ల కోసం స్టాక్‌ ఇన్వెస్టింగ్‌ యాప్‌ లెమన్‌ను పీపల్‌కో ఆవిష్కరించింది. కొత్త ఇన్వెస్టర్లకు స్టాక్‌ మార్కెట్ల పట్ల పూర్తి అవగాహన కల్పించటంతో పాటు పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే విధంగా ఈ యాప్‌ తోడ్పాటునందిచనుంది.

3.72 కోట్ల టన్నుల సరుకు రవాణా

అదానీ గంగవరం పోర్టు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని అదానీ గంగవరం పోర్టు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3.724 కోట్ల టన్నుల సరుకు రవాణా చేసింది. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 15 శాతం అధికం. కాగా అదానీ గంగవరం పోర్టు కంటైనర్‌ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్‌	69,110 ▼	63,350 ▼	82,000 ▲
ముంబై	68,961 ▲	63,168 ▲	76,127 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్‌ 100 గుడ్లు)

3వ తేదీ

హైదరాబాద్‌	380	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్‌	382

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్‌ ధర (కిలో) రూ. వెన్‌కాబ్‌ బ్రాయిలర్‌ చికెన్‌

హైదరాబాద్‌	137	గోదావరి	131
వరంగల్‌	137	విజయవాడ	131
కరీంనగర్‌	137	గుంటూరు	132
మహబూబ్‌నగర్‌	137	ఒంగోలు	132
కర్నూలు	137	చిత్తూరు	133
విశాఖపట్నం	122		



కొత్తపల్లి-కొండెవరం మధ్య ఆటోలో ప్రయాణిస్తున్న పవన్‌కల్యాణ్

ఇక్కడే ఉంటా..!

పిఠాపురం నా స్వస్థలం... ఎవరినీ వదిలి వెళ్లను

- ప్రేమైనా, బాధైనా మీతో పంచుకోవాలని ఉంది
- పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి వీరమహిళలతో పవన్
- చివరి రోజు పర్యటనలో 30 కిలోమీటర్ల మేర రోడ్ షో

(ఆంధ్రజ్యోతి- కాకినాడ)

పిఠాపురం తన స్వస్థలమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఒకసారి వచ్చి వెళ్లిపోవడానికి ఇక్కడికి రాలేదని.. తాను ఎక్కడికీ వెళ్లనని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన నాలుగోరోజైన మంగళవారం కొనసాగింది. యు.కొత్తపల్లి మండలంలో పార్టీ వీరమహిళలతో ఆయన సమావేశం నిర్వహించారు. కాసేపట్లో పవన్ ప్రసంగం మొదలవుతుందనగా నియోజకవర్గ ఎన్నికల అధికారులు వచ్చి సమావేశానికి అనుమతులు లేవని అభ్యంతరం తెలిపారు. దీంతో పవన్ ఈ సమావేశాన్ని రద్దు చేసుకున్నారు. అనంతరం మహిళలనుద్దేశించి కాసేపు ప్రసంగించారు. పార్టీ వీరమహిళలతో ఎంతో ప్రేమ, బాధలు పంచుకోవాలని ఉందని, ప్రతి ఒక్కరి కష్టాలు తెలుసుకోవాలని ఉందని పవన్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి 48 గంటల ముందే దరఖాస్తు చేసుకున్నా అనుమతి రాలేదన్నారు. మరో రెండు మూడు రోజుల్లో అన్ని అనుమతులూ తీసుకుని ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేసుకుందామని చెప్పారు. అధికారులు అనుమతులు ఎందుకు ఇవ్వలేదో కారణాలు తెలుసుకుంటానని తెలిపారు. "మీకు ఒక్కటే చెబుతున్నా.. మీ సోదరుడిగా.. బిడ్డగా.. కుటుంబ సభ్యుడిగా.. పిఠాపురాన్ని నా స్వస్థలం చేసుకుంటా. నేను ఎక్కడికీ వెళ్లను. ఒక్కసారి వచ్చి వెళ్లిపోవడానికి పిఠాపురం రాలేదు. ఇక్కడ ప్రతిఒక్కరికీ అండగా ఉంటా" అని చెప్పారు.

రోడ్ షోకి బ్రహ్మరథం...

సమావేశం రద్దవడంతో పవన్ యు.కొత్తపల్లి మండలం మీదుగా పిఠాపురం పట్టణం వరకు పవన్ రోడ్ షో నిర్వహించారు. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేసుకుంటూ 30 కిలోమీటర్ల మేర నిర్వహించిన రోడ్‌షోకు ఆరున్నర గంటలు పట్టింది. దారిపొడవునా రైతులు, కూలీలు, మత్స్యకారులు, వృద్ధులు, మహిళలు, యువకులు బ్రహ్మరథం పట్టారు. మండుటెండలో పర్యటిస్తున్న పవన్‌కు కొందరు రైతులు కొబ్బరి బొండాలు అందించారు. నాగులాపల్లిలో నవదంపతులు వచ్చి పవన్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. పొన్నాడ గ్రామంలో పవన్ నులక మంచంపై కూర్చుని గ్రామస్తులతో ముచ్చటించారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. పిఠాపురం సమీపంలో ఆటోలో ప్రయాణించారు. రైతుకూలీలను పలకరించారు. మూలపేట గ్రామంలో మహిళలతో కలిసి సరదాగా కాసేపు సెల్ఫీలు దిగారు. పిఠాపురం పట్టణంలోని ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చిలో పవన్ ప్రార్థనలు చేశారు. "తనను తాను తగ్గించుకునేవాడు హెచ్చించబడును" అనే బైబిల్ సూక్తి తనకు ఆదర్శమని, బైబిల్ తనకు దిక్సూచిలాంటిదని చెప్పారు. చర్చి బయటకు వస్తుండగా పవన్‌కు అభిమానులు గాజుగ్లాస్ సెట్‌ను అందించారు. అనంతరం ఆయన యు.కొత్తపల్లి మండలం పొన్నాడలోని బషీర్‌బీబీ ఔలియా (బంగారు పాప) దర్గాను దర్శించుకున్నారు. బషీర్‌బీబీకి చాదర్ సమర్పించారు. దీంతో పిఠాపురంలో నాలుగురోజుల పర్యటన ముగిసింది.

అనంతబాబుపై దళితుల ఆగ్రహం

మోటార్ సైకిల్ ఎక్కి పరార్
సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 2: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ దళితుల ఆగ్రహానికి గురై పరారవుతున్న వీడియోలు మంగళవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావుకు సమీప బంధువైన ఉదయభాస్కర్.. ధర్మవరం ఎన్నికల ప్రచారంలో దళితుల ఆగ్రహానికి గురైన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'దళితుడిని చంపి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయడానికి సిగ్గుందా, ఎస్సీ వాడిని చంపి ఏవిధంగా దండ వేస్తావంటూ దళితులు కేకలు వేస్తూ అనంతబాబును వెంబడించడంతో ఆయన బైక్ ఎక్కి పరారయ్యారు. ఆయన గన్‌మెన్ కూడా బైక్ వెనుక పరిగెత్తారు. అనంతబాబు, వరుపుల, చలమలశెట్టి సునీల్‌ను దళితులు చుట్టుముట్టడంతో అక్కడ నుంచి జారుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



నా అనుకున్న వాళ్లను

నాశనం చేశాడు!

(మొదటి పేజీ తరువాయి)

చిన్నాన్నకే న్యాయం జరగలేదంటే ప్రజలకు ఏం జరుగుతుంది? చిన్నాన్న కోరిక మేరకు కడప ఎంపీగా పోటీ చేస్తున్నా' అని ప్రకటించారు. మంగళవారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో తల్లి వైఎస్ విజయలక్ష్మి, కూతురు అంజలి, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, జేడీ శీలం, మీడియా చైర్మన్ తులసిరెడ్డితో కలిసి వైఎస్‌కు నివాళులు అర్పించి ప్రార్థనలు చేశారు. 114 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, ఐదు ఎంపీ అభ్యర్థులతో కూడిన కాంగ్రెస్ తొలి జాబితాను ఘాట్‌పై ఉంచారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్ని ఆధారాలు ఉన్నప్పటికీ హంతకులను ఈ ఐదేళ్లు వెనకేసుకొచ్చారని ఆక్షేపించారు. ఘోరమని తెలిసినా.. ప్రజలు హర్షించరని తెలిసినా.. ఎంత అహంకారం కాకపోతే మళ్లీ అదే అవినాశ్‌రెడ్డికి ఇస్తారని నిలదీశారు. 'రాజకీయ లబ్ధి కోసం వివేకాను హత్య చేస్తే అదే హంతకులకు జగనన్న అండగా నిలబడ్డాడు. మరి రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా నేను ఏం చేయాలి? ఆయన తమ్ముడికే న్యాయం చేయలేకపోతే ఇక ప్రజలకు ఏం న్యాయం జరుగుతుంది? రాజశేఖర్ రెడ్డి తమ్ముడి బిడ్డ సునీత న్యాయం కోసం ఈరోజు కోర్టులు, గడపగడపా తిరుగుతోంది. అసలు కనికరం లేదా? వారినే హంతకులు అంటున్నారే.. హృదయం లేదా? ఈరోజు నేను ఎంపీగా నిలబడడానికి కారణం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా అవినాశ్‌ను నిలబెట్టారు కాబట్టి.. ఇది హత్యా రాజకీయం కాబట్టి.. ఒక హంతకుడు, హత్య చేయించిన వాళ్లు చట్టసభల్లోకి వెళ్లకూడదనే నేను పోటీచేస్తున్నా' అని స్పష్టం చేశారు.

ఒక్క చాన్సిస్తే..

రాజశేఖర్‌రెడ్డి కొడుకై ఉండి, ఆయన ఆశయాలను నిలబెడతానని ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను జగనన్న కోరితే జనం అవకాశమిచ్చారని.. కానీ రాక్షస రాజ్యం తెచ్చాడని షర్మిల ధ్వజమెత్తారు. 'ఒక్క చాన్సిస్తే ప్రత్యేక హోదా తెస్తానన్నాడు. స్వప్రయోజనాల కోసం దానిని బీజేపీకి తాకట్టుపెట్టాడు. పోలవరం నిర్మిస్తానన్నాడు.. బీజేపీతో కుమ్మక్కయ్యాడు. ఆ పార్టీకి బానిసగా మారాడు. వారు ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకూ మద్దతిచ్చాడు. మణిపూర్ విషయంలో బీజేపీని వ్యతిరేకించలేదు. ఒక్క చాన్స్ ఇవ్వండి రాజధాని కడతానని.. మద్యనిషేధమని మహిళలను, పేదవాళ్లకు ఇళ్లు అని



ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద తల్లి విజయలక్ష్మితో కలసి వైఎస్ షర్మిలారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు

పేదలను.. జాబులని నిరుద్యోగులను మోసం చేశాడు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడు. మద్యాన్ని ఏరులై పారిస్తున్నాడు. ఎక్కడ చూసినా డ్రగ్సే. ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేయబోతున్న ఎమ్మెల్యేలు, ఎంపీల అభ్యర్థులం ఇడుపులపాయలో రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద ఆయన ఆశీస్సుల కోసం వచ్చాం. రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకుడు. ముఖ్యమంత్రిగా రెండుసార్లు ఎన్నికయ్యారు. తన ఆఖరి నిమిషం వరకు కాంగ్రెసే దేశంలో అధికారంలో ఉండాలి.. అప్పుడే దేశ ప్రజలకు రక్షణ ఉంటుందని అన్నారు. ఆఖరి కోరిక కూడా రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలన్నదే. రాజశేఖర్‌రెడ్డి బతికిఉంటే ఆ కోరికను నిజం చేసేవారు. 114 అసెంబ్లీ, 5 లోక్‌సభ అభ్యర్థుల జాబితాను విడుదల చేశాం. మిగతా పేర్లు త్వరలో విడుదల చేస్తాం. రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా చెబుతున్నా.. కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి. రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పాలనను ఆయన బిడ్డగా నేను తీసుకొస్తా' అని తెలిపారు.

హోదా కోసం ఇద్దరూ ఉద్యమం చేయలేదు

ప్రజలు ఐదేళ్లు చంద్రబాబుకు, మరో ఐదేళ్లు జగన్‌కు అవకాశం ఇచ్చారని.. కానీ వీరు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏనాడూ పనిచేయలేదని షర్మిల ఆరోపించారు. 'హోదా కోసం ఇద్దరూ ఉద్యమించలేదు. పదేళ్లుగా రాష్ట్రంలో ఒక్క అడుగు కూడా అభివృద్ధి జరగలేదు. హోదా వచ్చి ఉంటే ఒక్కో నియోజకవర్గంలో కనీసం వంద పరిశ్రమలైనా వచ్చేవి. రాష్ట్రం అతి దీన పరిస్థితుల్లో ఉందంటే దానికి కారణం చంద్రబాబు, జగనే. అందుచేత ప్రజలంతా ఆలోచించాలి' అని కోరారు.

సిటింగ్‌లు, సీనియర్లకు చాన్సు

కాంగ్రెస్ తొలి జాబితాలో.. ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరిన ఎమ్మెల్యేలు ఆర్థర్ (నందికొట్కూరు-ఎస్సీ), ఎలీజా (చింతలపూడి-ఎస్సీ)కు చోటు దక్కింది. పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి శైలజానాథ్‌కు శింగనమల (ఎస్సీ), వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలీకి గుంటూరు తూర్పు కేటాయించారు. అదేవిధంగా.. కడప లోక్‌సభ స్థానం నుంచి షర్మిల, కాకినాడ-ఎంఎం పల్లంరాజు, రాజమండ్రి-గిడుగు రుద్రరాజు, బాపట్ల (ఎస్సీ)-జేడీ శీలం, కర్నూలు నుంచి పీజీ రాంపుల్లయ్య యాదవ్ పేర్లను అధిష్ఠానం ప్రకటించింది.



మంగళగిరి పాత బస్టాండు సెంటరులో భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న లోకేశ్

నిర్మాణ రంగాన్ని ఆదుకుంటాం

- అధికారంలోకి వచ్చాక మెరుగైన ఇసుక విధానం అమలు
- అమరావతి పనులు కొనసాగిస్తాం.. మళ్లీ చంద్రన్న బీమా: లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 2: ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెరుగైన ఇసుక విధానాన్ని అమలు చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరి పాతబస్టాండు సెంటరులో మంగళవారం ఆయన భవన నిర్మాణ కార్మికులు, అడ్డా కూలీలను కలసి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ అమరావతి పనులు కొనసాగించి నిర్మాణ రంగానికి గత వైభవం తీసుకువస్తామని, చంద్రన్న బీమాను పునరుద్ధరిస్తామని, సంక్షేమ బోర్డును ప్రక్షాళన చేసి బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. 'జగన్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రంలో నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైంది. అమరావతి పనులు నిలిపివేయడంతో ఉపాధి కోసం కార్మికులు పొట్ట చేతపట్టుకుని పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. గత టీడీపీ ప్రభుత్వం చంద్రన్న బీమా పేరిట కార్మికులకు భరోసా కల్పించింది. ఆ పథకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు రూ.2,500కోట్లు వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి కార్మికులకు తీరని ద్రోహం చేసింది' అని ఆరోపించారు. అమరావతి నిర్మాణం కొనసాగించి ఉంటే దాదాపు ఐదు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేవని తెలిపారు. టీడీపీ పాలనలో ట్రాక్టరు ఇసుక రూ.1,500 ఉంటే.. జగన్ రెడ్డి పాలనలో రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు పెరిగిందన్నారు. దీంతో నిర్మాణ రంగం కుదేలై కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ఉపాధి దొరక్క వందలాది మంది కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని చెప్పారు. గతంలో చంద్రన్న బీమా ద్వారా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతే రూ.5లక్షల సాయం, మట్టి ఖర్చులకు రూ.5వేల తక్షణ సాయం అందించి ఆదుకున్నామని గుర్తుచేశారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు సాయం అందేదని చెప్పారు. కార్మికులు, పేదలను కష్టాల నుంచి గట్టెక్కించేందుకే చంద్రబాబు సూపర్-6 పథకాలు ప్రకటించారని లోకేశ్ తెలిపారు.

వలంటీర్లను తప్పించడంపై స్టే ఇవ్వండి

- హైకోర్టులో పిల్.. నేడు విచారణ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెన్షన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లను నిషేధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది మార్చి 30న జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలయ్యింది. గుంటూరు జిల్లా కుంచెనపల్లి మండలం మున్నంగికి చెందిన వంగా వరలక్ష్మి, బిందు, అల్లు సునీత ఈ పిల్ దాఖలు చేశారు. ఎన్నిక సంఘం ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరారు. ఈ పిల్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని మంగళవారం న్యాయవాది జి.శివప్రసాద్‌రెడ్డి హైకోర్టును అభ్యర్థించగా బుధవారం విచారిస్తామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం తెలిపింది.

పింఛన్ల పంపిణీపై వైసీపీ కుట్ర: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీ విషయంలో అధికార వైసీపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆరోపించారు. పింఛన్ల పంపిణీ ఆలస్యానికి జగన్ సర్కార్, అధికార యంత్రాంగమే ఆధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు పింఛన్ల పంపిణీలో వలంటీర్లను వినియోగించవద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేస్తే.. జగన్ ప్రభుత్వం, అధికార యంత్రాంగం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ పింఛన్ల పంపిణీని ఆలస్యం చేస్తున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి కుయుక్తులను రాష్ట్ర ప్రజలందరూ గ్రహించి రానున్న ఎన్నికల్లో తమ ఓటు ద్వారా జగన్ సర్కారుకు బుద్ధి చెప్పాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

నేటి నుంచి చంద్రబాబు మలి విడత పర్యటన

- మొదటి రోజు కోనసీమ జిల్లా కొత్తపేట, రామచంద్రపురం

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత ప్రజాగళం మలి విడత పర్యటన బుధవారం నుంచి ప్రారంభం అవుతోంది. ఐదు రోజులపాటు ఈ పర్యటన జరగనుంది. ఖరారైన షెడ్యూల్ ప్రకారం తొలి రోజు ఈ నెల 3న కోనసీమ జిల్లాలోని కొత్తపేట, రామచంద్రాపురంలో ఆయన పర్యటన ఉంటుంది. నాలుగో తేదీన కొవ్వూరు, గోపాలపురం, ఐదో తేదీన నర్సాపురం, పాలకొల్లు, ఆరో తేదీన పెదకూరపాడు, సత్తెనపల్లి, ఏడో తేదీన పామర్రు, పెనమలూరుల్లో ఆయన సభలు ఉంటాయి. ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటలకు మొదటి మీటింగ్, ఆరు గంటలకు రెండో మీటింగ్ నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

టీడీపీలో చేరిన కాటసాని సోదరుడు

- చంద్రబాబు సమక్షంలో పలువురు వైసీపీ నేతల చేరిక

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పాణ్యం వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సోదరుడు కాటసాని చంద్రశేఖర రెడ్డి టిడిపిలో చేరారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో మంగళవారం హైదరాబాద్‌లో ఆయన ఆ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డితో కలిసి ఆయన చంద్రబాబు వద్దకు వెళ్లారు. కర్నూలు జిల్లా వైసీపీ మహిళా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు దంపతులు కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వారి అనుచరులు కూడా వారితోపాటు టీడీపీలో చేరారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో 2014లో వైసీపీ తరఫున పోటీ చేసిన వీఆర్ రామిరెడ్డి కూడా మంగళవారం టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఆయనతోపాటు కుమారుడు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, మరో కుమారుడు విఘ్నేశ్వర్ రెడ్డి కూడా చంద్రబాబు సమక్షంలో హైదరాబాద్‌లో టీడీపీలో చేరారు. వారితోపాటు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి కూడా ఉన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.27 లక్షల మంది సిబ్బంది ఉన్నారని, సరిపడా ప్రభుత్వ ఉద్యోగులు లేకపోవడంతో లబ్ధిదారులనే గ్రామ, వార్డు సచివాలయాలకు వచ్చి పింఛను తీసుకునే విధానం ఖరారు చేసినట్టు పేర్కొంది. ఏప్రిల్, మే ఈ రెండు నెలలు ఇదే విధానం అమలవుతుందని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పనిచేస్తాయని, పింఛన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంది.

ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వండి

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు బాబు లేఖ

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లు అందుకునే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వంటి వారికి అందరికీ ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ చేసేలా ఆదేశాలివ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి టీడీపీ అధినేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఇంటింటి పంపిణీకి సరిపడా ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉన్నా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో మురళీధర్‌రెడ్డి కావాలనే అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలపై బురదజల్లే దురుద్దేశంతోనే ఆయన దీనికి మోకాలడ్డుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు ఆయన లేఖ రాశారు. 'ఇప్పటిదాకా వలంటీర్ల ద్వారా పింఛనుదారులకు వారి ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ జరుగుతోంది. ఇటీవల ఎన్నికల కమిషన్ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాల పంపిణీని నిలిపివేసింది. ఈ క్రమంలో గ్రామ/వార్డు సచివాలయాల వద్ద ఈ పింఛన్ల పంపిణీ చేయాలని దీనిని పర్యవేక్షిస్తున్న సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టడానికే ఈ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో రాజకీయ కుట్ర దాగి ఉంది. ఇంటింటికీ పింఛన్లు అందకపోవడానికి టీడీపీ కారణమని వైసీపీ నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నేను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరాను. ఆయన దీనిపై కలెక్టర్ల సమావేశం నిర్వహించి చర్చించారు. వారు కూడా అంగీకరించారు. సచివాలయాల సిబ్బంది, ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడానికి అవకాశం ఉంది. కానీ వీటి పంపిణీకి నోడల్ అధికారిగా ఉన్న సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి అడ్డుపడుతున్నారు. ఈయన రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి బంధువు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై సీబీఐ నమోదు చేసిన కేసుల్లో కూడా ఆయన సహనిందితుడిగా ఉన్నారు. టీడీపీపై బురదజల్లడానికి వీలుగా ఇంటింటికీ పింఛన్ల పంపిణీని అడ్డుకోవాలని జగన్ ప్రభుత్వం మురళీధర్‌రెడ్డిపై రాజకీయ ఒత్తిడి చేస్తోంది. తదనుగుణంగా ఆయన వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు 40 డిగ్రీల సెల్సియస్‌ను మించి ఉన్నాయి. ఈ సమయంలో వృద్ధులు, దివ్యాంగులు, తదితరులు నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి రావడం వారికి చాలా ఇబ్బందికరం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను ఆదేశించండి' అని అందులో కోరారు. కాగా.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్ కుమార్ మీనాకు చంద్రబాబు మంగళవారం ఉదయం ఫోన్లు చేశారు. పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టాలని వారిద్దరికీ విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ పింఛన్ల పంపిణీపై ఎన్నికల కమిషన్ ఎలాంటి ఆంక్షలూ పెట్టలేదని సీఎస్‌కు గుర్తుచేశారు. పింఛన్ల విషయంలో ప్రజల సౌలభ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరారు.

జగన్‌రెడ్డిది ఫేక్ బతుకు..


జగన్‌రెడ్డిది ఫేక్ బతుకని చంద్రబాబు ధ్వజమెత్తారు. తప్పుడు ప్రచారం, అవాస్తవాల దుష్ప్రచారంతో రాజకీయ లబ్ధి పొందే నీచమైన మనస్తత్వం ఆయన డీఎన్ఏలో, వైసీపీ డీఎన్ఏలోనే ఉందని 'ఎక్స్'లో విరుచుకుపడ్డారు. 'ఇళ్ల వద్ద పింఛన్లు పంచవద్దని టీడీపీ ఎక్కడా చెప్పలేదు. ఇళ్ల వద్ద పింఛన్లు ఇవ్వకూడదని ఎన్నికల కమిషన్ కూడా ఆదేశించలేదు. తమ రాజకీయ అవసరాల కోసం వృద్ధులు, దివ్యాంగులు, రోగులను ఇబ్బంది పెట్టడానికి కూడా జగన్ ప్రభుత్వం వెనకాడడం లేదు. మేం అధికారంలోకి రాగానే పింఛను రూ.4 వేలు చేస్తాం. ఇళ్ల వద్దనే ఇస్తాం' అని స్పష్టం చేశారు.

పింఛన్లపై బాబు ఫోన్ సందేశం

సామాజిక పింఛన్లపై వైసీపీ దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పికొడుతూ చంద్రబాబు ఒక ఫోన్ సందేశాన్ని కూడా విడుదల చేశారు. అందులో జగన్‌కు సవాల్ విసిరారు. 'పేదల పింఛన్లను వారి ఇళ్ల వద్ద ఎందుకు పంపిణీ చేయలేకపోతున్నావో ఈ సీఎం సమాధానం చెప్పాలి. లక్షా 30 వేల మంది సచివాలయ సిబ్బందితో పేదల ఇళ్ల వద్ద ఎందుకు పంపిణీ చేయలేకపోతున్నారు? కేవలం టీడీపీపై బురదజల్లడానికే పేదలను ఇబ్బంది పెడుతున్నారు. డబ్బు వచ్చాక కూడా ఇంటి వద్దకు పంపడం చేతకావడం లేదు. మీరు ఇవ్వలేకపోతే మేం వచ్చాక.. ఈ రెండు నెలల మొత్తం కూడా కలిపి ఇస్తాం' అని తెలిపారు.

పింఛన్ల జాప్యం వైసీపీ కుట్రే

- ఆలస్యానికి నిధుల కొరతే కారణం
- నెపం టీడీపీపై వేయాలని చూస్తున్నారు
- ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ



అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఆలస్యం వెనుక వాస్తవాలను తెలియజేస్తూ రాష్ట్ర ప్రజలకు మంగళవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. "ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు పంపిణీ చేసే బాధ్యతల నుంచి వలంటీర్లను ఎన్నికల కమిషన్ తప్పించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇళ్ల వద్దకే పింఛన్లు అందించాలని ఈసీ ఆదేశించింది. కానీ, ఈ పరిణామాన్ని కుట్రలు, కుతంత్రాలకు వైసీపీ ఉపయోగించుకుంటున్న విధానాన్ని రాష్ట్ర ప్రజలు, లబ్ధిదారులు అర్థం చేసుకోవాలి. గతేడాది, 2022లలో ఏప్రిల్ ఒకటో తేదీకి ముందే పింఛన్ల నిధులు బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసి ఒకటో తేదీన పంపిణీ చేశారు. ఈ ఏడాది కూడా ముందే బ్యాంకుల నుంచి విత్ డ్రా చేసి ఉంటే ఇబ్బంది ఎదురయ్యేది కాదు. మార్చి 16 నుంచి 30వ తేదీ మధ్య 15 రోజుల్లోనే సొంత కాంట్రాక్టర్లకు రూ.13 వేల కోట్లు విడుదల చేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వం పింఛనుదారులకు ఇవ్వాల్సిన రూ.2 వేల కోట్లను కూడా సొంత కాంట్రాక్టర్లకు కట్టబెట్టి ఖజానా ఖాళీ చేశారు. నిధుల కొరత వల్లే పింఛన్ల పంపిణీని జాప్యం చేస్తున్నారు. ఇళ్ల వద్దనే పింఛన్లు ఇవ్వాలని ఈసీ ఇచ్చిన ఆదేశాలనూ జగన్ లెక్క చేయకుండా.. మండుటెండల్లో పింఛన్‌దారులను కష్టపెట్టి, ఆ నెపాన్ని ప్రతిపక్షాలపైకి నెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారు. గత ఎన్నికల సమయంలో బాబాయి హత్యను రాజకీయ లబ్ధికి వాడుకున్నాడు. నారాసుర రక్తచరిత్ర అంటూ నాపై నిందలేశాడు. నేడు పింఛన్ల పంపిణీ విషయంలోనూ జగన్నాటకం ఆడుతూ పింఛనుదారులకు నమ్మక ద్రోహం చేస్తున్నాడు. ఈ విషయాన్ని లబ్ధిదారులు, ప్రజలు అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. టీడీపీపైకి నెపం నెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి అవ్వాతాతల్ని అవస్థలపాలు చేయడం దుర్మార్గం కాదా? దివ్యాంగులు, వృద్ధులు, రోగులకు మాత్రమే ఇళ్ల వద్ద పింఛన్లు ఇస్తామని, మిగిలినవారికి సచివాలయాల వద్ద ఇస్తామంటూ సర్క్యులర్ ఇవ్వడం దుర్మార్గం. ఈ కుట్రలకు, నాటకాలకు తెరదించి లబ్ధిదారులందరికీ ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నాను" అని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు.



పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో పవన్‌కల్యాణ్‌ను కలిసిన బీజేపీ నేతలు సుజనాచౌదరి, కామినేని

పవన్‌ను కలసిన సుజనా, కామినేని

- తమ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించాలని వినతి
- కూటమి పార్టీల మధ్య సమన్వయంపై చర్చ

పిఠాపురం, ఏప్రిల్ 2: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి, రాష్ట్ర మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావులు కలుసుకున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌కు వచ్చిన వారు పవన్‌తో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తాము పోటీ చేస్తున్న విజయవాడ పశ్చిమ, కైకలూరు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించాలని సుజనా, కామినేని కోరారు. దీనిపై పవన్ సానుకూలంగా స్పందించారు. పవన్‌ను కలిసిన అనంతరం సుజనాచౌదరి మాట్లాడుతూ కూటమి పార్టీలైన జనసేన, టీడీపీ, బీజేపీల మధ్య సమన్వయం, ప్రచారం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. తన నియోజకవర్గంలో జనసేన తరఫున సీటు ఆశించిన పోతిన మహేశ్‌తో మాట్లాడాలని కోరినట్లు చెప్పారు. కూటమి వల్ల అన్ని పార్టీల నేతలు త్యాగాలు చేయవలసి వచ్చిందని తెలిపారు. పొత్తు కుదరడానికి పవన్ పడిన కష్టం అంతా ఇంతా కాదని తెలిపారు. పవన్ ఏపీ సేవియర్‌గా మారారని చెప్పారు. కూటమి పార్టీల మధ్య పొత్తులో కీలకంగా వ్యవహరించిన పవన్‌కు అభినందనలు తెలిపినట్టు కామినేని శ్రీనివాసరావు తెలిపారు. పవన్‌ను రియల్ లైఫ్ టైమ్ హీరోగా అభివర్ణించారు.

అమ్మ ఒడి ఖర్చుకంటే.. కరెంటు బాదుడే ఎక్కువ

- అమ్మ ఒడి ఖర్చు 26 వేల కోట్లు
- పెంచిన కరెంటు చార్జీలతో అదనంగా పిండింది 27 వేల కోట్లు: పట్టాభి



అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అమ్మ ఒడి పథకం కింద ఇచ్చినదాని కంటే కరెంటు చార్జీలు పెంచి అదనంగా ప్రజల నుంచి పిండింది ఎక్కువగా ఉందని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. వైసీపీ ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన పథకం అమ్మ ఒడి ఒక్కటేనని, దానికి అయిన ఖర్చును కూడా ప్రజల నుంచే పిండారని ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అమ్మ ఒడి పథకం కింద రూ.26 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇదే ఐదేళ్లలో కరెంటు చార్జీలను పెంచి ప్రజల నుంచి అదనంగా రూ.27,500 కోట్లు వసూలు చేసింది. ఒక్క కొత్త పథకం అమలు చేయడానికి ఇంత ఘోరంగా చార్జీలు పెంచారు. చంద్రబాబు ఐదేళ్లు సీఎంగా ఉండి ఒక్క రూపాయి కూడా పెంచలేదు. కరెంటు చార్జీలు పెంచడంతోపాటు చెత్త పన్ను, డ్రైనేజి పన్ను, మరుగు దొడ్డి పన్ను, ఆస్తి పన్నులను కూడా పెంచారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి బాదనంత స్థాయిలో జగన్ ప్రజలను బాదారు. ఈ పిండుడుపై టీడీపీ ప్రత్యేకంగా 'బాదుడే బాదుడు' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఒక కార్యక్రమం నిర్వహించాల్సి వచ్చింది. జగన్‌రెడ్డి విద్యుత్ చార్జీల బాదుడు తట్టుకోలేక పరిశ్రమలు ఈ రాష్ట్రం నుంచి పారిపోయాయి. ఈ బాదుడు కాక విపరీతంగా అప్పులు తెచ్చారు. రాష్ట్రం అప్పులను ఏకంగా రూ.12 లక్షల కోట్లకు చేర్చారు. ఇన్ని అప్పులు తెచ్చి ఏం చేశారో తెలియదు. కనీసం రోడ్లు బాగుచేసే దిక్కు కూడా లేదు' అని పట్టాభి విమర్శించారు. కార్పొరేషన్ల పేరుతో రూ.లక్షల కోట్ల అప్పులు తెచ్చి వాటిని తిరిగి తీర్చలేక రాష్ట్రం పరువు తీస్తున్నారని విమర్శించారు. చార్జీల పెంపుతో ప్రజలకు షాక్ మీద షాక్ ఇస్తున్న జగన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు దిమ్మ తిరిగే షాక్ ఇవ్వడం ఖాయమని పట్టాభి హెచ్చరించారు.

9 మందిపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి. ఐదుగురు ఎస్పీలు సహా ఆరుగురు ఐపీఎస్‌లు, ముగ్గురు కలెక్టర్లను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసింది. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి, అనంతపురం జిల్లా ఎస్పీ కె.కె.ఎన్. అన్బురాజన్, చిత్తూరు జిల్లా ఎస్పీ పల్లె జాషువా, ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజులను, కృష్ణా జిల్లా కలెక్టర్ పీ రాజబాబు, అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి, తిరుపతి కలెక్టర్ డా.లక్ష్మీషాను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీ విస్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అనంతపురం జిల్లా కలెక్టరు, ఎస్పీ ఇద్దరినీ ఒకేసారి బదిలీ చేయడం గమనార్హం. ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చిన కొన్ని గంటల్లోనే ఐదుగురు ఎస్పీలతోపాటు గుంటూరు రేంజ్ ఐజీని పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ఐపీసీ బదులు వైసీపీ చట్టం రాష్ట్రంలో జగన్ సీఎం అయినప్పటి నుంచి అమలవుతోంది. అలా చేయగలిగిన వారికే వైసీపీ నేతలు సిఫారసు చేసి శాంతిభద్రతల విభాగంలో పోస్టింగులు ఇప్పించారు. ఫలితంగా అధికార పార్టీకి చెందిన వారు అరాచకాలు చేసినా బాధ్యులపై కాకుండా బాధితులపై కేసులు పెట్టి చితక్కొట్టే పోలీసు అధికారులే రాష్ట్ర నలుమూలలా కనిపిస్తున్నారు. అదే కోవలో పనిచేసిన ఐపీఎస్ అధికారులకూ రాష్ట్రంలో కొదవలేదు. కానీ నిష్పక్షపాతంగా పనిచేస్తేనే ఎన్నికల విధుల్లో ఉంటారని, ఏపక్షంగా.. పక్షపాతంగా.. వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎన్నికల కమిషన్ గట్టి షాకిచ్చింది. రాష్ట్రంలోని 26 పోలీసు యూనిట్లలో మెజారిటీ ఐపీఎస్‌లు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే అపవాదు చాలాకాలంగా ఉంది. అటువంటి వారిపై నిఘా పెట్టి ఆరుగురికి ఉద్వాసన పలికిన ఎన్నికల కమిషన్ మరికొందరిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒక డీఐజీ, మరో ఐజీ ర్యాంకు అధికారితోపాటు అడిషనల్ డీజీ స్థాయి ఐపీఎస్‌కూ బదిలీ తప్పక పోవచ్చని ఉన్నత స్థాయి ఐపీఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చిన కొన్ని గంటల్లోనే ఐదుగురు ఎస్పీలతో పాటు గుంటూరు రేంజ్ ఐజీని పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వామిభక్తిలో నం.1



సీఎం జగన్ సొంత జిల్లా కడపలో ఏకంగా నాలుగేళ్లు ఎస్పీగా పనిచేసిన కె.కె.ఎన్. అన్బురాజన్ చూపించిన స్వామిభక్తి రాష్ట్రంలో ఎవ్వరూ చూపించలేదు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తులో నిందితుడిని విచారించేందుకు తీసుకెళ్లిన సీబీఐ అధికారులపై కిడ్నాప్ కేసు నమోదుచేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. వైసీపీ ఎన్ని అరాచకాలు చేసినా, భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి (వివేకా హత్యకేసులో నిందితులు) నుంచి ఫోన్ వస్తే చాలు అన్నీ మాయం అయిపోయేవి. ఇంతలా ఏకపక్షంగా వ్యవహరించిన ఆయనకు అనంతపురం జిల్లా ఎస్పీగా రెండు నెలల క్రితమే జగన్ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాయల సీమలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉన్న అనంతపురం జిల్లాలో వైసీపీ కోసం గట్టిగా పని చేయాలని చెప్పి పంపించారు. ఆయన ఆ పనిలో ఉండగానే ఈసీ కంట్లో పడ్డారు. కర్ణాటక మద్యం అనంతపురం జిల్లాలోకి రాకుండా ఎందుకు అరికట్టలేకపోయారని ఎన్నికల కమిషన్ అన్బురాజన్‌ను ప్రశ్నించింది. దానికి ఆయన.. రాష్ట్రంలో మద్యం ధరలు తగ్గాయి, దానివల్ల కర్ణాటక మద్యం అక్రమ రవాణా తగ్గిందని చెప్పారట! 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అనంతపురం జిల్లాలో జరిగిన జగన్ 'సిద్ధం' సభలో వైసీపీ మూకలు దాడి చేశాయి. దాడి దృశ్యాల వీడియోలు లభించాయి. దాడి చేస్తున్నది ఎవరో స్పష్టంగా అందులో కనిపించింది. ప్రజలు సైతం దాడిచేసినవారి వివరాలను బయటపెట్టారు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ దాడి గురించి ఆ జిల్లా ఎస్పీ అన్బురాజన్ అస్సలు పట్టించుకోలేదు. దాడిలో చాలా మంది పాల్గొనగా, తూతూ మంత్రంగా ఒకరిని మాత్రమే ఇప్పటివరకు అరెస్టు చేశారు. ఈ కేసు ఆ తర్వాత ఏమైందో కూడా తెలియదు. అధికార పార్టీవారికి పోలీసులు ఏ స్థాయిలో లొంగి పనిచేస్తున్నారనేది ఈ ఘటనతో ఈసీకి అర్థమై పోయిందని చెబుతున్నారు. దీంతో కొంతకాలంగా ఈయన పనితీరుపై ఎన్నికల కమిషన్ కన్నేసింది. చివరకు వేటు వేసింది.

పెద్దిరెడ్డికి జీ హుజూర్



చిత్తూరు జిల్లా ఎస్పీగా రెండు నెలల క్రితమే నియమితులైన పల్లె జాషువా వైసీపీ కండువా కప్పుకోవడమే తక్కువ అన్నట్లు పనిచేశారని చెబుతారు. తన బ్యాచ్‌మేట్ పరమేశ్వర్ రెడ్డితో ఉన్న స్నేహం వైసీపీ ప్రభుత్వంలో జాషువాకు బాగా కలిసొచ్చింది. ఐపీఎస్ వచ్చిన వెంటనే విజయవాడ శాంతి భద్రతల డీసీపీగా పోస్టింగ్ తెచ్చుకున్న ఆయన ఇక్కడి వైసీపీ నేతలు ఏది చెప్పినా కాదనకుండా చేసేవారనే ఆరోపణ ఉంది. దీంతో కొన్ని నెలల్లోనే కృష్ణా జిల్లా ఎస్పీగా పోస్టింగ్ తెచ్చుకుని తన కారులోనే వైసీపీ నేతలు, వారి కుమారుల్ని సైతం కూర్చోబెట్టుకుని బహిరంగంగా తిరిగేవారు. ఆయన పనితీరుపై వస్తున్న ఆరోపణలతో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి పలుమార్లు టెలి కాన్ఫరెన్స్‌లో సైతం హెచ్చరించారని ఇతర ఐపీఎస్‌లు చర్చించుకొనేవారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రతిష్ఠకు వచ్చినప్పుడు గన్నవరం విమానాశ్రయంలో కాంగ్రెస్ శ్రేణులు నల్ల బెలూన్లు గాల్లోకి ఎగురవేసి నిరసన తెలిపాయి. అప్పట్లోనే కేంద్ర నిఘా వర్గాలు నివేదిక కోరడంతో జాషువాపై వేటు పడుతుందని అనుకున్నారు. గతంలో చిత్తూరు జిల్లాలో డీఎస్పీగా పనిచేసిన జాషువాకు వైసీపీ కీలక నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మంచి సాన్నిహిత్యం ఉంది. కుప్పంలో ఎలాగైనా చంద్రబాబును ఓడించాలని సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించే బాధ్యత జగన్ ఈ ఎన్నికల్లో పెద్దిరెడ్డికి అప్పగించారు. తమ లక్ష్యం నెరవేరాలంటే జిల్లాలో ఏకపక్షంగా పనిచేసే వారిని ఎస్పీగా నియమించాలని అనుకున్నారు. జాషువాను మించిన వారెవరూ లేరంటూ జనవరి చివరి వారంలో ఆయనను చిత్తూరు జిల్లాకు తెచ్చిపెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో కాస్త గట్టిగా పని చేద్దామనుకున్న అక్కడి సీఐలు, ఎస్ఐలను క్రిమినల్స్ కన్నా హీనమైన భాషలో తిడుతూ పట్టు తెచ్చుకునే ప్రయత్నం చేశారు. అన్నీ గమనించిన ఎన్నికల కమిషన్... పాలకులకు నీ దండాలు.. సిబ్బందికి నీ బూతులు చాల్లే ఎన్నికలు ముగిసే దాకా దూరంగా ఉండు అంటూ పక్కన పెట్టేసింది.

'తిరుపతి బంధా'నికి బ్రేక్



రాయలసీమకు చెందిన పరమేశ్వర్‌రెడ్డి 2010 గ్రూప్ వన్ ద్వారా డీఎస్పీ అయ్యారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆయనకు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. జగన్ కుటుంబానికి దగ్గరగా ఉండే పరమేశ్వర్ రెడ్డికి ఐపీఎస్ వచ్చిన వెంటనే రాష్ట్రంలోనే పెద్దదైన తిరుపతి జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. అయితే అక్కడ పార్లమెంటు ఉప ఎన్నిక సందర్భంగా వైసీపీ పాల్పడిన అక్రమాలు, అరాచకాలు ఎన్నికల కమిషన్‌ను సైతం ఆశ్చర్యానికి గురిచేశాయి. అటువంటి అరాచకాలకు పాల్పడిన వారిపై నమోదైన కేసులు పరమేశ్వర్‌రెడ్డి ఎస్పీగా ఉన్నప్పుడు క్లోజ్ అయ్యాయి. అవి రాజకీయ పరమైన కేసులు కావడమూ, కనీస సమాచారం బయటికి ఇవ్వకుండా ఎఫ్ఐఆర్ మూసేయడంతో ఈసీ సీరియస్ అయింది. బాధ్యులైన పోలీసులపై కేసులు నమోదు చేయించి పరమేశ్వర్ రెడ్డిపై చర్యకు సిఫారసు చేసింది. దీంతో అప్రమత్తమైన జగన్ ప్రభుత్వం ప్రకాశం జిల్లా ఎస్పీగా ఆయనను నియమించింది. వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఎంపీగా గెలిపించే బాధ్యత పరమేశ్వర్ రెడ్డికి అప్పగించారు. తిరుపతి బంధం కావడంతో అంతా సజావుగా జరుగుతుందని వైసీపీ పెద్దలు భావించారు. అందుకు అనుగుణంగానే ఎన్నికల షెడ్యూల్ వెలువడిన రెండు రోజులకే ప్రతిపక్ష టీడీపీకి చెందిన కీలక కార్యకర్త హత్య జరిగింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ఎన్నికల కమిషన్.... పరమేశ్వర్ రెడ్డిని పిలిచి గట్టిగా హెచ్చరించింది.. అప్పటికే ప్రధాని పల్నాడు పర్యటన సందర్భంగా ట్రాఫిక్ పర్యవేక్షణ బాధ్యతలు సరిగా నిర్వర్తించలేదన్న నివేదిక ఉండటంతో ఈసీ వేటు పడింది.

పల్నాడులో వైసీపీ చేతికి లాఠీ



ఫ్యాక్షన్ గొడవల ప్రాంతమైన పల్నాడులో అధికార వైసీపీ నేతల అరాచకాలు, భూకబ్జాలు, అక్రమాలకు ఆ జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి అండ ఉందని అక్కడ ప్రతినోటా వినిపిస్తుంది. వైసీపీ కేడర్ సైతం 'జిల్లా ఎస్పీ మా వాడు.. మిమ్మల్ని తన్నినా, చంపినా మాపై కేసు ఉండదు..' అంటూ దర్జాగా దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. ప్రతిపక్ష టీడీపీ నేత జూలకంటి బ్రహ్మారెడ్డి మాచర్లలో టీడీపీ కార్యాలయం ప్రారంభించి ప్రజల్లోకి వెళ్లగా వైసీపీ మూకలు అడ్డుకున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో చెప్పేందుకే జనంలోకి కరపత్రాలతో వెళుతున్నాం తప్ప తాము ఎవ్వరినీ రెచ్చగొట్టేందుకు కాదని చెప్పినా వినిపించుకోకుండా వైసీపీ మూకలు దాడులు చేశాయి. టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరుల్ని తరిమి తరిమి కొడుతూ ఇళ్లల్లోకి దూరి మహిళలపైనా దౌర్జన్యాలు చేశాయి. టీడీపీ కార్యాలయాన్ని తగుల బెట్టి విధ్వంసం సృష్టించి బిహార్ కన్నా ఎక్కువ హింసను చూపించాయి. అయినా సరే రెచ్చగొట్టారంటూ టీడీపీ శ్రేణులపై ఏకంగా హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత రవిశంకర్ రెడ్డిదే. అంతకు ముందే టీడీపీ నాయకుడు తోట చంద్రయ్య హత్య ఆ ప్రాంతంలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇవన్నీ ఒక ఎత్తయితే ఆ ప్రాంతంలోని వైసీపీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, పిన్నెల్లి రామక్రిష్ణా రెడ్డి చేసే భూ కబ్జాలకు, ఇసుక దందాలకు, మైనింగ్ దోపిడీకి, ఇతర అక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారనే పేరు ఎస్పీ రవిశంకర్ రెడ్డికి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కుల సంఘం తరఫున రెడ్ల ఏ చిన్న కార్యక్రమం చేపట్టినా ఆయన హాజరవుతారు. పల్నాడు ప్రాంతంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తులు ఈసీ భరోసాతో ఇటీవలే తిరిగి వస్తున్నారంటే పల్నాడులో ఎంత అరాచకం ఉందో చెప్పక్కర్లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోదీ పల్నాడు పర్యటనకు వచ్చినప్పుడు భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపించింది. చిలకలూరిపేట సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతుండగా, మధ్యలో వచ్చి స్వయంగా మోదీ మైకు అందుకుని 'పోలీసులు మీ రేమి చేస్తున్నారు.. వాళ్లను దించండి.. అక్కడ కరెంట్ ఉంది' అంటూ సూచించడం చర్చనీయాంశమైంది. ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభా నిర్వాహకులను అడ్డుకోవడం, మైకు ఆగిపోతున్నా జనాన్ని అదుపు చేయకపోవడం, ఆఖరికి సభకు వచ్చే వాహనాలను సైతం ట్రాఫిక్ నుంచి మళ్లించక పోవడం లాంటివి రవిశంకర్ రెడ్డిపై వేటుకు కారణాలుగా చెబుతున్నారు. కాగా, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు తన పరిధిలోని పోలీసు అధికారులతో సమర్థవంతంగా పని చేయించడంలో విఫలమయ్యారు. మంచితనం ఉన్న ఆయన, పోలీసు అధికారిగా పనితీరు కనబరిస్తేనే ఫలితం ఉంటుంది తప్ప సౌమ్యం అన్నింటా కుదరదు. ముఖ్యంగా వైసీపీ అరాచక పాలనలో అలాంటి ప్రవర్తన ఏమాత్రం సాధ్యం కాదని అర్థం చేసుకోలేకపోవడమే ఆయన బదిలీకి ప్రధాన కారణమని ఐపీఎస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రధాని సభకు భద్రతాఏర్పాట్ల పర్యవేక్షణలో వైఫల్యం చెందారనే అపవాదు మూటగట్టుకున్నారు.

వైసీపీ అడ్డాగా ఎస్పీ నివాసం..!



సుమారు ఏడాది క్రితం తిరుమలేశ్వరరెడ్డి నెల్లూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. మొదటి నుంచీ ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, ఎస్పీ బదిలీకి ప్రధాన కారణం ప్రధానమంత్రి సభలో వైఫల్యమేనని ఉన్నతవర్గాలు చెబుతున్నాయి. తిరుమలేశ్వరరెడ్డి మామ దుగ్గిరెడ్డి గురువారెడ్డి వైసీపీ నాయకుడు. దానివల్ల కూడా ఆయనను బదిలీ చేసినట్టు భావిస్తున్నారు. దీనిపై మూడు రోజుల క్రితమే రాష్ట్ర టీడీపీ నేతలు.. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తిరుమలేశ్వరరెడ్డి మామ వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని, వైసీపీ నాయకులు ఎస్పీ ఇంటికి రాకపోకలు సాగిస్తూ లాబీయింగ్ చేస్తున్నారని తమ ఫిర్యాదులో తెలిపారు. ఫలితంగానే ఆయనను బదిలీ చేసినట్టు భావిస్తున్నారు.

ఈసీ నిఘా ఉందని తెలిసినా తిరుపతి కలెక్టర్ లక్ష్మీశ అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన ఈ ఏడాది జనవరి 28న కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అదేరోజు స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిని కలుసుకోవడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదం అయింది. తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా వైసీపీ తరఫున భూమన తనయుడు బరిలో ఉన్న సంగతి తెలిసిందే.



'దొంగ ఓట్ల' దెబ్బ.. ముగ్గురు కలెక్టర్లపై వేటు

కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గురు ఐఏఎస్‌లపై వేటు వేసింది. కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి, తిరుపతి కలెక్టర్ లక్ష్మీశను విధుల నుంచి తప్పించింది. కలెక్టరు విధుల నుంచి తప్పుకొని వెంటనే జీఏడీలో రిపోర్టు చేయాలని వారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఒకేసారి ముగ్గురు కలెక్టర్లపై కేంద్ర ఎన్నికల సంఘం వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది. ఓటర్ల జాబితాలో అవకతవకల దగ్గర నుంచి విధుల్లో నిర్లక్ష్యం, ప్రభుత్వం పట్ల సానుకూల ధోరణి వంటి కారణాలతో వీరిని అకస్మాత్తుగా బదిలీ చేసినట్టు చెబుతున్నారు. రాజాబాబు, గౌతమి ఏడాది క్రితమే బదిలీపై కృష్ణా, అనంతలకు వచ్చారు. గత ఏడాది ఏప్రిల్ 6వ తేదీన జగన్ ప్రభుత్వం ఒకేసారి దాదాపు ఎనిమిది కలెక్టర్లను బదిలీ చేసింది. ఆ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న రాజాబాబును కృష్ణా కలెక్టర్‌గా, తిరుపతిలో ఎలక్ట్రికల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ సీఈవోగా ఉన్న ఎం.గౌతమిని అనంతపురం కలెక్టర్‌గా నియమించింది. లక్ష్మీశ ఈ ఏడాది జనవరి 28వ తేదీన తిరుపతి కలెక్టర్‌గా నియమితులయ్యారు. దొంగ ఓట్ల వ్యవహారం రాష్ట్రమంతా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఉమ్మడి అనంతపురం జిల్లా ఉరవకొండలో అత్యధికంగా దొంగ ఓట్లు నమోదు అయ్యాయని కలెక్టర్‌కు అనేక ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై కలెక్టర్ పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోగా, తీవ్ర నిర్లక్ష్యం వహించారు. పైగా సీనియర్ మంత్రి పెద్దిరెడ్డికి బంధువు కావడం, సీఎంవోలోని కీలక అధికారికి సన్నిహితంగా ఉంటూ, ఆయన ఆదేశాలపై పనిచేస్తుండటాన్నీ ఈసీ గమనించింది. దీంతో గౌతమిపై ఈసీ బదిలీ వేటు వేసింది. ఈసీ నిఘా ఉందని తెలిసినా తిరుపతి కలెక్టర్ లక్ష్మీశ అత్యుత్సాహం ప్రదర్శించారు. బాధ్యతలు తీసుకున్న రోజే వైసీపీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డిని కలిశారు. అప్పటికే తిరుపతిలో దొంగ ఓటు కార్డుల వ్యవహారంపై ఈసీ అత్యంత సీరియస్‌గా ఉంది. ఇలాంటి సమయంలో లక్ష్మీశ ప్రవర్తన ఈసీకి ఆగ్రహం తెప్పించింది. ఇటీవల ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తిరుపతిలో అధికార పార్టీ దాచిన వేలకొద్ది తాయిలాలు పట్టుబడ్డాయి. దీనిపై కలెక్టర్ ఇచ్చిన రిపోర్టు స్పష్టంగా లేకపోవడంతో ఈసీ వేటు వేసిందని చెబుతున్నారు.


గౌతమి


రాజాబాబు

జగనన్నా.. ఎందుకు భయం?

(మొదటి పేజీ తరువాయి)



ఈ ప్రయత్నం" అని తెలిపారు. పులివెందుల పోలీసులు తనపైనా, తన భర్తపైనా నమోదు చేసిన కేసు కొట్టివేయాలని కోరుతూ దాఖలు చేసిన వ్యాజ్యం సోమవారం విచారణ ఉన్న సందర్భంగా సునీత హైకోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. "చిన్నాన్నను ఎవరు హత్య చేశారో దేవుడికి తెలుసు, కడప ప్రజలకు తెలుసు అని జగనన్న ప్రకటనలు చేస్తున్నారు. అంటే.. ఆ ప్రాంతవాసిగా ఆయనకు కూడా తెలుసనే కదా. మరి హత్య చేసినవారి పేర్లను ఎందుకు బయటపెట్టడం లేదు? ముఖ్యమంత్రిగానైనా దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత జగనన్నపై ఉంది. అవినాశ్ రెడ్డిని ఎందుకు కాపాడుతున్నారో సమాధానం చెప్పాలి. ఆయనను అరెస్టు చేస్తే ఇతర విషయాలు కూడా బయటకు వస్తాయని భయపడుతున్నారా?" అని సునీత ప్రశ్నించారు. తన ప్రశ్నలకు ఒక అన్నగా జగన్ తనకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేనప్పటికీ... ముఖ్యమంత్రిగా ఆ బాధ్యత కచ్చితంగా ఉందన్నారు. "జగన్ ఎందుకు భయపడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలి. నేను లేవనెత్తిన ప్రశ్నలపై జగన్ సొంత చానల్‌కు వచ్చి చర్చించేందుకూ సిద్ధం" అని సునీత పేర్కొన్నారు.

ప్రతిసారీ మోసం చేయలేరు...

"ఎవరో పన్నిన ఉచ్చులో నేను, షర్మిల పడ్డామని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డితోపాటు పలువురు పదేపదే చెబుతున్నారు. వాస్తవానికి వివేకా హత్య తర్వాత జగన్ పన్నిన ఉచ్చులోనే నాతోపాటు రాష్ట్రప్రజలంతా పడ్డారు. అప్పట్లో నన్ను జగన్ తోలుబొమ్మలా ఆడించారు. హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టించి అవినాశ్‌రెడ్డికి అనుకూలంగా మాట్లాడించారు. ఎవరినైనా ఒకసారి మోసం చేయవచ్చు. పదేపదే చేయలేరు. ప్రజలు చాలా తెలివైనవారు. నిజం గ్రహిస్తారు. సానుభూతి మాటలతో ప్రతీసారి ప్రజలను మోసం చేయలేరు" అని సునీత తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రక్తంలో మునిగి ఉందని, దీని నుంచి బయటపడితేకానీ రాష్ట్ర పురోగతి సాధ్యం కాదని తెలిపారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే తనకు, రాష్ట్ర ప్రజలకూ మంచిది కాదని హెచ్చరించారు.

పార్టీని నిలబెట్టిన షర్మిల...

కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిలకు సునీత అభినందనలు తెలిపారు. అప్పట్లోనే షర్మిలకు కడపలో పోటీకి నిలబెట్టాలని వివేకానందరెడ్డి శాయశక్తులా ప్రయత్నించారని, ఈ క్రమంలోనే ఆయన హత్యకు గురయ్యారని చెప్పారు. "పెదనాన్న రాజశేఖరెడ్డి చనిపోయిన తరువాత జగన్ జైలుకు పోయినప్పుడు జరిగిన ఉపఎన్నికల్లో షర్మిల కష్టపడి ప్రచారం చేశారు. పాదయాత్ర చేసి షర్మిల పార్టీని నిలబెట్టారు. జైలు నుంచి వచ్చిన తర్వాత షర్మిల ఎక్కడ బలపడుతుందో అని ఆమెను జగన్ పక్కనపెట్టారు. వారికి ఎప్పుడు అవసరం వచ్చినా షర్మిల సహాయం చేసింది. 2014, 2019 ఎన్నికల్లో ప్రచారం చేసి పార్టీని గెలిపిస్తే చివరికి ఆమెను పక్కనపెట్టారు" అని సునీత పేర్కొన్నారు. వివేకా హత్య కేసులో విచారణ జరిగి శిక్ష పడితే ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి కుదరదని విచారణకు రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఇది వ్యవస్థలతో ఆడుకోవడం కాదా అని ప్రశ్నించారు.

అంతకంటే క్రూరంగా చంపారు...

తన తండ్రి హత్యోదంతంపై వచ్చిన 'వివేకం' సినిమాను చాలా ధైర్యంగా తీశారని సునీత తెలిపారు. అయితే... సినిమాలో కొన్ని సంఘటనలను చాలా లైట్‌గా తీశారని, వాస్తవంగా అవి మరింత ఘోరంగా ఉన్నాయని చెప్పారు. తన తండ్రిని సినిమాలో చూపించినదాని కన్నా మరింత క్రూరంగా హత్య చేశారన్నారు.

నట వీర.. నట శూర!

- ఎన్నికల ప్రచారంలో జగన్ అద్భుత ప్రదర్శన
- స్క్రిప్టు ప్రకారం బయట పడుతున్న 'జాలి గుండె'
- ఐదేళ్లు జనాన్ని ఆమడ దూరం ఉంచిన జగన్
- వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినా ఈడ్చి పడేయడమే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా బారికేడ్లు పెట్టి, పరదాలు కట్టి జనాన్ని ఆమడ దూరంలో ఉంచారు. ఇప్పుడు మరోసారి అధికారం కోసం నానా అగచాట్లు పడుతున్నారు. 'నాది జాలిగుండె' అని చెప్పుకునేందుకు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. ఇదంతా 'ఐప్యాక్' ఆడిస్తున్న కరుణ రసాత్మక నాటకం! షెడ్యూలు విడుదలకు ముందు జనాన్ని పట్టించుకోని జగన్... ఎన్నికల ప్రచారంలో మాత్రం 'ఎంతటి కరుణామయుడో' అనిపించే స్థాయిలో పెర్ఫామెన్స్ చూపిస్తున్నారు. ఈ రెండు సీన్లు చూస్తే మీకే ఆ విషయం అర్థమవుతుంది.

సీన్ 1: ఎన్నికల షెడ్యూలు విడుదలకు ముందు..




అది ధర్మవరం మండలం తుంపర్తి గ్రామం. వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం రైతుల నుంచి భూమి సేకరించింది. కానీ... ఏళ్లు గడుస్తున్నా పరిహారం చెల్లించలేదు. నార్పలకు వచ్చిన జగన్ తిరుగు ప్రయాణంలో పుట్టపర్తి విమానాశ్రయానికి రోడ్డు మార్గాన వెళుతున్నారని తెలిసి.. బాధిత రైతులు, ఆ కుటుంబాలకు చెందిన మహిళలు, వృద్ధులు రోడ్డుపైకి వచ్చారు. సీఎంకు తమ గోడు విన్నవించుకునే ప్రయత్నం చేశారు. భద్రతా సిబ్బంది వారిని పక్కకు ఈడ్చి పడేశారు. వృద్ధులు, మహిళల్ని రోడ్డుపై నుంచి లాగి పడేస్తున్నదంతా చూసి కూడా జగన్ రెడ్డి పట్టించుకోలేదు. ముఖం పక్కకు తిప్పుకొని రయ్యిన కాన్వాయ్ కార్లలో పుట్టపర్తి వైపు వెళ్లిపోయారు. రెండు మూడు నెలల ముందు ఈ ఘటన జరిగింది. ఇదే కాదు! జగన్ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఇదే తంతు. బారికేడ్లు అడ్డు పెట్టడం, పరదాలు కట్టడం! ఏ ఒక్కరూ ఆయన సమీపానికి కూడా వచ్చే వీలు లేకుండా చేశారు. ఒకవేళ ఎవరైనా ధైర్యం చేసి రోడ్డుపక్క నిలబడి ఏ వినతి పత్రమో ఇచ్చే ప్రయత్నం చేస్తే పోలీసులు వారిని పక్కకు నెట్టేసేవారు. ఇక... విపక్షాలు, ప్రజా సంఘాల ప్రతినిధులను ఒక రోజు ముందే గృహ నిర్బంధంలో పెట్టడం రివాజుగా మారింది.

సీన్ 2: ఎన్నికల ప్రచారంలో...



జగన్మోహన్ రెడ్డి బుల్లెట్ ప్రూఫ్ బస్సులో కూర్చుంటారు. ముందూ వెనుకా అటూ ఇటూ భారీ భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. బస్సు ముందుకు వెళ్తూ ఉంటుంది. అంతలో రోడ్డు పక్క నుంచి... ఒకరో ఇద్దరో 'అన్నా... జగనన్నా' అని కేకలు వేస్తారు. అదేమి చిత్రమోకానీ, బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో కూర్చున్న జగన్‌కు వాళ్ల పిలుపు వినిపిస్తుంది. వెంటనే... 'ఆపేయ్' అంటూ జగన్ సైగ చేయగానే, డ్రైవరు బస్సును ఆపేస్తాడు. రోడ్డుపక్కన ఉన్న ఆ ఒకరిద్దరినీ పోలీసులు నిలువరిస్తుండగా... జగన్ బస్సు దిగొస్తారు. వారిని ఆప్యాయంగా కౌగిలించుకుంటారు. వారితోపాటు కింద కూర్చుని యోగక్షేమాలు అడుగుతారు. ఆ వెంటనే... సొంత మీడియా.. కూలి మీడియాలో 'హోదాను కూడా మరిచి పేదలకోసం కిందికి దిగిన జగనన్న' అంటూ వీడియో క్లిప్పులు, ఫొటోలతో హోరెత్తిస్తారు. ఈ తతంగమంతా ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతోందనే అనుమానాలూ ఉన్నాయి. ఒక జిల్లాలో రెండు కాళ్లు లేని దివ్యాంగుడు... మరో జిల్లాలో ఒంటరి మహిళ... ఇంకో చోట ముస్లిం మైనారిటీకి చెందిన పెద్దాయన... ఇలా పరామర్శలు కూడా ఒక స్కీమ్ ప్రకారం సాగుతుండటం గమనార్హం. గతంలో ఇలా రోడ్డుపక్కన ఉన్న వారిని ఈడ్చేసిన పోలీసులే... ఇప్పుడు సున్నితంగా వ్యవహరిస్తూ, కెమెరా యాంగిల్ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వెరసి... ఇదంతా ఐ ప్యాక్, రోత మీడియా బృందం కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో నడుస్తున్న నాటకమని ఇట్టే అర్థమవుతుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.









హాట్ సమ్మర్

రోజు రోజుకు నగరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండ వేడిమితో రోడ్లపై జన సంచారం తగ్గుముఖం పడుతోంది. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో ఎండ ధాటికి తట్టుకోలేక చల్లటి ప్రదేశాలను ఆశ్రయిస్తున్నారు. పరీక్షలు ముగియడంతో చాలామంది విద్యార్థులు సమ్మర్ క్యాంపులకు వెళుతున్నారు. ఆయా క్లాసులకు వెళ్లివచ్చేటప్పుడు ఎండ నుంచి తప్పించుకునేందుకు ముఖాలకు మాస్కులు, గొడుగులు ఉపయోగిస్తున్నారు. ఎండ నుంచి ఉపశమనాన్ని పొందేందుకు చల్లటి పానీయాల వద్ద గుమిగూడుతున్నారు..

సీజనల్ వ్యాధులపై అవగాహనతో ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు

కృష్ణలంక, ఏప్రిల్ 2: సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు అన్నారు. జిల్లాలో పొందుగల పరిసర ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా లాంటి జ్వరాలు ప్రబలడంతో అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లతో నగరంలో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది సహాయంతో డోర్ టు డోర్ సర్వే నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలోని ల్యాబ్ టెక్నీషియన్లు జ్వర రోగుల పట్ల అప్రమత్తంగా ఉండి, రక్తనమూనాతో పాటుగా సత్వరమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. రోగ నిర్ధారణ తరువాత పై అధికారులకు తెలిపి వైద్య సాయం అందేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు సహకరించి సమీపంలోని ప్రభుత్వ వైద్యారోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఎట్టి పరిస్థితులలోను నిర్లక్ష్యం చేయకుండా ఉండాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారులు, రామచంద్రారెడ్డి, బాబావలి, సుబ్బారావు, శ్యాంబాబు, శ్రీనివాసరావు, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

చిట్టినగర్, ఏప్రిల్ 2: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బొమ్మతో ఆ పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేష్‌కు మద్దతుగా మంగళవారం ఎర్రకట్ట రోడ్డులో సంతకాల సేకరణ చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ సర్వైలెన్స్ టీమ్) ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎర్రకట్ట బైజర్ పేట ప్రాంతంలో ఎఫ్ఎస్‌టీ టీమ్-5 తిరుగుతుండగా అక్కడ మల్లిఖార్జునపేటకు చెందిన బైపరామకృష్ణ, చిట్టినగర్‌కు చెందిన లండా ప్రశాంత్ పోతిన మహేష్‌కు పశ్చిమ సీట్ కేటాయించాలని సంతకాల సేకరణ చేస్తున్నారు. ఇందుకు రిటర్నింగ్ అధికారి అనుమతి ఉందా అని ప్రశ్నించగా అనుమతి లేదని తెలియటంతో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నిర్వహిస్తున్నందున వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

ఓటు వినియోగంపై ప్రజలను చైతన్యపరచండి

● రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేత పేరం

ధర్నాచౌక్, ఏప్రిల్ 2: ఓటర్లు ఓట్లు ఎలా వేయాలి, ప్రజాస్వామ్యాన్ని ఎలా పరిరక్షించాలనే అనే అంశంపై ప్రజలను చైతన్యం చేసేందుకు తమ పార్టీకి అవకాశం కల్పించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి, ఆ పార్టీ విజయవాడ ఎంపీ అభ్యర్థి పేరం నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌కు మంగళవారం అర్జీ పెట్టి మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ధర్నాచౌక్, ఏప్రిల్ 2: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ, మన రామరాజ్యం పార్టీలు కలిసి ప్రజా సోషలిస్టు కూటమిగా ఏర్పడి రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్నట్టు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కేబీ.శ్రీధర్, పద్మాకర్ బజాక్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి పని చేస్తుందన్నారు. త్వరలోనే ప్రజాదర్శన యాత్ర చేపడతామన్నారు. మన రామరాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షుడు మావులేటి ధనేష్, రాజ్యాధికార పార్టీ జాతీయ అధ్యక్షుడు నారగోని, ఐసీపీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, లాం జయబాబు పాల్గొన్నారు.

జాతీయ సీనియర్స్ క్యారమ్స్‌కు వంశీకృష్ణారెడ్డి

విజయవాడస్పోర్ట్సు, ఏప్రిల్ 2: గ్వాలియర్‌లో ఈ నెల 6 నుంచి 10 వరకు జరిగే సీనియర్ నేషనల్స్ క్యారమ్స్ టోర్నీలో జిల్లా నుంచి క్యారమ్స్ ప్లేయర్స్ ఎ.వంశీకృష్ణారెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నాడు. జిల్లా నుంచి పలు టోర్నీల్లో సత్తా చాటిన వంశీకృష్ణ విజేతగా తిరిగి రావాలని జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ సెక్రటరీ జె.మురళీకృష్ణ, కోచ్ సంపత్‌కుమార్ ఆకాంక్షించారు. స్థానికంగా నగరంలో ఆయన్ని అభినందించారు.

త్వరలో పశ్చిమ పర్యటనకు పవన్ రాక



వన్‌టౌన్, ఏప్రిల్ 2: కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి విజయాన్ని కాంక్షిస్తూ జనసేనాధిపతి పవన్‌కల్యాణ్ రానున్నారు. మంగళవారం పవన్‌కల్యాణ్‌ను సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, వర్మ, చినరాజప్పను కలిశారు. ఈ సందర్భంగా సుజనాచౌదరి మాట్లాడుతూ, పార్టీల కూటమికి పవన్‌కల్యాణ్ చేసిన కృషిని అభినందించారు. రాష్ట్రంలోని అరాచక, ప్రజావ్యతిరేక, అభివృద్ధి రహిత పాలనను తరిమికొట్టేందుకు సీట్ల విషయంలో త్యాగం చేసినందుకు ప్రత్యేక ప్రశంసలు అందచేశారు. సొంత సోదరుడు పోటీచేస్తానన్నప్పటికీ ఉమ్మడి పొత్తులో త్యాగం చేయడం ప్రశంసనీయమన్నారు. పశ్చిమ నుంచి తన గెలుపు సునాయాసమన్నారు. మరో వైపు పశ్చిమలో ప్రచారానికి పవన్‌కల్యాణ్ రానున్నారని తెలిపారు.

నగరానికి స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్మోహన్ మిశ్రా

నోవాటెల్ వద్ద స్వాగతం పలికిన ముఖేష్ కుమార్ మీనా, ఢిల్లీరావు



కృష్ణలంక, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 1987 బ్యాచ్‌కి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామ్మోహన్ మిశ్రాను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ జనరల్ అబ్జర్వర్‌గా ఇటీవల నియమించింది. ఢిల్లీ నుంచి నగరానికి చేరుకొన్న మిశ్రాకు నోవాటెల్ హోటల్ వద్ద రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, కలెక్టర్ ఢిల్లీరావు స్వాగతం పలికారు.

ప్రతి ఓటు ముఖ్యమే..!

● 40 రోజులు శక్తివంచన లేకుండా కృషి చేయాలి ● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఏప్రిల్ 2: ప్రతి ఓటు ఎంతో ముఖ్యమని ప్రతి ఒక్కరూ ఈ 40 రోజులు శక్తివంచన లేకుండా కృషి చేసి ఉమ్మడి అభ్యర్థులకు అఖండ మెజారిటీ వచ్చేలా చూడాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బూత్ స్థాయి నుంచి టీడీపీ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు నియోజకవర్గానికి తాను చేయదలచుకున్న అభివృద్ధిని కూడా వివరించాలని చెప్పారు. స్థానిక రాయనగర్ కళ్యాణ మండపంలో మంగళవారం మండలంలోని బూత్ లెవెల్ ఏజెంట్లు, కూటమి నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ బూత్ స్థాయిలో ఏ సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సమిష్టిగా కృషి చేసి పరిష్కరించుకుందామన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజలకు మరింతగా తెలియజెప్పాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలను సమన్వయ పరిచి టీడీపీకి అనుకూలంగా ఓటు వేసేలా కూటమి నాయకులు, కార్యకర్తలు చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. చంద్రబాబు నాయకత్వం, సమర్థతపై ప్రజలు అనుకూలంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో మూడు పార్టీల నేతలు అందరలందరూ సమష్టిగా పని చేసి భారీ మెజార్టీతో విజయం సాధించి గన్నవరం సీటును భువనమ్మకు కానుకగా ఇద్దామన్నారు. జనసేన సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు, బీజేపీ జిల్లా నాయకుడు నాదిండ్ల మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, దొంతు చిన్న, పొట్లూరి బసవరావు, మండవ లక్ష్మీ, జాస్తి శ్రీధర్, కొమ్మరాజు సుధీర్, గూడపాటి తులసీ మోహన్, పడమట రంగారావు, తుల్లిమిల్లి ఝాన్సీ, మద్దినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

మండలంలోని సావరగూడెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ శ్రేణులు యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండు వాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వైసీపీలో ఎన్నో అవమానాలు పడ్డానని, ఆ పార్టీ శ్రేణులు కూడా అదే స్థితికి వచ్చి టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. జగన్‌ను నమ్ముకుంటే యువత మత్తు పదార్థాలకు బానిసలవడమేనని, అదే చంద్రబాబు అధికారంలో ఉంటే పరిశ్రమలతో రాష్ట్రం కళకళలాడుతూ ఉంటుందని యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని వివరించారు. టీడీపీలో చేరే ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.



బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



రామవరప్పాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న జ్ఞానేశ్వరి

చంద్రబాబుతోనే మైనార్టీలకు న్యాయం: జ్ఞానేశ్వరి

గుణదల: రాష్ట్రంలో మైనార్టీలకు తగిన గుర్తింపు రావాలన్నా...న్యాయం జరగాలన్నా టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యపడుతుందని గన్నవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి యార్లగడ్డ జ్ఞానేశ్వరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మంగళవారం రామవరప్పాడు గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదలకు న్యాయం జరగాలన్నా...గాడితప్పిన ఆర్థిక విధానం గాడిలో పెట్టాలన్నా చంద్రబాబు అధికారంలోకి రావల్సిందేనని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా మరోసారి పరిపాలించాల్సిన చారిత్రాత్మక అవసరం ఏపికి ఉందని చెప్పారు. లేదంటే నిరుద్యోగం బాగా పెరిగి పోవడం అప్పుల బాదల్లో కూరుకుపోవడం ఖాయమని అన్నారు. టిడిపి అధికారంలో ఉన్న సమయంలో మాత్రమే మహిళలకు ఆత్మగౌరవం దక్కేదని నేడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటి రంగాన్ని అభివృద్ధి చేసి ప్రపంచపటంలో మన రాష్ట్రానికి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. అధికారంలోకి వచ్చాక వైసిపి సొంత ప్రయోజనాలకు అధికారాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిన ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామవరప్పాడు గ్రామ టిడిపి అధ్యక్షుడు నాబిగాని కొండ, టిడిపి నాయకులు అద్దేపల్లి సాంబశివనాగరాజు, అరుణ, క్రాంతి, కొల్లా ఆనంద్, కె.వి.సుబ్బారావు, ఆర్.సాంబశివరావు, తుపాకుల శివలీల, జనసేన నేతలు గంధం గోవర్ధన్, హరి, మేడికొండ రాంబాబు, రవిశంకర్, పట్టపు చంటి, కొంగన రవి, బిజెపి నాయకులు డాక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా పోర్టుఫోలియో జడ్జి శేషసాయిని కలిసిన
బెజవాడ బార్ నూతన కార్యవర్గసభ్యులు

విజయవాడ లీగల్, ఏప్రిల్ 2: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణాజిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయిని మంగళవారం బెజవాడ బార్ నూతన కార్యవర్గసభ్యులు ఏపీ హైకోర్టులోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల రాజా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. బార్ ఉపాధ్యక్షుడు జీవీ రామశర్మ, జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతికుమార్, లైబ్రేరియన్ సెక్రటరీ సిహెచ్.రవికుమార్, కోశాధికారి ఎన్‌వీవీ సుబ్రమణ్యం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి అజ్గర్ షేక్, మహిళా కార్యదర్శి ఎస్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



శేషసాయిని హైకోర్టులో మర్యాద పూర్వకంగా కలిసిన బెజవాడ బార్ నూతన కార్యవర్గసభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి, సమావేశంలో పాల్గొన్న గద్దె అనురాధ తదితరులు

మద్యం దుష్ఫలితాలపై
విస్తృత ప్రచారం జరగాలి

●జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ

గవర్నర్‌పేట, ఏప్రిల్ 2: మద్యం దుష్ఫలితాలపై యువత సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేయాలని ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్వేచ్ఛాయుత ఎన్నికలు-మద్యం ప్రభావం, నియంత్రణ, మన ముందున్న సవాళ్లు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సంస్థ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ మద్యం మత్తులో కార్మికులు ఉత్పాదక శక్తిని కోల్పోతున్నారని, యువత నిర్వీర్యమౌతోందన్నారు. గతంలో రూ.60కే లభించే చీప్ లిక్కర్ రూ. 250 అమ్ముతున్నారన్నారు. కల్తీ మద్యం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉచితంగా ఓటర్లకు, కార్యకర్తలకు, యువతకు మద్యం పంపిణీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉచితంగా మద్యం పంపిణీ వల్ల యువతకు మద్యం అలవాటౌతోందన్నారు. అభ్యర్థులు పెట్టే ఎన్నికల ఖర్చులో 25 శాతం మద్యం పంపిణీకే కేటాయిస్తున్నారన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మద్య నిషేదం కన్న నియంత్రణ ఆచరణ సాధ్యమన్నారు. జాతీయ మహిళా సమాఖ్య నేత అక్కినేని వనజ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రమాదకరమైన జె బ్రాండ్స్ కొనసాగుతున్నాయి, రసాయనాలతో కలుషితమైన మద్యం తీసుకోవడం వల్ల మద్యం సేవించే వారు తీవ్రమైన అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీకి మించిన లిక్కర్ స్కాం ఏపీలో సాగుతోందన్నారు. పీవోడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ మద్యానికి కుటుంబ పెద్ద బానిసైతే ఆ కుటుంబంలో మహిళల వెతలు వర్ణనాతీతమని, పిల్లలు వీధిన పడుతున్నారన్నారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, గోళ్ళ నారాయణరావు, అక్కినేని భవానీప్రసాద్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హీరో చైతన్యరావు, హీరోయిన్ శ్రద్ధాదాస్

నగరంలో 'పారిజాత పర్వం'

లబ్బీపేట, ఏప్రిల్2: నగరంలో పారిజాత పర్వం చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మురళి ఫార్చ్యూన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో హీరో చైతన్య రావు మాట్లాడుతూ కిడ్నాప్ డ్రామాతో పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని, ఒక కిడ్నాప్ ఇతివృత్తంగా ఈ చిత్రం కొనసాగుతుందన్నారు. ప్రముఖ నటుడు సునీల్ ఈ చిత్రంలో ఒక మంచి పాత్రలో కనబడతారని, ఆయన పాత్ర హైలైట్‌గా ఉంటుందన్నారు. ఈ సినిమాలో హీరోయిన్ శ్రద్ధాదాస్ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 19న థియేటర్లలో రిలీజ్ కానుందని ప్రేక్షకులు అదరించాలన్నారు. అనంతరం హీరోయిన్ శ్రద్ధాదాస్ మాట్లాడుతూ కిడ్నాప్ డ్రామాతో చిత్రం ప్రారంభమవుతుందని ఇందులో కామెడీ సన్నివేశాలు కడుపుబ్బా నవ్విస్తాయన్నారు. తిరుపతి నుంచి ప్రమోషన్ ప్రారంభించామని, ఇందులో భాగంగా కళాశాల విద్యార్థులతో ముచ్చటించిన సమయంలో వారి నుంచి వచ్చిన స్పందన ఎంతో ఆనందంగా ఉందన్నారు.

తెలుగులో ఒక వెబ్ సిరీస్‌తో పాటు రెండు చిత్రా లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న కమెడియన్ వైవా హర్ష మాట్లాడుతూ ఈ చిత్రంలో వ చ్చే హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో నవ్విస్తాయని, ఇప్పటివరకు ఇలాంటి కామెడీ కిడ్నాప్ డ్రామా చిత్రం రాలేదని ప్రేక్షకులు తప్పక వీక్షించాలని కోరారు. దర్శకుడు సంతోష్ కంభంపాటి పాల్గొన్నారు.

రూ. 5614.13 కోట్లు.. ఆల్‌టైమ్.. గ్రేట్!

- సమష్టికృషితోనే చరిత్రను లిఖించాం: డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్
- చరిత్రలోనే భారీ ఆదాయం మూటకట్టుకున్న రైల్వే డివిజన్!
- సరకు రవాణాలో రూ.4057.01 కోట్ల ఆదాయం.. చరిత్రలో అత్యధికం
- ప్రయాణికుల రవాణా ద్వారా రూ.1379.3 కోట్ల ఆదాయం.. చరిత్రలో అత్యధికం
- స్థూలంగా రూ.5614.13 కోట్ల ఆదాయం.. చరిత్రలో అత్యధికం
- కిందటేడాది కంటే రూ. 302.33 కోట్ల ఆదాయం . 5.69 % వృద్ధి



ఆంధ్రజ్యోతి, విజయవాడ: చరిత్రలోనే అత్యధిక ఆదాయాన్ని సాధించి నగర రైల్వే డివిజన్ సరికొత్త రికార్డును సృష్టించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసింది. రూ.5614.13 కోట్ల స్థూల ఆదాయాన్ని ఆర్జించింది. సరకు రవాణా, ప్రయాణికుల రవాణా, పార్శిల్స్, లీజులు, అద్దెలు తదితరాలన్నీ కలిపి ఇంతటి భారీ ఆదాయాన్ని సాధించింది. ఈ విజయంలో సరకు రవాణా అగ్రస్థానంలో నిలిచింది. రూ. 5500 కోట్ల ఆదాయాన్ని దాటడమన్నది చరిత్రలోనే రైల్వే డివిజన్‌కు ఇది మొదటిసారి. కిందటి ఆర్థిక సంవత్సరం 2022 - 23లో రూ. 5311.8 కోట్ల మేర ఆదాయాన్ని సాధించిగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.302.33 కోట్ల అదనపు ఆదాయాన్ని సాధించటం ద్వారా ఆల్‌టైమ్ రికార్డు ఆదాయాన్ని మూటకట్టుకుంది. కిందటేడాది కంటే ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 5.69 శాతం అదనంగా ఆదాయాన్ని సాధించటం జరిగింది. విజయవాడ రైల్వే డివిజన్ సాధించిన ఆదాయంలో 72 శాతం సరకు రవాణా వ్యాపారం ద్వారా వచ్చింది. ప్రయాణికుల రవాణా ద్వారా 24 శాతం మేర ఆదాయం వచ్చింది. ఇతర కోచింగ్ నుంచి 1.8 శాతం, సండ్రీస్ నుంచి 1.3 శాతం మేర ఆదాయం వచ్చింది. ఒక రకంగా సరకు రవాణా ఆదాయం ద్వారానే రైల్వే డివిజన్ అత్యధిక స్థూల ఆదాయాన్ని సాధించగలిగింది. 2023- 24లో సరకు రవాణా ద్వారానే రూ.4కోట్ల ఆదాయాన్ని సాధించటం విశేషం. ప్రయాణికుల రవాణా ద్వారా విజయవాడ రైల్వే డివిజన్ 2023- 24 ఆర్థిక సంవత్సరంలో రూ.1379.3 కోట్ల మేర ఆదాయాన్ని సాధించింది. 2022 - 23 కంటే 10.63 శాతం ఎక్కువగా ప్రయాణికుల రవాణా ద్వారా సాధించటం జరిగింది. ప్రయాణీకుల ఆదాయంలో కూడా ఇప్పటి వరకు సాధించిన ఆదాయంలో ఇదే అత్యధికం కావటం మరో విశేషం. ముగిసిన 2023- 24లో 63.47 మిలియన్ల మంది ప్రయాణీకులు రైళ్లలో ప్రయాణించారు. కిందటేడాది కంటే 3.18 శాతం మేర ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ప్రధానంగా సరకు రవాణాకు సంబంధించి చూస్తే 2023- 24 ఆర్థిక సంవత్సరంలో 36.63 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను లోడ్ చేసింది. కిందటి ఆర్థిక సంవత్సరం కంటే 9.03 శాతం ఎక్కువ ఇది. విజయవాడ గూడ్స్ ఆదాయం రూ. 4057.01 కోట్లుగా నమోదు అయింది. 2022- 23 తో పోలిస్తే 3.69 శాతం మేర వృద్ధి నమోదు అయింది. సరకు రవాణాలో ఇంత భారీ విజయం సాధించటానికి ప్రధానంగా అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా 2023- 24 ఆర్థిక సంవత్సరంలో 16.110 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గును లోడ్ చేయటం జరిగింది. కృష్ణపట్నం పోర్టు ద్వారా జరిపిన లావాదేవీల కారణంగానే అత్యధికంగా రూ. 2190.16 కోట్ల ఆదాయాన్ని సాధించింది. కాకినాడ పోర్టు ద్వారా 906.2 కోట్ల ఆదాయాన్ని సాధించటం జరిగింది. విజయవాడ రైల్వే డివిజన్ సాధించిన ఆల్‌టైమ్ రికార్డు స్థాయి ఆదాయం పట్ల డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ హర్షం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల సమన్వయంతో ఈ ఆదాయాన్ని సాధించామని తెలిపారు. బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రణాళికలు బాగా ఫలించాయని తెలిపారు. కొత్త లైన్లు, ఎలక్ట్రిఫికేషన్, మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక చర్యల ద్వారా ఈ స్థాయిని సాధించినట్లు ఆయన చెప్పారు. విజయవాడ రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ కు త్వరలో శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు.

చంద్రబాబుతో సత్యకుమార్ భేటీ

» రాష్ట్ర దుస్థితి, రాజకీయాలపై చర్చ



టీడీపీ అధినేత చంద్రబాబుతో ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్య కుమార్

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో బీజేపీ జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ భేటీ అయ్యారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ధర్మవరం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తోన్న సత్యకుమార్... తన విజయానికి కావాల్సిన మద్దతు టీడీపీ శ్రేణుల నుంచి సంపూర్ణంగా ఇప్పించాల్సిందిగా కోరారు. ఈనెల 4న ధర్మవరం వెళుతున్నానని, ఎన్నికల్లో విజయం సాధించేందుకు దీవించాలని కోరడంతో స్పందించిన చంద్రబాబు స్థానిక టీడీపీ నేతలకు ఫోన్‌చేసి సత్యకుమార్ విజయం కోసం గట్టిగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఇప్పటికే పార్టీ శ్రేణులతో చర్చించి సత్యకుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు వ్యూహం సిద్ధం చేశారని తెలిసింది. దీంతో బీజేపీ టికెట్ ఆశించిన వరదాపురం సూరి మద్దతు కూడా తీసుకుంటే మెజారిటీ మరింత పెరుగుతుందన్న ధీమా వ్యక్తమైంది. మోదీ నేతృత్వంలో దేశం ప్రపంచవ్యాప్తంగా బలీయమైన శక్తిగా ఎదుగుతుంటే మన రాష్ట్రం సర్వ నాశనమైందని సత్య కుమార్ వ్యాఖ్యానించగా... 'ఆ బాధ నన్ను నిరంతరం వేధిస్తుంటుంది. 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. బాగు చేయాల్సిన బాధ్యత ఉంది. చేసి చూపిస్తా' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇప్పట్లో మీరు మాత్రమే బాగు చేయగలరని చంద్రబాబుతో సత్యకుమార్ అనగా... 'కేంద్రం మద్దతు కూడా కావాలి. మీరంతా సహకరించాలి' అని టీడీపీ అధ్యక్షుడు కోరారు. రాష్ట్రం కోసం తాము పనిచేసేందుకు ఎప్పుడూ సిద్ధమని సత్య బదులిచ్చారు.

సీఎం జగన్‌పై చర్య తీసుకోవాలి: బీజేపీ

ఎన్నికల సభల్లో అబద్ధాలు చెబుతోన్న ముఖ్యమంత్రి జగన్‌పై చర్య తీసుకోవాలంటూ ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ ఫిర్యాదు చేశారు. సామాజిక పెన్షన్లపై ఉద్దేశపూర్వకంగానే అధికార పక్షం రాజకీయం చేస్తోందని, ప్రతిపక్షాలపై నెపం నెట్టేసి ఓట్లు వేయించుకునే కుట్రకు తెరతీసిందని ఈ సందర్భంగా బీజేపీ నేతలు ఆరోపించారు. వలంటీర్లు లేకపోతే వ్యవస్థే పనిచేయలేదనే వాతావరణాన్ని జగన్ సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పురందేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తోన్న వైసీపీని, జగన్ మీడియాను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

మంత్రి రజని భర్తపై కేసు నమోదు చేయాలి: పిల్లి

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో దళితులపై దాడులు, హత్యలు నిత్యకృత్యమయ్యాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు ధ్వజమెత్తారు. గుంటూరులో ఎస్సీ యువకుడి కిడ్నాప్, వేధింపుల వెనుక మంత్రి రజని హస్తం ఉందని ఆరోపించారు. యువతిని ప్రేమించడమే దళిత యువకుడు చేసిన నేరమా? యువకుడిని మంత్రి భర్త బెదిరించడం దేనికి సంకేతం. మంత్రి భర్తపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నగదు లావాదేవీల్లో వ్యాపారులకు వెసులుబాటు కల్పించాలి: డూండీ

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు లావాదేవీల విషయంలో వ్యాపారస్తులను భయభ్రాంతులకు గురి చేయకుండా చూడాలని టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనాను కలసి వినతిపత్రం అందజేశారు. వ్యాపారస్తులు నగదు తీసుకుని వెళ్లున్నప్పుడు చెక్‌పోస్టుల్లో నగదు పట్టుకుంటే, 24 గంటల్లో తగిన ఆధారాలు సమర్పిస్తే నగదు తిరిగి ఇచ్చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆధారాలు లేకపోతేనే.. సీజ్ చేయాలన్నారు. కాగా, వేమూరు వైసీపీ అభ్యర్థిపై ఎన్నారై టీడీపీ నేత బుచ్చిరామ్ ప్రసాద్ సీఈవోకు ఫిర్యాదు చేశారు. ఎన్నారైలు టీడీపీ తరఫున ఎన్నికల్లో పాల్గొంటే.. తిరిగి విదేశాలకు వెళ్లలేరని హెచ్చరికలు చేశారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

తెలంగాణ పోలీసులపై కేసు వేస్తా

» చట్ట ప్రకారమే భూములు కొన్నా.. ఎక్కడికీ పారిపోలేదు: శివానందరెడ్డి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2: తనపై, తన కంపెనీపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్న తెలంగాణ పోలీసులపై ప్రైవేట్ కేసు వేస్తానని నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివనందరెడ్డి చెప్పారు. మంగళవారం కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ పోలీసులు సోమవారం ఆల్లూరులోని తన నివాసానికి వచ్చారని, న్యాయవాదుల సలహా మేరకు వారిని 41ఏ నోటీసులు అడిగానని చెప్పారు. దీంతో తనకు సమాధానం చెప్పుకోలేక పోలీసులు వెళ్లిపోయారన్నారు. పోలీసులను చూసి తాను పారిపోయానని కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, తాను పార్టీ ప్రచారం కోసం బయటకు వెళ్లానని తెలిపారు. ఆధారాలు లేకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్ సీపీ శ్రీనివాసరెడ్డి తనపై కక్ష గట్టి అరెస్టు చేయాలని పోలీసులను పంపారని తెలిపారు. ఇప్పటికే తన భార్య, కుమారుడిని అరెస్టు చేశారని, వారికి కోర్టు వెంటనే బెయిల్ మంజూరు చేసిందని చెప్పారు. సీపీ శ్రీనివాసరెడ్డి తనపై కక్ష గట్టారని, లాఅండ్‌ఆర్డర్‌ను పక్కనపెట్టి సివిల్ పంచాయితీలపై దృష్టి పెట్టారని ఆరోపించారు. '1970లోనే రైతులకు 4-5 ఎకరాల అసైన్డు భూములను అప్పటి ప్రభుత్వం రాసిచ్చింది. వాటిని 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చట్టబద్ధం చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఎస్‌ఈజడ్ పేరుతో సేకరించిన భూముల్లో రైతులకు 800 గజాలు ఇచ్చి మిగిలిన భూములను సేకరించేందుకు నిర్ణయించింది. ఆ తర్వాత రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో రైతుల నుంచి భూములు కొనుగోలు చేశాను. నాపై తప్పుడు స్టేట్‌మెంట్లు తీసుకునేందుకు రైతులను బెదిరించారు. అయినా వారు నాకు వ్యతిరేకంగా చెప్పలేదు. ఈ విషయంలో తెలంగాణ పోలీసులపై ప్రైవేట్ కేసు వేస్తా' అని శివానందరెడ్డి చెప్పారు. 'హైదరాబాద్ నగరంలో వెసిల్లా గ్రీన్స్ అనే కంపెనీ ద్వారా ఇప్పటికే 600 విల్లాలు కట్టాం. ఎక్కడా చిన్న వివాదం కూడా లేదు. అన్నీ పక్కాగా ఉంటేనే మా కంపెనీ భూములను సేకరిస్తుంది' అని శివానందరెడ్డి తెలిపారు.

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు ఏడేళ్ల జైలు

» వరకట్న వేధింపులతో భార్య ఆత్మహత్య కేసులో కోర్టు తీర్పు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపుల కేసులో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌తో సహా నలుగురికి కోర్టు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన త్రిదంతా లక్ష్మీ లావణ్య (27)కు రైల్వే భద్రత దళం(ఆర్పీఎఫ్)లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుజ్జల రవితో 2019 ఫిబ్రవరి 10న వివాహమైంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రవి విధులు నిర్వర్తించడంతో రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉండేవారు. లావణ్యను రవితో పాటు అత్తమామలు గుజ్జల రాములు, రమణమ్మ, బంధువులు బొమ్మిడి సుందరమ్మ, తుంగాన జయలక్ష్మీ అధిక కట్నం తీసుకురావాలని వేధించేవారు. ఆమెను పుట్టింటికి కూడా పంపించేవారు కాదు. సోదరి పెళ్లి చూపులకు కూడా వెళ్లనీయకపోవడంతో మనస్తాపం చెంది 2021 సెప్టెంబరు 11న లావణ్య ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఆమె తండ్రి ఫిర్యాదుతో అప్పటి టూటౌన్ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి చార్జిషీటు వేశారు. ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో రవికి ఏడేళ్లు, మిగతా నలుగురికి మూడేళ్ల చొప్పున శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది.

ఈడీ విచారణకు కలెక్టర్లు హాజరుకావాల్సిందే

» ఇసుక క్వారీల అవినీతి కేసుపై సుప్రీం

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాట అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిగినట్లు రేగుతున్న ఆరోపణలకు సంబంధించి ఐదుగురు జిల్లా కలెక్టర్లు ఈడీ విచారణకు హాజరు కావాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇసుక క్వారీల్లో జరిగిన అవినీతికి సంబంధించి గత సెప్టెంబర్‌లో ఈడీ అధికారులు ముమ్మర తనిఖీలు జరిపారు. ఇసుక క్వారీలు, నీటివనరుల శాఖ అధికారుల కార్యాలయాలు, నివాసగృహాల్లో ఒకే సమయంలో తనిఖీలు జరిపి కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. ఆ దస్తావేజుల ఆధారంగా విచారణకు హాజరుకావాలంటూ వేలూరు, తిరుచ్చి, కరూరు, తంజావూరు, అరియలూరు జిల్లాలకు చెందిన కలెక్టర్లకు ఈడీ సమన్లు జారీ చేసింది. అయితే ఆ సమన్లను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఈడీ సమన్లపై స్టే విధించింది. విచారణను మాత్రమే కొనసాగించవచ్చని పేర్కొంది. హైకోర్టు స్టేను వ్యతిరేకిస్తూ ఈడీ తరఫున అప్పీలు పిటిషన్, ఈడీ విచారణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల తరఫున అప్పీలు పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. కాగా, తమిళనాట లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ నెల 25న జిల్లా కలెక్టర్లు ఈడీ విచారణకు హాజరు కావాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సుప్రీంకోర్టు హెచ్చరించింది.

ఇంట్లో పట్టుబడిన ఎలుగుబంటి



వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 2: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులోని ఓ పాడుపడిన ఇంట్లో దూరిన ఎలుగుబంటిని జూ అధికారులు చాకచక్యంగా పట్టుకుని బోనులో బంధించారు. మెట్టూరులో సోమవారం అర్ధరాత్రి పాడుపడిన ఇంట్లోకి ఎలుగుబంటి ప్రవేశించింది. ఆ సమయంలో కుక్కలు బిగ్గరగా అరవడంతో స్థానికులు కొమర దమయంతి, గండుపల్లి మోహన్ చూడగా ఎలుగుబంటి కనిపించింది. వేకువజామున 5 గంటలకు స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేశారు. అటవీశాఖా అధికారి నిషాకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎలుగుబంటిని బయటకు పంపించే ప్రయత్నాలు చేశారు. ఇంటిచుట్టూ వలలు, ఇనుప ఊచలు అడ్డంగా ఉంచారు. ఎలుగుబంటిని పట్టుకోవాలనే ఉద్దేశంతో విశాఖపట్నం జూ అధికారులకు సమాచారం అందజేశారు. మంగళవారం మధ్యాహ్నం రిస్క్యూటీం చేరుకొంది. మత్తుమందు లేకుండా ఎలాగైనా ఎలుగుబంటిని బంధించాలనే ఉద్దేశంతో బోనును ఇంటిముందు ఉంచారు. పెద్దపెద్ద శబ్దాలు చేయడంతో ఇంటిలోపల నుంచి ఎలుగుబంటి బయటకు రాగా బోనులో బంధించారు. ఆ ఎలుగుబంటిని విశాఖ జూకు తరలించినట్టు అధికారులు తెలిపారు.

దూర విద్య దూరం!

» జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం... 30 వేల మంది విద్యార్థుల్లో అయోమయం

» సేవలు ఆపేస్తామన్న అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ

» గత ఏడాది సెప్టెంబరులోనే రాష్ట్రానికి సమాచారం

» అయినా పట్టించుకోని వైసీపీ సర్కారు



అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో రాష్ట్రంలోని దూర విద్య విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పదో షెడ్యూలులో ఉన్న హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సేవలు ఆంధ్రప్రదేశ్‌కు నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్రం నిర్ణయించింది. ఈ మేరకు గతేడాది సెప్టెంబరులోనే ఏపీకి లేఖ రాసింది. కానీ ప్రత్యామ్నాయ ఏర్పాట్ల విషయంలో ఏపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం ప్రభావం ఇప్పుడు వేలాది మంది విద్యార్థులపై పడింది. ఇప్పటికే చదువుతున్న వారికి సేవలు దూరం కావడం ఒకెత్తు అయితే, కొత్తగా దూర విద్యా కోర్సుల్లో చేరాలనుకునే వారికి అసలు అవకాశమే లేకుండా పోయే దుస్థితి నెలకొంది. దూర విద్యా కోర్సులు అందించే అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పదో షెడ్యూలులో ఉన్నందున విభజన కాలేదు. రాష్ట్ర విభజన నాటి నుంచీ రెండు రాష్ట్రాలకు హైదరాబాద్‌లో ఉన్న యూనివర్సిటీనే సేవలు అందిస్తోంది. ఏపీలో ఓపెన్ యూనివర్సిటీకి 76 స్టడీ సర్కిళ్లు ఉన్నాయి. సుమారు 30 వేల మంది విద్యార్థులు వాటిలో చదువుతున్నారు. అయితే విభజన జరిగి పదేళ్లు అవుతున్నందున 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఏపీలోని స్టడీ సర్కిళ్లకు సేవలు అందించలేమని తెలంగాణ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి గత సెప్టెంబరులోనే ఏపీకి లేఖ రాశారు. అంతకుముందే వర్సిటీ విభజనకు కమిటీలు వేసిన ఏపీ ఉన్నత విద్యాశాఖ, ఒకవేళ సేవలు ఆపేస్తే ప్రత్యామ్నాయంగా ఏంచేయాలనే దానిని పట్టించుకోలేదు. రాష్ట్రంలో యూనివర్సిటీ ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయాన్ని పట్టించుకోలేదు. ఫిబ్రవరిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరిగినా ఓపెన్ యూనివర్సిటీ ప్రస్తావన కూడా చేయలేదు. తీరా ఎన్నికల కోడ్ సమీపించాక హడావుడిగా తిరుపతిలో యూనివర్సిటీ పెట్టాలనే ఫైలును ముందుకు తెచ్చింది. అసెంబ్లీ సమావేశాలు లేనందున ఆర్డినెన్స్ జారీకి చర్యలు ప్రారంభించింది. కేబినెట్ సమావేశం కూడా లేకపోవడంతో షార్ట్ సర్క్యులేషన్ విధానంలో ఈనెల 16న హడావుడిగా ఆమోదముద్ర వేయించారు. అదే రోజున ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. దీంతో ఈ ఫైలును ఈసీకి పంపారు. అప్పటినుంచీ పెండింగ్‌లో ఉంది.

30 వేల మందిపై ప్రభావం

అంబేడ్కర్ యూనివర్సిటీ ఏపీకి సేవలు ఆపేస్తే విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పటివరకూ 76 స్టడీ సర్కిళ్లలో తరగతులు, పరీక్షలు జరుగుతున్నాయి. ఒకవేళ ఏపీలో యూనివర్సిటీ ప్రారంభం కాకపోతే, తప్పని పరిస్థితుల్లో తెలంగాణ సేవలు అందించినా వాటిని పరిమితం చేసే అవకాశం ఉంది. అలాగే తన పరిధిలో లేని ప్రాంతానికి ఏదైనా యూనివర్సిటీ సేవలు అందిస్తే, తద్వారా జారీ అయ్యే సర్టిఫికెట్లు చెల్లుబాటు కావని యూజీసీ నిబంధనలు చెబుతున్నాయి. ఇవన్నీ ఏపీ విద్యార్థులకు ప్రతికూలంగా మారనున్నాయి. ఈ ప్రభావం ప్రస్తుతం చదువుతున్న 30వేల మందిపై వెంటనే పడుతుంది. అలాగే కొత్తగా కోర్సుల్లో చేరాలనుకునే వారికి వేరే దారి లేకుండా పోతుంది.

సొంత పనులకే దోస్తీ

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచీ టీఆర్ఎస్ ప్రభుత్వంతో చెట్టాపట్టాలేసుకున్నట్టుగా స్నేహం చేసింది. అంత మంచి వాతావరణం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలకు చెందిన అంశాల్లో ఒక్కదాన్ని కూడా జగన్ సాధించలేకపోయారు. యూనివర్సిటీలు, తెలుగు అకాడమీ, ఉన్నత విద్యామండలి తదితర సంస్థల విభజనను పట్టించుకోలేదు. జగన్ చొరవ చూపి ఉంటే ఓపెన్ యూనివర్సిటీ కొలిక్కి వచ్చేది.

ఎన్నికల బాండ్లపై ఆ వివరాలు చెప్పలేం!

» ఆర్టీఐ దరఖాస్తుదారుకు ఎస్‌బీఐ జవాబు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఎన్నికల బాండ్ల విక్రయాలు, వాటిని నగదుగా మార్చుకోవడానికి సంబంధించిన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్‌వోపీ) వెల్లడించబోమని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడంతో ఈ పథకం కింద రాజకీయ పార్టీలకు వచ్చిన వివరాలను ఎన్నికల సంఘం బహిర్గతం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బాండ్ల విక్రయాలకు సంబంధించిన ఎస్‌వోపీని వెల్లడించాలంటూ సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్ ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేశారు. ఎన్నికల బాండ్ల విక్రయాలు, వాటిని నగదుగా మార్చుకోవడం కోసం తమ అధీకృత శాఖలకు ఎస్‌బీఐ జారీ చేసిన ఎస్‌వోపీ వివరాలను తెలియజేయాలని కోరారు. అయితే, ఎస్‌వోపీ వివరాలను వెల్లడించేందుకు ఎస్‌బీఐ నిరాకరించింది. "అది మా అంతర్గత మార్గదర్శకాల కిందకు వస్తుంది. వాణిజ్య వ్యాపార రహస్యాలు, మేధోపరమైన సంపదకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించకుండా చట్టంలో మినహాయింపులు ఉన్నాయి" అని బ్యాంకు స్పష్టం చేసింది. దీనిపై అంజలి స్పందిస్తూ.. "ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని చెప్పిన సుప్రీంకోర్టు.. వాటికి సంబంధించిన అన్ని వివరాలను బయటపెట్టాలని ఆదేశించింది. అయినప్పటికీ ఎస్‌బీఐ నిరాకరిస్తోంది" అని ఆరోపించారు.

బస్తర్ మే సవాల్


» 1998 నుంచి బీజేపీకి కంచుకోటగా బస్తర్

» మోదీ హవా ఉన్నా 2019లో ఓటమి

» తాజా ఎన్నికల్లో తిరిగి గెలుపుపై ఆశలు

» తొలివిడతలో ఈనెల 19న ఇక్కడ ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి-సెంట్రల్ డెస్క్)



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ లోక్‌సభ నియోజకవర్గానికి తొలి విడతలో ఈనెల 19న ఎన్నికలు జరుగనున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ ఉండొచ్చని భావిస్తున్న నియోజకవర్గాలలో ఇదొకటి. కొండగావ్, నారాయణ్‌పూర్, బస్తర్, జగ్దల్‌పూర్, చిత్రకోట్, దంతెవాడ, బీజాపూర్, కొంటా అసెంబ్లీ స్థానాలు ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. హల్బ, భత్ర, గోండు తెగల ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారు. 1998 నుంచి ఈ నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా ఉంది. ఛత్తీస్‌గఢ్ బాలాసాహెబ్ ఠాక్రేగా ఖ్యాతిగాంచిన బీజేపీ నేత బలిరామ్ కశ్యప్ ఇక్కడ నాలుగు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. భత్ర తెగ మేలు కోసం ఆయన విశేషంగా కృషి చేయడంతో ఆ తెగ ఓటర్లంతా బీజేపీ వెంట నిలిచారు. 2011లో ఆయన మరణించినప్పటి నుంచి ఆయన కుమారుడు దినేశ్ కశ్యప్ ఇక్కడ ఎంపీగా కొనసాగుతూ వచ్చారు. అయితే, 2019లో బీజేపీ ఆయనకు టికెట్ నిరాకరించింది. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బైదు రామ్ కశ్యప్ ఇక్కడ ఓటమి పాలయ్యారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి దీపక్ బైజ్ విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో కొత్త అభ్యర్థి మహేశ్ కశ్యప్‌ను బీజేపీ ఇక్కడ బరిలోకి దింపింది. ఈయన వీహెచ్‌పీ, బజరంగదళ్‌లలోనూ క్రియాశీలకంగా వివిధ స్థాయిల్లో పనిచేశారు. ఈయన పేరులోనూ కశ్యప్ ఉండటం ఆ పార్టీకి కలిసొస్తుందని భావిస్తున్నారు. మరోవైపు సీనియర్ నేత కవాసీ లఖ్మాను ఇక్కడ పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయితే, లఖ్మా మాత్రం తన కుమారుడు హరీశ్ కవాసీకి టికెట్ ఇవ్వాలని అడుగుతున్నారు. కొంటా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు గెలిచిన లఖ్మా ఛత్తీస్‌గఢ్ కేబినెట్ మంత్రిగా కూడా పనిచేశారు. 2013లో దర్భ లోయలో నక్సల్ దాడితో రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకత్వం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. ఆ దాడిలో 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరిని నక్సల్స్ కిడ్నాప్ చేశారు. ఆ దాడి నుంచి లఖ్మా ప్రాణాలతో బయటపడటంపై ఆయన ప్రత్యర్థులు ఇప్పటికీ ప్రశ్నలు సంధిస్తున్నారు. ఆయనకు నార్కో ఆనాలసిస్ పరీక్ష చేయాలని కూడా పలువురు డిమాండ్ చేశారు. ఓటర్లతో మమేకమయ్యే ప్రత్యేక నైపుణ్యం వల్ల ఆయన ఎన్నికల్లో వరుస విజయాలు సాధిస్తున్నారని స్థానిక నేతలు చెబుతున్నారు. దీంతోపాటు స్థానిక భాషలన్నింటిలోనూ మాట్లాడగలగడం ఆయనకు కలిసివచ్చింది. అయితే, నారాయణ్‌పూర్ కొండగావ్ అసెంబ్లీ సెగ్మెంట్లలో లఖ్మాకు అంతగా మద్దతు లేదని చెబుతున్నారు. దీంతోపాటు కాంగ్రెస్‌లోని వర్గపోరు బీజేపీకి కలిసి వస్తుందని భావిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజ్ ఈ నియోజకవర్గం నుంచి తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరగా అధిష్ఠానం నిరాకరించింది. దీంతో ఆయన అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. 2013 నక్సల్స్ దాడిలో మరణించిన ప్రముఖ గిరిజన నేత మహేంద్ర కర్మ కుమారుడు చవీంద్ర కర్మ కూడా ఈసారి తనకు టికెట్ నిరాకరించడంపై అసంతృప్తితో ఉన్నారు. గతేడాది నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో చవీంద్ర కర్మ దంతెవాడ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కాగా, నక్సల్స్‌ను పూర్తిగా అంతమొందిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన తమ పార్టీకి కలిసి వస్తుందని బీజేపీ నాయకులు చెబుతున్నారు. గతేడాది నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ మతమార్పిడుల అంశాన్ని బీజేపీ తెరపైకి తెచ్చింది. తాజా ఎన్నికల్లోనూ అదే వ్యూహాన్ని కొనసాగించాలనుకుంటోంది. మొత్తంగా జాతీయవాదం డోసు, నక్సల్ వ్యతిరేక సెంటిమెంటు, మతమార్పిడుల అంశంతోపాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గ విభేదాలు కూడా ఈ ఎన్నికల్లో బీజేపీకి కలిసి వస్తాయని అనుకుంటున్నారు.

త్వరలో నలుగురి అరెస్టు

» ఆప్ మంత్రి ఆతిశీ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్2: ఆప్ మంత్రి ఆతిశీ మంగళవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతో సహా నలుగురు ఆప్ సీనియర్ నాయకులను నెల రోజుల్లోగా అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. తనతో పాటు మంత్రి సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే దుర్గేశ్ పాథక్, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దాలను అదుపులోకి తీసుకోవచ్చని ఆమె తెలిపారు. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సత్యేంద్రజైన్ అరెస్టు తర్వాత కూడా ఆప్ ఐక్యంగా ఉండటంతో మిగిలిన బలమైన నేతల్ని అరెస్టు చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం కేజ్రీ కేసు విచారణలో భాగంగా ఈడీ తన పేరును సౌరభ్ పేరును ప్రస్తావించడం ఇందుకు బలాన్నిస్తుందని ఆమె పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ నాయకులు ఒక సన్నిహిత వ్యక్తి ద్వారా తనను సంప్రదించి ఆ పార్టీలో చేరాల్సిందిగా కోరారని లేకపోతే అరెస్టుకు సిద్ధంగా ఉండాల్సిందిగా హెచ్చరించారని పేర్కొనారు. కాగా, ఆతిశీ వ్యాఖ్యల్ని బీజేపీ నాయకులు ఖండించారు. తమ పార్టీలో ఆమెకు అసలు చోటులేదని స్పష్టం చేశారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 71 మంది మృతి

జెరూసలేం, ఏప్రిల్ 2: గాజాపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 71 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో స్వచ్ఛంద సేవలు అందిస్తున్న ఆరుగురు విదేశీయులు కూడా ఉన్నారు. ప్రముఖ చెఫ్ జోస్ ఆండ్రెస్ గాజాలో వరల్డ్ సెంట్రల్ కిచెన్ పేరిట ఉచితంగా ఆహారం అందజేస్తున్నారు. ఈ కేంద్రంపైనా ఇజ్రాయెల్ ఆయుధాలతో దాడులు చేసింది. ఇక్కడ పనిచేస్తున్న పాలస్తీనా వ్యక్తితో పాటు, ఆరుగురు.. ఆస్ట్రేలియా, పోలాండ్, అమెరికా, కెనడా, బ్రిటన్ పౌరులు మొత్తం కలిపి ఏడుగురు మరణించినట్టు నిర్వాహకులు వివరించారు. దాంతో తమ సహాయ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. సోమవారం సముద్ర మార్గం ద్వారా అందిన ఆహార పదార్థాలను పంపిణీ చేసే పనిలో ఉండగా దాడి జరిగినట్టు చెప్పారు. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పందిస్తూ అనుకోకుండా ఈ దాడి జరిగిందని చెప్పారు. యుద్ధంలో ఇలాంటివి మామూలే అని అన్నారు. దీనిపై విచారణ వ్యక్తం చేసిన ప్రధాని దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. గత అయిదు నెలలుగా జరుగుతున్న యద్ధంలో 33వేల మంది మరణించగా, 75 వేల మంది గాయపడ్డారు.

పార్టీల కూటమి పేరు'ఇండియా'ఉండొచ్చా?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: రాజకీయ పార్టీల కూటమికి 'ఇండియా' అన్న పేరు ఉండొచ్చా అన్నదానిపై వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వం, పలు విపక్షాలకు నోటీసులు ఇచ్చింది. సమాధానం ఇచ్చేందుకు ఇదే చివరి అవకాశం అని హెచ్చరించింది. 26 పార్టీలు కలిసి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్- సంక్షిప్త నామంలో ఇండియా అని పేరు పెట్టడాన్ని సవాలు చేస్తూ గిరీష్ భరద్వాజ్ అనే వ్యక్తి గత ఏడాది ఆగస్టు నెలలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. ఇది దేశం పేరును సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నట్లయిందని ఆరోపించారు. తాజాగా ఈ కేసును తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్‌ప్రీత్ పి.ఎస్. అరోరా ధర్మాసనం విచారణ చేపట్టింది.



భారత టెకీలపై యూఎస్ వీసా భారం

» కోర్టు తీర్పు నేపథ్యంలో భారీగా పెంపు

» హెచ్ 1 బీ, ఎల్ 1, ఈబీ 5 వీసా ఫీజుల్లో

» 70% నుంచి 201% వరకూ పెరుగుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: అమెరికా వీసా ఫీజులు భారీగా పెరిగాయి. ఐటీ ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లాలనుకునే భారతీయులపై ఇది ప్రభావం చూపుతుంది. కొలరాడో జిల్లా కోర్టు జడ్జి షార్లెట్ ఎన్ స్వీనీ మార్చి 29న ఓ కేసులో తీర్పు చెపుతూ 'కొత్త ఫీజుల అమలును అడ్డుకోవద్దు' అంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తీర్పు అనంతరం యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ ప్రాసెస్(యూఎస్‌సీఐఎస్) వివిధ రకాల వీసాల ఫీజులను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ ఉద్యోగులకు కంపెనీలు స్పాన్సర్ చేసే హెచ్ 1బీ వీసా ఫీజు గతంలో 460 యూఎస్ డాలర్లు (రూ.38 వేలు) ఉండేది. ఇప్పుడు అది 780 యూఎస్ డాలర్లకు (రూ.64,000) పెరిగింది. అలాగే దరఖాస్తు ఫీజు 10 యూఎస్‌డీ(రూ.829) నుంచి ఏకంగా 215(రూ.17,000) యూఎస్‌డీలకు పెరిగింది. ఇది టెక్ పరిశ్రమపై పెను ప్రభావం చూపుతుంది. అలాగే ఉద్యోగులను ఇతర దేశాల నుంచి యూఎస్‌కు బదిలీ చేయడానికి ఉపయోగించే ఎల్ 1 వీసా చార్జీల్లోనూ భారీ పెరుగుదల కనిపించింది. దీని ఫీజు 460 యూఎస్‌డీ(రూ.38,000) లనుంచి 1,385 యూఎస్‌డీ (రూ.1,10,000)లకు పెరిగింది. అలాగే ఇన్వెస్టర్ వీసా ఈబీ 5 ఫీజులో పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. గతంలో ఇది 3,675 యూఎస్‌డీ (రూ.3 లక్షలు) ఉంటే అది ఇప్పుడు 11,160 యూఎస్‌డీ(రూ.9 లక్షలు)లకు పెరిగింది. యూఎస్‌లో నివాసం ఉండాలనుకునే సంపన్న భారతీయులను ఇది ప్రభావితం చేస్తుంది.

21 వేల కోట్లు దాటిన రక్షణ ఎగుమతులు

» భారత చరిత్రలో ఇదే తొలిసారి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: భారత రక్షణ రంగ ఎగుమతులు దేశ చరిత్రలోనే తొలిసారిగా రూ.21వేల కోట్ల మార్కుని దాటేశాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.21,083 కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం (రూ.15,920 కోట్లు)తో పోలిస్తే ఇది 32.5 శాతం అధికం కావడం విశేషం. 2013-24 ఆర్థిక సంవత్సరం నుంచి పరిశీలిస్తే ఈ దశాబ్ద కాలంలో రక్షణ రంగ ఎగుమతులు 31 రెట్ల వృద్ధిని సాధించాయి. కాగా, 2003-04 నుంచి 2013-14 మధ్య కాలంలో రక్షణ ఎగుమతులు మొత్తం రూ.4,312 కోట్లు కాగా, 2014-15 నుంచి 2023-24 మధ్యకాలంలో ఇవి ఏకంగా రూ.88,319 కోట్లకు పెరిగాయి. రక్షణ రంగ ఎగుమతుల్లో గణనీయ పెరుగుదల పట్ల రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. "ఇది మన దేశ అభివృద్ధికీ, సామర్థ్యాలకూ నిదర్శనం" అని ట్వీట్ చేశారు.



ఎన్నికల ప్రధానాధికారి మీనాకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు

» డీజీపీ, అదనపు డీజీపై సీఈవోకు వర్ల ఫిర్యాదు


అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సహా ఎన్డీయే కూటమి నేతల ఫోన్లను పోలీసులు ట్యాప్ చేస్తున్నారు. ఇజ్రాయిల్ నుంచి తెచ్చిన పరికరాలు, పెగాసిస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు. ఎన్నికల గురించి ఏం మాట్లాడుకుంటున్నారో తెలుసుకోవటానికి ఈపనికి తెగబడ్డారు. దీనికి కారకులైన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, అదనపు డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలి' అని తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీడీపీ నేతల బృందం మంగళవారం సాయంత్రం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలసి ఫిర్యాదు చేసింది. అనంతరం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణలో మాదిరి ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నేతల వాయిస్‌లు రికార్డు చేస్తున్నట్లు మాకు పక్కా సమాచారం ఉంది. ప్రతిపక్షాలను దెబ్బతీసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడితే... తెలంగాణలో మాదిరి ఫోన్ ట్యాప్ చేసిన వారు జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఆరుగురు ఐపీఎస్‌లు, ముగ్గురు కలెక్టర్లపై ఎన్నికల కమిషన్ వేటు వేసింది. దూడలపై చర్యలు తీసుకున్నా.. చేలో దొంగతనంగా మేస్తున్న ఆవుల్లాంటి డీజీపీ, అదనపు డీజీపై చర్య తీసుకోలేదు. వేటుకు గురికావాల్సిన అన్ని అర్హతలు డీజీపీ, అదనపు డీజీకి ఉన్నాయి. వెంటనే వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని సీఈవోని కోరాం. పింఛన్ల విషయంలో చంద్రబాబుపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీపై చర్యలు తీసుకోవాలని కోరాము. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, జగన్‌కు ఓటేయాలని ప్రచారం చేస్తున్న నాగార్జున యూనివర్సిటీలో సూపరింటెండెంట్ వెంకటప్పారెడ్డిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశాం.

కేసుల విచారణకు జగన్ సహకరించాలి: వర్ల

తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎదుటివారిని విమర్శిస్తున్న జగన్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా తన కేసు విచారణకు సహకరించాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'పదేళ్లుగా కేసులు విచారణకు రాకుండా వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్న జగన్‌కు చట్టంలో ప్రత్యేకమైన మినహాయింపులున్నాయా? తనపై ఉన్న కేసులు విచారణ పూర్తయితే.. జైలుకెళ్లడం ఖాయమని జగన్‌కు తెలుసు. అందుకే అధికారాన్ని అడ్డం పెట్టుకుని, కోర్టుకు వెళ్లకుండా డ్రామాలు ఆడుతున్న మహానటుడు జగన్' అని విమర్శించారు.

ప్రభుత్వాలు మారినప్పుడు లాయర్లను మార్చుకోవచ్చు

» అయితే ఆరు వారాల వరకు పాతవారిని కొనసాగించాలి: సుప్రీం




న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ప్రభుత్వాలు మారినప్పుడు లాయర్లను మార్చుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే కోర్టు కార్యకలాపాలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అడ్వకేట్ల ప్యానెల్‌ను మార్చుకొనే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నప్పటికీ కనీసం ఆరు వారాల వరకు పాత ప్యానెల్‌ను కొనసాగించాల్సి ఉంటుందని తెలిపింది. పాత లాయర్లు లేకుంటే కేసుల విచారణను గత్యంతరం లేక వాయిదా వేయాల్సిన పరిస్థితులు కోర్టులకు ఎదురవుతాయని పేర్కొంది. అలా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం తెలిపింది. ఈ మేరకు సర్క్యులర్‌ను పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ నిందితునికి బెయిల్ మంజూరుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు ఇచ్చింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 3 ఏప్రిల్ 2024

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్ సంస్థలు) అందిస్తున్న 'బీఎస్ ఎంఎస్' డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఉద్దేశించిన ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐసర్ ఏటీ)2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షని భోపాల్ ఐసర్ నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా తిరుపతి సహా భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, బెర్హంపూర్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఎస్-ఎంఎస్(సైన్సెస్) ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. భోపాల్ క్యాంపస్‌లో నాలుగేళ్ల వ్యవధిగల బీఎస్(ఇంజనీరింగ్ సైన్సెస్/ఎకనామిక్ సైన్సెస్) డిగ్రీ ప్రోగ్రామ్ కూడా ఉంది. ఇవి పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. బెంగళూరు ఐఐఎస్సీ అందిస్తున్న బీఎస్(రీసెర్చ్), మద్రాస్ ఐఐటీ అందిస్తున్న బీఎస్(మెడికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కూడా ఐసర్ ఏటీ 2024 టెస్ట్ స్కోర్‌ను అనుమతిస్తారు.

ఐసర్‌లో బీఎస్, ఎంఎస్

ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు నోటిఫికేషన్



విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ అండ్ డేటా సైన్సెస్, ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్సెస్/ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఎకనామిక్ సైన్సెస్, ఇంజనీరింగ్ సైన్సెస్ (కెమికల్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్), జియోలాజికల్ సైన్సెస్, ఇంటిగ్రేటెడ్ అండ్ ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్

క్యాంపస్‌లు-సీట్లు: బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి తిరుపతిలో 275, తిరువనంతపురంలో 320, పుణెలో 288, మొహాలీలో 250, కోల్‌కతాలో 250, భోపాల్‌లో 255, బెర్హంపూర్‌లో 180 చొప్పున మొత్తం 1818 సీట్లు; భోపాల్ క్యాంపస్ అందిస్తున్న బీఎస్ ప్రోగ్రామ్‌లో ఇంజనీరింగ్ సైన్సెస్ 84, ఎకనామిక్ సైన్సెస్ 31 చొప్పున మొత్తం 115 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి 2022, 2023 సంవత్సరాల్లో ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు; మూడేళ్ల డిప్లొమా ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు; 2024లో చివరి సంవత్సర పరీక్షలు రాసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్ అభ్యర్థులకు ప్రథమశ్రేణి మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. చివరి సంవత్సర మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకొంటారు. బీఎస్ ప్రోగ్రామ్‌నకు మాత్రం మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయాలజీ అంశాలనుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు ఎన్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఇస్తారు. అన్ని సబ్జెక్ట్‌లకూ సమాన వెయిటేజీ ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. మొత్తం మార్కులు 240. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఈ టెస్ట్‌ను హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహిస్తారు. సంస్థ నిర్దేశించిన కటాఫ్ మేరకు ర్యాంక్‌లు ప్రకటిస్తారు. ఆప్టిట్యూడ్ టెస్ట్ సిలబస్, గత ప్రశ్నపత్రాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 13
- **కరక్షన్ విండో ఓపెన్:** మే 16, 17
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 1
- **ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ:** జూన్ 9
- **ఫైనల్ కీ విడుదల:** జూన్ 21
- **ఏటీ ఫలితాలు విడుదల:** జూన్ 25
- **కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్:** జూన్ 26 నుంచి జూలై 1 వరకు
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 2 నుంచి 5 వరకు
- **మొదటి రౌండ్ అడ్మిషన్స్ లిస్ట్ విడుదల:** జూలై 7
- **వెబ్‌సైట్:** iiseradmission.in

పరిశోధనలు

నైసర్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)- ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్‌లు, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్

అర్హత: బయలాజికల్ సైన్సెస్‌కు డిగ్రీ(బయాలజీ/లైఫ్ సైన్సెస్) లేదా బీఫార్మసీ/బీవీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్/ఎంబీబీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కెమికల్ సైన్సెస్‌కు డిగ్రీ(కెమికల్ సైన్సెస్) లేదా కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; మేథమెటికల్ సైన్సెస్‌కు మేథమెటిక్స్ ఫిజికల్ సైన్సెస్‌కు ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. విభాగాన్ని అనుసరించి జామ్ 2024/గేట్ 2024/ఎన్‌బీహెచ్‌ఎం/జెస్ట్ 2024/సీఎస్ఐఆర్ నెట్/యూజీసీ నెట్ అర్హత పొంది ఉండాలి.

ఫెలోషిప్: మొదటి ఏడాది నెలకు రూ.21,000ల నగదు; బుక్ అలవెన్స్ కింద రూ.25000 చెల్లిస్తారు. తరవాత రెండేళ్ల నెలకు రూ.31000 ఇస్తారు. నాలుగో ఏడాది నుంచి ఏడో ఏడాది వరకు నెలకు రూ.35,000 చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 6 నుంచి 8 మధ్య
- **టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు:** ఫిజికల్ సైన్సెస్‌కు జూన్ 6, 7; మేథమెటికల్ సైన్సెస్‌కు జూన్ 12 నుంచి 14 వరకు; బయలాజికల్ సైన్సెస్‌కు జూన్ 13, 14; కెమికల్ సైన్సెస్‌కు జూన్ 20 నుంచి 22 వరకు;
- **వెబ్‌సైట్:** www.niser.ac.in



ఐఐఎస్సీ

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. నాలుగో సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. చివరి ఏడాది రీసెర్చ్ ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. మరో సంవత్సరం చదివి మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్) డిగ్రీని పొందే సౌకర్యం ఉంది. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఇన్‌స్పయిర్/ఐఐఎస్సీ ప్రమోషనల్ స్కీం స్కాలర్‌షిప్‌లు ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్


అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సును 2023లో పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అర్హులే. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు పాసైతే చాలు. అభ్యర్థులు జేఈఈ మెయిన్ 2024/జేఈఈ అడ్వాన్స్ 2024/నీట్ యూజీ 2024/ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ స్కోర్ ద్వారానే అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 19
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** https://bs-ug.iisc.ac.in

ఐడీఆర్‌బీటీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిర్వహిస్తున్న 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(ఐడీఆర్‌బీటీ)'- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (పీజీడీబీటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైమ్ రెగ్యులర్ ప్రోగ్రామ్. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్లలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అనుసరించాల్సిన అనలిటికల్ స్కిల్స్, టెక్నాలజీ ఇంప్లిమెంటేషన్, మేనేజ్‌మెంట్ అంశాలను ఈ ప్రోగ్రామ్‌లో వివరిస్తారు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. వీటిలో 10 సీట్లను స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు. నిర్దేశిత జాతీయ పరీక్షలో సాధించిన స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో టాపర్‌గా నిలిచిన అభ్యర్థికి డీ.ఏ.ఎస్ రామశాస్త్రి గోల్డ్ మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ అందిస్తారు. అలాగే మెరిట్ సాధించిన అభ్యర్థులకు ప్రాజెక్ట్ సమయంలో స్టయిపెండ్ ఇస్తారు. ప్లేస్‌మెంట్స్ సౌకర్యం ఉంది.



ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో నాలుగు టర్మ్‌లు ఉంటాయి. మొదటి టర్మ్‌లో బ్యాంకింగ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, క్రిప్టోగ్రఫీ, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ సబ్జెక్టులు; రెండో టర్మ్‌లో ఏఐ అండ్ ఎంఎల్, ఫండమెంటల్స్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్, ఇంటర్నెట్ టెక్నాలజీస్, డిజిటల్ పేమెంట్ సిస్టమ్స్ అండ్ లెండింగ్ సబ్జెక్టులు; మూడో టర్మ్‌లో ఫైనాన్షియల్ అనలిటిక్స్, అడ్వాన్స్‌డ్ సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డెవోప్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, బిగ్ డేటా అండ్ క్లౌడ్ సబ్జెక్టులు ఉంటాయి. నాలుగో టర్మ్‌లో ప్రాజెక్ట్ వర్క్, ప్రజంటేషన్ ఉంటాయి.

- ప్రోగ్రామ్‌లో భాగంగా ఐటీ ఇండస్ట్రీకి సంబంధించిన ప్రముఖులు, సీనియర్ బ్యాంకర్ల లెక్చర్స్, సెమినార్లు; ఇంటరాక్టివ్ సెషన్స్ ఉంటాయి. సంస్థకు చెందిన రీసెర్చ్ సెంటర్లలో ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటుంది.

రీసెర్చ్ సెంటర్లు

- సెంటర్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
- సెంటర్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అండ్ డేటా ప్రైవసీ
- సెంటర్ ఆఫ్ ఎమర్జింగ్ నెట్‌వర్క్స్ అండ్ క్లౌడ్ కంప్యూటింగ్
- సెంటర్ ఆఫ్ ఓపెన్ అండ్ డిజిటల్ బ్యాంకింగ్
- సెంటర్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్
- సెంటర్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ అండ్ ఇన్నోవేషన్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ లేదా ఏదేని స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యరులు గేట్/క్యాట్/జీమ్యాట్/జీఆర్ఈ/సీమ్యాట్/ ఎక్స్ఏటీ/మ్యాట్/ఏటీఎంఏ అర్హత పొంది ఉండాలి. బ్యాంక్‌లు, ఫైనాన్షియల్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **తరగతులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.idrbt.ac.in/pgdbt

SCHOLARSHIP ALERT

Goonj Setu Fellowship 2024-25

Description: Goonj Setu Fellowship 2024-25 is an opportunity offered by Goonj, a non-profit organisation to graduates aged between 21 to 30 years by 31st July 2024. This programme provides an opportunity to individuals to develop an understanding about themselves and the larger social ecosystem, the dynamics, innovations, and how small things can bring about significant changes.

Eligibility: Open to applicants between 21 and 30 years as on July 31, 2024, having graduated from a recognised institution by the same date. A basic understanding of English or Hindi and proficiency in Microsoft Office and other relevant computer tools are required.

Prizes & Rewards: A fixed monthly fellowship stipend ranging between 20,000 and 22,000 depending on the city.

Last Date to Apply: 22-04-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/GGSF1

Vardhman Foundation Shakun Oswal

Description: An initiative of Vardhman Textiles Limited that aims to support the educational needs of diploma/ITI students.

Eligibility:
Students studying in any year of diploma/ITI courses after Class 10 and/or 12 are eligible.

- Applicants must have secured at least 50% marks in their Class 10 and/or 12 examination.
- The annual family income of the applicants must be less than or equal to 6,00,000 from all sources.

Prizes & Rewards: 20,000

Last Date to Apply: 20-04-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SOSP1



The Cadence Scholarship Program

Description: Cadence Design Systems Private Limited & Concern India Foundation invites applications from students pursuing undergraduate or postgraduate courses in the Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad regions to continue their education.

Eligibility: Open to applicants residing and studying in Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad (Indian nationals only) pursuing undergraduate and postgraduate courses.

Prizes & Rewards: Financial support for key educational expenses

Last Date to Apply: 30-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCSP4

buddy4study.com

లిటిల్




మీకు తెలుసా?

- నల్లగా, పొడవైన కొమ్ములు వెనక్కి తిరిగి ఉండే ఈ జింకను 'సాబుల్ యాంటేలోపే' అని పిలుస్తారు. ఇదో పెద్ద జింక.
- పొడవు 190 నుంచి 225 సెం.మీ. ఉంటాయి. ఎత్తు 117 నుంచి 140 సెం.మీ. వరకూ ఉంటాయి.
- వీటి బరువు 220 కేజీలనుంచి 235 కేజీలు.
- పగలు మాత్రమే చురుగ్గా ఉంటాయి. ఆకులు, హెర్బ్స్, గడ్డినే ఎక్కువ ఇష్టపడతాయి.




- బోట్స్‌వానా, నమీబియా, దక్షిణాఫ్రికా, కెన్యా, టాంజానియా దేశాల్లోని పచ్చిక మైదానాల్లో ఉంటాయి.
- ఇవి గుంపుగా ఉంటాయి. ఒక్కో గుంపులో 15 నుంచి 30 జంతువులు ఉంటాయి. వీటిలో ఆడ జంతువే లీడర్.
- గంటకు 70 కి.మీ. వేగంతో పరిగెత్తుతాయి.
- పులులు, సింహాలు, మనుషులతోనే వీటికి హాని జరుగుతుంది. అయితే వీటి పొడవైన కొమ్ముల వల్ల శత్రువులు ప్రాణాలు కూడా కోల్పోతుంటారు. అంత పదునుగా ఉంటాయి వీటి కొమ్ములు.
- ఇవి ఆఫ్రికాలోనే అతి పెద్ద జింకలు. ఇవి ఆకాశం వైపు చూస్తూ అరుస్తుంటే వాటి కొమ్ములు తోక దగ్గర టచ్ అవుతాయి. అంటే ఆ కొమ్ముల పొడవును అర్థం చేసుకోవచ్చు.
- దాదాపు 11 దేశాల్లో 50 వేలకు పైగా ఈ జంతువులు ఉన్నాయి.
- ఇవి 17 నుంచి 19 సంవత్సరాలు జీవిస్తాయి.

ఏవి ఎన్ని?



10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 271

		4	8					1
8		1		4			9	
	6			3				
		6	9					
	3	2				5	7	
					7	3		
				8			2	
	5			6		8		7
2					1	4		

సుడోకు - 270 సమాధానం

9	3	2	1	6	8	4	7	5
8	7	6	5	4	9	1	3	2
1	5	4	2	7	3	6	8	9
2	1	3	6	9	7	5	4	8
6	4	5	3	8	1	9	2	7
7	9	8	4	2	5	3	6	1
3	8	7	9	1	6	2	5	4
4	6	1	7	5	2	8	9	3
5	2	9	8	3	4	7	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.